ఈనాడు

విజయవాడ 11-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 332
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


చరిత్రలోనే కనీవిని ఎరుగని తక్కువ తరుగు
బంగారం కొనేటప్పుడు మీరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆదా చేస్తారు.
ఇలాంటి వేలాది డిజైన్లలో అందమైన నగలు, ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
తరుగు V.A. 10%
ఇలాంటి వందలాది బ్లాక్ బీడ్స్ డిజైన్లు, కేవలం 10% తరుగుకే మా వద్ద లభిస్తాయి.
ఇలాంటి రకరకాలైన డిజైన్లలో అందమైన వడ్డాణం / బ్రేస్‌లెట్ నగలు ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
బ్రేస్‌లెట్
MC DELHI V.A.3%
CASTING MC CHAIN STONE V.A.8%
KATTIYAR STAMPING V.A.8%
LOTUS V.A.8%
LOTUS SAND V.A.8%
MC CASTING PLAIN V.A.8%
CASTING GENTS RUDRACHAM V.A.8%
BOMBAY STAMPING DELHI V.A.9%
INDO FANCY V.A.9%
రకరకాలైన కాస్టింగ్ ఉంగరాలు (రాళ్లు పొదిగిన / రాళ్లు లేని) ఇదే తరుగులో మా వద్ద లభ్యం. ఇక్కడ కొన్ని ఉంగరాలు మాత్రమే చూపించాం.
ఎలాంటి దాపరికం లేని తక్కువ!
ఇతర నగల షోరూంలలో లలితా జ్యువెల్లరి వారి Estimate Slipను కస్టమర్లు చూపించిన తర్వాత.. వాళ్లు తరుగు తగ్గిస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. కానీ, దేవుళ్లతో సమానమైన మా కస్టమర్లు మా వద్ద అలా విన్నవించుకోవాల్సిన అవసరం లేదు. ఏ నగ అయినప్పటికీ, మార్కెట్‌లో కంటే తక్కువ తరుగుకు మావద్ద తీసుకోవచ్చు!
నగల బుకింగ్ పథకం
OLD GOLD EXCHANGE
5 to 11 month scheme
ఖర్చు లేకుండా, పాత నగల అదే బరువుకు కొత్త నగ!
100% తరుగు లేదు
డబ్బులు చెల్లించి కూడా ఈ పథకంలో చేరవచ్చు!
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
Lalithaa
www.lalithaajewellery.com
@M.KIRANKUMAR_TELUGU
విజయవాడ • వైజాగ్ • గోపాలపట్నం • విజయనగరం • అనకాపల్లి • గాజువాక • శ్రీకాకుళం
భీమవరం • అమలాపురం • రాజమహేంద్రవరం • గుంటూరు • ఒంగోలు • నరసారావుపేట
కర్నూలు • కడప • సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • చిత్తూరు • తిరుపతి • తుని
కాకినాడ • అనంతపురం
లక్షలాది డిజైన్లు! | 100% HUID
Customer Care: 90 99 999 916
VIRAL VIDEO 2.4+M VIEWS

ఈనాడు

విజయవాడ 11-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 332

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



మరో 100 ఏళ్లయినా ఏఐ సృజనాత్మకంగా ఆలోచించదు

ప్రోగ్రామింగ్‌లో అదో సహాయకారిగా మాత్రమే వ్యవహరిస్తుంది: బిల్‌గేట్స్

ఇంటర్నెట్ డెస్క్

ప్రోగ్రామర్లను కృత్రిమ మేధ (ఏఐ) భర్తీ చేయలేదని, మరో 100 ఏళ్లయినా అది సృజనాత్మకతగా ఆలోచించదని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ తేల్చిచెప్పారు. కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందనే ఆందోళనపై తాజాగా ఆయన స్పందించారు. "ప్రోగ్రామింగ్ రంగంలో ఏఐ మనకు సహాయకారిగా వ్యవహరిస్తుంది. తప్పుల్ని గుర్తించి సాయం చేస్తుంది కానీ పూర్తి ప్రత్యామ్నాయంగా మారదు. క్లిష్టమైన సమస్యను సృజనాత్మకంగా పరిష్కరించడం ప్రోగ్రామింగ్‌లో అత్యంత సవాల్‌తో కూడుకున్న అంశం. యంత్రాలు దాన్ని చేయలేవు. యుక్తాయుక్త విచక్షణ, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు అనుకూలమైన సర్దుబాటు అనేవి ప్రోగ్రామింగ్‌కు అవసరం. ఈ లక్షణాలు ఏఐలో లోపించాయి" అని బిల్‌గేట్స్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కోడింగ్ కేవలం టైప్ చేయడం కాదని, (మిగతా 3లో)



జయ్ చౌద్రీ | సుందర్ పిచాయ్ | సత్యనాదెళ్ల

అమెరికాలో 'సంపన్న' భారతీయం

43 దేశాలకు చెందిన 125 మంది బిలియనీర్లలో మనవాళ్లే 12 మంది

అగ్రస్థానంలో జయ్ చౌద్రీ.. తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు

ఈనాడు వాణిజ్య విభాగం

అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ విడుదల చేసిన 'అమెరికాస్ రిచెస్ట్ ఇమిగ్రెంట్స్-2025' జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్లు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే. ఈ సంఖ్యా పరంగా ఇజ్రాయెల్‌ను మనదేశం అధిగమించింది. ఈ జాబితాలోని ఇతర విశేషాలు..

10 దేశాల నుంచే మూడో వంతు: మొత్తం ప్రవాస బిలియనీర్లలో మూడో వంతు మంది భారత్, ఇజ్రాయెల్, తైవాన్, కెనడా, చైనా, మరో అయిదు దేశాలకు చెందినవారు.

కొత్తగా వీరు: గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల తొలిసారిగా ఈ జాబితాలో నిలిచారు. 2018 నుంచి సైబర్ భద్రతా సంస్థ పాలో ఆల్టో నెట్‌వర్క్స్‌ను నిర్వహిస్తున్న నికేశ్ అరోరా సైతం ఇప్పుడు (మిగతా 2లో)

మీ బిడ్డల భవిత.. నా బాధ్యత

- విద్యార్థులపై ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులూ శ్రద్ధ చూపాలి
- విద్యార్థుల హాజరు తెలుసుకోవడానికి కొత్త యాప్
- ప్రభుత్వ బడుల్లో సీట్లు లేవు అని బోర్డు పెట్టే పరిస్థితి రావాలి
- శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు హైస్కూల్‌లో మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 2.20 కోట్ల మందితో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీహెచ్ఎస్‌లోని తరగతి గదిలో పాఠాలు చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. శ్రద్ధగా వింటున్న విద్యార్థులు, విద్యాశాఖ మంత్రి లోకేశ్

పాఠాలు బోధించిన చంద్రబాబు

8వ తరగతి గదిలో సీఎం చంద్రబాబు పుస్తకం అందుకుని వనరుల సంరక్షణ, ఆధునిక సాంకేతికత తదితర అంశాలపై విద్యార్థులకు పాఠాలు బోధించారు. సహజ వనరులను జాగ్రత్తగా వాడుకోకపోతే భవిష్యత్తు తరాలు దెబ్బతింటాయంటూ ఓ కథ చెప్పారు. 'మోనాకు ఒక కల వచ్చింది. భూమిపై ఉన్న నీరంతా ఇంకిపోయాయి. తాగేందుకు నీరు లేదు. చెట్లన్నీ ఎండిపోయాయి. తినడానికి తిండిలేక చాలా ఇబ్బందులొచ్చాయి. తనకు వచ్చిన పీడకలను తల్లికి చెప్పింది. అప్పుడు వాళ్ల అమ్మ.. మనం తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భూమిపై వనరులు నిజంగానే దెబ్బతింటాయని, వాటిని జాగ్రత్తగా వాడుకోవాలని చెప్పింది' అని చంద్రబాబు విద్యార్థులకు వివరించారు.

> నేను ముఖ్యమంత్రిగా 12సార్లు డీఎస్సీ నిర్వహించి 1.66 లక్షల మందికి ఉద్యోగాలిచ్చా. గత ప్రభుత్వం ఒక్క టీచర్‌నూ నియమించలేదు. పైగా మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలంటూ ఉపాధ్యాయులను నానా ఇబ్బందులు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు పూర్తి చేశాం. ఆగస్టులోపు కొత్త ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపే బాధ్యత నారా లోకేశ్ తీసుకుంటారు. 64,29,354 మంది పిల్లలకు సంబంధించి 40,25,743 మంది తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు జమ చేశాం. – చంద్రబాబు

ఈనాడు – అనంతపురం, పుట్టపర్తి

పాఠశాలలు మన పిల్లలను తీర్చిదిద్దే దేవాలయాలని.. ఊరంతా గుడిని కాపాడుకున్నట్లే బడి బాగోగులు చూసుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విద్యార్థులతోపాటు పాఠశాలలను బాగు చేసుకోవాలనే బాధ్యతను గుర్తు చేయడానికే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందిని చదివించాలని, వారికి ఉత్తమ భవిష్యత్తు అందించే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలన్నారు. 'మెగా పీటీఎం (పేరెంట్స్-టీచర్స్ మీటింగ్) 2.0'లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను 1978 నుంచి రాజకీయాల్లో తీరిక లేకుండా ఉండటంతో ఏ రోజూ మా అబ్బాయితో పేరెంట్స్ మీటింగ్‌కు వెళ్లలేదు. స్టాన్‌ఫర్డ్ వరకు (మిగతా 3లో)



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



ఓటరు జాబితాల సమగ్ర సవరణ సబబే...

అందుకు ఎంచుకున్న సమయం సరికాదు

ఆధార్, రేషన్ కార్డులనూ గుర్తింపు పత్రాలుగా పరిగణించండి

బిహార్‌లో ఎన్నికల సంఘం కసరత్తుపై సుప్రీంకోర్టు ధర్మాసనం

దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న తరుణంలో ఆ ప్రక్రియను చేపట్టడం సమర్థనీయంగా లేదని జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. అదే సమయంలో ప్రత్యేక సమగ్ర సవరణపై నిలుపుదల ఉత్తర్వులు(స్టే) ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ ప్రక్రియను కొనసాగించవచ్చని చెబుతూనే.. ఓటర్ల గుర్తింపునకు పరిశీలించే పత్రాల జాబితాలో ఆధార్, రేషన్, ఓటరు ఐడీ కార్డునూ చేర్చాలని ఎన్నికల సంఘానికి (మిగతా 2లో)

రింగైనా... కాకున్నా మనసంతా రింగరింగా..!



ప్రతి నిమిషం ఫోన్‌ను తడిమే చేతులు.. నోటిఫికేషన్‌ల కోసం ఎదురు చూపులు.. పక్కవారి మొబైల్ మోగినా.. తమదేనన్నట్లు తనిఖీలు.. పొరుగువారికి కాల్ వచ్చినా.. తమకేనన్నట్లు కంగారు.. 'రింగ్జైటీ'గా పేర్కొనే ఈ రుగ్మత.. యువతలోనే ఎక్కువంటున్నాయి అధ్యయనాలు!!

ప్రత్యేక కథనం 14లో

విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు

మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా పిలుపు

రేపు విచారణకు రావాలని ఆదేశాలు..

ఆయన ఏం చెబుతారనేదానిపై ఆసక్తి



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన (ఏ-5) వైకాపా మాజీ నేత వి.విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులిచ్చింది. శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 179 ప్రకారం సాక్షిగా ఆయనను విచారణకు పిలవడం గమనార్హం. విజయసాయిరెడ్డి ఏప్రిల్ 18న సిట్ విచారణకు హాజరై ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక అంశాలతో పాటు ఎవరెవరు ఏ పాత్ర పోషించారు? తదితర వివరాలు వెల్లడించారు. తాజాగా మరోసారి ఆయన్ను విచారణకు పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ దఫా విచారణలో కుంభకోణానికి సంబంధించి ఆయన ఏం గుట్టు (మిగతా 3లో)

ప్రపంచంలోనే మేటి భవనం!

- ఐకానిక్‌గా అమరావతి 'క్వాంటమ్' వ్యాలీ
- 40 వేల చదరపు అడుగుల్లో నిర్మాణం
- గాలి చొరబడని విధంగా 'ఐసొలేషన్'



ఈనాడు – అమరావతి

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాన్ని ఐకానిక్‌గా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ భవన ఆకృతి ప్రపంచంలో ఎక్కడా లేనంత ప్రత్యేకంగా ఉండాలని.. 'క్వాంటమ్ వ్యాలీ' ఆకృతి గురించి ప్రపంచం మాట్లాడుకునే స్థాయిలో ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇప్పటికే సీఎం రెండుసార్లు అధికారులతో చర్చించారు. మరో వారంలో నమూనా ఎంపిక కొలిక్కి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. 156 క్యూబిట్‌ల క్వాంటమ్ టూ కంప్యూటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఐబీఎం సంస్థ డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించింది. ప్రపంచంలో ఉన్న ప్రముఖ సంస్థలను అమరావతి క్వాంటమ్ వ్యాలీకి తీసుకువచ్చేందుకు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. 'కంపెనీలు, స్టార్టప్‌లు.. పరిశోధనలు నిర్వహించే సంస్థలు, క్వాంటం హార్డ్‌వేర్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తుంది' అని ఒక అధికారి తెలిపారు.

క్వాంటమ్ భవనమే.. ఒక ప్రత్యేకత

- క్వాంటమ్ వ్యాలీలో కంప్యూటర్ పరిశోధన.. అభివృద్ధి కేంద్రాన్ని ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 40,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న భవనాన్ని నిర్మిస్తుంది.
- క్వాంటమ్ కంప్యూటర్ ఫోటాన్ (కాంతి కణం) ఆధారంగా పనిచేస్తుంది. ఈ దృష్ట్యా ప్రత్యేకమైన భద్రతతో కూడిన (మిగతా 3లో)



వాట్సప్‌లో సరికొత్త ఫీచర్!

చాలాసార్లు ఫార్వర్డ్ అయిన మెసేజ్‌లకు 'సెర్చ్ ఆన్ వెబ్' అనే కొత్త ఫీచర్

ఇక తేలికగా నిర్దేశిత చిత్రం, సందేశం నిర్ధారణ

ఈనాడు, తిరుపతి: సాధారణంగా వాట్సప్‌లో వచ్చే ఫార్వార్డెడ్ మెసేజ్, చిత్రాల గురించి మరిన్ని వివరాలు తెలుసుకోడానికైనా, నిర్ధారించుకోడానికైనా.. ఆ యాప్ నుంచి బయటకొచ్చి వెబ్‌లో సెర్చ్ చేయాలి. దీన్ని యూజర్లకు మరింత సులభతరం చేయడానికి వాట్సప్ ఓ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిర్దేశిత మెసేజ్ లేదా చిత్రాన్ని ఎక్కువసార్లు ఫార్వార్డ్ చేసినప్పుడు దానిపైనే 'సెర్చ్ ఆన్ వెబ్' అనే ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీనిపై ట్యాప్ చేయగానే 'సెర్చ్', 'క్యాన్సిల్' అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. 'సెర్చ్'పై ట్యాప్ చేస్తే నేరుగా వెబ్‌పేజ్ ఓపెనై సంబంధిత (మిగతా 3లో)

ఉచిత ప్రయాణ పథకంపై లెక్కలు తీస్తున్న ఆర్టీసీ

- ఉమ్మడి జిల్లాల పరిధిలోనే.. 88% గ్రామీణ బస్సుల పరుగులు
- ఎక్స్‌ప్రెస్‌ల్లోనూ 70 శాతం ఉమ్మడి జిల్లాలోనే
- వీటిలో 8.5 శాతం మందే పొరుగు జిల్లాలకు ప్రయాణం



ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో వచ్చేనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. జిల్లా పరిధిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎన్ని బస్సులు తిరుగుతున్నాయి? వాటిలో ప్రయాణించేవారు ఎందరు? ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తే ఎంతమందికి లబ్ధి చేకూరుతుందన్న దానిపై ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగుతో పాటు, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ బస్సుల్లో 88 శాతం ప్రయాణికులు ఉమ్మడి జిల్లాల పరిధిలోనే రాకపోకలు సాగిస్తున్నట్లు తేలింది. 12 శాతం బస్సులు మాత్రమే పొరుగున ఉన్న జిల్లాలకు తిరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో బస్సు ప్రయాణం అమలు ద్వారా ఎక్కువ మంది మహిళలకు మేలు కలగనుందని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోనే 91.5 శాతం ప్రయాణికులు

- ఆర్టీసీలో ప్రస్తుతం 11,449 బస్సులు ఉన్నాయి. ఇందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీలు కలిపి 6,561 బస్సులు ఉన్నాయి. ఇవన్నీ అత్యధికంగా ఉమ్మడి జిల్లాల్లోనే ప్రయాణిస్తున్నాయి. (మిగతా 3లో)

ఇదీ సంగతి!



'బడి'బుడి అడుగుల హైడ్రోపోనిక్స్

మట్టిలేని మొక్కల పెంపకం

నెల్లూరు వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో వినూత్న ప్రయోగం



విద్యార్థులకు హైడ్రోపోనిక్స్ విధానాన్ని వివరిస్తున్న బయాలజీ ఉపాధ్యాయురాలు శ్యామకుమారి

ఈనాడు, నెల్లూరు: పెద్దఎత్తున భూమి, సాగునీటి వనరులు లేకుండా పరిమిత వనరులతో పంటలు సాగుచేసే సాంకేతికతే హైడ్రోపోనిక్స్. నగరాలు, పట్టణాల్లో ఇప్పుడిప్పుడే ఈ సాంకేతికతపై మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ప్రారంభమైన నెల్లూరు నగరంలోని వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో హైడ్రోపోనిక్స్ సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో ఈ తరహా ప్రయోగం చేపట్టడంతో ప్రత్యేకత సంతరించుకుంది. బడిలో సుమారు 1500 చదరపు అడుగుల్లో షేడ్‌నెట్ నిర్మించారు. ఇందులో న్యూట్రియంట్ ఫిల్మ్ టెక్నిక్ వినియోగిస్తున్నారు. మట్టి స్థానంలో కోకో పిట్, పెర్లైట్, న్యూట్రియంట్లు కలిపిన నీటిని వినియోగిస్తూ.. నీటి ప్రవాహాన్ని నియంత్రించే యంత్రాలు అమర్చారు. షేడ్‌నెట్ లోపల కృత్రిమ వాతావరణంతో పాటు వివిధ ఆకృతుల్లో ఫ్రేములు అమర్చి, వాటిలో పాలకూర పండిస్తున్నారు. ఇదంతా విద్యార్థులే చేస్తుండటం గమనార్హం. ఇందుకోసం 6-9 తరగతుల విద్యార్థులకు పీరియడ్లను కేటాయించారు. నేల లేకుండా మొక్కలు ఎలా పెరుగుతాయి? వాటికి పోషకాలు ఎలా అందుతాయి? నీటిలో పీహెచ్ స్థాయిలను ఎలా గుర్తించాలి? మొక్కలకు పోషకాలు అందాలంటే ఏం చేయాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల వీఆర్ హైస్కూల్ ప్రారంభోత్సవానికి వచ్చిన విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు హైడ్రోపోనిక్స్ విధానంలో మొక్కలు ఎలా పెంచుతారనే విషయాన్ని అక్కడ చదివే విద్యార్థి వివరించడం గమనార్హం. బయాలజీ ఉపాధ్యాయుడు జాకబ్ ప్రవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రకాల పంటలు పండిస్తామని తెలిపారు.




రైలు పెట్టె తరహాలో ఏర్పాటు చేసిన క్యాప్సుల్ హోటల్

రైలును మరిపించే స్లీపింగ్ పాడ్‌లు

- విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రారంభమైన క్యాప్సుల్ హోటల్

3లో



నరేగా పెండింగ్ బిల్లులకు ఆమోదం

● కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో నిలిచిపోయిన. . ఉపాధి హామీ పథకం బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. కేంద్రం తన వాటా కింద రూ.180 కోట్లను ఇవ్వనుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కలిపి 30 రోజుల్లోపు కాంట్రాక్టర్లకు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో 2014-19 మధ్య ఉపాధి పథకం కింద చేసిన రూ.250 కోట్ల విలువైన పనులకు బిల్లులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం నిలిపేసి వాటిని క్లోజ్ చేసింది. దానివల్ల గత ఆరేళ్లుగా అవి పెండింగ్‌లో పడిపోయాయి. ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ కూడా మారిపోయింది. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయం చేసుకొని పాతసాఫ్ట్‌వేర్ తీసుకొచ్చి గతంలో జరిగిన పనులన్నీ రీఓపెన్ చేశారు. దాని ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూ.180 కోట్ల మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వానికి చెల్లించనుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కలిపి పెండింగ్ బిల్లులన్నీ 30 రోజుల్లోపు కాంట్రాక్టర్లకు చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. 4.30 లక్షల వర్క్‌లకుగాను 3.50 లక్షల పనులకు బిల్లుల చెల్లింపులకు ఆమోదం తెలిపారు. వీరంతా రూ.5-10 లక్షల వరకు పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లే. ఎట్టకేలకు ధర్మం విజయం సాధించింది" అని పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్రం ఈ నిధుల విడుదలకు అంగీకరించడంపై ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లుల సాధన కమిటీ ఛైర్మన్ బీద రవిచంద్ర హర్షం ప్రకటించారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

ఈఏపీసెట్- 2025 (గతంలో ఎంసెట్) కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల కోసం *ఈనాడు- 'చదువు', గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (GGU)* ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్ జూమ్ ప్లాట్‌ఫామ్‌పై జరగనుంది.

ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, కన్వీనర్ ప్రొ. వి.వి. సుబ్బారావు.. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, వెబ్ ఆప్షన్ మెలకువలు వివరిస్తారు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొని బ్రాంచి, కళాశాల ఎంపికలో జాగ్రత్తలు, బ్రాంచీల వారీగా కెరియర్ అవకాశాలు తదితర అంశాలపై సూచనలూ, సలహాలూ అందిస్తారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో పాటు కౌన్సెలింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలనుకునేవారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే..

13-07-2025 (ఆదివారం) నాడు..

● క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేదా

https://bit.ly/apengwebinar
వెబ్ లింకు ఓపెన్ చేయండి
(లేదా)
zoom id- 917 6881 2223
Passcode- 478741తో
జాయిన్ కావచ్చు

2027 మార్చి 1 నుంచి జనగణన

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: జనగణన కార్యక్రమం 2027 మార్చి 1న ప్రారంభం కానుందని కేంద్రం జారీ చేసిన గెజిట్‌ను ఉటంకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. లద్దాఖ్, జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 అక్టోబరు 1 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని, మిగిలిన చోట్ల 2027 మార్చి 1 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది.

ఓటరు జాబితాల సమగ్ర సవరణ సబబే..

(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. ఓటరును నిర్ధారించేందుకు పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాలు సమగ్రంగా లేవని పేర్కొంది.

'ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం న్యాయబద్ధమైందని మా అభిప్రాయం. వాటిని పరిగణనలోకి తీసుకోవాలా? లేదా? అన్నది ఎన్నికల సంఘమే నిర్ణయించాలి. ఒకవేళ తీసుకోకపోతే అందుకు గల కారణాలను వెల్లడించాలి' అని ధర్మాసనం పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తులో ఈసీని అనుమానించడానికి ఏమీ లేదని, ఈ అంశంపై మరింత విచారణ జరగాల్సి ఉందని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ నెల 21కి కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఈసీని ఆదేశించింది. ఆ అఫిడవిట్‌పై పిటిషనర్ల స్పందనకు వారం రోజుల గడువు ఇచ్చింది. బిహార్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణను సవాల్ చేస్తూ పలు ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో పాటు పలువురు వ్యక్తులు దాఖలు చేసిన 10కి పైగా పిటిషన్లపై ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. ఈసీ, పిటిషనర్ల తరపు వాదనలు విన్న తర్వాత కొన్ని ప్రశ్నలు సంధించింది. ఓటరు జాబితాల సవరణను చేపట్టడం సమస్యే కాదని, అయితే దానికి ఇది సరైన సమయమా? అని ఈసీని జస్టిస్ సుధాంశు ధూలియా ప్రశ్నించారు. ఓటు హక్కును కోల్పోయేవారు, ఎన్నికల కంటే ముందే దాన్ని తిరిగి పొందేందుకు అప్పీల్ చేసుకునేందుకు సమయం తప్పక ఉండాలని పేర్కొన్నారు. పౌరులకు ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు ప్రభుత్వమే ఆధార్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణనలోకి తీసుకుంటోందనే విషయాన్ని గుర్తుచేశారు. ఓటరు జాబితాల నుంచి పేర్లను తొలగించే వారి వాదనలు వినేందుకు అవకాశం ఇస్తామని, ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఈసీ తరఫు న్యాయవాది తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటరును నిర్ధారించేందుకు ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులను పరిగణనలోకి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ధర్మాసనం సూచనపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తంచేసింది. ఇది ప్రజాస్వామ్యానికి ఉపశమనమని ఆ పార్టీ సీనియర్ నేత కె.సి.వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగింపునకు న్యాయస్థానం అనుమతించడం విపక్షాలకు ఎదురుదెబ్బ అని భాజపా అధికారప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ తెలిపారు.



ఈ మంత్రాలతో మీకు తిరుగులేని శక్తి

1. నేను క్లిష్టమైన పనులను చేయగలను.
2. సమస్య ఎలాంటిదైనా పరిష్కారాన్ని కనుగొనే సామర్థ్యం నాకుంది.
3. నిత్యం కొత్త విషయాలు నేర్చుకుంటూ పురోగతి సాధిస్తాను.
4. నా మీద నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. అదే అతి పెద్ద బలం.
5. ప్రతి క్షణాన్నీ ఆస్వాదించేలా నా జీవితాన్ని ఆసక్తికరంగా మలచుకుంటాను.

ఈ ఐదు వాక్యాలను మంత్రాల్లా పదే పదే మననం చేసుకుంటే మీరు నిత్యశక్తిమంతులై ఉంటారు.

– అంబర్ లయన్, రచయిత్రి

గ్రహం అనుగ్రహం

11–7–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
పాడ్యమి: రా. 2-02 తదుపరి విదియ
పూర్వాషాఢ: ఉ. 6-37 తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: మ. 2-53 నుంచి 4-33 వరకు
అమృత ఘడియలు: రా. 12-50 నుంచి 2-29 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-11 నుంచి 9-03 వరకు
తిరిగి మ. 12-31 నుంచి 1-23 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.36; **సూర్యాస్తమయం:** సా.6.35

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	26.0
తిరుపతి	38.7	27.4
నెల్లూరు	38.6	29.7
కడప	37.0	27.0
విజయనగరం	37.0	26.0
విజయవాడ	36.8	27.0
అనంతపురం	36.2	25.5
గుంటూరు	36.0	29.0
ఒంగోలు	36.0	28.5
తాడేపల్లిగూడెం	35.8	25.7
విశాఖపట్నం	35.4	26.8
నరసాపురం	35.0	28.2
కర్నూలు	34.5	25.0
శ్రీకాకుళం	31.0	27.0

అమెరికాలో 'సంపన్న' భారతీయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ జాబితాలో చేరారు.

అగ్రస్థానంలో జయ్ చౌధ్రీ: 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌధ్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్‌సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్‌డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40% వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, 10వ తరగతి వరకు సురక్షిత నీటి సరఫరా లేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్‌ఐటీ అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాతే బిలియనీర్‌గా మారగలిగారు.

దక్షిణాఫ్రికాలో పుట్టి.. అమెరికాకు వచ్చి: ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికాలో పుట్టి, ఒక కళాశాల విద్యార్థిగా కెనడా నుంచి అమెరికాకు వచ్చారు. ఇపుడు 393.1 బి. డాలర్లతో ప్రవాస సంపన్నుల్లోనే కాదు ప్రపంచ కుబేరుల్లోనే అగ్రస్థానంలో ఉన్నారు. గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్ కుటుంబం కూడా బ్రిన్‌కు ఆరేళ్ల వయసున్నపుడు రష్యా నుంచి అమెరికాకు వలస వచ్చింది. 139.7 బి. డాలర్లతో బ్రిన్ రెండో స్థానంలో ఉన్నారు. ఎన్‌విడియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సెన్‌హువాంగ్ తైవాన్‌లో పుట్టి, చిన్నపుడే థాయ్‌లాండ్‌కు కుటుంబంతో వెళ్లారు. 9 ఏళ్ల వయసున్నపుడు ఆయన కుటుంబం అమెరికాలో స్థిరపడింది. తైవాన్ నుంచి వచ్చిన 11 మంది బిలియనీర్ ప్రవాసుల్లో ఈయన ఒకరు. 137.9 బి. డాలర్ల సంపదతో, మొత్తం జాబితాలో మూడో స్థానంలో నిలిచారు.

అమెరికా సంపన్నుల్లో నాలుగో వంతు మందికి వారసత్వంగా సమకూరగా, ప్రవాస బిలియనీర్లలో 93% మంది స్వయంకృషితోనే ఎదిగారు. జాబితాలో మూడింట రెండొంతుల మంది టెక్ (53 మంది), ఆర్థిక (28 మంది) రంగాల నుంచే ఉన్నారు. విదేశాల్లో పుట్టి, ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న వారి సంపదనే ఈ జాబితా కోసం ఫోర్బ్స్ పరిగణనలోకి తీసుకుంది.

అమెరికాలో సంపన్న ప్రవాస భారతీయులు

ర్యాంకు	పేరు	సంపద (బి.డా.)	రంగం/ కంపెనీ
1	జయ్ చౌధ్రీ	17.9	సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్
2	వినోద్ ఖోస్లా	9.2	సన్ మైక్రోసిస్టమ్స్
3	రాకేశ్ గంగ్వాల్	6.6	ఎయిర్‌లైన్స్
4	రోమేశ్ వాద్వానీ	5.0	సాఫ్ట్‌వేర్
5	రాజీవ్ జైన్	4.8	ఫైనాన్స్
6	కవితార్క్ రామ్ శ్రీరామ్	3.0	గూగుల్
7	రాజ్ సర్దానా	2.0	టెక్నాలజీ సర్వీసెస్
8	డేవిడ్ పాల్	1.5	వైద్య పరికరాలు
9	నికేశ్ అరోరా	1.4	సైబర్ సెక్యూరిటీ
10	సుందర్‌పిచాయ్	1.1	ఆల్ఫాబెట్
11	సత్య నాదెళ్ల	1.1	మైక్రోసాఫ్ట్
12	నీరజ్ సేథి	1.0	ఐటీ కన్సల్టింగ్

★ ఈనెల 7 నాటికి 1 బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది.

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అడుగులు

భూమిని పరిశీలించిన జిందాల్ కంపెనీ ప్రతినిధులు



ఉక్కు పరిశ్రమ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిందాల్ కంపెనీ ప్రతినిధులు. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే-జమ్మలమడుగు గ్రామీణ: కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ పరిశ్రమను నిర్మించనున్న జిందాల్ కంపెనీ ప్రతినిధులు.. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో కలిసి జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద భూమిని గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులు మొదలుపెట్టడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలపై కలెక్టర్‌తో చర్చించారు. త్వరలోనే నిర్మాణ పనులు మొదలుపెట్టి, శరవేగంగా పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. రెండు దశల్లో చేపట్టనున్న ఈ పరిశ్రమ నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యూ సంస్థ రూ.9 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. పరిశీలనకు వచ్చిన వారిలో జిందాల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, జీఎం వికాస్ కన్వర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, తెదేపా నేత భూపేష్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి తదితరులున్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను గురువారం రాత్రి పోలీసు నియామక మండలి విడుదల చేసింది. 37,600 మంది హాజరుకాగా 33,921 మంది అర్హత సాధించినట్లు మండలి ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా తెలిపారు. వారిలో 29,211 మంది పురుషులు. 4,710 మంది మహిళలు ఉన్నారు. అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ నుంచి ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఓఎంఆర్ షీట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వెరిఫికేషన్ అవసరమైతే రూ.1,000 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర సందేహాలకు 94414 50639, 91002 03323 నంబర్లపై ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సంప్రదించవచ్చు. ఈ ఉద్యోగాలిప్పిస్తామంటూ ఎవరైనా మోసపూరితంగా ప్రకటనలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మీనా సూచించారు.

ఉచిత ప్రయాణ పథకంపై లెక్కలు తీస్తున్న ఆర్టీసీ

(మొదటి పేజీ తరువాయి)

■ 1,897 ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉండగా, వీటిలో 70 శాతం ఉమ్మడి జిల్లాల పరిధిలోనే తిరుగుతున్నాయి.

■ మొత్తంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కలిపి 8,458 బస్సులు ఉన్నాయి. ఇవన్నీ కలిసి 83 శాతం ఉమ్మడి జిల్లాల లోపలే తిరుగుతున్నాయి.

■ ప్రస్తుతం ప్రయాణిస్తున్న వారి లెక్కలు పరిశీలిస్తే.. ఆయా బస్సుల్లో 8.5 శాతం మంది మాత్రమే పొరుగు జిల్లాలకు ప్రయాణిస్తున్నారు. మిగిలిన 91.5 శాతం ఉమ్మడి జిల్లా పరిధిలోనే రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు.

10.84 లక్షల మంది మహిళా ప్రయాణికుల పెరుగుదల

■ ఆర్టీసీ గ్రామీణ, సిటీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కలిపి ప్రస్తుతం రోజుకు 16.11 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తే ప్రయాణికుల సంఖ్య 26.95 లక్షలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

■ అంటే నిత్యం సగటున 10.84 లక్షల మంది మహిళా ప్రయాణికులు పెరుగుతారు.

■ మహిళలు సగటున వారానికి ఓసారి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణిస్తారని అంచనా..

■ విజయవాడ, విశాఖపట్నాల్లో తిరిగే సిటీ బస్సుల్లో మాత్రం వారానికి నాలుగుసార్లు ప్రయాణిస్తారని భావిస్తున్నారు.

■ మొత్తంగా ఉమ్మడి జిల్లా పరిధిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు ద్వారా ఆర్టీసీపై నెలకు రూ.242 కోట్ల మేర భారం పడుతుంది. దానిని ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

బస్టాండ్లలో వసతులపైనా దృష్టి..

రద్దీ పెరగనున్న నేపథ్యంలో బస్టాండ్లలో వసతులు పెంచడంపై ఆర్టీసీ దృష్టి పెట్టింది. 19 ప్రధాన బస్టాండ్లలో నీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా తాగునీటిని అందుబాటులో ఉంచనున్నారు. రూ.1.6 కోట్లతో బస్టాండ్లలో మరుగుదొడ్ల మరమ్మతులు చేయగా, రూ.2.5 కోట్లతో మరిన్నింటిని నవీకరిస్తున్నారు. మూడు సీట్లతో కూడిన 596 బెంచీలను ఇప్పటికే పలు బస్టాండ్లలో అమర్చగా, మరో 596 బెంచీలను కొంటున్నారు. బస్టాండ్లలో మరమ్మతులు, పెయింటింగ్ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు.

మీ బిడ్డల భవిత.. నా బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

లోకేశ్ చదువంతా నా భార్యే చూసుకుంది. విద్యార్థుల జీవితంలో తల్లి పాత్ర ఎంతో కీలకం. మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు. తల్లిదండ్రులు ఇద్దర్నీ సమానంగా చూడాలనే ఉద్దేశంతోనే ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తున్నాం. ఐదు, పదేళ్లలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతాం' అని చంద్రబాబు చెప్పారు. మా బడిలో సీట్లు లేవు అని బోర్డు పెట్టే పరిస్థితి తీసుకురావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

6 కి.మీ. నడిచివెళ్లి చదువుకున్నా

నా చిన్నప్పుడు 6 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునేవాళ్లం. ఉదయాన్నే ఆరు గంటలకే బయలుదేరాలంటే మా అమ్మ వేకువన 4 గంటలకే లేచి భోజనం కట్టిచ్చేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. గత ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దు చేస్తే మళ్లీ తీసుకొచ్చాం. సన్నబియ్యంతో రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం ఇస్తున్నాం. దీని నాణ్యతపై తల్లిదండ్రులు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి.

ప్రతిభను ప్రోత్సహిస్తాం


ప్రతిభా అవార్డులు ప్రవేశపెట్టి ఏడు, పది తరగతులతో పాటు ఇంటర్మీడియట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉన్నత చదువులకు నగదు ప్రోత్సాహకాలిచ్చాం. వాటిని మళ్లీ తీసుకురావాలని విద్యాశాఖకు సూచిస్తున్నా. ప్రస్తుతం షైనింగ్ స్టార్స్ పేరుతో అవార్డులు ఇస్తున్నాం. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పుస్తకాలు తీసుకొస్తున్నాం. మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌ను స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన విద్యాశాఖను అభినందిస్తున్నా. గత ప్రభుత్వంలో గంజాయిని వాణిజ్య పంటలా పెంచే పరిస్థితి తీసుకొచ్చారు. కళాశాలల్లో పిల్లలు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. గంజాయి అమ్మేవారి ఆస్తిని స్వాధీనం చేసుకుని బాధితులకు ఖర్చు పెడతాం. భవిష్యత్తులో మారకపోతే సంక్షేమ పథకాలను నిలిపివేస్తాం.

2.28 కోట్ల మందితో మహాయజ్ఞంలా..

'రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని 3,32,770 మంది ఉపాధ్యాయులు, 74,96,282 మంది విద్యార్థులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులతో కలిపి 2.28 కోట్ల మందితో మెగా పీటీఎం నిర్వహించాం. పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులిస్తున్నాం. మొక్కల సంరక్షణ బాధ్యత వారికి తెలియాలనే గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాన్ని తీసుకొచ్చాం. నాణ్యమైన, ఆకర్షణీయమైన యూనిఫాం, షూ, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు అందించాం. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో ఇచ్చే మిత్ర కిట్ల కోసం ఒక్కోదానికి రూ.2,275 చొప్పున రూ.953 కోట్లు ఖర్చుపెట్టాం. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే పుస్తకాలు అందించాం' అని సీఎం వెల్లడించారు.



రిహాన్ బాషా ప్రోగ్రెస్ రిపోర్టు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఉపాధ్యాయుడు గోపాలరెడ్డి, మంత్రి లోకేశ్, విద్యార్థి తల్లిదండ్రులు



మెగా పీటీఎం లోగో వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

రాజకీయాలన్నీ గేటు బయటే.. లోకేశ్

'గత ప్రభుత్వం ఇచ్చిన యూనిఫాంలో నాణ్యత లేదు. పుస్తకాలు, బ్యాగులపైనా ముఖ్యమంత్రి ఫొటోలు ముద్రించి ఇచ్చారు. మేమొచ్చాక పాఠశాలల్లో ఎక్కడా రాజకీయ ప్రచారానికి తావు లేకుండా చేశాం. రాజకీయాలన్నీ గేటు బయటే ఉంటాయి' అని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. దేశంలో ఎప్పుడూ లేనివిధంగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారు? మార్కులు ఎలా వచ్చాయని బాధ్యతగా తల్లిదండ్రులు ప్రశ్నించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు విద్యాశాఖ తరఫున కోటి మొక్కలు నాటుతామన్నారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో మొక్క నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్‌పోర్టు ఇస్తున్నామన్నారు. కొందరు విద్యార్థులు మార్కులు తక్కువ వచ్చాయనే కారణంతో ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా పట్టుదలతో విజయం వైపు పయనించాలన్నారు. డిసెంబరులో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో సీఎం పిల్లలకు పెట్టే భోజనమే తిన్నారని.. ఆరోజే ఆయన భోజనం బాగోలేదని గుర్తించారన్నారు. ఆ వెంటనే పిల్లలకు సన్నబియ్యంతో భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక క్లాసుకు ఒక టీచర్ ఉన్న పాఠశాలలు 1,200 ఉండేవని.. కూటమి ప్రభుత్వంలో ఆ సంఖ్యను 9,600కు పెంచామన్నారు. 'లీప్' యాప్ ద్వారా పిల్లలు పాఠశాలకు వచ్చారా.. లేదా? ఎన్ని మార్కులొచ్చాయని తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనం, ఇతర కార్యక్రమాలపై తల్లిదండ్రులు అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ఇంటర్మీడియట్‌లోనూ ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నట్లు వివరించారు.

ప్రణాళికాబద్ధంగా పీటీఎం

ఈనాడు, అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న తల్లిదండ్రులు, టీచర్ల ఆత్మీయ సమావేశాన్ని హడావుడి లేకుండా, ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. వేదికను అందరికీ అందుబాటులో దగ్గరగా వేశారు. వేదికపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దాతలు, పూర్వ విద్యార్థులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ తదితరులు ఆసీనులయ్యారు. సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చి.. నేరుగా కొత్తచెరువు చేరుకున్నారు. జడ్పీ బాలుర హైస్కూల్‌లో పర్వీన్, షబ్బీర్ దంపతులతో మాట్లాడారు. వారి పిల్లల చదువు గురించి ఉపాధ్యాయుడు గోపాలరెడ్డితో కలిసి సమీక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, ప్రోగ్రెస్ కార్డులు అందించారు. భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు.

■ ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థి సూర్యతేజ చెప్పిన పద్యాన్ని ముఖ్యమంత్రి ఆసక్తిగా విని అభినందించారు.

కొత్తచెరువు జడ్పీహెచ్ఎస్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి లోకేశ్, అధికారులు, విద్యార్థులు





కొత్తచెరువు జడ్పీహెచ్ఎస్ మెగా పీటీఎంకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీటీఎం సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థినులతో ఎంపీ పురందేశ్వరి

గిన్నిస్ రికార్డుకు మెగా పీటీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో గురువారం పెద్ద ఎత్తున నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) వివరాలను గిన్నిస్ రికార్డు కోసం సిద్ధం చేస్తున్నారు. గిన్నిస్ రికార్డు నిర్వాహకులకు పంపించేందుకు వీలుగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వివరాల నమోదుకు సాక్షులను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగిన మెగా పీటీఎంకు సుమారు 2.28 కోట్ల మంది హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల పురోగతిపై హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించారు. తల్లి పేరిట మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టులు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం 38 లక్షల మంది విద్యార్థులు మొక్కలు నాటగా వారిలో 25 లక్షల మందికి గ్రీన్ పాస్‌పోర్టులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువు జడ్పీ హైస్కూల్‌లో పీటీఎంకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్.. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు వీటికి హాజరయ్యారు.

ప్రపంచంలోనే మేటి భవనం!

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణం ఉండాలి. ఆ కంప్యూటర్ ఉన్న గదిలోకి వెంట్రుక మందం ఖాళీ నుంచి గాలి వెళ్లినా.. వేవ్స్ (తరంగాలు) తగిలినా ప్రాసెసర్‌పై ప్రభావం పడి వచ్చే ఫలితం మారిపోతుంది.

■ కంప్యూటర్ ఏర్పాటుచేసే గది చుట్టూ గోడలు నిర్మిస్తూ.. ఐసోలేట్ చేసుకుంటూ వస్తారు. బయటి నుంచి కాంతి, శబ్దాలు చొరబడకుండా ఇన్సులేషన్ ఉంటుంది.

■ ఇలాంటి కొన్ని లేయర్ల నిర్మాణాల తర్వాత క్వాంటమ్ కంప్యూటర్ ఉండే ప్రాంతం ఉంటుంది. అందులో -273 డిగ్రీల ఉష్ణోగ్రత నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తారు.

■ కంప్యూటర్‌లో వినియోగించే ప్రతి చిన్న విడి భాగానికి ఒక శాస్త్రవేత్త ఉంటారు. క్వాంటమ్ ఫిజిక్స్, క్వాంటమ్ సెన్సింగ్ వంటి వివిధ సాంకేతికతల మేళవింపుతో క్వాంటమ్ కంప్యూటర్ తయారవుతుంది. ఇక్కడి నుంచే క్లౌడ్ ద్వారా ప్రపంచం మొత్తానికి క్వాంటమ్ సేవలను సంస్థ అందిస్తుంది.

■ ఐబీఎం తయారు చేసే క్వాంటమ్ కంప్యూటర్‌లో వినియోగించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ డిజైన్ల తయారీ అనుబంధ యూనిట్లకు కూడా స్పేస్‌ను కేటాయించనున్నారు.

90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలు

మొత్తం వ్యాలీలో దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నదే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ మాదిరే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో డెవలపర్లు భవనాలను నిర్మించి.. వివిధ కంపెనీలకు స్పేస్ లీజుకు ఇస్తారు. దీనికి ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం భూములను ఇస్తుంది. అందులో నిర్మించే భవనాల ఆకృతులను మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన రీతిలోనే ఉండాలనే నిబంధన విధించనుంది. అలా ప్రపంచంలోనే ప్రత్యేకంగా క్వాంటమ్ వ్యాలీని తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచన.

■ అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక ఉద్యోగికి సగటున 150 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం. అలా ప్రభుత్వం నిర్దేశించిన విస్తీర్ణంలో సుమారు 60 వేలమంది నిపుణులు పనిచేసేలా మౌలిక సదుపాయాలను ఇక్కడ అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన.

వాట్సప్‌లో సరికొత్త ఫీచర్!


(మొదటి పేజీ తరువాయి)

మెసేజ్ లేదా చిత్రం గూగుల్ సెర్చ్‌లోకి వెళ్లి వివరాలు అందిస్తుంది. తద్వారా వాటి వాస్తవికతను మనం సులభంగా నిర్ధారించుకోవచ్చు. దీనికీ గూగుల్ సేవ, గోప్యతా నిబంధనలు వర్తిస్తాయి. ఇది 2020లోనే బీటా వెర్షన్‌లో బ్రెజిల్, ఇటలీ, ఐర్లండ్, మెక్సికో, స్పెయిన్, యూకే, అమెరికా దేశాల్లోని వినియోగదారులకు చేరువ కాగా.. ప్రస్తుతం చిలీ, అర్జెంటీనా, కొలంబియా, ఫ్రాన్స్, జర్మనీ, నైజీరియా, పెరూ, డొమినికన్ రిపబ్లిక్, వెనిజువెలాలో మాత్రమే ఉంది. ఎక్కువసార్లు పంపిన మెసేజ్ లేదా చిత్రాలకే ఇది వర్తిస్తుంది.

మరో 100 ఏళ్లయినా ఏఐ సృజనాత్మకంగా ఆలోచించదు

(మొదటి పేజీ తరువాయి)

చాలా లోతైన ఆలోచన అవసరమని తెలిపారు. మానవ మేధకు ఉండే సృజనాత్మకతకు ఏ అల్గారిథమ్ సరిపోదని అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఏఐ భర్తీ చేసే అవకాశం ఉందని 'ప్రపంచ ఆర్థిక వేదిక' ఇటీవల అంచనా వేసింది. దీనిపై బిల్‌గేట్స్ ఈ మేరకు స్పందించారు.



రైలును మరిపించే స్లీపింగ్ పాడ్‌లు



డబుల్ బెడ్ మోడల్ స్లీపింగ్ పాడ్

ఈనాడు, విశాఖపట్నం: తక్కువ స్పేస్‌లోనే సౌకర్యవంతంగా విశ్రాంతి తీసుకునేందుకు ప్రారంభమైనవే క్యాప్సుల్ హోటల్స్. వీటినే స్లీపింగ్ పాడ్‌లుగా కూడా వ్యవహరిస్తారు. తొలుత జపాన్‌లో ప్రారంభమైన ఈ తరహా వసతి ఏర్పాటు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. తాజాగా ఈ సౌకర్యాన్ని విశాఖ రైల్వే స్టేషన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. రైలు పెట్టెలో పడకలను తలపించేలా స్లీపింగ్ పాడ్‌లను ఏర్పాటు చేశారు. తూర్పు కోస్తా రైల్వేజోన్‌లో తొలిసారి ఈ రకమైన వసతిని ఇక్కడే ఏర్పాటు చేశామని డీఆర్ఎం లలిత్ బోహ్రా తెలిపారు. విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంలో ఒకటో అంతస్తుపై ఈ స్లీపింగ్ పాడ్‌లు అందుబాటులో ఉంటాయి. రైలు బోగీ లేదా స్లీపర్ బస్ తరహాలో ఒక వరుసలో పైన, కింద, ఎదురెదురుగా ఈ క్యాప్సుల్స్‌ను డిజైన్ చేశారు. కర్టెన్స్ ఉంటాయి కాబట్టి గోప్యతకు భంగం వాటిల్లదు.

24 గంటలకు డబుల్ బెడ్ రూ.600

ఏసీ సదుపాయంతో ఇందులో సింగిల్ బెడ్ పాడ్‌లు 73, డబుల్ బెడ్‌వి 15 ఉన్నాయి. 18 పడకలు ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేశారు. ఉచిత వైఫై, స్నానానికి వేడి నీరు, చిరుతిళ్లు, పర్యాటకులకు అవసరమైన సమాచారం అందించే డెస్క్, మోడ్రన్ వాష్‌రూం సదుపాయం కల్పించారు. సింగిల్ బెడ్‌కు 3 గంటల వరకు ఒక్కొక్కరికి రూ.200, అది దాటితే 24 గంటల వరకు ఒకరికి రూ.400 వసూలు చేస్తారు. డబుల్ బెడ్ అయితే 3 గంటల వరకు రూ.300, ఆ తర్వాత 24 గంటల వరకైతే రూ.600 వసూలు చేస్తారు. ప్రత్యేకంగా అందరూ కూర్చొని వీక్షించేందుకు సోఫాలు, టీవీ సౌకర్యం ఉన్నాయి.

విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

విప్పుతారనేది ఆసక్తికరంగా మారింది. 2019లో వైకాపా అధికారం చేపట్టిన తర్వాత.. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన కోసం జరిగిన సమావేశాల్లో విజయసాయిరెడ్డి పాల్గొన్నారని, కొన్ని సమావేశాలు ఆయన నివాసంలోనే జరిగాయని సిట్ ఇప్పటికే తేల్చింది. అదాన్ డిస్టిలరీస్‌కు, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు రుణాలు ఇప్పించడం వెనక ఆయన ప్రమేయం ఉన్నట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈ కుంభకోణంలో ప్రధాన కుట్రదారెవరు? ముడుపుల సొమ్ము అంతిమంగా ఎవరికి, ఎలా చేరింది? తదితర అంశాలపై సిట్ ఆయన్ను ప్రశ్నించనుంది. విజయసాయి వైకాపాలో సుదీర్ఘకాలం పాటు నంబర్-2గా అధికారం చలాయించారు. ఆ పార్టీ, నాటి ప్రభుత్వంలోని అంతర్గత వ్యవహారాలు అన్నీ ఆయనకు తెలుసు. వీటితో పాటు మద్యం కుంభకోణానికి సంబంధించిన సమగ్ర వివరాలు ఆయనకు ఎరుకే. ఈ కుంభకోణానికి సంబంధించి చెప్పాల్సి వస్తే మరిన్ని వివరాలు భవిష్యత్తులో వెల్లడిస్తానంటూ గతంలోనే ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఏం అడగనున్నారు? ఆయన ఏం చెబుతారనేదానిపై ఆసక్తి నెలకొంది.

ఈనాడు

ఆగని మరణ మృదంగం!

ఉత్తర్ ప్రదేశ్‌లో పుసయినా అని నాలుగు వేల జనాభా కలిగిన చిన్న గ్రామం... ఆ ఊళ్లోని దాదాపు సగం కుటుంబాల్లో భర్తలను కోల్పోయిన మహిళలు కనపడతారు. తమ సౌభాగ్యాన్ని కల్తీమద్యం కబళించడంతో ఆ అభాగినులు ఇప్పుడు గుండెల నిండా వేదన నింపుకొని బతుకుతున్నారు. పుసయినా విషాదకాండపై జాతీయ మానవ హక్కుల సంఘం స్పందిస్తూ- ఎన్నో కుటుంబాలను దుర్భరావస్థల్లోకి నెడుతున్న నేరగాళ్లపై ఉక్కుపాదం మోపడంలో వ్యవస్థాగత వైఫల్యాన్ని ఎండగట్టింది. యంత్రాంగం అలా మునగదీసుకుని పడుకుంటుండటంతోనే దేశవ్యాప్తంగా కల్తీకల్లు, నాటుసారా, చీప్ లిక్కర్ వంటివి నిత్యం కన్నీటి కాష్ఠాలను ఎగదోస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాసిరకం కల్లుకు అయిదు ప్రాణాలు కడతేరిపోయాయి. కామారెడ్డి, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వికారాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోనూ రసాయనాలు కలగలిసిన కల్లు వెల్లువెత్తుతోందన్న కథనాలు గతంలో వెలుగుచూశాయి. ఏపీలో ఉమ్మడి తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల్లో నాలుగు రోజుల క్రితమే నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడ్డాయి. కాసులయావతో పచ్చివిషం వంటి పిచ్చిసరకును విక్రయిస్తూ, జనారోగ్యాన్ని బలితీసుకుంటున్న వారెవరూ క్షమార్హులు కానేకారు!

పల్లెల నుంచి వంద లీటర్ల కల్లు తెచ్చి, అందులో ఆల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరల్ హైడ్రేట్ వంటి ప్రమాదకర పదార్థాలను గుమ్మరించి వెయ్యి లీటర్ల పరిమాణానికి పెంచి అమ్మేస్తున్న ప్రబుద్ధులు- ఎన్నో సంసారాలను నాశనం చేస్తున్నారు. అత్యంత విషపూరిత ద్రావకం మిథైల్ ఆల్కహాల్(మిథనాల్)తో మద్యం తయారుచేస్తున్న మరికొందరు రాక్షసులు- ఇంకెంతో మంది ప్రాణాలను పొట్టనపెట్టుకుంటున్నారు. మిథనాల్‌తో చేసిన చీప్‌లిక్కర్ తాగి మొన్న మేలో పంజాబ్‌లో 23 మంది విగతజీవులయ్యారు. బిహార్, గుజరాత్, తమిళనాడు... ఇలా అనేక రాష్ట్రాల్లో ఇలాంటి దారుణోదంతాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వ సమాచారం ప్రకారం, 2002-2022 మధ్యలో కల్తీమద్యం కారణంగా దేశవ్యాప్తంగా 22వేల ప్రాణాలుపోయాయి. వాస్తవానికి అలా చనిపోతున్నవారి వివరాలన్నీ అధికారిక లెక్కల్లోకి రావట్లేదు. ఏపీలోని జంగారెడ్డిగూడెంలో కల్తీ సారాక్షసికి 27మంది చనిపోతే, వాళ్లవి సహజ మరణాలేనంటూ నాటి జగన్ సర్కారు కొట్టిపారేసింది. బిహార్‌లో 2016-21 మధ్యలో కల్తీ మద్యం దాదాపు రెండొందల మందిని చంపేస్తే- దస్త్రాల్లో మాత్రం మృతుల సంఖ్య 23గానే నమోదైంది. కల్తీ మందును కట్టడిచేయడంలో చేవచూపలేని యంత్రాంగం- దాని స్వైరవిహారాన్ని కప్పిపుచ్చుతూ జనాన్ని ఏమారుస్తుండటమే దౌర్భాగ్యం!

కల్తీసారాకు సమిధలయ్యేది పేదసాదలే... అలాంటి వాటి తయారీ, సరఫరాలకు వెనక ఉండే నిజమైన నేరగాళ్లకు సంకెళ్లు వేసేందుకు సరైన ప్రయత్నం చేస్తున్నట్లు లేరంటూ పంజాబ్ ప్రభుత్వానికి గతంలో న్యాయపాలిక చీవాట్లేసింది. ఏ రాష్ట్రంలోనైనా సరే- కిందిస్థాయి అధికారులు, స్థానిక రాజకీయ నాయకులకు తెలియకుండా ఎక్కడా కల్తీమద్యం దందాలు జరగవు. కాబట్టి సారా బట్టీలపై దాడులంటూ అప్పుడప్పుడు హడావుడి చేసే యంత్రాంగం- నెత్తుటి వ్యాపారాలను కూకటివేళ్లతో సహా పెకిలించి పారేయడంపై దృష్టి సారిస్తేనే కల్తీమద్యం మోగిస్తున్న మరణ మృదంగం ఆగుతుంది. సమాజానికి హానికారులైన అక్రమ సారా తయారీదారులపై పీడీ చట్ట ప్రయోగంలో తప్పేమీ లేదని తెలంగాణ హైకోర్టు కిందటి నెలలో స్పష్టంచేసింది. ఇలా కఠినచర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత కేసుల్లో నిందితులకు సరైన దండనలు పడేవిధంగా ప్రభుత్వాలు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలి. మద్యాదాయాల మత్తులో జోగాడటం సంక్షేమ రాజ్యధర్మం కాదని గుర్తించాలి!



వర్తమానాన్ని సమర్థించుకోవడానికి గతాన్ని ఉపయోగించుకోవడం ఎంత అసమంజసమో, గతాన్ని సమర్థించడానికి వర్తమానాన్ని వాడుకోవడం కూడా అంతే మంచిది కాదు.

– అమితాభ్ ఘోష్, రచయిత

మెరుగైన సమాజం కోసం...

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం. జనసంఖ్యలో హెచ్చుతగ్గులు దేశ స్థితిగతులను ప్రభావితం చేస్తాయి. అందుకే పదేళ్లకోసారి జనగణన ఆధునిక పాలనకు అవసరం. ప్రజల జీవన, ఆయుప్రమాణాల గురించి తెలుసుకుని తదనుగుణంగా సంక్షేమ పథకాల అమలుకు కృషిచేస్తాయి ప్రభుత్వాలు.

రామాయణ కాలంలోనూ జీవన ప్రమాణాలు, ధర్మానుసార జీవితం పట్ల దృష్టిని కేంద్రీకరించారు. వాల్మీకి అయోధ్య గురించి చెబుతూ- ప్రజలు, రాజు కూడా తమ ధర్మంపట్ల నిష్ఠగా ఉండేవారని రాశారు. భారతంలోని శాంతిపర్వంలో భీష్ముడు యుధిష్ఠిరుడికి పాలనలో ప్రజా సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం గురించి వివరించాడు.

కురుక్షేత్ర సంగ్రామం తర్వాత దేశం జనశూన్యమైపోయినట్టు వర్ణిస్తూనే ధర్మహీనమైన రాజనీతి వల్ల జనాభా నాశనమవ్వచ్చు అనే హెచ్చరిక కూడా చేస్తుంది భారతం. నైతికజీవన విధానంతోనే సమాజ సమతుల్యత సాధ్యం. కౌరవుల మాదిరిగా దుష్టబుద్ధి గల వంద మంది కొడుకుల కన్నా ధర్మనిరతి గల పంచపాండవులు మేలు. అధిక జనాభా కన్నా ధర్మబద్ధ జీవితం, సామాజిక సమతుల్యత ముఖ్యమని ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. జనాభా నియంత్రణ తత్వం పరోక్షంగా ఉన్నా- నైతికత, సామరస్యం, సామాజిక క్రమం విషయంలో వాటిలో గాఢమైన సందేశాలున్నాయి. అక్షరాస్యులు, లక్ష్యసాధకులు, న్యాయవర్తనులైన ప్రజలు ఉంటే సరిపోదు. వారంతా అందరికీ అవసరమైన వనరులను ఉత్పత్తి చేయగలగాలి. అలాంటి ప్రజలు దేశానికి సంపదతో సమానం. 'వనరుల కన్నా వేగంగా జనాభా పెరిగితే అది ప్రళయానికి దారి తీస్తుంద'ని ఆర్థికవేత్తలు సైతం హెచ్చరిస్తున్నారు. వనరులను ఉత్పత్తిచేసే భూమి దైవంతో సమానమని రుగ్వేదం చెబుతోంది.



అంతర్యామి

ఒకప్పుడు దేవగిరి అనే ఊళ్లో ప్రజలు స్వయంకృషితో సమృద్ధిగా వనరులను నిల్వ చేసుకునేవారు. ప్రతి ఇంటా దైవనామస్మరణ నిత్యకృత్యం. పెద్దల పట్ల గౌరవం వెల్లివిరిసేది. ధర్మానికే పెద్ద పీట వేసేవారు. కానీ, ఒకరోజు గ్రామంలోకి వచ్చిన ఓ పండితుడు, 'ఇదంతా మీ సొంత పుణ్యం కోసం మాత్రమేనా, నిజమైన ధర్మం పరుల సేవలో లేదా?' అని ప్రశ్నించాడు. దాంతో గ్రామస్థులు ఆలోచనలో పడ్డారు. అప్పటి నుంచి వారు తమ భక్తిని కేవలం పూజలకే పరిమితం చేయకుండా అవసరంలో ఉన్న పొరుగు గ్రామాలవారికి సాయం చేయడమూ మొదలెట్టారు. అప్పుడే వారికి నిజమైన ఆనందం, శాంతి లభించాయి. పరోపకారంలోని పరమార్థాన్ని ఆ గ్రామస్థులు అర్థం చేసుకున్నారు.

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్!' అన్నారు గురజాడ. దేశాభివృద్ధి అంటే కేవలం సువిశాల భూభాగం, రోడ్లు, భవనాలు, కర్మాగారాలే కాదు. అక్కడి జనాభా, వారి చైతన్యం, నైతికత, బాధ్యత, విద్య ఇవన్నీ కలిస్తేనే అభివృద్ధి. మానవ వనరులు గొప్పవే... వారు చైతన్యవంతులై, జ్ఞానవంతులై, నైతిక విలువలను పాటిస్తూ దేశాభివృద్ధికి సహకరిస్తే ప్రగతి మరింత గొప్పగా ఉంటుంది.

– డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

అభివృద్ధికి సోపానాలు పరిశోధనలే

సాంకేతికంగా పురోగమిస్తూ నూతన ఆవిష్కరణలకు వేదికైనప్పుడే ఏ దేశమైనా వేగంగా అభివృద్ధి చెందుతుంది. అందుకనే అనేక దేశాలు పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)కి పెద్దపీట వేస్తున్నాయి. భారత్ సైతం ఆ దిశగా పలు చర్యలు తీసుకుంటోంది. అయితే, ఈ క్రతువులో పరిశ్రమలూ పరిశోధనా సంస్థలూ ఉన్నత విద్యాలయాలూ కలిసికట్టుగా క్రియాశీల పాత్ర పోషించాలి.

పరిశోధనలపై వెచ్చించే పెట్టుబడులు- భారతదేశాన్ని ఒక బలమైన, స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాయి. ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా పెద్దయెత్తున విదేశీ పెట్టుబడులనూ ఆకర్షించవచ్చు. పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా దేశీయంగా శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలు మరింతగా వెలుగులోకి వస్తాయి. గడిచిన దశాబ్ద కాలంలో ఈ రంగానికి కేటాయింపులు మెరుగుపడినా, గణనీయమైన పెరుగుదల మాత్రం కనిపించడం లేదు. కేంద్రం 2013-14లో శాస్త్ర సాంకేతిక శాఖకు(డీఎస్‌టీకి) రూ.2,777 కోట్లు కేటాయించగా, 2024-25 నాటికి అవి రూ.28,509 కోట్లకు చేరాయి. అదే కాలంలో శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన శాఖకు కేటాయింపులు రూ.2,013 కోట్ల నుంచి రూ.6,658 కోట్లకు పెరిగాయి. మరోవైపు, అంతరిక్ష విభాగం బడ్జెట్‌ను రూ.5,615 కోట్ల నుంచి రూ.13,416 కోట్లకు పెంచారు. ఏటికేడు నిధుల శాతం పెరుగుతున్నప్పటికీ, శాస్త్ర సాంకేతిక పరిశోధనలను జోరెత్తించాలంటే వీటిని ఇంకా గణనీయంగా పెంచక తప్పదు.



ఆ రెండు నిర్ణయాలు

నేడు పలు దేశాలు ప్రత్యేకించి కొన్ని రంగాల్లో ముందుంటున్నాయంటే, అందుకు కారణం పరిశోధన-అభివృద్ధికి అవి పెద్దపీట వేయడమే. ఆర్‌అండ్‌డీ వల్ల కొత్త ఉత్పత్తులు, మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఉత్పత్తి విధానాలూ మెరుగుపడతాయి. కాబట్టి ఇది మొత్తం పరిశ్రమల తీరుతెన్నులనే మార్చగలదు. నాణ్యమైన ఉత్పత్తులు, ఉత్పాదకత పెరగడం వల్ల దేశార్థికం బలపడుతుంది. భారతీయ పరిశ్రమలు ప్రపంచ మార్కెట్లో గట్టి పోటీ ఇవ్వగలుగుతాయి. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లో సమస్యల పరిష్కారమూ సులభమవుతుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్త ఉద్యోగావకాశాలు అందివస్తాయి.

'ఆత్మనిర్భర్ భారత్' ఆశయ సాధనకు ఆర్‌అండ్‌డీ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరముంది. వివిధ రంగాలకు సంబంధించి స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవడానికి ఇదెంతో ముఖ్యం. ఈ క్రతువులో భాగమయ్యేందుకు విదేశీ సంస్థలు, పరిశోధకులు కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే, దీనికి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించడంతో పాటు పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టేలా ప్రైవేటు రంగాన్నీ ప్రోత్సహించాలి. పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యాలయాలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించాలి. ఆర్‌అండ్‌డీకి అవసరమైన అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక వసతులను సమకూర్చడమే కాకుండా- వివిధ రంగాలకు అవసరమైన నైపుణ్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మేలిమి మానవ వనరులను తయారు చేసుకోవాలి.

చారిత్రకంగా చూసినప్పుడు భారత్‌లో ప్రాథమిక పరిశోధనలు అధికంగా, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చాలా తక్కువగా ఉంటున్నాయి. పరిశ్రమలూ ఉన్నత విద్యాసంస్థలూ పూర్తిస్థాయిలో కలిసి పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు- ప్రైవేటు రంగం తోడ్పాటుతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలకు పెద్దపీట వేయాలి. తద్వారా గణనీయమైన మార్పును చూడగలుగుతాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రెండు వ్యూహాత్మక నిర్ణయాలు కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. వాటిలో ఒకటి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు కాగా, రెండోది పరిశోధన-అభివృద్ధి ఆవిష్కరణల పథకాన్ని తీసుకురావడం.


బహుముఖ లక్ష్యాలతో ముమ్మందుకు...

పార్లమెంటు చట్టం ద్వారా 2023లో అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్‌ఆర్‌ఎఫ్) ఏర్పాటైంది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలు, ప్రయోగశాలల్లో ఆర్‌అండ్‌డీ సంస్కృతిని పెంపొందించేందుకు దీన్ని ఉద్దేశించారు. ఇందుకు 70శాతం నిధులను ప్రైవేటు రంగం నుంచే సమకూరుస్తారు. ఏఎన్‌ఆర్‌ఎఫ్ విజయవంతమైతే- పరిశ్రమలు, విద్యా పరిశోధన సంస్థల మధ్య ఎలాంటి అరమరికలు లేని సమగ్ర ఆర్‌అండ్‌డీ వ్యవస్థ ఏర్పడుతుంది. జాతీయస్థాయి పరిశోధనలకు మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు... సామాజిక, ఆర్థిక, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాల రూపకల్పనకు ఈ వేదిక తోడ్పడుతుంది. అంతర్జాతీయ పరిశోధనల్లో భాగస్వామ్యం కావడానికీ, శాస్త్రీయ పరిశోధనల ఫలితాలపై వార్షిక సర్వే నిర్వహణకూ, కేంద్ర సమాచార డేటాబేస్ రూపకల్పనకూ ఏఎన్‌ఆర్‌ఎఫ్ దోహదపడుతుంది.

కేంద్ర మంత్రివర్గం ఇటీవలే పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల(ఆర్‌డీఐ) పథకానికి ఆమోదం తెలిపింది. దీనికి లక్ష కోట్ల రూపాయలు కేటాయించారు. దీని ద్వారా ప్రైవేటు రంగానికి తక్కువ వడ్డీకి, లేదంటే వడ్డీ లేకుండా రుణాలు అందజేస్తారు. నిధులనూ అందిస్తారు. తద్వారా నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ సేకరణ, సామర్థ్యాల పెంపు సాధ్యపడతాయి. ఈ పథకం ద్వారా ఆర్థిక భద్రత కల్పించడం, వ్యూహాత్మక రంగాల్లో ప్రైవేటు పరిశోధనల పెంపు, సాంకేతికంగా సంసిద్ధంగా ఉన్న ప్రాజెక్టులకు సహకారం, వ్యూహాత్మకంగా అవసరమైన టెక్నాలజీల కొనుగోలుకు మద్దతు, డీప్-టెక్ పరిశోధనలకు తోడ్పాటు అందించాలని లక్షించారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా ఆర్‌అండ్‌డీలో ప్రైవేటు రంగాన్ని చురుకైన భాగస్వామిగా మార్చేందుకూ, స్వయం సమృద్ధి సాధించేందుకూ భారత్ వడివడిగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ స్థాయి సామర్థ్యాలను అందిపుచ్చుకుని ప్రభావవంతమైన ఆవిష్కరణల వాతావరణాన్ని సృష్టించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. 'వికసిత భారత్-2047' సాధన దిశగా జరుగుతున్న ఈ ప్రయత్నంలో పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యాలయాలు విశాల దృక్పథంతో పాల్గొంటాయని ఆశిద్దాం.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి



రెండు రెళ్లు అయిదు

రెండును రెండుతో కూడినా, హెచ్చవేసినా ఒకటే అంకె వస్తుంది. కానీ ఒక ఉపాధ్యాయుడు తన తరగతిలో నేర్పిన లెక్క 2+2=5. గణితంలో కొత్త సవాలేమీ కాదు, అదొక సినిమా కథ.

బబాక్ అన్వారి 2011లో సృష్టించిన పర్షియన్ సినిమా '2అండ్ 2'. క్లాస్‌రూంలో పిల్లలు కబుర్లు చెప్పుకొంటుండగా ఉపాధ్యాయుడు వస్తాడు. వెంటనే స్పీకర్‌లోంచి ప్రధానోపాధ్యాయుడి సందేశం వినిపిస్తుంది... ఈరోజు నుంచి టీచర్ చెప్పే కొత్త పాఠాలు నేర్చుకోమని. ఆ టీచర్ బోర్డ్ మీద 2+2=5 అని రాస్తాడు. ఒక్కసారిగా తరగతిలో అలజడి. టీచర్ గదమాయింపుతో అందరు మౌనంగా బోర్డ్‌కి కళ్లప్పగిస్తారు. ఒక విద్యార్థి ధైర్యంగా లేచి 'అది తప్పు' అంటాడు. ఉపాధ్యాయుడు తాను చెప్పిందే కరెక్టని, నోట్స్‌లో రాసుకోమంటాడు. ఆ విద్యార్థి పట్టువదలడు. చేతివేళ్లు ముడిచి, లెక్కించి మరీ చూపిస్తాడు. 'ఎంత ఆలోచించినా, రెండు రెళ్లు నాలుగే' అంటాడు. 'నువ్వు ఆలోచించాల్సిన అవసరంలేదు' టీచర్ ఖండితంగా అని, మౌనంగా వెళ్లి, సీనియర్ విద్యార్థులతో తిరిగివస్తాడు. వాళ్లు కూడా 'రెండు రెళ్లు అయిదే' అంటారు. విద్యార్థి అంగీకరించడు. సరైన జవాబేమిటో రాయమంటాడు టీచర్. సీనియర్ విద్యార్థులు తమ చేతివేళ్లను ముడిచి తుపాకుల్లా గురిపెడతారు. ఆ విద్యార్థి 4 అని రాస్తాడు. అసహనంతో టీచర్ ముఖకవళికలు మారతాయి. ఉత్తుత్తి తుపాకులు పేలతాయి. నల్లబల్ల మీది 4 రక్తసిక్తమవుతుంది. విద్యార్థి రక్తపుమడుగులో కుప్పకూలతాడు. సీనియర్ విద్యార్థులు పడిపోయిన విద్యార్థిని బయటికి మోసుకెళ్తారు.

టీచర్ బోర్డ్‌ను శుభ్రం చేసి, మళ్లీ అదే సమీకరణం రాస్తాడు. జరిగిందంతా చూస్తూ భయంతో బిగదీసుకుని కూర్చున్న ఆ చిన్నపిల్లలు టీచర్ చెప్పింది రాసుకుంటారు. అయితే, ఒక పిల్లాడు 5ని కొట్టేసి, 4 రాయడంతో సినిమా పూర్తవుతుంది. నిజానికి ఆ సమీకరణం కథ మొదలైంది జార్జ్ ఆర్వెల్ '1984' నవలలో. నియంతృత్వపు పడగనీడలో విలవిలలాడే భావస్వేచ్ఛ కోసం సంధించిన బాణం అది. ఫ్రెంచ్ విప్లవకాలంలో 'వాట్ ఈజ్ థర్డ్ ఎస్టేట్?' అన్న కరపత్రం ఈ సమీకరణాన్ని విస్తృత ప్రచారంలోకి తెచ్చింది. నియంతృత్వం సత్యాన్ని, తార్కికతను ఎలా అణచివేస్తుందో రాస్తూ, రస్సెల్ ఈ సమీకరణాన్ని ఉదహరించాడు. ఆర్వెల్‌కి అదే స్ఫూర్తి.

నియంతృత్వం ఎక్కడో ఉండదు. మన చుట్టూ, మన లోలోన ఉంటుంది. అది గ్రహించి, కూకటివేళ్లతో సహా పెకలించడమే మనం చేయాల్సింది. సత్యాన్వేషణ, ప్రశ్నించడం మానవ సహజగుణాలు. కుతూహలంలోనుంచి ప్రశ్న పుడుతుంది. ఆలోచనగా పెంపొందుతుంది. యుక్తాయుక్తవిచక్షణ సత్యాన్ని గ్రహిస్తుంది. స్వేచ్ఛగా ఉండే తరగతి గది, ఆలోచనకు అవసరమైన మెలకువలను నేర్పుతుంది.

సత్యం కోసం ఎదురొడ్డి నిలబడ్డ పిల్లలకు ఉన్న ధైర్యం, తెగింపు మనలో ఎంతమందికి ఉంది? సత్యాన్ని అంగీకరించలేని అసహనం ప్రబలుతున్న మన సమాజంలో మానవ మేధ ఎలా వికసిస్తుంది? ప్రశ్నించడం మానేసి అనుసరించే వాళ్లే ఎక్కువగా తయారవుతున్న చోట అన్యాయాలకు లోటేముంటుంది?

– చంద్రలత

రాష్ట్రాల వెనకంజ

విద్యుదుత్పత్తి కోసం బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను ఎక్కువగా వినియోగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సౌర, పవన వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై భారత్ ఎక్కువగా దృష్టి సారించింది. కానీ చాలా రాష్ట్రాలు ఈ విషయంలో బాగా వెనకంజలో ఉన్నాయి. నిరుడు మార్చి చివరి నాటికి దేశీయంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం 21.09 లక్షల మెగావాట్లు. అందులో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాటా ఎంతంటే... (శాతాల్లో)

రాజస్థాన్	20
మహారాష్ట్ర	12
గుజరాత్	10
కర్ణాటక	10
ఆంధ్రప్రదేశ్	8
జమ్మూ కశ్మీర్, లద్దాఖ్	6
మధ్యప్రదేశ్	6
తమిళనాడు	6
తెలంగాణ	4
అరుణాచల్ ప్రదేశ్	3
హిమాచల్ ప్రదేశ్	3
ఒడిశా	2
ఉత్తరాఖండ్	2
ఉత్తర్ ప్రదేశ్	2
ఛత్తీస్‌గఢ్	1
ఇతరాలు	5

(ఆధారం: కేంద్ర ప్రభుత్వ నివేదిక)

శాంతి కభూతం!

'ఓహ్.. వాహో.. వాహో.. బుల్లి పావురమా.. అయ్యోపాపం అంటే అది నేరమా.. ప్రైజులు అంత సులభమా, ఓహో.. అయినా వదల నమ్మా..'

'ఏంటి సార్ పొద్దున్నే నా చుట్టూ తిరుగుతున్నారు. ఎంత పెంపుడు పావురాన్ని అయితే మాత్రం, మీ చిత్రవిచిత్ర విన్యాసాలన్నీ నాక్కూడా చూపించాలా? ఎటూ జనం చూస్తున్నారుగా! దానికితోడు వచ్చీరాని పాటలు కూడాను. ఈ పూటకు నన్ను ప్రశాంతంగా ఉండనివ్వరాదూ?'

'హే.. మై లవ్లీ పీజియన్.. నీకు తెల్సా నాకు నోబెల్ పీస్ ప్రైజ్ వస్తుంది!'

'అవునా.. ప్రతి దేశంలోనూ పీస్‌ని పీస్ పీస్ చేస్తుంటారు. మీకిస్తాం అని ఎవరు చెప్పారు?'

'హెవ్వరూ చెప్పలేదు, నేనే అనుకున్నా! అసలు ఈపాటికే త్రీ, ఫోర్ టైమ్స్ వచ్చేయాల్సింది తెలుసా!'

'దేనికి!! వైట్‌హౌస్‌లో కులాసాగా కూర్చుని ఏ దేశం మీద బాంబులేయాలి, ఎవరిని ఎవరి మీదకి రెచ్చగొట్టాలి, సుంకాల సుత్తి పట్టుకుని ఎవరి నెత్తి పగలగొట్టాలి, ఇచ్చిన మాటను వెంటనే ఎలా తప్పాలి.. ఇలా పనికిమాలిన పరిశోధనలు, పొద్దుపోని పంచాయతీలు చేస్తున్నందుకా!'

'ఏంటోయ్ నా చిట్టి పావురం.. నువ్వు కూడా ఇలా నన్ను తప్పుగా అర్థం చేస్కుంటే ఎలా? అసలు నాకంటే ప్రపంచ శాంతిదూత ఎవరున్నారు చెప్పు?'

'ప్రపంచ శాంతిదూత.. పెద్ద మాటే ఇది. ఇంతకీ మీకిలా ఎప్పట్నుంచి అనిపిస్తుంది?'

'ఇప్పుడేంటి, ఎప్పట్నుంచో! అయినా.. ఇప్పుడు అణ్వాయుధాలు ఉన్నాయనుకో మన దగ్గర ఉండొచ్చు, కానీ పక్కవాళ్ల దగ్గరుంటే అణుయుద్ధాలు జరిగిపోతాయి! అదే ఆ ఆయుధాలను, వాటిని చేసే వాళ్లని, పనిలో పనిగా చేసిన దేశం మీద మనమే ముందు బాంబులేసేశాం అనుకో, ప్రాబ్లమ్ ఉండదు కదా!'

'అయ్యబాబోయ్!'

'మరి.. ఎంత గొప్ప ఆలోచన ఇది! అలాగే.. ఇద్దరుముగ్గురు కొట్టుకుంటూ ఉన్నారనుకో, పాపం కర్రలకు కొదవలేకుండా మనమే అమ్మి పెట్టి.. ఎంచక్కా కొట్టుకోండని వేడుక చూడొచ్చు. అప్పుడూ అందరూ తన్నుకుచచ్చి బోలెడంత ప్రశాంతంగా ఉంటుంది. అదీ శాంతే కదా!'

'అవును సార్, వినేవారికి వాంతే.. అదే అదే శాంతే!'

'ఇంకా వరల్డ్‌లో బోలెడు పేద దేశాలుంటాయి. పాపం వారికి తినడానికి నాలా పిజ్జా బర్గర్లు



ఉండవు. అంత కష్టపడి బతకడం ఎందుకు చెప్పు? అదే మనం ఒకేసారి యుద్ధాలు చేసి అందరిమీదా బాంబులు వేయించాం అనుకో, వారికా కష్టాలే ఉండవ్. ఏం అంటావ్!'

'ఆహా.. ఇంత చిన్న కర్కోటక లాజిక్ ఇన్నాళ్లూ ఏ పెద్దబుర్రకూ తట్టకపోవడం ఎంత విడ్డూరం? అందుకే ముచ్చటైన మీ జుట్టును చూసి నాకు అప్పుడప్పుడూ అందులో గూడు కట్టుకుని గుడ్లు పెట్టాలి అనిపిస్తూ ఉంటుంది.'

'ఫోవోయ్.. నాకు సిగ్గేస్తోంది. నా దగ్గర ఇంకా ఇలాంటి ఎన్నో సమస్యలకు చక్కని పరిష్కారాలు ఉన్నాయ్ తెల్సా!'

'అదే సార్, వాతానికి కీలెరిగి వాత.. నరాల బలహీనతకు నానో వైద్యం.. మలబద్ధకం మూలికతో చెల్లు.. ఇలాంటి సమస్యలే కదా మీరు చెప్పేది?'

'హేయ్.. నేనేమైనా రోడ్‌సైడ్ టెంట్ డాక్టర్ అనుకున్నావా, డూ యూ నో హూ ఐయామ్? గ్రేటెస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్..'

'ఆగండి సార్.. తిక్కలోడు తిరనాళ్లకు పోతే మెట్లెక్కా దిగా సరిపోయిందని, ఏదో ప్రజల పేటు బాగోక ప్రెసిడెంటుగిరీ వెలగబెడుతున్నారు. అందులో మళ్లీ ఈ పురస్కారాల పిచ్చేమిటీ అని! ఇండియాలోనూ ఒకరు ఉన్నారులెండి.. ఏమైనా అంటే 'నాకు షన్మానాలు షేయాల్సింది పోయి..' అని సన్నాయినొక్కులు నొక్కుతుంటాడు'

'హవునా.. ఎవరా మాన్?'

'రామేశ్వరం పోయినా.. అని ఇప్పుడాయన టాపిక్ ఎందుకు లెండి. ఇంతకీ మీ సోది ఏంటి.. ప్రైజు కావాలంటారు, అంతే కదా!'

'యా.. అయినా కావాలేంటి, వచ్చేసినట్టే. నువ్వు కూడా రికమెండ్ చెయ్యి నాకిమ్మని.'

'ఏంటి నాకి ఇచ్చేది.. అదే మీకిచ్చేది.. అయినా మీ మాటకి, ధాటికి, నిర్ణయాలకు.. మీకు శాంతి పురస్కారం ఏమిటండీ బాబు!'

'అబ్బా... ఎంత తిప్పినా అక్కడికే వస్తున్నావ్. అయినా నాకేం తక్కువోయ్! బోలెడన్ని మిత్రదేశాలు చెప్పడం లేదూ.. నేను శాంతిదూతనని'

'అంతేలెండి.. తోడేలు వచ్చి హైనాకి వంతపాడినట్టు, దెయ్యం మంచిదని కొరివిదెయ్యం సాక్ష్యం చెప్పినట్లు మీ గొప్ప గురించి వారే మాట్లాడాలి. శాంతికపోతం స్పెల్లింగ్ మార్చేస్తున్నారు మీరందరూ కలిసి. అవునూ శాంతిదూతలంటే గాల్లోకి పావురాలు ఎగరేస్తుంటారు కదా! ఈసారి నన్నలా ఎగరేయకూడదూ.. ఎంచక్కా స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటాను'


'హ్హహ్హహ్హా.. టూ ఫన్నీ. నేను మనుషులకే ఫ్రీడమ్ ఇవ్వను, నీకెలా ఇస్తాను చెప్పు? నేనెళ్లి పీస్ మీటింగ్‌లో స్పీచ్ దంచి వస్తా, నువ్విలాగే ఫంజరంలో పండగ చేస్కో, బై బై'

'!!!!? ? ? !!!!? ? ? ?'

– చంద్రమౌళిక సాపిరెడ్డి

ఆలోచనే ముఖ్యం..!

గూడు కట్టుకోవడానికి మంచి చెట్టు కోసం వెతుకుతోంది రామచిలుక. పెద్ద కొమ్మలతో గుబురుగా ఉన్న చెట్టు దానికి చాలా నచ్చింది. అక్కడే గూడు కట్టుకోవాలనుకుంది. వెంటనే చిన్నచిన్న పుల్లలు ఏరడం మొదలెట్టింది. ఇంతలో గాలి గట్టిగా వీచడంతో.. దాని నోటికి అస్సలు పుల్లలు అందడం లేదు. పోనీ.. గడ్డి తీసుకెళ్దామన్నా అదే పరిస్థితి. అప్పుడే అక్కడికి ఒక చిన్ని పిచ్చుక వచ్చింది. 'మిత్రమా! దేని కోసం వెతుకుతున్నావు?' అని అడిగింది. 'ఈ చెట్టు మీద గూడు కట్టుకోవాలి అనుకుంటున్నాను. అందుకే పుల్లలు, గడ్డి ఏరుతున్నా. కానీ గాలి వల్ల అసలు వాటిని పట్టుకోలేకపోతున్నాను' అంది రామచిలుక. 'అవునా! నేనేమైనా సాయం చేయాలా?' అని



అడిగింది పిచ్చుక. 'ఇంత చిన్నగా ఉన్నావు. నా వల్లే అవ్వట్లేదు. ఇక నువ్వేం చేస్తావు.. ఏం వద్దులే' అని బదులిచ్చింది చిలుక. 'గూడుకు కావాల్సిన పుల్లలు ఎలా తీసుకురావాలో నాకు బాగా తెలుసు' అంటూ రివ్వున ఎగిరిపోయింది పిచ్చుక. ఇక చిలుక.. పుల్లలు ఏరడానికి ప్రయత్నిస్తూనే ఉంది. అంతలోనే పిచ్చుక కొంత గడ్డిని పట్టుకుని వచ్చేసింది. 'ఇక్కడ అసలు నోటితో పట్టుకోవడానికి వీల్లేకుండా గాలి వీస్తుంటే.. ఎక్కడి నుంచి తీసుకొచ్చావు' అడిగింది చిలుక. 'కొట్టుకెళ్లిన గడ్డి పక్కనే ఉన్న కొలనులో పడుతోంది. తడిగా ఉన్న గడ్డి కదలదు కదా! అక్కడి నుంచే తీసుకొచ్చాను' అని బదులిచ్చింది పిచ్చుక. ఇక గూడు మొత్తం పూర్తయ్యేవరకు గడ్డి, పుల్లలు తీసుకొచ్చి ఇచ్చింది పిచ్చుక. 'చిన్నదానివని నీకు ఏ పని రాదనుకున్నాను. కానీ కొన్ని పనులు చేయడానికి ఆకారం, వయసు కన్నా ఆలోచనే ముఖ్యమని తెలియజేశావు. నీకు కృతజ్ఞతలు మిత్రమా!' అంది చిలుక.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర

హాయ్! బుజ్జీ!!

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

రాష్ట్ర	ఫలం	నీరు	భూమి
తీరం	జోడు	ప్రభుత్వం	లేఖ
సాగు	నీలి	యువ	వరం
ప్రతి	సముద్ర	చిత్ర	కళ్ల
తరం	తాగు	మేఘం	అన్న

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం, జులై 11, 2025

ఉద్యోగుల చదరంగ పోటీలకు స్పందన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం సాయంత్రం 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులకు చదరంగ పోటీలు జరిగాయి. పోటీల్లో కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 23 మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. విజేతలకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్సు) డి.చంద్రశేఖర్ 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' తరఫున ఛాంపియన్ ట్రోఫీలు అందజేసి వారిని అభినందించారు.


బహుమతులు సాధించిన పురుషుల విభాగంలో నరేంద్ర (ప్రథమ), పవన్‌కుమార్ (ద్వితీయ), మహిళా విభాగంలో కె.నాగజ్యోతి (ప్రథమ), లక్ష్మీసింధు (ద్వితీయ)లతో అదనపు కమిషనర్ చంద్రశేఖర్



కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం (వెంకట్రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా) ఆరో స్నాతకోత్సవం నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బంగారు పతకాలు అందించారు. చిత్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న స్కాలర్

అన్నదాతా సుఖీభవ@ 2,45,789

ఈనాడు, అమరావతి: రాయితీ యంత్ర పరికరాలు, ఉద్యాన రాయితీలు, పండ్ల తోటల వృద్ధికి నిధులు.. ఇలా కూటమి సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అదే తరహాలో అన్నదాత సుఖీభవ పేరుతో ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు సిద్ధమైంది. ఆ మేరకు అధికారులు ఉభయ జిల్లాల్లో పథకం అర్హుల జాబితా ప్రక్రియ కొలిక్కి తీసుకొచ్చారు. మొత్తం 2,45,789 మంది రైతులు అర్హత సాధించినట్లు ప్రకటించారు.

ఉభయ జిల్లాల్లో అన్నదాత సుఖీభవ పథకం వివరాలు

జిల్లా	రైతులు	అర్హులు	ఈకేవైసీ పెండింగ్	ఫిర్యాదులు
కృష్ణా	3,44,029	1,35,881	2,660	534
ఎన్టీఆర్	2,41,898	1,19,908	1,729	449
మొత్తం	5,85,927	2,45,789	4,389	983



ఫిర్యాదులకు జులై-13 వరకు అవకాశం: ఉభయ జిల్లాల్లో అర్హుల జాబితాను ఆయా ఆర్ఎస్‌కేల పరిధిలో ప్రదర్శించారు. ఇందులో చూసుకుని అర్హత ఉన్నా పేరు లేకుంటే ఆర్ఎస్‌కే సిబ్బందికి అర్జీతో పాటు అర్హత ఉందని తెలిపే పత్రాలు సమర్పించాలి. అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్లోనూ ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదు చేసేందుకు జులై-13 వరకు అవకాశం ఉంది. ఇప్పటికే తమకు అర్హత ఉందని ఎన్టీఆర్‌లో 449 మంది దరఖాస్తు చేయగా 135 మంది అర్హులుగా నిర్ధారించారు. మిగిలిన 314 పరిశీలనలో ఉన్నాయి. కృష్ణాలో 534 దరఖాస్తులకు 291 మందిని అర్హుల జాబితాలో చేర్చారు. మిగిలిన 243 దరఖాస్తులు పరిశీలిస్తున్నారు.

ఈకేవైసీ కీలకం: జులైలో మొదటి విడత నగదు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు మూడు విడతల్లో రూ.20వేలు జమ చేస్తారు. అందులో కేంద్రం ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు అందిస్తాయి. పథకానికి అర్హత సాధించాలంటే ఈకేవైసీ కీలకం. తమ వివరాలు నమోదు చేయించుకుని ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసినవారికే లబ్ధి చేకూరుతుంది. రెండు జిల్లాల్లో ఇంకా 4,389 మంది రైతులు స్థానికంగా అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాలతో ఈకేవైసీ చేయించుకోలేదు. ఈ నేపథ్యంలో రైతులు త్వరపడాల్సి ఉంది.

గుట్ట చూస్తే గుటుక్కే..!

ఈనాడు, అమరావతి

- ✦ వత్సవాయిలో వైకాపా హయాంలో దౌర్జన్యం
- ✦ అడ్డుకున్న అధికారులందరూ ఒకేసారి బదిలీ

వత్సవాయి మండలంలో వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారులపై దౌర్జన్యం చేసి మరీ సాగించిన భారీ మట్టి అక్రమ దందా తాజాగా వెలుగులోకి వచ్చింది. మైనింగ్ విభాగం అనుమతులు లేకుండా సాగర్ ప్రధాన కాలువకు ఇరువైపుల వత్సవాయి, వేములనర్వ గ్రామాల పరిధిలో 13 ఎకరాల్లో విచ్చలవిడిగా తవ్వేశారు. వేములనర్వ పరిధిలో కొంత భాగం ఓ మాజీ సైనికుడికి ప్రభుత్వం ఇచ్చిన భూమి ఉంది. తహసీల్దారు, వేములనర్వ, కంభంపాడు వీఆర్వోలు దీనిని అడ్డుకోవడంతో వారిపైనా తమ ప్రతాపం చూపించారు. మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు, వైకాపా ప్రభుత్వంలో చక్రం తిప్పిన వాసుదేవరెడ్డి బంధువు కనుసన్నల్లోనే ఈ దందా సాగింది. రాత్రికి రాత్రే తహసీల్దారు ఉదయభాస్కర్, ఇద్దరు వీఆర్వోలు, ఇతర సిబ్బందిని అక్కడి నుంచి బదిలీ చేయించారు. అనంతరం అనుకూలమైన వారిని నియమించుకుని యథేచ్ఛగా కొల్లగొట్టారు.

★ వైకాపా హయాంలో ఈ 13 ఎకరాల్లోనే రూ.20కోట్లకు పైగా విలువైన మట్టిని అక్రమంగా అమ్ముకున్నారు. రోజూ వందల సంఖ్యలో టిప్పర్లతో మట్టి తరలించారు. సాగర్ కాలువకు ఒకవైపున వత్సవాయిలో 5.68ఎకరాలు, వేములనర్వ పరిధిలో 7.5 ఎకరాల్లో 20 నుంచి 30 అడుగుల లోతులో తవ్వేసి విధ్వంసం సృష్టించారు. వేములనర్వలో కాలువ పక్కనే ఓ మాజీ సైనికుడికి ప్రభుత్వం 2.5 ఎకరాల గతంలో ఇచ్చింది. అతను చనిపోవడంతో ఈ భూమి కోసం కుటుంబంలో తగాదాలు నెలకొన్నాయి. ఇదే అదనుగా స్థానికంగా ఉన్న వాసుదేవ రెడ్డికి బంధువైన ఓ వైకాపా నాయకుడు చక్రం తిప్పాడు. సైనికుడి కుటుంబంలో గొడవ పడుతున్న రెండు వర్గాలకు రూ.6లక్షల చొప్పున ముట్టజెప్పి ఆ భూమిని జానకిరాముడు అనే వ్యక్తికి విక్రయించేలా రాయించుకున్నారు. సైనికుడికి ఇచ్చిన భూమిని అమ్మడానికి వీల్లేకపోయినా జానకిరాముడు పేరుతో పట్టాదారు పాసుపుస్తకం తీసుకున్నారు. ప్రస్తుతం దీనిపై తహసీల్దారు నుంచి కలెక్టర్ వరకు అధికారులందరికీ గ్రామస్థులు ఫిర్యాదులు చేస్తున్నారు.


మాజీ సైనికుడికి చెందిన భూమిని గుల్ల చేశారిలా..

మూగ జీవాల గుట్టనూ వదల్లేదు..

మాజీ సైనికుడి భూమి పక్కనే ఐదెకరాల పోరంబోకు భూమిలో బోడగుట్ట ఉంది. ఈ మొత్తం ఏడున్నర ఎకరాలనూ వదల్లేదు. గుట్ట పక్కనే ఉన్న భూమి లేకుండా గుల్ల చేసేశారు. ఈ గుట్ట ఒకప్పుడు పచ్చని చెట్లతో పక్షులు, జంతువులకు ఆవాసంగా ఉండేది. అటవీ చట్టాన్ని ఉల్లంఘించి తవ్వేసి మూగ జీవాల ఉసురు తీశారు. వత్సవాయి గ్రామంలోనూ 5.68ఎకరాల పోరంబోకు గుట్టను తవ్వేయడమే కాకుండా.. ఆ పక్కనే ఉన్న రైతుల భూముల సైతం ఆక్రమించాలని దౌర్జన్యం చేసినా వాళ్లు ఎదురుతిరగడంతో వెనక్కి తగ్గారు.


బోడగుట్ట ప్రస్తుత పరిస్థితి ఇదీ

☛ అక్రమంగా మట్టి రవాణాకు సాగర్ కాలువ కట్టను కిలోమీటర్ల మేర ధ్వంసం చేశారు. చెదిలికలు ప్రధాన రహదారిని గుల్ల చేశారు. మళ్లీ ప్రభుత్వ నిధులతో ఆ దారిని వేయడం.. ఇదే తంతు నడిచింది.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు

14లోగా చేరికకు అవకాశం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9 వరకు గల ఖాళీ సీట్ల భర్తీకి గత నెల 25న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆయా గురుకుల పాఠశాలల వద్ద ప్రదర్శించినట్లు సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఆధారంగా సీట్లు పొందిన విద్యార్థులకు ఇప్పటికే ఫోన్ ద్వారా సమాచారం అందించామని పేర్కొన్నారు. వీరంతా ఈ నెల 14వ తేదీలోగా అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఆయా గురుకుల పాఠశాలల్లో హాజరుకావాలని సూచించారు. ఎవరైనా హాజరుకాకపోతే.. తదుపరి ప్రతిభ చూపిన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ఖాతాలు ఎన్.పి.సి.ఐ.తో అనుసంధానం చేసుకోండి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తల్లికి వందనం పథకంలో ఉపకారవేతన మంజూరుకు బ్యాంకు/ తపాలా ఖాతాలను ఎన్.పి.సి.ఐ.తో అనుసంధానం చేసుకోవాలని జిల్లా ఎస్సీ కులాల సంక్షేమాధికారి జి.మహేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా అనుసంధానం చేసుకోవాల్సిన వారు 2,445 మంది ఉన్నారని చెప్పారు. ఖాతాలు లేకపోతే.. వెంటనే తెరిచి, ఎన్.పి.సి.ఐ.తో అనుసంధానం చేసుకోవాలని ఆయన సూచించారు.

నీవు దూరమై.. ఎనిమిది మందికి ప్రాణదీపమై..

రోడ్డు ప్రమాదంలో గాయపడి జీవన్మృతుడైన జ్యోతిర్‌భాను

గుంటూరు, గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదం ఓ వ్యాపారిని జీవన్మృతుడిగా మార్చేసింది.. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం అంత విషాదంలోనూ అవయవదానానికి ముందుకు రావడంతో ఎనిమిది మందికి ప్రాణదానం చేసినట్లయింది. ఈనెల 7న ఉదయం కుమారుడితో కలిసి విజయవాడ మున్సిపల్ స్టేడియం సమీపంలో నడకకు బయలుదేరిన విజయవాడ గవర్నర్‌పేటకు చెందిన దుర్గా ఎలక్ట్రానిక్స్ అధినేత శౌంఠి జ్యోతిర్భాను అలియాస్ జ్యోతిభాను(56)ను ముగ్గురు యువకులు స్కూటీపై వచ్చి ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కళ్లెదుటే జరిగిన ఘటనతో నిర్ఘాంతపోయిన కుమారుడు మోహన్‌శ్రీనివాస్ సమీపంలోని రమేష్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి తరలించారు. శరీరం చికిత్సకు సహకరించకపోవడంతో జీవన్మృతుడిగా నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి ఎనిమిది మందికి అవయవదానం చేశారు.

గుంటూరు నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా గుండె తరలింపు..

జీవన్మృతుడి గుండెను గుంటూరు రమేష్ ఆసుపత్రి నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా గన్నవరం విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతి పద్మావతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఒక కిడ్నీ విజయవాడ క్యాపిటల్ ఆసుపత్రికి, మరొకటి గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి, కాలేయం తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి, ఊపిరితిత్తులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి, నేత్రాలు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు తరలించారు. అవయవాల తరలింపునకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



గుండె ఉన్న బాక్సును పట్టుకుని విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఉదయపు నడకకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లారా.. అంటూ జ్యోతిర్భాను భార్య విజయలక్ష్మి, కుమారుడు మోహన్‌శ్రీనివాస్, కుమార్తె లిఖిత రుక్మిణి బోరున విలపించారు. కుమారుడు బీటెక్ పూర్తి చేయగా, కుమార్తె బీటెక్ తృతీయ ఏడాది చదువుతోంది. పద్మావతి ఆసుపత్రికి గుండెను తరలిస్తుండగా భార్య, పిల్లలు ఆ బాక్స్‌ను పట్టుకొని గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

మా నాన్న చిరస్మరణీయుడు

ప్రమాదంలో నాన్న జీవన్మృతుడిగా మారినా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగు నింపారని కుమారుడు శౌంఠి మోహన్‌శ్రీనివాస్ గద్గదస్వరంతో అన్నారు. ప్రమాదంలో గాయపడిన ఆయన చికిత్స ద్వారా కోలుకుని వస్తారని భావించామని, కానీ తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి చేయిదాటిపోయిందన్నారు. తండ్రిని కోల్పోయామన్న బాధ మనస్సును కలచివేసినా అవయవదానంతో 8 మందిలో జీవించి ఉంటారనే ఆశతో కుటుంబ సభ్యులం అవయవదానానికి అంగీకరించామన్నారు.


ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా సాయిబాబా ఆలయాలు కిటకిటలాడాయి. విజయవాడ ముత్యాలంపాడులోని ఆలయంలో భక్తుల రద్దీ

బడిలో కాసేపు.. భవితపై మదింపు


విజయవాడ సత్యనారాయణపురం ఏకేటీపీఎంసీ హైస్కూల్‌లో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థినులు


జిల్లాలో గురువారం అన్ని ప్రభుత్వ బడుల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు తరలివచ్చి వారి పిల్లలకు పాఠాలు బోధించే గురువులతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్నం అక్కడే భోజనాలు చేసిన అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి ఆనందంగా ఇంటికి తిరిగివెళ్లారు. - ఈనాడు, అమరావతి



పట్టిసీమ పరవళ్లు.. కృష్ణమ్మ ఉరకలు

10,000 క్యూసెక్కుల దిశగా సాగునీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా నదిలో విలీనమైన క్రమంలో కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు 10,000 క్యూసెక్కుల సాగునీటిని అందించే దిశగా అడుగులు పడ్డాయి. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు గురువారం 9,882 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 8,106, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 1,716 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,001, ఏలూరు 1,302, బందరు 1,546, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1257 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి మట్టం పెరుగుతోంది. 12 అడుగులకు గాను, 11.6 అడుగుల మేర నీరు ఉంది.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

నందిగామ, న్యూస్‌టుడే: రాఘవాపురం కొండలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కె.బాలకృష్ణ హెచ్చరించారు. గురువారం 'కొండను మింగేస్తున్నారు' శీర్షికన 'ఈనాడు' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్డీవో స్పందించారు. స్థానిక తహసీల్దారు నూతక్కి సురేష్ బాబు, మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి రాఘవాపురం కొండను పరిశీలించారు. మైనింగ్ అధికారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో కొండను యంత్రాలతో తవ్వకాలు చేస్తుండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాఘవాపురంతో పాటు మండలంలో ఎక్కడా అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు. అక్కడి నుంచి మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు అప్రమత్తంగా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో బాలకృష్ణ

ఈనాడు కథనానికి స్పందన

అత్యాచారం కేసులో ఏడేళ్ల జైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యాచారం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరీ గురువారం తీర్పు చెప్పారు. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన ఓ యువతి (21) 8వ తరగతి వరకు చదువుకుని ఇంట్లోనే ఉంటున్నారు. 2018, జూన్ 23న కుటుంబ సభ్యులు ఊరు వెళ్లగా.. ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ఆమె బంధువైన అత్తిలి కనకరాజు ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రాధా వాదించారు. అప్పటి సీఐ జగదీశ్వరరావు పర్యవేక్షణలో 14 మంది సాక్షులను విచారించగా.. నిందితుడిపై నేరం రుజువైంది. అతడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రూ.22 లక్షల ఖాతాదారుల నగదు గోల్‌మాల్..?

జి.కొండూరు: మండలంలోని సున్నంపాడు గ్రామంలో పోస్టు ఆఫీసులో ఖాతాదారులు దాచుకున్న రూ రూ.22 లక్షలు నగదు గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. 2023లో రూ.2 లక్షలు జమ చేసిన ఓ ఖాతాదారుడు తన ఖాతాలో జమ అయిన నగదు ఎంతో తెలుసుకునేందుకు గురువారం పోస్టు ఆఫీసుకు వెళ్లి అడగ్గా..నగదు లేదని చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. గ్రామంలోని మరి కొంత మంది ఖాతాదారులు కూడా తనిఖీలు చేయగా దాదాపు రూ.22 లక్షలు తేడా వచ్చిందని సమాచారం. అప్రమత్తమైన వాళ్లంతా సదరు ఉద్యోగిని ప్రశ్నించగా చేతిని కత్తితో కోసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు స్థానికులు చెపుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందివ్వగా శుక్రవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తామని చెప్పినట్లు తెలిసింది.

రూ.35 కోట్లు.. విలాసాలకే విసిరేసి..

ఈనాడు, అమరావతి

ఒకవైపు విలాసాల కోసం అపరిమితంగా ఖర్చులు చేయడం.. మరోవైపు ట్రేడింగ్‌ను నిలిపివేయడమే అద్విక ట్రేడింగ్ కంపెనీని ఆర్థికంగా దివాలా తీసేలా చేసింది. కంపెనీ వార్షికోత్సవాలు, పుట్టిన రోజు వేడుకలు.. సందర్భం ఏదైనా ఆదిత్య స్థాయికి మించి రూ. కోట్లలో ఖర్చు చేయడంతో అదుపు తప్పింది. దర్యాప్తులో పోలీసులు దుబారా ఖర్చుల లెక్కలు తీస్తున్నారు. దాదాపు రూ.35 కోట్ల మేర విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లుగా భావిస్తున్నారు. డిపాజిటర్ల దృష్టిని ఆకర్షించేందుకు డబ్బును మంచినీళ్లలా వ్యయం చేశాడు.

దుబాయ్‌లో ఆరు కంపెనీల ఏర్పాటు: దుబాయ్‌లో ఫారెక్స్ ట్రేడింగ్ కోసం నిందితుడు ఆరు కంపెనీలను రిజిస్టర్ చేశాడు. వీటి ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించాడు. ఇందుకు రూ.2కోట్లు వెచ్చించాడు. అక్కడ వ్యాపారం అంటూ ప్రచారంతో ఊదరగొట్టాడు. ముఖ్యమైన ఏజెంట్లు, వారి కుటుంబ సభ్యులను తీసుకెళ్లి హడావుడి చేశాడు. వారికి ఖరీదైన బహుమతులు అందజేశారు. దీనికి రూ.6కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది.

స్టార్ హోటల్‌లో ప్రత్యేక సూట్‌రూమ్: విజయవాడ నగరంలోని ప్రముఖ స్టార్ హోటల్‌లో ఓ సూట్ రూమ్‌ను ఏడాదిన్నర పాటు తనకిందే ఉంచుకున్నాడు. ప్రతి నెలా దీనికి రూ.3లక్షలు చెల్లించేవాడు. బందరు రోడ్డులోని మరో ప్రముఖ హోటల్‌కూ తరచూ వెళ్లే వాడని, అక్కడా భారీగా చెల్లించినట్లు దర్యాప్తులో బయటపడింది. కంపెనీకి సలహాదారుగా నియమించుకున్న నాగలక్ష్మి గవ్వలు వేసి ఫలానా షేర్లలో పెట్టుబడి పెట్టమని సలహాలిచ్చే వారని సమాచారం. ఈమె భర్త బాలకృష్ణకు అద్విక ట్రేడింగ్‌ను ప్రమోట్ చేసేందుకు రూ.కోట్లలో చెల్లించినట్లు గుర్తించారు. తద్వారా కంపెనీ డిపాజిట్లను ఈ ఏడాది చివరి నాటికి రూ.500 కోట్లకు తీసుకెళ్లాలని ఆదిత్య లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిసింది.


డైరెక్టర్లకు విల్లాల నిర్మాణానికీ ప్రణాళిక

11మంది డైరెక్టర్లకు ఒకచోట విల్లాలు నిర్మించి ఇచ్చేందుకు నిందితుడు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఇందుకోసం ఓ రియల్టర్‌తో వెంచర్ వేయించాడు. దీనికి రూ.2 కోట్లు చెల్లించాడు. అంతలో బోర్డు తిప్పేయడంతో ఇది ముందుకు సాగలేదు.

ఏజెంట్లకే ఎక్కువ సొమ్ము: ఆర్థిక క్రమశిక్షణ కొరవడడంతో ఎవరు ఎంత కమీషన్, వడ్డీ తీసుకుంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిని అవకాశంగా తీసుకుని పలువురు ఏజెంట్లు వారికి రావాల్సిన కమీషన్ కంటే ఎక్కువ తీసుకున్నారు. ఇవన్నీ బ్యాంకు ఖాతాల పరిశీలనలో వెలుగులోకి వస్తున్నాయి. అసలు డిపాజిటర్ల కంటే వీరే అధికంగా లాగేశారు. గుంటూరుకు చెందిన ఓ ఏజెంట్ డిపాజిటర్ల నుంచి రూ.4కోట్ల వరకు సేకరించాడు. దీనికి రెట్టింపు సొమ్ము రాబట్టుకున్నట్లు తెలిసింది. ఆదిత్యను బెదిరించి మరో రూ.1.50 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. ఏజెంట్ల ఖాతాలు, వసూలు చేసిన డిపాజిట్లు, తీసుకున్న కమీషన్ వివరాలను పోలీసులు తీసుకున్నారు. ఇంకా ఐదుగురు లెక్కలు చూపడానికి రాలేదు. వారంతా అజ్ఞాతంలో ఉన్నట్లు భావిస్తున్నారు. వీరిని కేసులో ఆదిత్యతో పాటు నిందితులుగా చేర్చనున్నట్లు తెలిసింది. లెక్కలు చూపిన వారిని సాక్షులుగా పరిగణించనున్నట్లు సమాచారం.

కనిపెట్టేసే కళ్లు

గత వైకాపా పాలనలో ఇసుక దందా గురించి తెలిసిందే. నదిలో తవ్వకం నుంచి లారీల్లో ఇసుక ఎక్కడికి వెళ్లేదో కూడా తెలిసేది కాదు. రీచ్‌ల వద్ద కనీసం సీసీ కెమెరాలు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చి, అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకత ఉండేలా స్టాక్ పాయింట్ల వద్ద ఇలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నందిగామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇసుక పాయింట్ల వద్ద కనిపించిన దృశ్యమిది. –ఈనాడు, అమరావతి




ముత్యమల్లె మెరిసే నృసింహుడు

మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముత్యాల పందిరిలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. – న్యూస్‌టుడే, మంగళగిరి

ప్రహరీ లేక పాట్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాలలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

★ పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల మీదుగా వరద పారడంతో ప్రహరీ కూలిపోయింది. సెలవు రోజుల్లో ఆకతాయిలు, మద్యం ప్రియులకు అడ్డాగా మారుతోంది. ★ గంపలగూడెం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలకు కూడా ప్రహరీ లేదు. పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, పొదలు నెలకొన్నాయి. పాములు బడిలోకి వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ★ విద్యాలయాలకు ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పశువులు కట్టేస్తున్నారు. గడ్డివాములు వేస్తున్నారు. వాహనాలు నిలుపుతున్నారు. వ్యర్థాలు, వంట చెరకు వేస్తున్నారు. స్థానికులు ఆక్రమించడం వల్ల విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు సమీప ప్రాంతాల నుంచి విష సర్పాలు వస్తున్నాయి. ఇలాంటి ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి.



కూలిన ముచ్చింతాల పాఠశాల ప్రహరీ

111 బడులకు లేవు.. జిల్లాల్లో 227 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ తదితర పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 96,711 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల మైదానాలు, భవనాల్లోకి ఇతరులు లోపలికి రాకుండా ఉపయోగపడే ప్రహరీలు జిల్లాలో 111 పాఠశాలలకు లేవు. పాక్షికంగా 86 చోట్ల, పక్కా ప్రహరీలు 30 చోట్ల ఉన్నా... కొన్ని దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పాఠశాలలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మద్యం తెచ్చుకొని తాగుతున్నారు. అక్కడే సీసాలు పగలగొడుతున్నారు. ఇతర వ్యర్థాలు పడేస్తున్నారు. ఉదయం బడికి వచ్చే పిల్లలు, గురువులు వాటిని శుభ్రం చేయాల్సి వస్తోంది. ఆకతాయిలు మరుగుదొడ్లు అధ్వానంగా మారుస్తున్నారు. కొళాయిలు, చెట్ల కొమ్మలు విరిచేస్తున్నారు. జూద క్రీడలు ఆడుతున్నారు. గతంలో కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. సెలవు రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. అధికారులు, పాలకులు స్పందించి ప్రహరీలు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీలు లేని పాఠశాలలకు కొత్తవి నిర్మించాలని, దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు **జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు** తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం

ఉత్సాహంగా 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' చదరంగ పోటీలు



తలపడుతున్న మున్సిపల్ ఉద్యోగులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు దయనందిన జీవితంలో ఏదో రకమైన ఒత్తిడికి గురవుతారని, ముఖ్యంగా ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ఇలాంటి సమస్య ఎదుర్కొంటారని దీనిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్(ప్రాజెక్టు) డి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' చదరంగ పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు(ట్రోఫీలు) అందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఉపకరిస్తాయన్నారు. పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్‌షిప్' చదరంగ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్ ఆర్బిటర్ మందుల రాజీవ్, అకౌంట్సు సూపరింటెండెంట్ లక్ష్మి, ప్రణాళికాధికారి కృష్ణ, పబ్లిక్ రిలేషన్ అధికారి రజియా షబీనా తదితరులు పాల్గొన్నారు.

గొప్ప అనుభూతి



చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఎంతో ఇష్టం. మా నాన్న నేర్పించారు. పాఠశాల, కళాశాల స్థాయిలోనూ ఆడాను. ఉద్యోగ బాధ్యతల దృష్ట్యా చాలా కాలంగా ఆడడం లేదు. ఈ పోటీల్లో చాలామంది పాల్గొంటున్నట్లు తెలుసుకుని పాల్గొన్నాను. నేను విన్నర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ఇదో గొప్ప అనుభూతి. 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' వారికి అభినందనలు. - వడ్డాది నరేంద్ర(విన్నర్)

ఆలోచనా శక్తి పెరుగుతుంది



నిత్యం చాలా ఒత్తిడితోనే రోజువారీ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఇందులో బహుమతి అందుకోవడం చక్కటి అనుభూతినిచ్చింది. ఉద్యోగులు మరింత ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆలోచనాశక్తిని పెంచుకునేందుకు వీలుంటుంది. - సీహెచ్ పవన్ కుమార్(రన్నర్)

చాలా ఆనందంగా ఉంది



ఈ పోటీల వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. 'ఈనాడు-ఈటీవీ ఛాంపియన్' పోటీలు బాగా నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెల్చుకోవడం ఆనందంగా ఉంది. వర్కింగ్ ఉమెన్‌గా నిత్యం ఒత్తిడి ఎదుర్కొనే తమలాంటి వారికి ఇటువంటి పోటీలు రిలీఫ్‌గా ఉంటాయి. చాలా ఆనందంగా ఉంది. - కె.నాగజ్యోతి, మహిళా విభాగం విన్నర్

ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించాలి



ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి దక్కడం చాలా ఆనందంగా ఉంది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని మరింత సాధన చేసి ఉన్నత స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటా. ఇంతమంది ఉద్యోగులు పాల్గొనం విశేషం. నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు. - గండికోట లక్ష్మీ సింధు, మహిళా విభాగంలో రన్నర్

ప్రతి విద్యార్థికి బంగారు భవిష్యత్తు అందించడమే లక్ష్యం




తల్లుల పాదాలు కడుగుతున్న విద్యార్థినులు. వేదికపై కలెక్టర్ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి బంగారు భవిష్యత్తు అందించాలన్న సంకల్పంతో ఈ ఆత్మీయ సమావేశాన్ని అన్ని విద్యా సంస్థల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఉపాధ్యాయులు, తలిదండ్రుల ఆత్మీయ సమావేశం కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత లక్ష్యాలను నిజాయితీగా విద్యార్థులు సొంతం చేసుకోవడానికి అనుక్షణం శ్రమించాలన్నారు. తలిదండ్రులను గౌరవించి సన్మానించాలన్న ఆలోచన ఈ కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,453 విద్యాలయాల్లో ఈ సమావేశాలు నిర్వహించారన్నారు. బడిలో..బడి బయట విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు, తలిదండ్రులు చర్చించుకునేందుకు ఇంది మంచి వేదిక అని చెప్పారు. ప్రతి విద్యార్థికి సామాజిక బాధ్యత గుర్తు చేసేందుకు ఈ కార్యక్రమంలో గ్రీన్‌పాస్‌పోర్టును ఏర్పాటు చేశామని..ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షణను నిత్యం నమోదు చేయడంలో పాయింట్లు దక్కించుకుంటారన్నారు. దీనిపై ఆన్‌లైన్ మానిటరింగ్ ఉంటుందని వివరించారు. ప్రస్తుత తరుణంలో సంభవిస్తున్న అనేక అకృత్యాల్లో విద్యార్థులు అవగాహన లేమితో బలవుతున్నారని..పిల్లల ప్రవర్తనను తలిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం గమనిస్తూ వారికి హితబోధ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులు తల్లుల పాదాలు కడిగే కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా కోలాటంలో సరదాగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, కమిషనర్ రమ్యకీర్తన, తహసీల్దారు వెంకటేశ్వర్లు, పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, జనసేన నాయకులు గాంధీ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఒకే విద్యార్థిని.. అయినా పీటీఎం నిర్వహణ



హాజరైన ప్రధానోపాధ్యాయుడు, పంచాయతీ కార్యదర్శి ఖాసిం, తదితరులు



మిద్దె దివ్య, విద్యార్థిని

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి తొర్రగుడిపాడు బేసిక్ ప్రైమరీ పాఠశాలలో ఒకే విద్యార్థిని చదువుతోంది. చిన్న పంచాయతీ కావడంతో ఉన్న కొద్ది మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన మెగా (పీటీఎం) తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి విద్యార్థిని తల్లి, పాఠశాల మధ్యాహ్న భోజన, పారిశుద్ధ్య కార్మికురాలు, పంచాయతీ కార్యదర్శి ఖాసిం హాజరయ్యారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు బుదియను వివరణ కోరగా.. గతేడాది అయిదుగురు విద్యార్థులు ఉండగా.. ముగ్గురు ఆరో తరగతికి వెళ్లగా, ఒకరు వసతి గృహంలో చేరారని చెప్పారు. దీంతో ఒక్క విద్యార్థిని మాత్రమే మిగిలిందన్నారు.

బీఐఎస్ మార్క్ ఉంటేనే విదేశాలకు ఎగుమతి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: భారత ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) మార్క్ ఉన్న వస్తువులనే విదేశాలకు పంపించాలని పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ ఎ.రామలింగేశ్వరరాజు అన్నారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో బీఐఎస్ ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ, ఫెడరేషన్ ఆఫ్ స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఇండియాల సహకారంతో గురువారం ఇండస్ట్రియల్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, 1100 భారీ పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఎక్కువ ఖర్చు అవుతుందనే ఆలోచనతో చిన్న పరిశ్రమలే ఎక్కువగా బీఐఎస్ మార్క్ తీసుకోవడం లేదన్నారు. దీన్ని తీసుకోవడం చాలా సులభతరమని వివరించారు. బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ సజినీ పట్నాల మాట్లాడుతూ దేశంలోని వస్తువుల తయారీ, నిల్వ, అమ్మకాలు చేయాలంటే బీఐఎస్ సర్టిఫికేషన్ చేయాలని తెలిపారు. 816 వస్తువులకు తప్పనిసరి చేశారన్నారు. ఎఫ్ఎస్ఎంఈ ఛైర్మన్ కేఎల్ఎన్ ప్రకాష్‌రావు, పరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు వెంకట్రావు, డిప్యూటీ డైరెక్టర్ వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వంద మందికిపైగా పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు.

కూలిపోతున్నా.. కళ్లు తెరవరేం?



మండలంలోని పెంటాలవారిగూడెం సమీపంలో కాలువ గట్టు వద్ద విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. సిమెంటు స్తంభం సగానికి చీలిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏక్షణంలో ఏమి జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వత్సవాయి

కనుల పండువగా గిరి ప్రదక్షిణ



ఊరేగింపును ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్ దంపతులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆది దంపతుల గిరిప్రదక్షిణ కనుల పండువగా నిర్వహించారు. దుర్గగుడి టోల్‌గేటు సమీపంలో అలంకరించిన రథంలో గంగ, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు పూజ చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ దంపతులు కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ఊరేగింపును ప్రారంభించారు. భజన, కోలాట బృందాలతో కలిసి భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. కుమ్మరిపాలెం సెంటరు, నాలుగుస్తంభాల సెంటరు, సితార, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, రథం సెంటరు మీదుగా ఊరేగింపు ఇంద్రకీలాద్రికి చేరింది. దారిపొడవునా మహిళలు హారతులు ఇచ్చి ఆదిదంపతులకు స్వాగతం పలికారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు స్వర్ణ కవచాలంకృత దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూరాలజిస్ట్స్ అసోసియేషన్ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు అజయ్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, సతీష్‌కుమార్, ధీరజ్, శ్రీమన్నారాయణ

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎండోస్కోపీ నుంచి పూర్తిస్థాయి రోబోటిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్సల వరకు యూరాలజీలో వివిధ విభాగాలపై అధ్యయనం చేసేందుకు ఈ నెల 11 నుంచి 13 వరకు మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో 36వ సదరన్ యూరాలజిస్ట్స్ అసోసియేషన్ వార్షిక సదస్సు(సుజికాన్-2025) నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ సీవీ సతీష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ ధీరజ్ కాసరనేని తెలిపారు. గురువారం విజయవాడ ఎంజీరోడ్డు లబ్బీపేటలోని ప్రశాంత్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది యూరాలజిస్టులు, ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని వెల్లడించారు. తాజా ఆవిష్కరణలతో 75 ట్రేడ్ స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ కె.ప్రశాంత్‌కుమార్, డాక్టర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలకుమించిన భారం.. కొండ దిగితేనే అన్నం..!

చిట్టినగర్, న్యూస్‌టుడే

● గతంలో వాహనాల ద్వారా బియ్యం పంపిణీ
● కొండపైకి బరువు మోసుకెళ్లలేక అవస్థలు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేదుకు కార్డుదారులు డీలర్ల వద్దనే రేషన్ తీసుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదే సమయంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే బియ్యం అందజేసేలా చూస్తోంది. ఇది బాగానే ఉన్నా విజయవాడలోని కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు మాత్రం ప్రభుత్వ నిర్ణయం మింగుడు పడటం లేదు. తమకు కూడా వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.



రేషన్‌బియ్యం బస్తా మోసుకెళుతున్న కార్డుదారు

16 ప్రాంతాలు.. 30వేల కార్డులు

విజయవాడ నగరంలోని మల్లికార్జునపేట, కొత్తపేట, ఆంజనేయవాగు, చిట్టినగర్, గొల్లపాలెం గట్టు, ప్రైజర్‌పేట, వించిపేట, బేరర్‌పేట, లంబాడీపేట, భీమనవారిపేట, కబేళా, రామరాజ్యనగర్, పాలప్రాజెక్ట్‌సెంటర్, మొగల్రాజపురం, గుణదల, క్రీస్తురాజపురం తదితర కొండప్రాంతాలు ఉన్నాయి. ఈప్రాంతాల పరిధిలో దాదాపు 30 వేల వరకు రేషన్‌కార్డులు ఉన్నాయి. గత వైకాపా పాలనలో కార్డుదారులకు ఎండీయూ వాహనం ద్వారా కొండ ప్రాంతాల్లో బియ్యం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో కార్డుదారులు డీలర్ల వద్దే బియ్యం తీసుకోవాలన్న నిర్ణయం తీసుకుంది. దీంతో కొండ ప్రాంత వాసులకు రేషన్ కష్టాలు తలెత్తాయి. కొండప్రాంత వాసులు బియ్యం కోసం కొండ దిగిరావడం, గంటలపాటు వేచిఉండడం, బియ్యం మోసుకుని కొండెక్కడం కష్టంగా మారింది.

బరువుతో 140 మెట్లు ఎక్కాలి



చిట్టినగర్ ఈద్గా వెనక భాగంలో ఉంటున్నాం. డీలర్ వద్దకు వెళ్లాలంటే కొండ పైనుంచి మెట్లు దిగి అడ్డరోడ్డు మీదుగా మెయిన్ రోడ్డు దాటి కొంతదూరం వెళ్లి బియ్యం తీసుకోవాలి. 140 మెట్లు దిగిపోయి బియ్యం ఎత్తుకుని కొండ ఎక్కి రావడం తలకుమించిన భారం అవుతోంది. .మళ్లీ బరువుతో 140 మెట్లు ఎక్కాలంటే నానా అవస్థలు పడుతున్నాం. అడ్డరోడ్డులో డిపో ఏర్పాటుతో మేలు. - పిల్లా ఏసు, చిట్టినగర్

వాహనం ద్వారా ఇస్తే మేలు



బంగారయ్యకొట్టు సెంటర్ పైభాగంలో ఉంటున్నాం. గతంలో వాహనాలు కొండపైకి వచ్చేవి. బియ్యం తీసుకోవడం సులభంగా ఉండేది. వాహనం రాకపోవడం, డిపో దూరం కావడంతో బియ్యం తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. కొండ ప్రాంతవాసులకు అందుబాటులో ఉండేలా డిపో ఏర్పాటుచేయాలి. వీలుకాకుంటే వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేయాలి. -ఎస్.శివకుమారి, బంగారయ్యకొట్టు సెంటర్

నివేదిక కోరాం..

విజయవాడ కొండ ప్రాంతాలలో రేషన్ బియ్యం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిసింది. ప్రజలు బియ్యం, ఇతర సరుకుల కోసం మెట్లు దిగి దూరం వెళ్లకుండా ఉండేదుకు ఆయా ప్రాంతాల్లో డిపోల ఏర్పాటును పరిశీలిస్తున్నాం. దీనిపై ఏఎస్‌వో అధికారులను నివేదిక ఇమ్మని కోరాం. నివేదిక రాగానే సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. - పాపారావు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

జిల్లాలో డ్రైడే కార్యక్రమాలు నేడు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వంటివి ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ శుక్రవారం డ్రైడే- డ్రైడే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారుల మధ్య పటిష్ఠ సమన్వయం, సమాచార మార్పిడికి విజయవాడలోని కలెక్టరేట్‌లో ఫోన్ నంబరు 91549 70454తో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జ్వరాలు, కాలానుగుణ వ్యాధులు తదితరాలపై వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలోని ప్రత్యేక బృందాలకు అందించి, యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

తొలిసారి ఉద్యోగంలో చేరితే.. ప్రోత్సాహకాలు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతు ఇచ్చేందుకు, సామాజిక భద్రత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని రూపొందించిందని భవిష్యనిధి ప్రాంతీయ కమిషనర్-1 ప్రభుదత్త ప్రూష్టి వెల్లడించారు. గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఈఎల్ఐ పథకం వివరాలను భవిష్యనిధి ప్రాంతీయ కమిషనర్-2 తానయ్యతో కలిసి ఆయన వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి ఈ పథకం కింద ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. యువతకు ఉపాధి నైపుణ్యం, ఇతర అవకాశాలను సులభతరం చేయడం కోసం ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించారన్నారు. 2025, ఆగస్టు 1వ తేదీ నుంచి 2027, జులై 31 మధ్య ఉద్యోగాలు కల్పించినవారికి ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. మొదటిసారిగా ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఒక నెల ఈపీఎఫ్ వేతన మొత్తాన్ని రూ.15,000 వరకు రెండు విడతల్లో అందిస్తారన్నారు. రూ.లక్ష వరకు వేతనం పొందే ఉద్యోగులు దీనికి అర్హులన్నారు. ఆరు నెలల సర్వీస్ తర్వాత మొదటి విడత మొత్తాన్ని, 12 నెలల సర్వీస్ అనంతరం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత రెండో విడత మొత్తాన్ని చెల్లిస్తారన్నారు. రూ.లక్ష వరకు వేతనం ఉన్న ఉద్యోగులు కలిగి ఉన్న యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు అందిస్తారన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన నియమించుకున్న ప్రతి అదనపు ఉద్యోగి కోసం యాజమాన్యాలకు ప్రభుత్వం రెండేళ్ల పాటు నెలకు రూ.3,000 వరకు అందిస్తుందని వివరించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలోని కార్మికులు, యాజమాన్యాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో భవిష్యనిధి ప్రాంతీయ సహాయ కమిషనర్ గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.కొండూరు 3.4 మి.మీ., వీరులపాడు 2.2, తిరువూరు 1.6, విజయవాడ సెంట్రల్, తూర్పు, పశ్చిమ 1, విజయవాడ ఉత్తరం 0.8, నందిగామ 0.2 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ వీరంగం

పటమట, న్యూస్‌టుడే: అర్ధరాత్రి హల్‌చల్ చేస్తున్నారని రౌడీషీటర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తే అతడు స్టేషన్‌లో వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 9న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో రౌడీ షీటర్ మాదిరి ప్రవీణ్ కుమార్ అలియాస్ చిన్నరాజా మద్యం తాగి ద్విచక్ర వాహనంపై అల్లరి చేస్తుండగా బీట్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో తలను గోడకు కొట్టుకుని స్విచ్‌బోర్డును ధ్వంసం చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే తీగలు పీకివేశాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లి ఈలప్రోలు రోడ్డులో యాదవుల బజారు మలుపు వద్ద ఉన్న పేడ, మురికి వల్ల వర్షం పడినప్పుడు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. పరిశీలించి పరిష్కరించండి. -దుర్గారావు, కొండపల్లి

✔ పరిస్థితి సమీక్షించి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. - వెంకటరత్నం, మేనేజర్. - న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం

☛ కుంటముక్కల ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్మశానవాటికలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురించగా స్పందించిన కార్యదర్శి సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు




☛ పట్టణంలోని యాదవ బజార్ డ్రెయినేజీలో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

☛ పట్టణంలోని 8వ వార్డులో ఎస్ఆర్ టవర్ రహదారిలోని కాలువల్లో తొలగించిన పూడిక మట్టి, చెత్త రోడ్డుపై అడ్డుగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించారు. పురపాలిక కార్మికులను పంపి శుభ్రం చేయించారు.

☛ పట్టణంలోని 10 ఎన్నెస్పీ కాలనీలో రహదారి పక్కన పిచ్చి చెట్లు పెరిగి ఇబ్బందిగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, తిరువూరు

శాకంబరిగా కోట మహాలక్ష్మమ్మ



మైలవరం, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల దత్తత దేవాలయమైన స్థానిక కోట మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని వివిధ రకాల కూరగాయలతో గురువారం అలంకరించారు. శాకంబరీ దేవి రూపంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వాసవీమాతకు ఆషాఢ సారె సమర్పణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా గురువారం గంపలగూడెంలో శ్రీరామభజన మందిరంలోని వాసవీమాతకు ఆర్యవైశ్య సంఘం మహిళల ఆధ్వర్యంలో సారె సమర్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహానికి అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, ఫలాలు, గాజులు, చీర, జాకెట్లు, పిండి వంటలతో సారె సమర్పించారు. భక్తులకు పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీరామసేవకుల పాదయాత్ర

మేడూరు(గంపలగూడెం): పౌర్ణమి సందర్భంగా రామసేవకుల ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్ర నిర్వహించారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో గంపలగూడెం, తోటమూల నుంచి 100 మంది భక్తులు 5 కి.మీ పాదయాత్ర చేసి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి మాస కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి కృష్ణాలయంలో గురువారం రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి మాసకల్యాణం ప్రధానార్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా యాగశాలలో ఉత్సవమూర్తులకు జరిపించిన కల్యాణంలో వివిధ గ్రామాలకు 9 మంది దంపతులు పీటలపై ఆసీనులై కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పాల్గొన్నారు.



రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులు

నాడు మూలన.. నేడు పెట్టాలి గాడిన

మరమ్మతులకు నోచని ఎత్తిపోతల పథకాలు

మైలవరం, న్యూస్‌టుడే



రైతులు సొంతగా మరమ్మతులు చేయించిన దాసుళ్లపాలెం ఎత్తిపోతల స్కీం



పనిచేయని పుల్లూరులో పంప్‌హౌస్

పక్కనున్న ఫొటోలో కనిపించేది దాసుళ్లపాలెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్. గత వైకాపా ప్రభుత్వంలో కనీస మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం చూపడంతో మూలన పడగా, కూటమి అధికారంలోకి వచ్చాక ఆయకట్టు రైతులే రూ.35 వేలు వెచ్చించి గాడిన పెట్టుకున్నారు. కానీ నేటికీ ఆ ఖర్చులు తిరిగి చెల్లించిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. ఇది ఆ ఒక్క పథకం పరిస్థితే కాదు, నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎత్తిపోతల పథకాలు మరమ్మతుల లేమితో మూలనపడుతుంటే, ప్రయోజనాలు మరుగున పడుతున్నాయి. మెట్ట ప్రాంతమైన మైలవరం నియోజకవర్గంలో వాగులు, చెరువులు, రబీలో నాగార్జునసాగర్ ద్వారానే ఆయకట్టు భూములకు నీరందుతోంది. వర్షాభావం ఉంటే ఆరుతడి పంటలకే పరిమితం కావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున వాగులు, కాలువలకు అనుబంధంగా ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి, చెరువులకు అనుసంధానించారు. అందుకోసం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించారు.

నిర్లక్ష్యం రాజ్యమేలింది

తెదేపా ప్రభుత్వం మారి, వైకాపా అధికారంలోకి వచ్చాక ఐడీసీకి నిధులలేమి కారణంతో కనీస మరమ్మతులు పైనా దృష్టి సారించలేదు. దాంతో నియోజకవర్గవ్యాప్తంగా సగానికి పైగా మరమ్మతులు కోరుతున్నాయి. ఇప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల మోటార్ల మరమ్మతులు, మరికొన్ని చోట్ల విద్యుత్తు సమస్య.. అవి బాగుంటే, విద్యుత్తు బిల్లుల బకాయిల సమస్యలతో ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదని చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..
మొత్తం ఎత్తిపోతల పథకాలు: 22
నిర్మాణ వ్యయం: సుమారు రూ.6.5 కోట్లు
మరమ్మతులు కోరుతున్నవి: 10 వరకు
ఆయకట్టు భూమి: సుమారు 5 వేల ఎకరాలు

సమస్యలతో సతమతం

మైలవరం మండలం పుల్లూరులో దాదాపు మూడు దశాబ్దాల కిందట బుడమేరు వాగు నుంచి బొర్రగూడెం చెరువుకు నీటిని ఎత్తిపోసే నిమిత్తం నిర్మించిన పథకం మూలన పడి చాలా కాలమైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. ★ రెడ్డిగూడెం మండలంలో నాగార్జునసాగర్ కాలువలపై మూడు చోట్ల చెరువులకు నీటిని తరలించేందుకు నిర్మించిన పథకాలు మోటార్ల సమస్యతో పనిచేయడంలేదు. ★ పాతనాగులూరులో మోటారు ఏర్పాటు కాలేదు. ★ జి.కొండూరు మండలం మునగపాడులోని గ్రంధివానిచెరువుకు నీటిని తరలించేందుకు 2018లో ఏర్పాటు చేసిన పథకం కొట్టుకుపోగా, పునరుద్ధరించడంలేదు.

ఘనంగా వెంకటాచలుడికి గరుడ సేవ



తిరువూరు: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటాచలస్వామి ఆలయంలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. అర్చకులు డీవీ.కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌లకు విశేష పూజలు, ఉత్సవమూర్తులకు గరుడ వాహనంపై గుడి చుట్టూ ప్రదక్షిణలు, పంచ హారతులు నిర్వహించారు.

'రైతుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ పర్యటన'



మాట్లాడుతున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రైతులు కష్టపడి పండించిన మామిడి పంటను మాజీ ముఖ్యమంత్రి జగన్ రోడ్లపై పోయించి ట్రాక్టర్‌తో తొక్కించడం మంచి పద్ధతి కాదని తెదేపా నియోజకవర్గ సీనియర్ నాయకులు విజయబాబు, కుమార్ రెడ్డి, నరసింహారావు, శోభన్ బాబు తదితరులు విమర్శించారు. గురువారం సాయంత్రం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల మనోభావాలు దెబ్బతీసే విధంగా జగన్ పర్యటన సాగిందని ఆరోపించారు. బంగారుపాళ్యంలో జగన్ చేసిన వికృత చర్యలకు రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

తిరువూరు: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మందికి రూ.12.86లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరులోని తన కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గురువారం పంపిణీ చేశారు. తమకు ఆర్థికసాయం అందించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యం అప్రమత్తతే ప్రధానం



భద్రతా విభాగం సిబ్బంది మాక్‌డ్రిల్


ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కోల్ ప్లాంటులో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు అన్నారు. అగ్నిమాపక దళ విన్యాసాలను సంస్థ బొగ్గు సంభాళిత విభాగంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోల్ ప్లాంటులో క్షణకాలంలో అనేక ప్రమాదాలు సంభవిస్తాయని.. ఆ సమయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రాణాలకే ప్రమాదమని చెప్పారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరులను జాగ్రత్త పరచాలని సూచించారు. మొదట అలారం మోగించి ప్రమాద పరిస్థితిని అందరికీ తెలియజేయాలన్నారు. ఎస్టేట్ ఇన్‌స్పెక్టర్ బీటీసింగ్ మాట్లాడుతూ.. ప్రమాదాలు సంభవించే సమయంలో గాయపడినవారిని చెబుతూ.. తక్షణమే వారికి వైద్య సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రథమ చికిత్స పెట్టె అవగాహన కలిగి క్షతగాత్రులకు చికిత్సను అందించాలన్నారు. మంటలు ఆర్పే విధానాన్ని భద్రతా అధికారి నాగబాబు కార్మికులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాక్‌డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇంటింటా సుపరిపాలన



కరపత్రాల పంపిణీలో తెదేపా నాయకులు

నెమలి(గంపలగూడెం), పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని నెమలిలో గురువారం సాయంత్రం తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, నాయకులు మధుసూదనరావు, కొండలరావు, అనిల్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు. విస్సన్నపేట మండలం పుట్రేలలో ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, స్థానిక తెదేపా నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.



గంపలగూడెం: కొణిజెర్లలో..



ఎన్టీటీపీఎస్ ఏ కాలనీలో..



మైలవరం సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



తిరువూరులో..

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

న్యూస్‌టుడే, బృందం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గ్రామాల్లోని సాయి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. శిర్డీ సాయిబాబా విగ్రహాలకు అర్చకులు పంచామృతాభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు శిర్డీ సాయి వ్రతాలు, పారాయణం చేశారు. నిర్వాహకులు భారీగా అన్నప్రసాదం నిర్వహించారు.

☛ గొల్లపూడిలోని మహాత్మాగాంధీ టోకు వ్యాపార కేంద్రంలో ఉన్న సాయి బాబా ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎనిమిది వేల మందికి అన్నసంతర్పణ జరిగింది.



కొండపల్లి ఖిల్లారోడ్డులోని ఆలయంలో..

అడుగడుగునా ఆక్రమణలే



ఆక్రమణల పర్వం చెలరేగడంతో అవి నీటి పారుదలకు అడ్డుగా మారుతున్నాయి. ఇబ్రహీంపట్నం రింగుకూడలి నుంచి మైలవరం వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దీంతో వర్షపు నీరు సక్రమంగా పారుదల లేక జాతీయ రహదారిపైనే నిలిచిపోతున్నాయి. ఆక్రమణదారులు నీరు వెళ్లే మార్గాలను మట్టితో, నిర్మాణ వ్యర్థాలతో మూసేస్తున్నారు. దీంతో చిన్నపాటి కాలవలు పూడుకుపోతున్నాయి. జాతీయ రహదారి కాలువ పక్కనున్న స్థలం కొంత ఎన్టీటీపీఎస్ పరిధిలో, మరి కొంత పురపాలికలో ఉండడం వల్ల సమన్వయ లోపంతో ఏ ఒక్కరూ ఆక్రమణల తొలగింపునకు ముందుకు రావడం లేదు. పైగా ఆక్రమణల వెనుక రాజకీయ అండ ఉండడంతో అధికారులు సాహసం చేయడం లేదు. ఏదేమైనా వర్షాలు వచ్చిన సందర్భంలో ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

పొదలు తొలగిస్తేనే ప్రయాణాలు సాగుతాయ్



కూనపరాజుపర్వ గ్రామంలోని దక్షిణ బజారు వైపు నుంచి కుదప వెళ్లే తారురోడ్డుకి ఇరువైపులా దట్టంగా పెరిగిన పొదలతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ఈ మార్గంలో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు తప్పుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. ఇప్పటికే చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారి పైకి పెరిగిన పొదలను తొలగించి రాకపోకలు సజావుగా జరిగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

వాతావరణ మార్పులపై అవగాహన పెంచాలి



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో అనేక నష్టాలను చవిచూస్తున్నామని మద్రాస్ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగాధిపతి నారాయణ మతివానన్ పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవవైవిధ్య పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి అంశాలపై రెండు రోజుల జాతీయస్థాయి సదస్సును శుక్రవారం కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మతివానన్ మాట్లాడుతూ.. వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్‌తో పాటు ఇతర వాయువుల పెరుగుదలతో వాతావరణం వేడెక్కి సరైన సమయంలో వర్షాలు, ఎండలు రావడం లేదన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధుసూదన రెడ్డి మాట్లాడుతూ విద్యాలయంలో 15 ఎకరాల్లో చెట్లతో అడవిని పెంచామన్నారు. చెట్ల పెంపకం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని వివరించారు. ఉప ప్రిన్సిపల్ పి రంగారావు, సదస్సు కన్వీనర్ జె రాముడు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమానిపై కేసు

వినగడప(గంపలగూడెం): మండలంలోని వినగడప సమీప పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ప్రమాద సంఘటనలో ట్రాక్టర్ యజమాని అయిన అదే గ్రామానికి చెందిన బత్తుల నాగరాజుపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీధర్ తెలిపారు. బుధవారం సాయంత్రం అక్కడి పెట్రోల్ బంక్ నుంచి బయటకు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొట్టిన సంగతి తెలిసిందే. సంఘటనలో ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడేనికి చెందిన మొండ్రు శంకర్‌కు తీవ్రగాయాలు కాగా విజయవాడకు తరలించారు. క్షతగాత్రుడి భార్య మీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అడ్డుకున్నా ఆగరు.. వేడుకున్నా వదలరు

అన్నేరావుపేటలో అక్రమంగా మట్టి తరలింపు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే



సీతారాంపురం గ్రామం దగ్గర ఇటుక బట్టీల తయారీ ప్రదేశంలోకి తరలించిన మట్టి గుట్ట

మండల పరిధిలోని అన్నేరావుపేటలో మట్టి మాఫియా ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తూ అక్రమార్జనకు తెరలేపింది. పంచాయతీలోని సీతారాంపురం తండా దగ్గరలో ఉన్న పేట చెరువుపై ఈ మాఫియా కన్ను పడింది. ఓ ఇద్దరు నాయకులు పోటీ పడి మరి మట్టి తోలకాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

అడ్డుపెట్టినా ఆగకుండా.. రాత్రి సమయంలో ట్రాక్టర్ మోతలకు ప్రజలు భయాందోళనలు చెంది రోడ్డుపై దుంగ అడ్డు పెట్టినా ఆగడంలేదని, వద్దని వేడుకున్నా వినడంలేదని వాపోతున్నారు. ఈ విషయం గురించి అన్నేరావుపేట వీఆర్వో లావణ్యను వివరణ కోరగా అనుమతి తెచ్చుకున్నారని చెప్పడం గమనార్హం. నీటిపారుదల శాఖ ఏఈ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా మట్టి తోలకాలకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాన్ని మళ్లీ వీఆర్వోకు వివరించగా.. ఉన్నతాధికారులకు తెలిపి, తమ సిబ్బంది వెళ్లి పరిశీలించి మట్టి తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సేవలకు సత్కారం

మండలంలోని పెనుగొలనులో గురువారం కళాకారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులను శిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న 26 మందిని కమిటీ అధ్యక్షుడు వి.నారాయణరావు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కళాకారులు సాంబశివారెడ్డి, మౌలాలి, జయరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పెనుగొలను (గంపలగూడెం)



రసాభాసగా సర్వసభ్య సమావేశం



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ పథకం కార్మికులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఎంపికలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ధారావత్ ప్రసాద్ నాయక్‌ను ఓ నేరం కేసు ఉండడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఉపాధి హామీ కార్మికులు, పెద్దలు ఐక్యంగా గ్రామానికి చెందిన కె.బాబురావును తాత్కాలికంగా నియమించుకున్నారు. అతడిని పూర్తి స్థాయిలో కొనసాగించేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం అవసరమని అధికారులు సూచించగా..గురువారం పంచాయతీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. తీర్మానం అజెండాలో బి.నాగేశ్వరరావుతోపాటు, డి.ప్రసాద్‌లు దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొంటూ వీరిలో ఒకరిని ఎంపిక చేసుకోవాలని పంచాయతీ సభ్యులకు సూచించారు. నాగేశ్వరరావును సర్పంచితోపాటు ఎనిమిది మంది సభ్యులు బలపరిచారు. విషయం తెలిసిన ఉపాధి హామీ కార్మికులు అక్కడికి చేరుకుని బాబురావునే కొనసాగించేలా తీర్మానం చేయాలని నినాదాలు చేశారు. దీనిపై సర్పంచి కాకి దేవమాత, గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమావేశానికి హాజరైన సభ్యులందరూ నాగేశ్వరరావుకే మద్దతు తెలపడంతో అతని పేరునే తీర్మానం చేసి అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రమీలను వివరణ కోరగా తనకు పంచాయతీ తీర్మానం అందలేదని పరిశీలించిన తర్వాత తనే నిర్ణయం ప్రకటిస్తానన్నారు.



మైలవరం బాలికోన్నత పాఠశాలలో..



పినపాకలో విద్యార్థి తల్లికి ప్రోత్సాహకం అందజేస్తున్న వెంకటనరసింహారావు, రవికుమార్, రామకృష్ణ తదితరులు




కాచవరం పాఠశాలలో మొక్కలు నాటేందుకు వెళ్తున్న చిన్నారులు

అమ్మానాన్న బడికొచ్చారు

సందడిగా పీటీఎం సమావేశం

న్యూస్‌టుడే, బృందం: తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాలయాల్లో గురువారం పండగ వాతావరణంలో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఉదయం 8 గంటలకు పాఠశాలలకు చేరుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులకు పుష్పాలతో స్వాగతం పలికారు. దాతలు, పెద్దలు, ప్రజాప్రతినిధుల, తెదేపా నాయకులు కూడా పాల్గొని బాలబాలికలకు సందేశమిచ్చారు. పిల్లలు తమ తల్లులకు పాదపూజ చేసి ఆప్యాయతను చాటుకున్నారు. పిల్లలకు ప్రగతి పత్రాలు, ఆటల్లో ప్రతిభ చూపిన తల్లులకు బహుమతులు పంపిణీ చేశారు.


☛ వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.65 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను గ్రామ తెదేపా పార్టీ అధ్యక్షుడు పచ్చిగోళ్ల బాలకృష్ణ హెచ్ఎం శ్రీనివాసరావుకు అందజేశారు.



గొల్లపూడి: మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో కుర్చీలాట ఆడుతున్న తల్లులు



దుందిరాలపాడు హెచ్‌డబ్ల్యూ బడిలో తాడు లాగుడు పోటీలో తలపడుతూ..

లక్ష్యంతో చదివితే ఉన్నత స్థానాలు మీ సొంతం

గంపలగూడెం, తిరువూరు: లక్ష్యంతో చదివే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదనే సీఎం చంద్రబాబు తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికి వర్తింపజేశారన్నారు. తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జీవీ.లక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మెగా తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల నుంచి ఈ ఏడాది వృత్తి విద్యా కోర్సు ఫిషరీస్ విభాగంలో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన పింగళి ప్రత్యూషను శాలువతో సత్కరించి రూ.25వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన ప్రిన్సిపల్ లక్ష్మి, పురపాలిక ఛైర్‌పర్సన్ నిర్మల

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

జి.కొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. డ్వామా పీడీ రాము మాట్లాడుతూ..గత ఏడాది ఉపాధి హామీ కింద 1,241, పంచాయతీరాజ్ 88, ఎస్ఎస్ఏ కింద ఒక పని మొత్తం 1,330 పనులు చేసినట్లు తెలిపారు. ఈ పనుల నిమిత్తం వేతనాలు రూ.14.1 కోట్లు, మెటీరియల్‌కు రూ.4.7 కోట్లు చొప్పున మొత్తం రూ.18.89 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రాత్రి సమయంలో కూడా తనిఖీలు కొనసాగుతుండడంతో రికవరీ వివరాలు శుక్రవారం వెల్లడిస్తామని పీడీ తెలిపారు.



గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని టెంకాయలు కొడుతున్న భక్తులు

సింహగిరి ప్రదక్షిణం పరిపూర్ణం

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: అప్పన్న స్వామిపై అచంచల భక్తిభావంతో 32 కిలో మీటర్ల సింహగిరి పాదయాత్రను భక్తులు గురువారం పరిపూర్ణం చేశారు. సింహాచలం కొండ దిగువన తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టిన భక్తులు తిరిగి అక్కడికే చేరుకొని టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహాద్రినాథుడికి చివరి చందన సమర్పణ సంప్రదాయబద్ధంగా జరిగింది. సింహగిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం దేవస్థానం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పించింది. భక్తులు ఆలయం చుట్టూ 32 సార్లు ప్రదక్షిణ చేశారు. పాద యాత్ర ముగించుకొని వచ్చిన భక్తులతో తొలిపావంచా ప్రాంగణం, పాత అడవివరం నుంచి పాత గోశాల కూడలి వరకు రహదారులు కిక్కిరిసిపోయాయి.

కారాగారంలో మూడేళ్లుగా నిర్బంధం

- గుంటూరు వినియోగదారుల కమిషన్ తీరును తప్పుపట్టిన హైకోర్టు
- స్థిరాస్తి వ్యాపారిని విడుదల చేయాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: తమ ఆదేశాల మేరకు నడుచుకోలేదనే కారణంతో ఓ వ్యక్తిని గుంటూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డీసీడీఆర్‌సీ) జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపి.. మూడేళ్లుగా కారాగారంలో నిర్బంధించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇలా చేయడం రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనంది. జైలుశిక్ష విధించే అధికారాన్ని డీసీడీఆర్‌సీ నిర్లక్ష్యంగా వినియోగించడానికి వీల్లేదని హితవు పలికింది. 'పెనాల్టీ పిటిషన్ల' విచారణ సందర్భంగా తమముందు హాజరుకాలేదనే కారణంతో స్థిరాస్తి సంస్థ విజయసారథి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఎస్‌హెచ్‌పీఎల్) ఎండీ అల్లాబక్షును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారని, ఆయనను వెంటనే విడుదల చేయాలని గుంటూరు జిల్లా కారాగార సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

✦ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంకాయలపాడులో వీఎస్‌హెచ్‌పీఎల్ ఎండీ అల్లాబక్షు పలువురితో ప్లాట్ల విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలుదారులు 2019లో గుంటూరు డీసీడీఆర్‌సీని ఆశ్రయించారు. కొనుగోలుదారులకు నాలుగు వారాల్లో 12% వడ్డీతో సొమ్ము చెల్లించాలని అల్లాబక్షును కమిషన్ ఆదేశించింది. ఆయన అలా చేయలేదని కొనుగోలుదారులు 2022లో పెనాల్టీ పిటిషన్లు దాఖలుచేశారు. వీటిపై విచారణ సందర్భంగా అల్లాబక్షు హాజరుకు డీసీడీఆర్‌సీ ఉత్తర్వులిచ్చింది. ఆయన పట్టించుకోకపోవడంతో వారెంట్ జారీచేసింది. పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని 2022 జులై 20న హాజరుపరచగా డీసీడీఆర్‌సీ జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దానిని పలుమార్లు పొడిగించింది. దీనిపై అల్లాబక్షు సోదరుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన ధర్మాసనం డీసీడీఆర్‌సీ తీరును తప్పుపట్టింది.

తాజా ఫీజుల ఖరారు వరకు పాతవే అమలు

ప్రైవేటు ఇంజినీరింగ్ ఫీజులపై హైకోర్టు స్పష్టత

ఈనాడు, అమరావతి: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయం విషయంలో స్పష్టత ఇస్తూ హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. రెండు వారాల్లో సమాచారాన్ని ఏపీ ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌కు (ఏపీహెచ్‌ఈఆర్ఎంసీ) అందజేయాలని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించింది. ఆ సమాచారం ఆధారంగా తాత్కాలిక ఫీజును నిర్ణయించి, అందుకు సంబంధించిన వర్క్‌షీట్లను యాజమాన్యాలకు పంపించాలని కమిషన్‌కు స్పష్టం చేసింది. ఆ ఫీజులపై అభ్యంతరం ఉంటే కళాశాల యాజమాన్యాలకు వాదనలు చెప్పుకునే అవకాశం ఇవ్వాలంది. కళాశాలలు కోరిన విధంగా కాకుండా ఫీజులలో కోత విధిస్తే అందుకు కారణాలను నమోదు చేయాలని పేర్కొంది. సెమినార్లు, వర్క్‌షాపులు, గార్డెనింగ్ నిర్వహణ ఖర్చుల విషయంలో కమిషన్ పరిమితులు పెట్టడాన్ని ఆక్షేపించింది. కళాశాలల నుంచి ఖర్చుల సమాచారం తెప్పించుకొని కమిషన్ తాజాగా ఫీజులను నిర్ణయించే వరకు 2023-26 విద్యా సంవత్సరానికి (2024 జులై 7న జారీ చేసిన జీవో 17 ప్రకారం) నిర్ణయించిన ఫీజులు తాత్కాలికంగా అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. 2023-26 సంవత్సర స్లాబ్ కాలానికి ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను ఖరారు చేస్తూ కమిషన్ తీసుకున్న నిర్ణయంపై ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తదితరులు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. 2023 డిసెంబరు 5న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏపీహెచ్‌ఈఆర్ఎంసీ 2024లో ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేసింది.

విచారణకు ఇప్పుడు రాలేను.. వచ్చే వారం వస్తాను

సిట్ అధికారులకు తెలిపిన రజత్ భార్గవ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో శుక్రవారం తాను విచారణకు రాలేనని, వచ్చే వారం హాజరవుతానని విశ్రాంత ఐఏఎస్ అధికారి, జగన్ హయాంలో ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ భార్గవ సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. తన ఆరోగ్యం బాగోలేదని, చికిత్స పొందుతున్నానని, విచారణకు హాజరయ్యేందుకు తగిన సమయమివ్వాలని కోరారు. శుక్రవారం విచారణకు హాజరుకావాలంటూ ఆయనకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఆ నోటీసులకు ఆయన సమాధానంగా తాను రాలేనని చెప్పారు. అయితే సిట్ వర్గాలు మాత్రం ఆయన శుక్రవారమే విచారణకు హాజరవుతారని అంటున్నాయి.



వీటిని పాటిస్తే మిమ్మల్ని మీరు అభినందించుకుంటారు

1. ఆర్థిక నిర్వహణపై అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవడం.
2. క్రమం తప్పకుండా ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం.
3. క్రమంగా పెట్టుబడి మొత్తాన్ని పెంచుతూ దీర్ఘకాలం పాటు మదుపును కొనసాగించడం.
4. ఏటా కుటుంబంతో విహార యాత్రకు వెళ్లడం.

వీటి ఫలితాలు తక్షణం కనిపించవు కానీ, వీటిని పాటిస్తే భవిష్యత్తులో మిమ్మల్ని మీరు తప్పక అభినందించుకుంటారు.

– జాన్ హెన్రీ, ఇన్వెస్ట్‌మెంట్ మెంటార్

మధ్యాహ్న భోజనం కోసం కడపలో స్మార్ట్ కిచెన్

- నిధులు సమకూర్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



వంట కోసం వినియోగించే ఉపకరణాలు



వంట చేస్తున్న మహిళలు

ఈనాడు, కడప: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత నిధులు సమకూర్చగా, కడప పురపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి స్మార్ట్ కిచెన్ నిర్మాణం పూర్తైంది. ప్రభుత్వ పాఠశాలలు స్వయంగా నిర్వహించే ఈ స్మార్ట్‌కిచెన్ దేశంలోనే మొదటిదని అధికారులు చెబుతున్నారు. ఈ వంటశాల ద్వారా ప్రస్తుతం 12 పాఠశాలల్లోని 2,200 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నారు. డొక్కా సీతమ్మ పేరుతో పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అత్యంత శుచిగా, రుచిగా, నాణ్యంగా విద్యార్థులకు అందిస్తున్నారు. ఐదు నక్షత్రాల హోటల్ తరహాలో వంట కార్మికులు డ్రెస్ కోడ్, పరిశుభ్రతా చర్యలు పాటిస్తున్నారు. స్మార్ట్ కిచెన్, ఉపకరణాలు, ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్, ఆటోమేషన్ ద్వారా వంటకాల తయారీ చేపడుతున్నారు. రిఫ్రిజిరేటర్లు, ఒవెన్లు, కుక్కర్లు, ఆహార రవాణా వాహన ట్రాకింగ్‌ను స్మార్ట్‌ఫోన్ ద్వారా నియంత్రిస్తున్నారు. ఈ సెంట్రల్ స్మార్ట్ కిచెన్ ద్వారా ప్రస్తుతం 12 పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, భవిష్యత్‌లో మరిన్ని పాఠశాలలకు విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు.



మధ్యాహ్న భోజన క్యారియర్లతో వాహనం

స్మార్ట్ కిచెన్ ఆదర్శనీయం

ఎక్స్ వేదికగా ఉపముఖ్యమంత్రి



ఈనాడు, అమరావతి: 'గత ఏడాది మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి వెళ్లినప్పుడు జిల్లా కలెక్టర్ స్మార్ట్ కిచెన్ ఆలోచన చెప్పగా ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం వ్యక్తిగత నిధుల నుంచి అందించాను. ఇప్పుడు స్మార్ట్ కిచెన్ సిద్ధమైంది. 12 పాఠశాలలకు ఆహారం సిద్ధమవుతోంది. ఈ కిచెన్ ఆదర్శంగా నిలుస్తుంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ విద్యారంగంలో తీసుకువస్తున్న మార్పులు కచ్చితంగా చక్కటి ఫలితాలు ఇస్తాయి. మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగవుతున్న ప్రమాణాలను తెలియజేస్తున్నాయి. కడపలో స్మార్ట్ కిచెన్ నిర్మాణాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు అభినందనలు' అని ఆయన పేర్కొన్నారు.

211 మంది బాలకార్మికులకు విముక్తి

- రాష్ట్ర కార్మికశాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించిన తనిఖీల్లో 211 మంది బాల కార్మికులకు పని నుంచి విముక్తి కల్పించినట్లు కార్మికశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వీరిలో 14 ఏళ్లలోపు వారు 21 మంది ఉన్నారని పేర్కొంది. సంబంధిత యజమానులపై కనీస వేతనాల చట్టం కింద 147 కేసులు నమోదు చేశామని, కనీస వేతనాల చట్టం అథారిటీ కోర్టు ద్వారా ఆయా బాల కార్మికులకు రూ.1,98,148 ఇప్పించామని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించి పిల్లలను యజమానులు పనిలో పెట్టుకుంటే ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు కోర్టులు జరిమానా విధిస్తాయని తెలిపింది.

27 ఏళ్ల తర్వాత చిక్కిన బాంబు పేలుళ్ల ప్రధాన నిందితుడు

కర్ణాటకలో అరెస్టు చేసిన తమిళనాడు పోలీసులు



టైలర్ రాజా

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తమిళనాడులోని కోయంబత్తూరులో 1998లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల ఘటన ప్రధాన నిందితుల్లో ఒకడైన టైలర్ రాజా 27 ఏళ్ల తర్వాత చిక్కాడు. గురువారం అతడిని తమిళనాడు పోలీసులు కర్ణాటకలో అరెస్టు చేశారు. 1998లో కోయంబత్తూరుకు ఎన్నికల ప్రచారానికి వచ్చిన భాజపా అగ్రనేత ఎల్‌కే ఆడ్వాణీ ఆర్‌ఎస్‌పురం టి.పి. రోడ్డు జంక్షన్‌లో ప్రసంగించాల్సి ఉంది. ఆ సమయంలో ఆ వేదికతో పాటు కోయంబత్తూరులో వరుసగా 14 చోట్ల బాంబులు పేలాయి. 58 మంది మృతి చెందారు. మరో 250 మంది కిపైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో నిషేధిత అల్ ఉమ్మా ఉద్యమ స్థాపకుడు బాషా సహా 166 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన టైలర్ రాజాను తాజాగా కర్ణాటకలోని విజయపుర జిల్లాలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతడిని కోయంబత్తూరు అవినాశి రోడ్డులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణానికి తీసుకొచ్చి విచారించారు. ఆ తర్వాత ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి, పోలీసు కస్టడీకి తీసుకున్నారు.

కారులో రహస్య అర.. అందులో 110 వెండి బిస్కట్లు!

స్వాధీనం చేసుకున్న ఒడిశా ఆబ్కారీ అధికారులు




ఆబ్కారీ అధికారులు స్వాధీనం చేసుకున్న వెండి బిస్కట్లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా ఆబ్కారీ అధికారులు సంబల్‌పూర్ జిల్లా రెంగాలిలో 110 వెండి బిస్కట్లను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ కారును తనిఖీ చేయగా సీట్ల కింద ఏర్పాటు చేసిన రహస్య అరలో వెండి బిస్కట్లను గుర్తించారు. కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వెండిని ముంబయి నుంచి రాంచీకి తరలిస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్ అసిత్ మల్లిక్ తెలిపారు. ఒక్కో బిస్కట్ కిలో ఉందని.. విలువ రూ.కోటికి పైగా ఉంటుందన్నారు. వెండిని జీఎస్టీ అధికారులకు అప్పగించనున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయం మన జీవన విధానం

విజ్ఞానంతో దేశ సేవ చేయండి ● ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్

ఈనాడు, అమరావతి, గన్నవరం, గ్రామీణ న్యూస్‌టుడే



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపిక అందిస్తున్న వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి గోపాల్, చిత్రంలో శ్రీనివాసులు (రిజిస్ట్రార్), గోపాల్‌లాల్ (ఎన్ఏఏఆర్ఎం, హైదరాబాద్ డైరెక్టర్), హరిజవహర్‌లాల్

'వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలు అంకితభావంతో పని చేస్తున్న రైతులతో పాటు వారి వెనకున్న మీలాంటి విద్యార్థుల సాంకేతిక కృషికి నిదర్శనం. వ్యవసాయం కేవలం జీవనోపాధి సాధనం కాదు.జీవన విధానం' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం (వెంకట్రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా) ఆరో స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. చదువులు, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. అనంతరం ఆయన ప్రసంగించారు.

అనతి కాలంలో అభివృద్ధి..

'విశ్వవిద్యాలయం ప్రారంభించిన అనతికాలంలోనే ఉద్యాన విద్య, పరిశోధనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ చదవిన పూర్వ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ముఖ్య బాధ్యతల్లో ఉన్నారు. గత మూడేళ్లుగా ఎంతో మంది జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించారు. నేషనల్ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ అక్రిడేషన్ బోర్డు, ఐసీఏఆర్ దిల్లీ నుంచి ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చింది. 38 అధిక దిగుబడి ఇచ్చే ఉద్యాన పంటలను అభివృద్ధి చేసి విడుదల చేశారు. వీటిలో 31 రకాలను సెంట్రల్ వెరైటీ కమిటీ అధికారికంగా ప్రకటించిందని తెలిపారు.

యూనివర్సిటీలో కొత్త కోర్సులు..

'ఉద్యాన రంగం అభివృద్ధికి సాంకేతికత, మౌలిక సదుపాయాలు, యాంత్రీకరణ, మార్కెట్ సౌకర్యాల అవసరం ఉంది. ఉద్యాన రంగంలో కృత్రిమ మేధను ఉపయోగించే ప్రయోగాలపై విద్యార్థులు దృష్టి సారించాలి. 2025-26 విద్యా సంవత్సరంలో అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ప్రాసెసింగ్, అగ్రికల్చరల్ కెమికల్స్‌లో పీజీ డిప్లొమా వంటి కొత్త కోర్సులు అందుబాటులో ఉంటాయి' అని గవర్నర్ తెలిపారు.

★ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీఏఆర్-నామ్ డైరెక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ. 'సాంకేతికత ద్వారా పంటల్లో చీడ పీడల నివారణపై దృష్టి పెట్టాలి. సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా పరిశోధనలు, డిజిటలైజేషన్ రావాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పంటలు నష్టపోతున్నారు. దీని నివారణకు విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు చేయాలి' అని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ కె.గోపాల్, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి, వెటర్నరీ యూనివర్సిటీ వీసీ జేవీ రమణ, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

★ విశ్వవిద్యాలయ పరిధిలోని 7కళాశాలల్లో అత్యధిక మార్కులు, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపించిన 12 మంది విద్యార్థులకు కులపతి హోదాలో గవర్నర్ బంగారు పతకాలు అందించారు. వీసీ కె.గోపాల్ ఇతర ప్రముఖులతో కలిసి యూజీలో 361, పీజీలో 62, పీహెచ్‌డీలో 24 మంది విద్యార్థులకు పట్టాలు అందించారు.

బయో ఏజెంట్స్‌పై దృష్టి పెడతా - జి.లహరి, ఉద్యాన వర్సిటీ విద్యార్థిని



మాది తాడేపల్లిగూడెం. నాన్న వస్త్ర దుకాణంలో పని చేస్తారు. 2020-24 యూజీలో బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం సాగులో పురుగు మందుల వినియోగం బాగా పెరిగింది. రైతులకు పెట్టుబడి భారం తప్పడం లేదు. సాగులో వచ్చే పురుగులను చంపే పురుగులను అభివృద్ధి చేసే బయో ఏజెంట్స్ విధానాన్ని రైతులకు చేరువ చేసేందుకు కృషి చేస్తా.

పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుపై దృష్టి పెట్టండి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం



మాట్లాడుతున్న విద్యాసాగర్

70 ఏళ్లలో ఉద్యోగులు పొందిన హక్కులను ఎన్నడూ లేని విధంగా గత ఆరేళ్లలో పోగొట్టుకున్నామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. పీఆర్‌సీ కమిషనర్ స్థానానికి మన్మోహన్‌సింగ్ రాజీనామా చేసి రెండేళ్లయినా కొత్త కమిటీని ఏర్పాటు చేయట్లేదని.. కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. మచిలీపట్నంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఏ రాష్ట్రంలో లేని విధంగా పీఆర్‌సీ మాకు వద్దని, బాటోయ్ అది లేకుండా జీతాలు ఇవ్వండి అనే పరిస్థితికి గత ప్రభుత్వం తీసుకువచ్చింది. 20శాతం ఉన్న హెచ్‌ఆర్ఏను 16శాతం.. పెన్షనర్లకు ఇచ్చే అడిషనల్ క్వాంటమ్‌ను 15శాతం నుంచి 12కు.. 10 నుంచి 7 శాతానికి తగ్గించారు. జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవులు ఇతర వాటికి సంబంధించి 4 ఏళ్లుగా రూ.27,500కోట్ల బకాయిలు పెట్టింది. ఉగ్యోగుల నుంచి ఆరోగ్య కార్డులకు డబ్బులు తీసుకుంటున్నా ఎక్కడా అవి పనిచేయట్లే'దన్నారు.

ఉద్యమాలు చేస్తే 3600 కేసులు పెట్టారు

'కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలు తీరతాయని భావించినట్టుగానే ఒకటో తేదీనే జీతాలు పడుతున్నాయి. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన రూ.7500కోట్లు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే చెల్లించినందుకు కృతజ్ఞతలు. వైకాపా హయాంలో మా హక్కుల కోసం ఉద్యమాలు చేస్తే ఉద్యోగులపై కక్ష కట్టి 3600 కేసులు పెట్టారు. వాటిని రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశాం. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో సమీక్షించారు. ఉద్యోగులకు రావాల్సిన మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో కేంద్ర ప్రభుత్వం నాలుగో డీఏ ఇవ్వనుంది. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.వేల కోట్ల బకాయలను దశల వారీగా చెల్లించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని' ఆయన కోరారు.

అబ్కాస్ కొనసాగించాలి

'2014కు ముందు ఉన్న 11వేల కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని గత ప్రభుత్వం చట్టం చేసి కేవలం 3వేల మందినే రెగ్యులర్ చేశారు. మిగిలిన వారినీ రెగ్యులర్ చేయాలి. 93 వేల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అబ్కాస్ ద్వారా జీతాలు పొందుతున్నారు. దాన్ని అలాగే కొనసాగించాలి. రూ.20వేల లోపు జీతం తీసుకుంటున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి' అని విద్యాసాగర్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ, తూర్పు కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాస్‌రావు, ఉల్లికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ముగిసిన శాకంబరి మహోత్సవాలు



యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు, పక్కన ఈవో శీనానాయక్ దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మూడు రోజుపాటు నిర్వహించిన శాకంబరి మహోత్సవాలు గురువారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. కనకాభరణాలతో విరాజిల్లే జగన్మాత దుర్గమ్మ మూడు రోజులు వనమాతను తలపించే విధంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో భక్తులకు దర్శనమిచ్చింది. మూడు రోజుల్లో లక్షమంది భక్తులు శాకంబరి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు ఉచిత పులిహోర ప్రసాదానికి బదులు కదంబ ప్రసాదం(కూరగాయల ముక్కలతో తయారు చేసిన పదార్థం) పంపిణీ చేశారు. 34 టన్నుల కూరగాయలతో అమ్మవారి ఆలయంతోపాటు ఉపాలయాలను అలంకరించారు. వీటితోపాటు డ్రైఫ్రూట్స్, పండ్లు కూడా అలంకరణకు వినియోగించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో శీనానాయక్ దంపతులు, స్థానాచార్య శివప్రసాద శర్మ, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ హేమ దుర్గాంబ పాల్గొన్నారు.

ఈవో దంపతుల విరాళం.. దుర్గగుడి ఈవో శీనానాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు విరాళాన్ని గురువారం అందజేశారు. ఈవో దంపతులు దేవస్థానం సూపరింటెండెంట్ హేమదుర్గాంబకు చెక్కును అందజేశారు. ఈసందర్భంగా దేవస్థానం వేదపండితులు వారికి ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఉద్యోగులు పలువురు ఈవోకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

తిరువూరు సబ్-రిజిస్ట్రార్ సస్పెన్షన్

ఈనాడు-అమరావతి: వారసత్వ ఆస్తి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయడంలో అవకతవకలకు పాల్పడిన తిరువూరు సబ్-రిజిస్ట్రార్ బి.జగ్నను రిజిస్ట్రేషన్ శాఖ సస్పెండ్ చేసింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామానికి చెందిన 4.65 ఎకరాల భూమికి 'ఎనివేర్ రిజిస్ట్రేషన్' విధానంలో తిరువూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెలలో రిజిస్ట్రేషన్ జరిగింది. ఒకే ఇంటి (జంగా) పేరు ఉండడాన్ని అనుకూలంగా తీసుకుని సంబంధంలేని వ్యక్తులు సమర్పించిన 'ఫ్యామిలీ సర్టిఫికెట్' ఆధారంగా తిరువూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. సదరు ఆస్తి యజమానికి చెందిన వారి వివరాలు నిశితంగా పరిశీలించకుండా..అడంగల్‌లో ఉన్న పేర్లను పరిగణనలోనికి తీసుకోకుండా సంబంధం లేని వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇందులో కొంత భూమికి మళ్లీ అమరావతి పరిధిలో రిజిస్ట్రేషన్ జరిగింది. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో అధికారులు చేసిన విచారణలో తిరువూరు సబ్-రిజిస్ట్రార్ అడ్డగోలు వ్యవహారం బయటపడింది. జగ్నను సస్పెండ్ చేస్తూ డీఐజీ రవీంద్రనాథ్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు.

కొమ్మా కోటేశ్వరరావుపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 3 ధర్నా కేసుల్లో.. వల్లభనేని వంశీతో సహా పలువురు నిందితులు హాజరు కాకపోవడంతో ఆ కేసులను ఈ నెల 24కు వాయిదా వేస్తూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో ధర్నాలు చేయడంతో 2019 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మరి కొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గురువారం విచారణ జరగ్గా.. నిందితులు హాజరు కాలేదు. క్రైం నంబరు 339, క్రైం నంబరు 342 కేసుల్లో కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కొమ్మా కోట్లు నిందితుడిగా ఉన్నారు. సత్యవర్ధన్ కేసులోనూ అతడిపై కేసు నమోదైంది. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. తాజాగా రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న కొమ్మా కోటేశ్వరరావు న్యాయస్థానం విచారణకు హాజరు కాకపోవడంతో అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి వి.అనిత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీల ఆదాయ వనరులు పెంచుదాం



కాఫీ షాప్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల ఆదాయ వనరుల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. విజిబులిటీ ఎసెట్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో హెచ్‌సీఎల్ ప్రాంగణం సమీపంలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తున్న కుంభకోణం కాఫీ షాపునకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, సహాయ కార్యదర్శి అలోక్ ప్రేమ్‌నగర్, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ కొబ్బరికాయలు కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ తేజ మాట్లాడుతూ గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో స్విమ్మింగ్‌పూల్స్, క్రికెట్ నెట్స్, కాఫీ, టీ దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటి ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. తద్వారా మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విజిబులిటీ ఎసెట్స్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడ కాఫీ దుకాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన షాపు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. డీపీవో జె.అరుణ, డీఎల్పీవో సంపత్ కుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా తులసి యోగీష్



సమావేశంలో లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంఘటన కార్యదర్శి ప్రకాష్‌చంద్ర తదితరులు

గుంటూరు(అరండల్‌పేట), న్యూస్‌టుడే: లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా తులసి యోగీష్ ఎన్నికయ్యారు. అరండల్‌పేటలోని యోగి భవన్‌లో లఘు ఉద్యోగ భారతి సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ముందుగా నూతన కమిటీని ప్రకటించారు. లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు తులసి యోగీష్, ప్రధాన కార్యదర్శి ఆట్లూరి రమేష్, కోశాధికారి [illegible], ఉపాధ్యక్షులు [illegible], సంయుక్త కార్యదర్శి గుత్తా సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు ఆట్లూరి సునీత నారాయణ, [illegible], తోట రామకృష్ణ, దాట్ల తిరుపతిరాజు, కార్యవర్గ సభ్యులు [illegible] ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంఘటన కార్యదర్శి ప్రకాష్‌చంద్ర పాల్గొని మాట్లాడుతూ [illegible] పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి లఘు ఉద్యోగ భారతి జాతీయ స్థాయిలో పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో తులసి గ్రూప్ అధినేత తులసి రామచంద్రప్రభు, [illegible] అధినేత పుష్పాల సుబ్బారావు, ఆక్వా వాటర్ కంపెనీ అధినేత సాయి, సత్యా ఇంజెక్ట్ అధినేత తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను కించపర్చడం సరికాదు

జగన్‌కు మంత్రి పయ్యావుల హితవు



ఉరవకొండ, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ తీవ్ర అసహనంలో ఉన్నారని, ఆయన అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రస్తుత పోలీసులే ఉన్నారన్న విషయాన్ని మరచిపోయి వారిని కించపరిచేలా మాట్లాడడం సరికాదని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో గురువారం ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై నిందలు వేయడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛను జగన్ అశాంతి, అలజడి సృష్టించడానికి, రైతులను రెచ్చగొట్టడానికి వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి రైతుల పేరుతో జగన్ చేసిన పర్యటన డ్రామా అని విమర్శించారు. 25 రోజులుగా 90 శాతం మామిడి ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు.

జగన్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని, కూటమి పాలనలోనే రైతులకు అన్నివిధాలా మేలు చేకూరుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. తెనాలిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఏదో ఒక గొడవ సృష్టించే చిల్లర మనస్తత్వంతో జగన్ పన్నుతున్న కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేవలం ఫొటోలు, వీడియోల కోసం చిత్తూరు జిల్లాలో రైతులు పండించిన మామిడిని ఐదు ట్రక్కుల్లో తరలించి, జగన్ వచ్చే దారిలో తొక్కించారని పేర్కొన్నారు. ఆ ఘటనకు సంబంధించి జగన్ వైకాపా నాయకులేదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అండగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని అమలు చేసి, చెల్లింపులు పూర్తిచేశామని తెలిపారు. ఏడాదిలో రూ.14,531 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని వెల్లడించారు. ఇది దేశంలోనే రికార్డుగా నిలిచిందన్నారు.

జగన్‌ది విధ్వంస యాగం

మంత్రి సత్యకుమార్



ఈనాడు, అమరావతి: రాష్ట్ర వికాసం కోసం సీఎం చంద్రబాబు ప్రగతి యజ్ఞం చేస్తుంటే.. జగన్ విధ్వంస యాగానికి కసరత్తు చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. పరామర్శల పేరుతో జగన్ విధ్వంస రాజకీయాలకు తెర తీస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ పాలనతో పెట్టుబడులకు దేశంలో అత్యంత అనువైన నాలుగు రాష్ట్రాల్లో ఏపీ ఒకటని ప్రఖ్యాత ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు.


కూటమి ట్రూడౌన్ చేసింది!

ఐదేళ్ల తర్వాత.. ఇదే మొదటిసారి

విద్యుత్ వినియోగదారులకు రూ.449.60 కోట్ల సర్దుబాటు

ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదించిన డిస్కంలు

ఈనాడు – అమరావతి



గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు విద్యుత్ బిల్లులు పెంచడంలో పోటీ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీల తగ్గింపులో తొలి అడుగు వేసింది. ఇన్నాళ్లు 'ట్రూఅప్ ఛార్జీలు' అనే పదాన్నే విన్న వినియోగదారులకు ఐదేళ్ల తర్వాత.. తొలిసారి 'ట్రూడౌన్' పదం పరిచయం కాబోతోంది. మొదటిసారి డిస్కంలు రూ.449.60 కోట్లు వినియోగదారులకు 'తిరిగి చెల్లించబోతున్నాయి'. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పీపీసీఏ) ప్రతిపాదనలను డిస్కంలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సమర్పించాయి. వాటిని పరిశీలించి 90 రోజుల్లోగా కమిషన్ ఉత్తర్వులు జారీ చేస్తుంది. ట్రూడౌన్ మొత్తాన్ని వినియోగదారులకు ఎలా సర్దుబాటు చేయాలనే విషయమై కమిషనే సూచనలు చేస్తుంది.

ఎఫ్‌పీపీసీఏ అంటే..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ కొనుగోళ్లకు చేసిన ఖర్చు.. వినియోగదారుల నుంచి ప్రతి నెలా బిల్లుల రూపేణా వసూలు చేసిన మొత్తం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పీపీసీఏ) కింద డిస్కంలు పరిగణిస్తాయి. విద్యుత్ కొనుగోలు వ్యయం వసూలు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉంటే.. ట్రూఅప్ కింద వినియోగదారుల నుంచి వసూలు చేస్తాయి. ఒకవేళ తక్కువగా ఉంటే.. అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి చెల్లిస్తాయి. ఈ ప్రకారం రెండు డిస్కంలు రూ.842.68 కోట్లు ట్రూఅప్ కింద ప్రతిపాదిస్తే.. ఈపీడీసీఎల్ రూ.1,292.28 కోట్లు ట్రూడౌన్ ప్రతిపాదన దాఖలు చేసింది.

డిస్కంలు దాఖలు చేసిన ప్రతిపాదనలు (రూ. కోట్లలో)

డిస్కం పేరు	ఎఫ్‌పీపీసీఏ	ఇప్పటికే వసూళ్లు	ఇంకా వసూలు చేయాల్సింది	క్యారీయింగ్ కాస్ట్	వసూలు చేయాల్సిన ఎఫ్‌పీపీసీఏ
కేంద్ర విద్యుత్ పంపిణీ సంస్థ	950.80	614.86	335.94	13.98	349.91
దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ	1,597.18	1,106.56	480.63	13.15	492.77
తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ	161.04	1,065.76	–1,226.80	–65.47	–1,292.28

- డిస్కంలు ప్రతి నెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున బిల్లులో కలిపి వినియోగదారుల నుంచి ఎఫ్‌పీపీసీఏ పేరిట వసూలు చేశాయి. మూడు డిస్కంలు రూ.2,782.19 కోట్లు వసూలు చేశాయి.
- క్యారీయింగ్ కాస్ట్ అంటే.. ప్రతి నెలా విద్యుత్ కొనుగోలుకు అధికంగా చేసిన ఖర్చుపై వడ్డీగా లెక్కించిన మొత్తం.

రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు

- తొలి విడతలో జాతీయ రహదారుల్లో అమరుస్తాం
- హోంమంత్రి అనిత వెల్లడి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని, తొలి విడతలో జాతీయ రహదారులు, ప్రత్యేక ప్రాంతాల్లో, రెండో విడతలో గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను, హైవే పాట్రోలింగ్‌కు ఫిన్వెస్కో క్యాపిటల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ అందజేసిన పది ఈవీ బైక్‌లను గురువారం ఆమె ప్రారంభించారు. హోంమంత్రి మాట్లాడుతూ "వివిధ కేసుల దర్యాప్తులో కీలకమైన సీసీ కెమెరాలను ముందుగా నా నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పాయకరావుపేట నుంచి ధర్మవరం-అగ్రహారం వరకు జాతీయ రహదారిలో 32 కిలోమీటర్ల మేర వంద సీసీ కెమెరాలు అమర్చాం. త్వరలో మరో 600 కెమెరాలు బిగిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడాన్ని డ్రోన్ ద్వారా నివారిస్తున్నాం. గంజాయి కేసుల్లో 400 మంది యువకులు విశాఖ సెంట్రల్ జైలులో ఉన్నారు. యువత మత్తులో జీవితాలను నాశనం చేసుకోవద్దు" అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిన్వెస్కో క్యాపిటల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఎండీ జక్కంపూడి రవీంద్రబాబు, ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ (క్రైమ్) మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హైవే పాట్రోలింగ్ ఈవీ బైక్‌లను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత. చిత్రంలో ఎస్పీ తదితరులు

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు ప్రసన్నకుమార్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యల కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరగనుంది.

పదో తరగతి ప్రశ్నపత్రాల్లో మార్పులకు కసరత్తు

ఈనాడు, అమరావతి: పదోతరగతి ప్రశ్నపత్రంలో పలు మార్పులు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లోని సృజనాత్మకత పరిశీలించేలా దీన్ని తీసుకొస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సీబీఎస్ఈ బోర్డుతో పోల్చితే రాష్ట్ర బోర్డుల్లో ఉత్తీర్ణత తక్కువగా నమోదు కావడంపై కేంద్ర విద్యాశాఖ ఇటీవల పలు సూచనలు చేసింది. ప్రశ్నపత్రాలను సైతం పరిశీలించిన కేంద్రం వీటిల్లో సారూప్యత ఉండాలని సూచించింది. ఈ మేరకు ప్రశ్నపత్రాల్లో చేయాల్సిన మార్పులపై వివరాలు అందించింది. ● భాషేతర సబ్జెక్టుల్లో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నల్లో విద్యార్థులను ఆరు రకాలుగా పరీక్షించనున్నారు. పరిజ్ఞానం, అవగాహన, విశ్లేషణ, సృజనాత్మకత, అప్లికేషన్, ఎవాల్యుయేషన్‌ను పరిశీలించేలా ప్రశ్నలు ఇస్తారు. ● ప్రశ్నల్లో దీర్ఘ, చిన్న, చాలా చిన్న సమాధానం రాసేలా ఇస్తారు. వీటికి ఎంత వెయిటేజీ ఇవ్వాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ● భాష సబ్జెక్టులకు వచ్చేసరికి భాషా అంశాలపై పరిజ్ఞానం, గ్రహణశక్తి, వ్యక్తీకరణ, ప్రశంసల విభాగాలుగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ● ప్రశ్నలకు వచ్చేసరికి భాషేతర, భాష సబ్జెక్టులకు ఒకే విధంగా ఉంటాయి. ● గతంలో బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉండగా వీటిని తొలగించారు. వీటి స్థానంలో ఒక్క మార్కు ప్రశ్నలు తీసుకొచ్చారు. రాష్ట్రంలోనూ ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేస్తున్నందున ప్రశ్నపత్రాల రూపకల్పనలోనూ ఈ మార్పు చేయనున్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా..

జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల సహకారంతో ఉచితంగా జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్‌లకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. ఇటీవల నిర్వహించిన జేఈఈ, నీట్‌లో అతి కొద్ది మార్కుల తేడాతో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ సీట్లు సాధించలేకపోయిన 80 మందిని ఎంపిక చేసినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. బోధన సిబ్బంది, స్టడీ మెటీరియల్‌ను నారాయణ విద్యాసంస్థలు ఉచితంగా సమకూరుస్తాయని పేర్కొన్నారు.

నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోండి

కరేడు కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం భూసేకరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించడం, హైవేపై రాకపోకలకు అవరోధం కలిగించారనే ఆరోపణలతో నమోదు చేసిన కేసులో భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తదితరులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. రామచంద్రయాదవ్, మరో 38 మందిపై ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేయగా, దానిని కొట్టేయాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వీవీ సతీశ్ వాదనలు వినిపించారు.

వాలంటీర్ల వల్లే ఎన్నికల్లో ఓడిపోయాం

వైకాపా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఈనాడు డిజిటల్, నరసరావుపేట: ఏ పార్టీకైనా కార్యకర్తలు మూలస్తంభాలని, వాలంటీర్లు కాదని.. వాలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టాలని.. ప్రజలు, పాలకులకు మధ్య వారధిలా కార్యకర్తల్ని ఉంచాలని జగన్‌కు సూచించానని వైకాపా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓడిపోయాక జగన్‌ను మొదటిసారి కలిసి మాట్లాడినప్పుడు ఇదే మాట తాను చెప్పానన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట వైకాపా నేతల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వాలంటీర్ల ద్వారా అందించారని, అదే కార్యకర్తల ద్వారా జరిగి ఉంటే ఇలా అయ్యి ఉండేది కాదన్నారు. వాలంటీర్ల వల్ల పార్టీ ఛిన్నాభిన్నమైందని చెప్పారు. కేసులు కార్యకర్తలపై మాత్రమే పెడుతున్నారని, వాలంటీర్లపై కాదని పేర్కొన్నారు. కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే ఎన్నికల్లో ఓడిపోయామని గోపిరెడ్డి పేర్కొన్నారు.

భోజనం తర్వాత కడుపారా నవ్వుకోండి



భోజనం చేసిన తర్వాత వినోద కార్యక్రమాలను వీక్షించండి లేదా స్నేహితులతో సరదాగా సంభాషిస్తూ, జోకులు చెప్పుకొంటూ కడుపారా నవ్వుకోండి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండి, మధుమేహం బారిన పడే ముప్పు తగ్గుతుంది. అంతేకాదు.. బాధల నుంచి ఉపశమనం కలిగించే ఎండార్ఫిన్లు అధిక సంఖ్యలో విడుదలవుతాయి. శ్వాస ద్వారా పీల్చుకొనే ఆక్సిజన్ శాతం పెరుగుతుంది.

– లోరీ షెమెక్, హెల్త్ ఎక్స్‌పర్ట్

అన్యాయంపై రోడ్డెక్కే వారంతా అసాంఘిక శక్తులేనా?

సీఎం చంద్రబాబుపై 'ఎక్స్' వేదికగా జగన్ విమర్శలు



ఈనాడు, అమరావతి: 'రెండు నెలలుగా పంట కొనే వారు లేక రైతులు మామిడికాయలను ఎక్కడికక్కడ పారబోస్తున్నారు. వారంతా మీ కంటికి రౌడీలు, దొంగలు, అసాంఘిక శక్తుల్లా కనిపిస్తున్నారా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును 'ఎక్స్' వేదికగా వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రశ్నించారు. 'మీ సిద్ధాంతం ప్రకారం చూస్తే.. రాష్ట్రంలో తమకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కే ప్రతి రైతు, యువకుడు, నిరుద్యోగి, మహిళ.. వారికి అండగా నిలిచే వారంతా రౌడీలు, అసాంఘిక శక్తులేనా? మామిడి రైతులు కష్టాల్లో లేకపోతే.. కిలోకి రూ.4 చొప్పున ప్రభుత్వం నుంచి ఇస్తామన్న ప్రకటన ఎందుకు చేశారు? బంగారుపాళ్యానికి నా పర్యటన ఖరారు కాగానే మీ వ్యవసాయ శాఖ మంత్రిని దిల్లీకి ఎందుకు పంపారు? ఏటా మే నెలలో పల్ప్ ఫ్యాక్టరీలను తెరుస్తుండగా, ఈసారి నెల ఆలస్యంగా.. అందులోనూ కొన్నింటినే ఎందుకు తెరిచారు? సరకంతా ఒకేసారి వచ్చేలా చేయడం దోపిడీకి ఆస్కారం కలిగించినట్లు కాదా? మీరు ఇస్తానన్న రూ.4 ఎంతమంది రైతులకిచ్చారు? ఎంతమందికి రూ.8 చొప్పున ఫ్యాక్టరీలు చెల్లించాయి' అని ప్రశ్నించారు.

మామిడి రైతులపై జగన్‌ది మొసలి కన్నీరు

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైకాపా అధ్యక్షుడు జగన్ చేసింది బలప్రదర్శన తప్ప.. రైతుల కోసం పోరాటం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రైతులపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో ఆమె ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీ దత్తపుత్రుడు జగన్ ఏది చేసినా రాష్ట్రంలో చెల్లుబాటవుతోంది. తలపై కార్లు పోనిచ్చినా, మామిడికాయలు తొక్కుకుంటూ వెళ్లినా.. రప్పా రప్పా నరుకుతామని బహిరంగంగా హెచ్చరించినా ఆయనపై చర్యలు ఉండవు' అని ధ్వజమెత్తారు. 'ధరల పతనంతో తోతాపురి మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. కిలోకు రూ.16 ధర అందిస్తే తప్ప కోలుకోలేమని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతుల కష్టాలపై ఉన్నతస్థాయి కమిటీ వేయాలి' అని డిమాండ్ చేశారు.

భూ వినియోగ మార్పిడికి పురపాలక చట్ట సవరణ

- రెవెన్యూశాఖ నుంచి అధికారాల బదలాయింపు
- ఇక స్థానిక, పట్టణాభివృద్ధి సంస్థల్లోనే అనుమతులు

ఈనాడు–అమరావతి: వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు ఉద్దేశించిన నాలా చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దాని స్థానంలో ఇక నుంచి పట్టణ స్థానిక, పట్టణాభివృద్ధి సంస్థల్లో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. ఎకరం ప్రాతిపదికన మొత్తం విలువపై 4 శాతం చొప్పున వసూలు చేయాలా? చదరపు మీటరుకు ధర నిర్ణయించి ఫీజు విధించాలా అనే దానిపై కొద్ది రోజుల్లో స్పష్టత రానుంది. ఛార్జీల వసూళ్లపైనా మున్సిపల్ చట్టం-1965లోనూ ప్రభుత్వం సవరణలు చేయనుంది.

జాప్యాన్ని నిరోధించేందుకే

వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునేందుకు రెవెన్యూ శాఖ నుంచి నాలా చట్టం కింద ఇప్పటివరకు అనుమతులు తీసుకుంటున్నారు. ఇందులో జాప్యంతో భవన నిర్మాణాలకు సకాలంలో అనుమతులు రావడం లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా జాప్యాన్ని నిరోధించేందుకు నాలా చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ కారణంగా ఫీజుల కింద వచ్చే ఆదాయం నష్టపోకుండా పట్టణ స్థానిక సంస్థల్లో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించారు.

◆ కొత్త నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు అనుమతులిచ్చే అధికారం పుర, నగరపాలక సంస్థల్లో కమిషనర్లకు, పట్టణాభివృద్ధి సంస్థ(యూడీఏ)ల్లో వైస్ ఛైర్మన్లకు కల్పించనున్నారు.

◆ భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు జారీ చేస్తున్న డెవలప్‌మెంట్, ప్లానింగ్ మోడల్ సర్వీసెస్ (డీపీఎంఎస్) పోర్టల్‌కు రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌ను లింక్ చేయనున్నారు.

◆ పట్టణ స్థానిక, పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో చేపట్టే భూ వినియోగ మార్పిడిపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయనున్నారు.

ఎర్రా ఎర్రని పండుని.. యాపిల్‌ను కాదు మరెవరిని?



ఎర్రగా నిగనిగలాడుతూ కనిపిస్తున్న ఈ పళ్లను చూసి యాపిల్ అనుకుంటే మోసపోయినట్లే. ఇవి అచ్చంగా జామకాయలు. తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీల్లో ఉన్న ఈ పళ్లు సందర్శకులను యాపిల్‌లా భ్రమింపజేస్తున్నాయి. దగ్గరికెళ్లి వివరాలు తెలుసుకున్నాకా జామకాయా అని ఆశ్చర్యపోతున్నారు. ఈ మొక్కలను కడియపులంకకు చెందిన ఓ రైతు థాయ్‌లాండ్ నుంచి దిగుమతి చేశారు. పళ్లకు రుద్ర జామగా నామకరణం చేశామని, ఇవి తీయదనంతో మైమరిపిస్తాయని ఇక్కడి రైతులు తెలిపారు. మొక్క ధర రూ.3 వేలు ఉంటుందని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కడియం



మద్యం కుంభకోణంలో మాస్టర్‌మైండ్ మిథున్‌రెడ్డి

- లావాదేవీలను తన నియంత్రణలోకి తీసుకున్నారు
- ముడుపులు అందిన కంపెనీలకే అనుమతులిచ్చారు
- హైకోర్టులో సీఐడీ తరఫున వాదనలు వినిపించిన లూథ్రా
- ముందస్తు బెయిల్‌పై వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైకాపా ప్రభుత్వ హయాంలో దానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4) కీలక పాత్ర పోషించారని సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో గురువారం వాదనలు వినిపించారు. తద్వారా లావాదేవీలను తన నియంత్రణలోకి తీసుకున్నారన్నారు. ముడుపులు అందిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులిచ్చారని తెలిపారు. మద్యం కుంభకోణం ద్వారా ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం జరిగిందన్నారు. ఆ సొమ్మును మళ్లించడంలో మిథున్‌రెడ్డి పాత్ర కీలకమని చెప్పారు. ఈ కుంభకోణానికి వ్యూహరచన, అమలులో మిథున్‌రెడ్డి 'మాస్టర్ మైండ్' అంటూ సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని, అందుకు ఆధారాలు లభించాయని తెలిపారు. ముడుపుల సొమ్ము అంతిమంగా ఎక్కడికి చేరిందో తేల్చాలంటే ఆయనను అదుపులోకి తీసుకొని విచారించాల్సి ఉందని పేర్కొన్నారు. ముడుపుల రూపేణా డికార్ట్ లాజిస్టిక్స్ (ఏ16) నుంచి ఆయన కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ ఖాతాలోకి రూ.5 కోట్లు చేరాయని కోర్టు దృష్టికి తెచ్చారు. బెదిరింపులకు పాల్పడి మద్యం ఉత్పత్తి సంస్థలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారని.. దర్యాప్తునకు సహకరించడం లేదని వివరించారు. మిథున్‌రెడ్డికి నేర చరిత్ర ఉందని, ఆయనపై 8 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు.

కస్టోడియల్ విచారణపై..

మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో పిటిషనర్‌కు సంబంధం లేదని వాదించారు. నాలుగు రోజుల్లో ఈ కేసులో అభియోగపత్రం దాఖలు చేస్తామని సిట్ తరఫు న్యాయవాది విజయవాడ ఏసీబీ కోర్టుకు తెలిపారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. షరతులతో ముందస్తు బెయిలివ్వాలని కోరారు. ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ప్రకటించారు.

జాతీయ స్థాయిలో చేబ్రోలు సర్పంచి సత్తా

'సర్పంచ్ సంవాద్' పోటీల్లో ప్రథమస్థానం



రాంధే లక్ష్మీ సునీత

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు సర్పంచి రాంధే లక్ష్మీ సునీత జాతీయ స్థాయిలో ఘనత సాధించారు. 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో తొలి స్థానం కైవసం చేసుకున్నారు. భారత నాణ్యత మండలి దేశంలోని సర్పంచులను ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు 'సర్పంచ్ సంవాద్' పేరిట మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టింది. మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచారం మార్పిడి దీని ముఖ్యోద్దేశం. ప్రతి నెలా ఆన్‌లైన్ విధానంలో సర్పంచులకు పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తోంది. జూన్‌కు సంబంధించి గ్రామాభివృద్ధి, భవిష్యత్తు ఆలోచనలపై పోటీలు నిర్వహించగా.. లక్ష్మీ సునీత 80 సెకన్ల వీడియో పంపారు. ఆమె ఆలోచనలకు మొదటి స్థానం లభించింది. ఇందుకు నగదు రూ.35 వేల బహుమతి ఇవ్వనున్నారు. ◆ అనంతపురం జిల్లా పి.నారాయణపురం సర్పంచి కె.హనుమంత రెడ్డి, గుజరాత్‌లోని ఉమ్రాల సర్పంచి హెచ్.ధర్మేంద్ర భాయ్‌లు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.25 వేలు, రూ.15 వేలు నగదు అందనుంది.





నమీబియా రాజధాని విండ్‌హోక్‌లో స్వాగత కళాకారుల ప్రదర్శన తిలకిస్తున్న ప్రధాని మోదీ

మోదీ అరుదైన ఘనత

- 17 దేశాల పార్లమెంట్లలో ప్రసంగం
- కాంగ్రెస్ ప్రధానులందరివీ 17

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ సరికొత్త మైలురాయిని చేరుకున్నారు. నమీబియా పార్లమెంటులో బుధవారం చేసిన ప్రసంగంతో కలిపితే 11 ఏళ్లలో 17 దేశాల పార్లమెంట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడినట్లయింది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాల తరఫున మొత్తం ప్రధానులందరూ కలిసి 17 పార్లమెంట్లలో ప్రసంగిస్తే ఒక్క మోదీ ఆ సంఖ్యను సమం చేశారు. దీనిపై భాజపా హర్షం వ్యక్తంచేసింది. వేరే దేశ పార్లమెంట్లలో మోదీ ప్రసంగించడంతోపాటు ఎక్కువ దేశాల్లో పర్యటించిన ఘనత కూడా మోదీకే దక్కుతుందని భాజపా పేర్కొంది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విదేశీ పార్లమెంట్లలో ఏడుసార్లు ప్రసంగించారు. ఇందిరాగాంధీ నాలుగుసార్లు, నెహ్రూ మూడుసార్లు, రాజీవ్ గాంధీ రెండుసార్లు, పీవీ నరసింహారావు ఒకసారి ప్రసంగించారు. మోదీ అమెరికా పార్లమెంటులో రెండుసార్లు మాట్లాడారు. విదేశీ పార్లమెంట్లలో ప్రసంగించడం ద్వారా మోదీ నాయకత్వానికి ప్రపంచస్థాయిలో గౌరవం దక్కుతోందని భాజపా ట్వీట్ చేసింది. ఆయన నాయకత్వంలో దేశ ప్రయోజనాలు పదిలమనే నమ్మకం ప్రజలకు ఉందని పార్టీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది విలేకరుల సమావేశంలో చెప్పారు. సైనిక, దౌత్య, వాణిజ్య ప్రయోజనాలను ఆయన కాపాడతారన్నారు.



పిల్లలకు విలువలు నేర్పాలంటే..

పెద్దలు క్రమశిక్షణ పాటించకుండా గాలివాటు జీవితం గడుపుతుంటే, వారిని చూసి పిల్లలూ అలాగే తయారవుతారు. అప్పుడు వారిని దండిస్తే ఉపయోగం ఉండదు. తాము ఆదర్శవంతమైన జీవితాన్ని కొనసాగించడం ద్వారా మాత్రమే పిల్లలకు క్రమశిక్షణ, విలువలు నేర్పగలమని తల్లిదండ్రులు గుర్తించాలి.

– బ్రాండన్ మూర్, రిలేషన్‌షిప్ కోచ్

100% కచ్చితత్వంతో.. సర్వస్వతంత్రంగా రోబో శస్త్రచికిత్సలు

దిల్లీ: వైద్యరంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగానికి సంబంధించి కీలక మైలురాయి వంటి ముందడుగు అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు సాధించారు. వారు రూపొందించిన ఓ రోబో తాజాగా.. మానవ కణజాలంతో తయారుచేసిన పిత్తాశయాలకు (గాల్ బ్లాడర్) సర్వస్వతంత్రంగా శస్త్రచికిత్సలు నిర్వహించింది. 100% కచ్చితత్వంతో.. నిపుణులైన వైద్యుల తరహాలో అది పనిచేసింది. సంబంధిత వివరాలు 'సైన్స్ రోబోటిక్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 'సర్జికల్ రోబో ట్రాన్స్‌ఫార్మర్-హైరార్కీ' (ఎస్‌ఆర్‌టీ-హెచ్) అనే రోబోను పరిశోధకులు తయారుచేశారు. చనిపోయిన పందుల పిత్తాశయాల శస్త్రచికిత్సల వీడియోల ద్వారా దానికి శిక్షణనిచ్చారు. చాట్‌జీపీటీ వంటి వ్యవస్థల పనితీరు తరహా ఏఐ అల్గోరిథమ్స్‌ను అందులో పొందుపరిచారు. వాటి సాయంతో ఎస్‌ఆర్‌టీ-హెచ్ పిత్తాశయాలకు స్వతంత్రంగా శస్త్రచికిత్సలు చేసింది. పరిస్థితులకు తగ్గట్లు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ.. ఆపరేషన్ సమయంలో వైద్య బృందం ఇచ్చిన మౌఖిక ఆదేశాలను పక్కాగా పాటించింది. ఫలితం విషయంలో వైద్యులకు తీసిపోలేదని పరిశోధకులు తెలిపారు. ఆసుపత్రుల్లో సర్వ స్వతంత్ర రోబోల మోహరింపు దిశగా ఇది కీలక ముందడుగని వారు అభిప్రాయపడ్డారు.

జ్ఞాన నేత్రం

అల్జీమర్స్‌కు ముందు నాలుగు విధాల హెచ్చరికలు!

దిల్లీ: అల్జీమర్స్ బారిన పడటానికి ముందు వ్యక్తుల్లో నాలుగు రకాల లక్షణ సముదాయాలు కనిపిస్తుంటాయని అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు గుర్తించారు. కొందరిలో అల్జీమర్స్.. అంతకంటే ముందు అధిక రక్తపోటు, టైప్ 2 మధుమేహం, చిన్న పేగు సమస్యలు తలెత్తుతాయి. ఈ మొదటి తరహా లక్షణ సముదాయం మానసిక సమస్యలకు, తరవాత అల్జీమర్స్‌కు దారితీయవచ్చు. రెండో తరహాలో- మెదడు, రక్తనాళాల సమస్యలు, మూత్రాశయ సమస్యలు వేగంగా అల్జీమర్స్‌కు, మరణానికి దారితీస్తాయి. మహిళల్లో రుతుక్రమం ఆగిపోయాక, పురుషుల్లో అంగస్తంభన లోపం ఏర్పడటం కొన్ని సందర్భాల్లో అల్జీమర్స్‌కు దారితీస్తుంది. నాలుగో తరహాలో మెదడుకు రక్తప్రసరణ తగ్గిపోయి నాడీసంబంధ సమస్యలు వస్తాయి. వీటికన్నా ముందు వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు కనిపిస్తాయి. ఇవన్నీ క్రమంగా అల్జీమర్స్‌కు దారితీసే ప్రమాదం ఉంది. ఈ సముదాయాలను గుర్తిస్తే అల్జీమర్స్‌కు సమర్థ చికిత్సను రూపొందించవచ్చని పరిశోధకులు వివరించారు.

బాలికలను వివస్త్రలను చేసి రుతుక్రమ తనిఖీ

- థాణె జిల్లాలో పాఠశాల ప్రిన్సిపల్ అరెస్ట్
- విచారణకు ఆదేశించిన మహారాష్ట్ర సీఎం ఫడణవీస్

థాణె: మహారాష్ట్రలోని థాణె జిల్లా శహాపుర్‌లో ఓ ప్రైవేటు స్కూలు యాజమాన్యం విద్యార్థినులతో దారుణంగా ప్రవర్తించింది. పాఠశాల మరుగుదొడ్లలో రక్తపు మరకలు కనిపించడంతో, బాలికలను వరుసలో నిలబెట్టి ప్రశ్నించడమే కాకుండా వివస్త్రలను చేసి మరీ రుతుక్రమ తనిఖీ చేసింది. మంగళవారం (జులై 8న) జరిగిన ఈ అమానవీయ ఘటన తల్లిదండ్రుల దృష్టికి వెళ్లి బుధవారం పాఠశాల ముందు వారు ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పాఠశాల మహిళా ప్రిన్సిపల్, నలుగురు ఉపాధ్యాయులు, బంట్రోతు, ఇద్దరు ట్రస్టీలపై పలు ఇతర సెక్షన్లతోపాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదయినట్లు థాణె ఏఎస్పీ రాహుల్ తెలిపారు. ప్రిన్సిపల్ సహా ఐదుగురిని అరెస్టు చేశారు. ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించారు. గురువారం మహారాష్ట్ర అసెంబ్లీలోనూ దీనిపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి ఫడణవీస్ విచారణకు ఆదేశించారని, కఠినచర్య తప్పదని మంత్రి గిరీశ్ మహాజన్ సభకు తెలిపారు.

వేలిముద్రలు సేకరించారు..

మరుగుదొడ్లు శుభ్రం చేసిన సిబ్బంది రక్తపు మరకల ఫొటోలు తీసి స్కూలు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రిన్సిపల్.. పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలందరినీ కన్వెన్షన్ హాలుకు పిలిపించారు. మరుగుదొడ్డిలోని రక్తపు మరకల ఫొటోలను ప్రొజెక్టరు ద్వారా తెరపై చూపించారు. పీరియడ్స్‌లో ఉన్నవారు, లేనివారు విడిగా నిలబడాలని ఆదేశించారు. విద్యార్థినులు అలాగే నిలబడ్డారు. రుతుక్రమంలో ఉన్న విద్యార్థినుల నుంచి టీచర్లు వేలిముద్రలు సేకరించారు. పీరియడ్స్‌లో లేమని చెప్పిన విద్యార్థినులను మహిళా బంట్రోతు ద్వారా చెక్ చేయించారు. ఈమె బాలికలను ఒకరొకరుగా మరుగుదొడ్డిలోకి పిలిచి వివస్త్రలను చేసి తనిఖీ చేశారు. దీనిపై శాఖాపరంగానూ దర్యాప్తు చేస్తున్నట్లు థాణె డీఈవో తెలిపారు.

క్షవరం చేసుకురమ్మంటే.. స్కూల్ డైరెక్టర్‌ను కత్తితో పొడిచి చంపారు

ఇద్దరు మైనర్ విద్యార్థుల దుశ్చర్య

హిసార్: హరియాణాలోని హిసార్ జిల్లాలో గురువారం ఇద్దరు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోనే డైరెక్టరును కత్తితో పొడిచి చంపారు. పాఠశాలకు పరిశుభ్రంగా రావాలని డైరెక్టరు చెప్పడంతో ఆగ్రహించిన విద్యార్థులు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. వీరి కథనం ప్రకారం.. హిసార్‌లోని కర్తార్ ప్రయివేటు స్కూలు డైరెక్టరుగా జగ్బీర్‌సింగ్ (55) పనిచేస్తున్నారు. క్రమశిక్షణ లేకుండా పాఠశాలకు వస్తున్న కొంతమంది పిల్లలను కౌన్సెలింగులో భాగంగా ఆయన మందలించారు. జుట్టు కత్తిరించుకోవాలని, టక్ చేసుకోవాలని చెప్పారు. దీంతో 11, 12 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థులు డైరెక్టరుపై కోపం పెంచుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఆయనపై దాడి చేసి కత్తులతో పలుమార్లు పొడిచి అక్కడి నుంచి పారిపోయారు. గమనించిన పాఠశాల సిబ్బంది జగ్బీర్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆయన మరణించారు. పరారీలో ఉన్న నిందితులు ఇద్దరూ మైనర్లని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ అమిత్ యశ్‌వర్ధన్ తెలిపారు.



మృతుడు జగ్బీర్‌సింగ్

అత్యయిక స్థితి ఓ చీకటి అధ్యాయం

- కాంగ్రెస్ ఎంపీ థరూర్ ధ్వజం



తిరువనంతపురం: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1975లో విధించిన అత్యయిక స్థితిని ఓ చీకటి అధ్యాయంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ అభివర్ణించారు. అది భారత ఆత్మను గాయపరిచిందని వ్యాఖ్యానించారు. ఆ కాలంలో మితిమీరిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చర్యలవల్లే 1977 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారని విమర్శించారు. ఎమర్జెన్సీ రోజులను కేవలం చీకటి అధ్యాయంగానే గుర్తుంచుకోకూడదని, దాన్నుంచి పాఠాలను నేర్చుకోవాలని సూచించారు. దేశంలో అత్యయిక పరిస్థితి విధించి ఇటీవల 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ మలయాళ పత్రికకు రాసిన వ్యాసంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎమర్జెన్సీలో క్రమశిక్షణ పేరిట చేపట్టిన చర్యలు సమర్థించలేని క్రూరత్వానికి దారితీశాయి. గ్రామాల్లో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను సంజయ్ గాంధీ చేపట్టారు. దిల్లీ వంటి నగరాల్లో మురికి వాడలను తొలగించి వేల మందిని నిరాశ్రయులను చేశారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదు' అని పేర్కొన్నారు. 'ఇప్పుడు మనం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. మరింత అభివృద్ధి చెందాం. చాలా రకాలుగా ప్రజాస్వామ్యం బలోపేతమైంది. అయితే ఎమర్జెన్సీ పాఠాలను మరిచిపోకూడదు' అని తెలిపారు. కేంద్రీకృత అధికారం, రాజ్యాంగ రక్షణలు పక్కదారి పట్టించడం.. ఇలా వివిధ రూపాల్లో అది మళ్లీ ప్రత్యక్షమయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.

■ శశి థరూర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాణికం టాగూర్ తప్పుబట్టారు. ఆయన పేరును ప్రస్తావించకుండా.. 'ఓ సహచరుడు భాజపా వల్లెవేసే మాటల్లోని ప్రతి పదాన్ని చెప్పడం చూస్తే మీరు ఆశ్చర్యపోకమానరు. పక్షి చిలుకగా మారుతోందా అనిపిస్తోంది. పక్షుల్లో మిమిక్రీ బాగుంటుంది. కానీ రాజకీయాల్లో కాదు' అని ఎద్దేవా చేశారు.

14న భూమికి తిరిగిరానున్న శుభాంశు శుక్లా



దిల్లీ: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 14న భూమికి తిరిగి రానున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ-నాసా గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. యాక్సియం-4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లారు. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు.

■ దాదాపు రెండు వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా.. అక్కణ్నుంచి ఇప్పటివరకూ 230 సూర్యోదయాలు చూశారు. ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. యాక్సియం స్పేస్ ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. యాక్సియం-4 వ్యోమగాములు ఇప్పటిదాకా దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని అందులో పేర్కొంది.

షేక్ హసీనాపై మానవ హనన నేరాభియోగం

- అప్పటి హోం మంత్రి, ఐజీపైనా..
- దోషులుగా తేలితే మరణశిక్ష!



ఢాకా: గత ఏడాది జులై, ఆగస్టు నెలల్లో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లపై కాల్పులు జరిపించి పలువురిని బలిగొన్న కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై మానవ హనన నేరాభియోగాన్ని బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ-బీడీ) మోపింది. ఆమెతోపాటు అప్పటి హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్, ఐజీ అబ్దుల్లా అల్ మామున్‌లపైనా గురువారం అభియోగాలను ఖరారు చేసింది. విద్యార్థుల తిరుగుబాటును అణచివేసేందుకు సామూహిక హత్యలు, హింసలకు హసీనా ప్రభుత్వం పాల్పడినట్లు అందులో పేర్కొంది. అప్పట్లో జరిగిన ఈ ఘటనల్లో 1400 మృతి చెందారు. మాజీ హోం మంత్రి, ఐజీలపై విచారణ గురువారం ప్రారంభంకాగా.. హసీనాపై ఆగస్టు 3వ తేదీ నుంచి జరగనుంది. ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించి అమాయక ప్రజలను చంపడానికి కుట్ర పన్నిన ఈ ముగ్గురిపై ఐదు అభియోగాలు ఉన్నట్లు జస్టిస్ మహమ్మద్ గులాం మోర్తుజా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసుల్లో దోషులుగా తేలితే వారికి మరణ శిక్ష పడనుంది.

హసీనాను అప్పగించాలని మరోసారి భారత్‌కు బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అప్పగింత అభ్యర్థనను మనస్సాక్షితో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరింది.

దక్షిణాసియాలో రక్తహీనత బాధిత మహిళలు 25.9 కోట్లు

కొలంబో: దక్షిణాసియా దేశాల్లో 25.9 కోట్ల మంది బాలికలు, మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఈ సమస్య పరిష్కారం కోసం బహుముఖ కృషి జరగకుంటే 2030 నాటికి మరో 1.8 కోట్ల మంది ఈ రుగ్మతకు గురవుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. సరైన నివారణ చర్యలు తీసుకోకుంటే మరో ఐదేళ్లలో రక్తహీనత బాధిత మహిళల సంఖ్య మొత్తంగా సుమారు 28 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంకలను దక్షిణాసియా దేశాలుగా పరిగణిస్తారు.

జన్మతః పౌరసత్వ హక్కుపై ట్రంప్ ఆదేశాల నిలిపివేత

కాంకర్డ్: అమెరికాలో అక్రమంగా ఉంటున్న విదేశీయులకు పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వులను న్యూహాంప్‌షైర్ ఫెడరల్ జడ్జి జోసెఫ్ లాప్లాంటీ నిలిపేశారు. అమెరికా అంతటికీ ఈ తీర్పు వర్తిస్తుందని గురువారం ఆదేశాలిచ్చారు. దీనిపై అప్పీలుకు వీలుగా ఏడు రోజులపాటు స్టే ఇచ్చారు. ఫెడరల్ జడ్జి నిర్ణయంతో సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ త్వరితగతిన జరగనుంది. ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు దేశమంతటా వర్తిస్తాయా.. లేదా అనే విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిర్ణయించనున్నారు.

ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు కొత్త ఆలోచనలు

- విదేశాంగ మంత్రుల భేటీలో పంచుకున్న అమెరికా, రష్యా



కౌలాలంపూర్‌లో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు

కౌలాలంపూర్: ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు భిన్న విధానాన్ని అవలంబించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. ఈ మేరకు శాంతి చర్చల కోసం తాజాగా రష్యా, అమెరికా పరస్పరం కొత్త ఆలోచనలను పంచుకున్నట్లు చెప్పారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఆసియాన్ ప్రాంతీయ వేదిక వార్షిక సదస్సు సందర్భంగా- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో రూబియో గురువారం భేటీ అయ్యారు. 50 నిమిషాలపాటు సాగిన తమ సమావేశంలో శాంతి చర్చలకు సంబంధించి కొత్త ఆలోచనలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. అవి కచ్చితంగా శాంతిని నెలకొల్పుతాయని తాను ఇప్పుడే చెప్పబోనన్నారు. అయితే వాటిని తమ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టికి తప్పకుండా తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా పట్టువిడుపులు ప్రదర్శించకపోవడంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని రూబియో తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం.. 22 మంది అధికారులపై వేటు

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంలో 22 మంది ఎక్సైజ్ అధికారుల్ని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వీరి పేర్లు ఏసీబీ-ఆర్థిక నేరాల విభాగ అభియోగపత్రంలో ఉండటం దీనికి కారణం. సస్పెండైన వారిలో ఐదుగురు డిప్యూటీ కమిషనర్లు, 12 మంది సహాయ కమిషనర్లు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన కుంభకోణాన్ని తమ ప్రభుత్వం వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై కఠిన చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. అవినీతిపరుల్ని వదిలిపెట్టేది లేదని స్పష్టంచేశారు.

రాహుల్ విమర్శలు అత్యయిక స్థితికి మద్దతివ్వడమే: భాజపా

దిల్లీ: ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ బిహార్‌లో నిరసన తెలపడమంటే అత్యయిక స్థితికి మద్దతిస్తున్నట్లేనని భాజపా విమర్శించింది. రాజ్యాంగబద్ధ సంస్థలు విజయం, ఓటములపై ఆధారపడతాయని ప్రతిపక్ష పార్టీ నమ్ముతోందని భాజపా ప్రతినిధి సుధాంశు త్రివేది వ్యాఖ్యానించారు. శశిథరూర్ ఎమర్జెన్సీపై తన అభిప్రాయాన్ని తెలపడాన్ని కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు.

ముంబయిలో సిందూర్ వంతెన

ముంబయి: దక్షిణ ముంబయిలో బ్రిటిష్ కాలంనాటి కార్నాక్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్తగా నిర్మించిన వంతెనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ గురువారం ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌లో సాయుధ దళాల విజయానికి ప్రతీకగా 'సిందూర్ బ్రిడ్జి' అని దానికి నామకరణం చేశారు. 150 ఏళ్ల క్రితం నిర్మించిన కార్నాక్ బ్రిడ్జి బలహీనపడిపోవడంతో 2022 ఆగస్టులో దాన్ని కూల్చివేశారు. 1839-1841 మధ్య బొంబాయి రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న జేమ్స్ రివెట్ కార్నాక్ పేరిట నిర్మించిన ఈ వంతెన దక్షిణ ముంబయిలో రద్దీని తగ్గిస్తోంది. భారతీయులపై కార్నాక్ దమనకాండకు పాల్పడ్డారని ఫడణవీస్ గుర్తుచేశారు. వలస పాలన అవశేషాలను రూపుమాపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ అభీష్టానికి అనుగుణంగా ఈ వంతెనకు కొత్త పేరు పెడుతున్నామని చెప్పారు.

శతవసంతాల మహతీర్



కౌలాలంపూర్: మలేసియా మాజీ ప్రధానమంత్రి మహతీర్ మహమ్మద్ గురువారం నూరో పుట్టినరోజు వేడుకలను కుటుంబం, బంధుమిత్రులు, అనుయాయుల మధ్య సంతోషంగా జరుపుకొన్నారు. కార్యాలయంలో అభినందనలు అందుకుని, ఇక పనిలోకి వెళ్దాం అని సిబ్బందితో అన్నారు. నూరేళ్ల వయసులోనూ చురుగ్గా ఉండటానికి కారణం తాను ఆరోగ్యంపై చూపిన శ్రద్ధేనని చెప్పారు. "రెండుసార్లు గుండెకు శస్త్రచికిత్సలు జరిగినా మానసికంగా, శారీరకంగా చురుగ్గా ఉండటమే నా ఆయుర్దాయ రహస్యం. ధూమపానం అలవాటు లేదు. అతిగా తినే అలవాటు లేదు. మానసికంగా ఎల్లప్పుడూ చురుగ్గా ఉంటాను. నిండునూరేళ్లు బతకడానికి ఇవి దోహదం చేశాయి. నూరో జన్మదినం జరుపుకోవడం కాస్త భీతి గొల్పే వ్యవహారమే. పదవీ విరమణ తర్వాత విశ్రాంతి తీసుకోవాలని చాలామంది అనుకుంటారు. విశ్రాంతి అంటే ఏమిటి? ఏమీ చేయకుండా కూర్చోవడమా? పనిలోనే నాకు ఆనందం" అని వివరించారు.

కేరళ నర్సుకు యెమెన్‌లో మరణ దండన తప్పించాలని సుప్రీంకోర్టులో పిటిషన్

విచారణకు అంగీకరించిన ధర్మాసనం

దిల్లీ: వ్యాపార భాగస్వామి హత్య కేసులో యెమెన్‌లో మరణ దండనను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియను కాపాడాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం విచారణకు స్వీకరించింది. మరణశిక్ష నుంచి నిమిష ప్రియను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్య మార్గాన్ని ఉపయోగించేలా ఆదేశించాలని పిటిషనర్ అయిన 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' విజ్ఞప్తి చేసింది. జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ జోయ్‌మాల్యా ధర్మాసనం ఈ కేసు విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 16న ఆమెకు ఉరిశిక్ష అమలు చేసే అవకాశం ఉన్నందున సత్వరమే విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. షరియత్ చట్టం ప్రకారం, బాధిత కుటుంబ సభ్యులకు జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లిస్తే నిమిషను విడుదల చేయవచ్చని ధర్మాసనానికి తెలిపారు. నిమిష ప్రియను విడిపించేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ సీపీఐ ఎంపీ సంతోష్‌కుమార్ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు.

యుద్ధ విమానాలు, నౌకలతో చైనా కవ్వింపు

లైవ్ ఫైర్ డ్రిల్ చేపట్టిన తైవాన్

తైపీ: పసిఫిక్ మహా సముద్రంలో చైనా మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. తైవాన్ తీరాన్ని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి (పీఎల్ఏ) చెందిన 12 యుద్ధ విమానాలు, 7 నౌకలు చుట్టుముట్టాయి. తమ జలాల్లో చైనా యుద్ధ విమానాలు, నౌకలు కదలాడినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. వీటిలో 10 విమానాలు తైవాన్ గగనతలంలోకి చొరబడ్డాయని వివరించింది. చైనా చర్యలకు దీటుగా బదులిస్తూ.. తైవాన్ లైవ్ ఫైర్ డ్రిల్ చేపట్టింది. గురువారం ఈ డ్రిల్‌ను అధ్యక్షుడు లాయ్ చింగ్ తె వీక్షించారు. అమెరికా నుంచి ఎగుమతి చేసుకున్న నాలుగు ఎం1ఏ2టీ అబ్రామ్స్ ట్యాంకులు ఈ డ్రిల్‌లో పాల్గొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 10 రోజులపాటు ఈ డ్రిల్ నిర్వహించాలని తైవాన్ నిర్ణయించింది

కెనడాలో కపిల్‌శర్మ రెస్టారెంటుపై కాల్పులు

టొరంటో: 'ద గ్రేట్ ఇండియన్ కపిల్ షో' ప్రయోక్త కపిల్ శర్మ ఇటీవల కెనడాలోని సర్రేలో ప్రారంభించిన 'కప్స్ కేఫ్' రెస్టారెంటుపై గురువారం కాల్పులు జరిగాయి. సిబ్బంది లోపల ఉండగానే జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోయినా ఆస్తినష్టం చోటు చేసుకుంది. తానే కాల్పులు జరిపినట్లు ఖలిస్థానీ ఉగ్రవాది హర్జీత్‌సింగ్ లడ్డీ ప్రకటించాడు. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

శిక్షణ విమాన ప్రమాదంలో అమరులైన పైలట్ల గుర్తింపు



లోకేందర్ సింగ్, రిషిరాజ్ సింగ్

దిల్లీ: రాజస్థాన్‌లోని చురూ వద్ద జాగ్వార్ శిక్షణ విమానం కూలిన ఘటనలో అమరులైన పైలట్లను భారతీయ వాయుసేనకు చెందిన స్క్వాడ్రన్ లీడర్ లోకేందర్ సింగ్ (31), ఫ్లైట్ లెఫ్టినెంట్ రిషిరాజ్ సింగ్ (23)గా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని, విమానం కూలడానికి దారితీసిన కారణాలపై కోర్టు విచారణ ప్రారంభించినట్లు గురువారం తెలిపారు.

నెలరోజుల క్రితమే తండ్రి అయిన లోకేందర్

శిక్షణ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన స్క్వాడ్రన్ లీడర్ లోకేందర్ సింగ్ నెల రోజుల క్రితమే తండ్రయ్యారు. జూన్ 10న ఆయన భార్య ఒక మగబిడ్డకు జన్మనిచ్చారు. పుట్టింట్లోనే ఉన్న ఆమె భర్త మరణవార్త విని హతాశులయ్యారు. హరియాణాలోని రోహతక్‌కు చెందిన లోకేందర్ 2016లో వాయుసేనలో చేరారు. స్వస్థలంలో జరిగిన ఈయన అంత్యక్రియలకు పెద్దసంఖ్యలో స్థానికులు తరలివచ్చారు. యుద్ధ విమానాల పైలట్ కావాలని చిన్నప్పటినుంచీ కలలు కన్న రిషిరాజ్ సింగ్ ఆ విమాన ప్రమాదంలోనే అమరుడు కావడం బాధాకరం. రాజస్థాన్‌లోని పాలీ జిల్లాలో గురువారం సాయంత్రం పూర్తి సైనిక గౌరవంతో ఈయన అంత్యక్రియలు జరిగాయి. కుమారుడి బారాత్ చూడాలని అమ్మాయిని వెదుకుతున్న తరుణంలో ఇలా చితిపై చూడాల్సి వచ్చిందంటూ తల్లిదండ్రులు భోరున విలపించారు.



గురువారం గురుపౌర్ణమి నేపథ్యంలో మథుర జిల్లాలో పుణ్య గోవర్ధన్ గిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మూడేళ్ల శిక్ష ఒకరోజుకు తగ్గింపు

- నలభై ఏళ్ల వేదనకు దిల్లీ హైకోర్టు ముగింపు



దిల్లీ: అవినీతి కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిన మాజీ ఉద్యోగికి శిక్షను దిల్లీ హైకోర్టు ఒకరోజుకు తగ్గించింది. 1984 నాటి అవినీతి కేసులో నిందితుడికి విధించిన రూ.15,000 జరిమానాను అతడు 2002లోనే చెల్లించాడని ఈ నెల 8న ఇచ్చిన తీర్పులో గుర్తుచేసింది. నిందితుడి వయసు ఇప్పుడు 90 ఏళ్లు కావడం, అతడికి పలు శారీరక, మానసిక సమస్యలు ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని హైకోర్టు ఈ తీర్పు చెప్పింది. కేసు 40 ఏళ్లుగా సాగుతున్నందున ఇక ఇంతటితో చాలించాలని తీర్మానించింది. నిందితుడు సురేంద్ర కుమార్ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎస్‌టీసీ)లో ప్రధాన మార్కెటింగ్ అధికారిగా పనిచేశారు. 140 టన్నుల ఎండుచేపల కోసం ఆ సంస్థ టెండర్లు పిలవగా ముంబయికి చెందిన ఒక సంస్థ తరఫున అబ్దుల్ కరీం హమీద్ కొటేషన్ సమర్పించారు. అతడి నుంచి సురేంద్ర కుమార్ రూ.15,000 లంచం డిమాండ్ చేయగా, హమీద్ సీబీఐని ఆశ్రయించారు. 1984లో మొదటి విడత లంచం కింద హమీద్ ఒక హోటల్లో సురేంద్రకు రూ.7,500 చెల్లిస్తుండగా సీబీఐ అరెస్టు చేసింది. అప్పట్లో సురేంద్రను ఒకరోజు నిర్బంధంలో ఉంచారు. తర్వాత బెయిలుపై విడుదలయ్యారు. 2002లో ఆయనకు దిగువ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.15,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించిన ఆయన జైలుశిక్షపై అప్పీలు చేశారు. ఈ కేసు 40 ఏళ్ల నుంచి సురేంద్ర నెత్తిపై కత్తిలా వేలాడుతోందనీ, ఇది రాజ్యాంగం నిర్దేశించిన సత్వర విచారణకు విరుద్ధమని హైకోర్టు పేర్కొంది. సురేంద్ర ఇప్పటికే అనుభవించిన ఒకరోజు నిర్బంధంతో జైలుశిక్ష సరి అని తీర్మానించింది.



ఎర్ర సముద్రంలో బుధవారం నీట మునుగుతున్న రవాణా నౌక ఎటర్నిటీ సీ

హూతీల చెరలో నౌకా సిబ్బంది!

దాడి అనంతరం ఎత్తుకెళ్లిన యెమెన్ రెబల్స్

దుబాయ్: ఎర్ర సముద్రంలో తాము దాడి చేసిన గ్రీస్‌కు చెందిన లైబీరియన్ నౌకలోని సిబ్బందిని హూతీలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. బుధవారం ఈ దాడి జరగడంతో నౌక మునిగిపోయిన సంగతి తెలిసిందే. దాడి సమయంలో ముగ్గురు మరణించగా.. ఆరుగురిని అధికారులు కాపాడారు. మిగిలిన డజను మందికిపైగా సిబ్బంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే వారిని తామే తీసుకెళ్లామని హూతీలు చెబుతున్నారు. అమెరికా కూడా దీనిని ధ్రువీకరించింది. ఎటర్నిటీ సీ అనే ఈ నౌకలో 22 మంది నావికులు, ముగ్గురు భద్రతా సిబ్బంది ఉన్నారు. 21 మంది ఫిలిప్పీన్స్ వాసులుకాగా ఒక రష్యన్ ఉన్నారు. బుధవారం సహాయక సిబ్బంది ఐదుగురు ఫిలిప్పీన్, ఒక భారతీయుడిని రక్షించారు.



దిల్లీలోని ఓ బహుళ అంతస్తుల భవనంపై ఏర్పాటు చేసిన వల్లభ్‌భాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ భారీ చిత్రాలు

వసుంధర

vasundhara@eenadu.in

సరదాగా చదివిద్దామా!



ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రపంచంతో పోటీపడాలని ఆరాటపడుతుంటారు. పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంకులు వస్తే బాగుంటుందని వారిపై ఒత్తిడి తెస్తారు. ఇందుకోసం వారిని టీవీలు చూడొద్దు, ఫోన్‌కి దూరంగా ఉండు అంటూ చాలానే షరతులు పెడుతుంటారు కదా! నిజానికి పిల్లల్ని ఎంత ఎక్కువ ఒత్తిడి చేస్తే అంత చదువుకి దూరంగా ఉంటారు. చదవమని బలవంతం చేయడం కంటే సరదాగా చదివేలా ప్రోత్సహించి చూడండి. అలాకాకుండా 'నీ ఫ్రెండ్‌కి మార్కులు ఎక్కువ వచ్చాయి. నువ్వు ఇంకా బాగా చదవాలి' అన్న ప్రతిసారీ అది వారికి టాస్క్‌లా అనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ వారితో పాఠ్య పుస్తకాలే కాకుండా అప్పుడప్పుడు కామిక్ బుక్స్‌నీ చదివించండి. ఉదాహరణకు కొంతమంది పిల్లలకి జంతువులంటే ఇష్టం. ఇంకొంతమందికి సూపర్ హీరోలు నచ్చుతారు. మరికొంతమందికి ఇంకో రకమైన ఆసక్తి ఉండొచ్చు. మీ పిల్లలకి ఏవి ఇష్టమో వాటికి సంబంధించిన పుస్తకాలు చదివిస్తే సరదాగా అనిపించడమే కాదు, పాఠ్యపుస్తకాలనూ ఇష్టంగా చదువుతారు.

కారణం కావాలా నవ్వడానికి..?

ఉదయం లేచింది మొదలు... పిల్లల్ని స్కూళ్లకు తయారుచేయాలి. టిఫిన్, లంచ్ సిద్ధం చెయ్యాలి... బస్సు వచ్చేలోగా బ్యాగులతో సహా వాళ్లని బయటికి పంపాలి. ఇవన్నీ జరుగుతుండగానే... ఏమోయ్ నా టై ఎక్కడ... రాధమ్మా నా మందులు ఇవ్వవా! కళ్లజోడు ఎక్కడ... ప్రశ్నల ప్రవాహం. తొమ్మిదయ్యేదాకా ఎన్ని పనులో... అన్నీ ఒంటి చేత్తో చక్కబెట్టి కాఫీ కప్పు పట్టుకుని ఒక్క సిప్ తాగేసరికి ఆఫీస్‌లో ప్రాజెక్టు గుర్తొస్తుంది. మెయిల్ పంపాలి. డెడ్‌లైన్ దగ్గరకొస్తోంది అంటూ ఎన్ని ఆలోచనలో. తీరా కార్యాలయం చేరుకున్నాక... రిపోర్టులు, గ్రాఫ్‌లు, బాస్ తిట్లు... అదో రసాభాస. ఇవన్నీ తెచ్చే ఒత్తిడి ఒకవైపైతే... పిల్లలు తిన్నారా లేదా... అన్న సందేహాలూ మనసుని తొలిచేస్తుంటాయి. ఇది రాధ పరిస్థితి మాత్రమే కాదు. ఉద్యోగం చేస్తోన్న ఆడవాళ్లంతా ఎదుర్కొంటున్నదే. ఇదంతా ఎంత ఒత్తిడి! మరి దీన్ని మార్చాలంటే ఓ మంత్రం కావాలి కదా! అదే నవ్వు... అవును రోజూ మనకి ఎదురవుతున్న ఆందోళనలకు చక్కని పరిష్కారం నవ్వే. నిపుణులు, అధ్యయనాలు చెబుతోన్న మాట ఇది. రోజులో కాసేపయినా ఏదో విధంగా నవ్వడానికి ప్రయత్నించండి. ఇది మీ మనసుకే కాదు శరీరానికీ ఒత్తిడి నుంచి ఉపశమనం ఇస్తుంది. ఇందుకు పెద్దపెద్ద టాస్కులు, ప్రణాళికలు ఏం అవసరం లేదు. ప్రయాణాల్లోనో, బ్రేక్ దొరికినప్పుడో... ఫోన్లో రీల్స్, కామెడీ క్లిప్స్, మీమ్స్ లాంటివి చూడండి చాలు. ఎండార్ఫిన్లు విడుదలై ఆందోళన తగ్గి, రోజంతా సాఫీగా సాగిపోతుంది. ప్రయత్నిస్తారు కదూ!



జనాభా వరమా? శాపమా? జన భారత్ ఇకపైన ఎలా అడుగులు వేయాలి, దీన్లో మహిళల పాత్ర ఏంటి... లాంటి సందేహాలెన్నో! 'వరల్డ్ పాప్యులేషన్ డే' సందర్భంగా వీటిపైన 'పాప్యులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఏం చెబుతున్నారంటే...

పిల్లల నిర్ణయం ఆమెదే అవ్వాలి!



పూనమ్



భారత్‌లో ప్రస్తుతం సంతాన సాఫల్య రేటు(టీఎఫ్ఆర్) 2శాతంగా ఉంది. అంటే సగటున ప్రతి మహిళా ఇద్దరు బిడ్డలకు జన్మనిస్తోంది. జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే అది 2.1గా ఉండాలి. కానీ, జనాభా తగ్గుదల ఒకసారి మొదలైతే, క్రమంగా అది తగ్గుతూ పోతుంది. ఆ మార్పునీ ఇప్పుడు చూస్తున్నాం. అధిక జనాభాతో సవాళ్లూ ఉన్నాయి. తగు రీతిలో వనరులు, అవకాశాల్ని అందించకపోతే సామాజిక, ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. విద్య, ఉపాధి దక్కకుంటే యువత పక్కదారి పడుతుంది. అందుకే అధిక సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు తీసుకురావాలి. నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. ముఖ్యంగా మహిళలకు విద్య, పోషకాహారం, వైద్యం, ఆదాయ వనరుల్ని అందించాలి. జనాభా గురించి ఆందోళన చెందకుండా, ప్రతి భారతీయుడూ ఒక ఆస్తి అనుకుని ప్రణాళికలు రచించాలి.

ఆ స్వేచ్ఛ ఇవ్వండి...

కొన్నిచోట్ల పిల్లలు కనడంపైన ఆంక్షలు పెడితే, ఇంకొన్నిచోట్ల ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నారు. వీటి ప్రభావం ప్రత్యక్షంగా పడేది మహిళలపైనే. ఇద్దరుకంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలో కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. వీటి కోసం కొందరు కాగితం మీద విడాకులు తీసుకున్నారు. దీంతో వివాహ బంధం అనిశ్చితిలోకి వెళ్తుంది. కొందరు పిల్లల్ని దత్తత ఇచ్చారు. అప్పుడూ బాధపడేది తల్లే. కాబట్టి పిల్లల్ని ఎప్పుడు కనాలి, ఎంతమందిని కనాలనే నిర్ణయం మహిళలు తాముగా తీసుకునే స్వేచ్ఛ రావాలి. పిల్లల్ని కనాలని చెప్పడం, వద్దనడం... మహిళల్ని అగౌరవపరచడమే. పిల్లల్ని కనడమనేది స్విచ్ కాదు ఆన్, ఆఫ్ చేయడానికి. కెరియర్, ఆర్థిక, సామాజిక కోణాల్లో... ఆలోచించి పిల్లల విషయంలో మహిళలే నిర్ణయానికి వస్తారు.

కు.ని. భారం మహిళలదేనా?

1970 నాటికి దేశంలో 30 శాతం వాసెక్టమీ ఆపరేషన్లు జరిగేవి. ఇప్పుడవి 0.3 శాతానికి తగ్గాయి. వాసెక్టమీ పదినిమిషాల్లో ముగుస్తుంది. కావాలనుకుంటే వెనక్కి మరల్చవచ్చు. ట్యూబెక్టమీలో కోత, కుట్లు ఉంటాయి. దురదృష్టవశాత్తూ పుట్టిన వాళ్లు చనిపోతే ట్యూబెక్టమీలో వెనక్కి వెళ్లి పిల్లల్ని కనే పరిస్థితి ఉండదు. అప్పుడు మగవాళ్లు వేరే పెళ్లి చేసుకునేందుకూ ఆస్కారం ఉంది. మరోపక్క ఏటా భారత్‌లో 1.6కోట్ల అబార్షన్లు జరుగుతున్నాయి. లెక్కకి అందనివి ఇంకెన్నో. వీటిలో సగం అవాంఛిత గర్భధారణలు కాగా, మగ పిల్లలే కావాలనుకోవడం మరో కారణం. రెండో త్రైమాసికంలోకి వెళ్తే అబార్షన్లతో ప్రాణహాని ఉంటుంది. అంతేనా... గర్భనిరోధకాలు వాడటం మగవాళ్లకు సంబంధంలేనిదిగా కేవలం మహిళల పనే అన్నట్టుగా ఉంది. వీటన్నింటివల్లా మహిళల ఆరోగ్యమూ దెబ్బతింటుంది.

జేఆర్‌డీ టాటా చెప్పినట్టు 'మగవాళ్లు మారినప్పుడే దేశం మారుతుంది'. వాళ్లలో ఏ విధమైన మార్పు రావాలంటారా... పిల్లల పెంపకంలో బాధ్యతలు తీసుకోవాలి. ఇంటిపనుల్లో భాగమవ్వాలి. కుటుంబ నిర్ణయాల్లో మహిళల మాటకు విలువివ్వాలి. అప్పుడే జనాభా పెరిగినా, తగ్గినా సమస్యలు తగ్గుతాయి.

- జనాభా లెక్కల్లో మహిళలకు సంబంధించిన డేటా తక్కువగా వెలుగులోకి వస్తోంది. 2027 జనాభా లెక్కలతోనైనా దీన్లో మార్పు రావాలి. జనాభా లెక్కింపు సమయంలో ఇంటి వివరాలు మగవాళ్లే చెబుతుంటారు. అలా కాకుండా మహిళల్నీ అడగాలి. మహిళలు, బాలికలకు సంబంధించి సరైన సమాచారం లేకుంటే పథకాల రూపకల్పనలో పొరపాట్లు జరుగుతాయి. అది ఎన్నటికీ పూడ్చలేని లోటుగా మిగిలిపోతుంది.

- 2050 నాటికి జనాభాలో 20శాతం(34కోట్లు) వృద్ధులు ఉంటారని అంచనా. మహిళల ఆయుష్షు ఎక్కువ. కాబట్టి వీరి కోణంలోనూ ప్రణాళికలు రచించాలి. కొత్త విషయాల్ని, నైపుణ్యాల్ని నేర్చుకునేలా అలవాటు చేయాలి. దానివల్ల వృద్ధాప్యంలోనూ పనిచేసే సామర్థ్యం వస్తుంది.

మరచిపోతే నోట్ పెట్టు..!



ఏదో పని చేస్తుంటాం... ఉన్నట్టుండి గుర్తొస్తుంది ఇంట్లో వాళ్లకి కాల్ చేయాలని... ఫోన్ తీస్తామా..! అంతలోనే వేరేవి కనిపిస్తాయి. అవి చూస్తూ అసలు సంగతి మరచిపోతాం. లేదా పక్కవారితో ఇంకేదో మాటల్లో మునిగిపోతాం. అయితే చిన్న విషయాల్ని ఇలా మరచిపోయినా పర్వాలేదు కానీ... ముఖ్యమైనవి వీటి జాబితాలో చేరితేనే సమస్యంతా. అలా కొన్నిసార్లు వృత్తిపరమైన టాస్క్‌లూ మరచిపోతుంటాం. ఎవరో వచ్చి గుర్తుచేస్తేనో... సంబంధిత సందర్భం ఎదురుపడితేనో... అబ్బా మరచిపోయాం అంటూ నాలుక కరచుకుంటుంటాం. మహిళలకైతే మరీనూ... మల్టీ టాస్కింగ్ చేయడం వల్ల దేని మీదా ఓ పట్టాన ధ్యాస నిలవదు. మీకు కూడా ఇలాంటి సందర్భాలు ఎదురయ్యాయా... దీన్నే 'టాస్క్ స్విచింగ్' లేదా 'కాగ్నిటివ్ డిస్ట్రాక్షన్' అంటున్నారు నిపుణులు. ఒకేసారి మెదడులో రకరకాల ఆలోచనలు, పనులు రన్ అవ్వడం వల్ల ఏర్పడుతుంది ఇది. మన జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని సరిచేసుకోవచ్చు. ఇందుకోసం 'సిట్ అండ్ కాల్' అలవాటు చేసుకోండి. అంటే ఒకదగ్గర కూర్చొని మాట్లాడటం. మనలో చాలామంది ఏదో ఒక పని చేస్తూ ఫోన్లు మాట్లాడుతుంటాం. పనిలో పని ఇది కూడా అయిపోతుంది కదా అనుకుంటాం. అందుకే నడుస్తూ, వండుతూ, మొక్కలకు నీళ్లు పోస్తూ, కూరగాయలు తరుగుతూ, మెయిల్ పంపిస్తూ ఫోన్ మాట్లాడుతుంటాం. దీని వల్ల డిస్ట్రాక్షన్స్ ఎక్కువ అవుతాయి. అలా కాకుండా సిట్ అండ్ కాల్ పద్ధతిని పాటిస్తే ఏ సమస్యా ఉండదు. అలానే, ఫోన్ మాట్లాడాలన్న ఆలోచన వచ్చిన వెంటనే తీసుకుని సంబంధిత వ్యక్తికి కాల్ చేసేయాలి. లేదా ఫలానా సమయం అనుకున్నారా... రిమైండర్ పెట్టుకోండి. అంటే ఒక చిన్న పుస్తకంలో రాసుకోవడమో... నోట్ పెట్టడమో చేయండి. డాక్టర్‌కి కాల్, ఇంటికి కాల్ అంటూ దానిలో రాసుకోండి. లేదా అలారమ్ అయినా పెట్టుకోండి. మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒక్కోసారి మల్టీటాస్కింగ్ తప్పదు. అలాంటప్పుడు రెండు నిమిషాలు బ్రేక్ తీసుకుని... పని చేయడం మొదలుపెడితే టాస్క్ స్విచింగ్ నుంచి బయటపడొచ్చు.

సాగుకి సాయం చేయాలని...

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అండగా ఉంటేనే... సమాజం సుభిక్షంగా ఉంటుందనేది వారి భావన. అందుకే, శాస్త్రవేత్తలుగా మారి తమ పరిశోధనలతో వ్యవసాయానికి ఊతం ఇవ్వాలనుకున్నారు. ఆ దిశగా అడుగులు వేసేందుకు వ్యవసాయ విద్యను ఎంచుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన భారత వ్యవసాయ సర్వీసు (ఏఆర్ఎస్)కి తెలంగాణకు చెందిన ఈ ముగ్గురమ్మాయిలు తాజాగా ఎంపికయ్యారు. వారితో వసుంధర ముచ్చటించింది.

పూల సాగుకి కొత్త కళ తేవాలని...

– అనుమాల నిఖిలావాగ్దేవి,



హనుమకొండ జిల్లా వడ్లపల్లి మా స్వస్థలం. స్పోర్ట్స్‌కోచ్ అయిన నాన్న దేవేందర్ ఉద్యోగరీత్యా నార్సింగిలో స్థిరపడ్డాం. చిన్నతనంలో మా తాత, నాన్న వ్యవసాయం చేసేవారు. ఆ వాతావరణంలో పెరిగిన జ్ఞాపకాలు ఉండటం వల్ల నాకూ చిన్నప్పటి నుంచీ వ్యవసాయ రంగమంటే ఆసక్తి. ఇంటర్ తర్వాత అందరూ డాక్టర్ కావాలని చెప్పినా... అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఎంసెట్ రాసి కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులో చేరాను. అక్కడే ఫ్లోరీకల్చర్, ల్యాండ్‌స్కేపింగ్‌లో ఎమ్మెస్సీ చదివా. ఆపై బెంగళూరులోని ఇండియన్ హార్టికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ చేశా. అనంతరం ఏఆర్ఎస్ సాధించాలనే సంకల్పంతో దానికి సిద్ధమయ్యా. మొదటి ప్రయత్నంలో సాధించి నార్మ్‌లో శిక్షణ పొందుతున్నా. శిక్షణ అనంతరం ఫ్లోరికల్చర్ శాస్త్రవేత్తగా మారతా. విదేశాల్లో పూల సాగుకు భారీ డిమాండ్ ఉంది. రూ.కోట్లవ్యాపారం సాగుతోంది. మన దేశంలో ఆ స్థాయిలో దానికి గుర్తింపు తేవాలి, అన్నదాతలకు చేయూతనివ్వాలనేది నా లక్ష్యం.

వ్యవసాయం లాభసాటి అయ్యేలా...

– అడుప షణ్ముఖ, హైదరాబాద్



మాది మంచిర్యాల జిల్లా. చదువు కోసం చాలా ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో స్థిరపడ్డాం. నాన్న స్ఫూర్తితో ఎంసెట్‌లో ర్యాంకు సాధించి... అశ్వారావుపేటలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశా. ఆ తర్వాత భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) పరీక్ష రాసి ఎమ్మెస్సీ సీటు పొందా. ఆ తర్వాత అక్కడే పీహెచ్‌డీ చేశాను. ఆ తర్వాత ఏఆర్ఎస్ రాసి జాతీయ స్థాయిలో అయిదో ర్యాంకు సాధించా. నేను పుట్టిపెరిగిన నేపథ్యం, అశ్వారావుపేట, దిల్లీ పరిశోధన సంస్థల్లో విద్యాభ్యాసంతో... రైతు సమస్యలపై అవగాహన కలిగింది. వారి శ్రమకు తగ్గ ఆదాయం వచ్చేలా కృషి చేయాలన్నది నా లక్ష్యం. దీనికి అనువైన వంగడాలను, వనరులను, సాంకేతికతను వారి దరికి చేర్చాలనే సంకల్పంతో పనిచేస్తా.

సేంద్రియ వ్యవసాయానికి చేయూత

– పొలెపొంగు శ్రీలత

మాది ఖమ్మం. వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచే వ్యవసాయ పనులు చేసిన అనుభవం ఉంది. అప్పుడే ఎన్నో సమస్యలు గుర్తించాను. వాటి పరిష్కారంపై కొన్ని ఆలోచనలూ చేశా. ఇంటరయ్యాక ఆచార్య జయశంకర్ అగ్రివర్సిటీ పరిధిలోని అశ్వారావుపేట కళాశాలలో బీఎస్సీ చేశా. తర్వాత మహారాష్ట్రలోని మహాత్మాఫులె కృషి విద్యాపీఠ్‌లో ప్లాంట్‌పాథాలజీలో ఎమ్మెస్సీ చేశా. ఆ తర్వాత తెలంగాణ అగ్రివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశా. ఆపై నేను డిగ్రీ చదివిన కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఏఆర్ఎస్ సాధించడంపై దృష్టిపెట్టా. అనుకున్నట్లుగానే ర్యాంకు సాధించా. ప్లాంట్ పాథాలజీ ద్వారా రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ విధానంలో అద్భుతాలను సృష్టించి, వ్యవసాయాన్ని సుసంపన్నం చేయడమే నా సంకల్పం.



– ఆకారపు మల్లేశం, హైదరాబాద్

బంగారం - వెండి



10న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,750	90,600	1,10,703
విజయవాడ	96,640	92,900	1,10,000
ప్రొద్దుటూరు	97,200	89,420	1,08,200
రాజమహేంద్రవరం	98,400	90,200	1,20,000
విశాఖపట్నం	98,050	90,200	1,12,000
తమిళనాడు	-----	90,200	1,20,000

శోధిత

ఈ దశ... కోపాన్ని తగ్గిస్తుంది!

కోపం... మనల్ని విచక్షణ కోల్పోయేలా చేసే భావోద్వేగం. ఇది మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నది నిపుణులు చెప్పే మాట. అయితే, మధ్య వయసుకొచ్చేసరికి ఆడవాళ్లలో ఈ కోపం తగ్గిపోతుందని మెనోపాజ్ సొసైటీ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు, ఈ దశలో కోపం, ఆవేశం... వంటివి నియంత్రించుకోవటంలో ఆడవాళ్లు మరింతగా మెరుగుపడతారట కూడా. దీనికి సంబంధించి 35-55 ఏళ్ల వయసున్న 500మంది మహిళలపై అధ్యయనం చేశారు పరిశోధకులు. పెరుగుతోన్న శారీరక, పునరుత్పాదక వయసే ఇందుకు కారణమని గుర్తించారు. దానితోపాటు ఈ దశలో మూడ్ స్వింగ్స్‌ని నియంత్రించుకోవటం గురించి మహిళలకు అవగాహన కల్పించటం ద్వారా మరింత స్థితప్రజ్ఞత పొందేలా చేయొచ్చనీ, మానసిక ఆరోగ్యాన్ని అందించొచ్చనీ పరిశోధకులు సూచిస్తున్నారు.

మీకు తెలుసా?

శిశువుల చర్మం పెద్దవారితో పోలిస్తే ఐదురెట్లు ఎక్కువ పలుచగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీనివల్లే వారి చర్మం పొడిబారటం, ఇరిటేషన్‌తో పాటు సుకుమారంగానూ ఉంటుందట. అందుకే, ఆ సమయంలో వారి స్కిన్‌కి తగినంత తేమను అందించాలట.



కాబోయే అమ్మకి... ఆరు గజాల చీర!



ఫ్యాషన్ ట్రెండ్!





ముద్దులొలికే పాపాయిగా తొలిసారి తొడుక్కున్న పరికిణీ. పట్టులంగాలో చిరునవ్వులొలికించే చిన్నారి! పరికిణీ-ఓణీలో మెరిసే అమ్మాయి. తొలిసారి చీర కట్టిన అందం. నవ వధువుగా మెరిసిన రూపం... వయసులు తేడానే కానీ... అన్నీ సంప్రదాయ భారతీయ వనిత అందాన్ని గుర్తు చేసేవే! ప్రతిదీ మనసులో చెరగని ముద్ర వేసేవే. ఒక దశ దాటాక తిరిగి ప్రయత్నిద్దామన్నా ఆ రోజులు రావుగా! ఆ జ్ఞాపకాలను తిరిగి కళ్లముందు మెదిలేలా చేసేది ఫొటోలే. అందుకే ఫొటోషూట్‌లు నిర్వహించుకుని మరీ ఆ జ్ఞాపకాలను పోగేసుకుంటారు. ఈ జాబితాలోకే మరో వేడుక వస్తుంది. అదే సీమంతం. నిండు గర్భంతో అమ్మాయి నుంచి అమ్మగా మారే దశ. చెప్పలేనంత ఆనందం, రవ్వంత భయం, మరికాస్త ఆందోళన... అన్నీ మేళవిస్తున్నా సంతోషంగా పాపాయి రాకకోసం ఎదురుచూస్తుందా తల్లి. ఆ సంబరాన్ని పట్టుచీర, మట్టిగాజులు, ఒంటినిండా నగలు, పసుపు కుంకుమలతో వేడుక చేసుకోవడం తెలుగునాట కొత్తేమీ కాదు. అదీ అరుదైన క్షణమే. ఆ అందాన్ని మళ్లీ మళ్లీ చూడటమూ సాధ్యమా? అందుకే దాన్నీ ప్రెగ్నెన్సీ షూట్ పేరుతో అపురూపంగా దాచుకుంటున్నారు. కానీ చాలావరకూ అమ్మలు గౌన్లు, ప్రత్యేక పాశ్చాత్య దుస్తుల్లో సిద్ధమవుతున్నవారే. పైగా ఈ సమయంలో చీర అనువుగా ఉండదు అని చెప్పేవారే! ఒక్కసారి ఈ చిత్రాలను చూడండి. ఆరుగజాల చీర... అమ్మాయిని అందంగా చూపనిదెప్పుడు? అందుకు మాతృత్వమూ మినహాయింపు కాదు. పైగా భారతీయ సౌందర్యాన్ని వర్ణించడానికి రవివర్మ చిత్రాలకు మించినవేంటి చెప్పండి. కాబట్టే, ఆ కలయికలో అలనాటి ఇతిహాస, పురాణ పాత్రలను తలపిస్తూ నేటి అమ్మల్లో కొందరు తిరిగి సంప్రదాయానికి ఊపిరి పోస్తున్నారు. చూస్తోంటే ఆ పెయింటింగ్‌ల్లోంచి దిగివచ్చారా అన్నట్టు లేరూ? చూస్తే చూపు తిప్పుకోవడానికీ మనసు రాదు. కాబట్టే, ఇప్పుడిది ట్రెండ్ అవుతోంది. నేత లేదా చిన్న జరీ పట్టు చీర, అలనాటి నగల్లో... చిత్ర నాయికలా కనిపించాలని మీకూ ఉందా? మీ ప్రెగ్నెన్సీ షూట్‌కీ ఈ వింటేజ్ థీమ్‌ని ప్రయత్నించేయండి మరి!







తనతో మాట్లాడాలని ఉంది!

నానమ్మ అంటే నాకు ప్రాణం. తను ఏడాది క్రితం చనిపోయింది. అయినా ఇప్పటికీ తనను తలచుకోని రోజుండదు. మా తరగతిలో ఒకమ్మాయి వాళ్ల నాన్న ఇటీవలే చనిపోయారు. డిగ్రీలో కొత్తగా చేరా. తనింకా పరిచయం కూడా కాలేదు. కానీ తన బాధ గురించి విన్నాక ఆమెతో మాట్లాడాలి అనిపిస్తోంది. తన బాధను పంచుకోవాలనుంది. నా ఆలోచన నాకే విచిత్రంగా ఉంది. ఎందుకిలా? – ఓ సోదరి

నీకు నాన్నమ్మతో మంచి అనుబంధం ఉంది. కాబట్టే, చనిపోయి ఏడాదైనా ఇప్పటికీ ఆవిడ లేని లోటుని ఫీల్ అవుతున్నావు. ఈ రోజుల్లో ఇలాంటి అనుబంధాలు పిల్లల్లో చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. మన మనసుకి కలిగిన బాధ ఇంకొకరికి ఎదురైనప్పుడు, సహజంగానే వాళ్లతో కనెక్ట్ అవుతాం. దీన్నే సహానుభూతి అంటాం. నీ ఆలోచనలో విచిత్రం ఏమీలేదు. ఇక, ఆ అమ్మాయితో మాట్లాడటం గురించి... బాధను పంచుకునే మనసు ఉంటే చాలు. పరిచయంతో పనేముంది? నీకు మాట్లాడాలి అనిపిస్తే తనతో మాట్లాడు. నీ అనుభవాన్ని ఉదహరిస్తూ ఓదార్పు ఇవ్వు. ధైర్యం చెప్పు. తండ్రి లేని లోటు తీర్చలేనిది. కానీ నీ స్నేహంతో ఆమెకు కొంత సాంత్వనను కలిగించవచ్చు. తను బాధ నుంచి బయటపడితే, మెల్లగా చదువు, లక్ష్యాల మీద దృష్టి పెట్టగలుగుతుంది. తనతోపాటు ఉంటూ, ధైర్యం చెబుతూ నువ్వూ నీ బాధ నుంచి బయటపడొచ్చు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

తెలిస్తే చంపేస్తారు..

సోషల్ మీడియాలో ఒకబ్బాయి పరిచయమయ్యాడు. తను చెప్పే విషయాలను చూస్తే మా కాలేజే, నేనెవరో తెలుసు అనిపిస్తోంది. మొదట్లో మామూలుగానే మాట్లాడినా ఇప్పుడు నేనంటే ఇష్టమంటున్నాడు. నాకేమో భయంగా ఉంది. అమ్మకీ, అక్కకీ తెలిస్తే కచ్చితంగా చంపేస్తారు. ఇప్పుడేం చేయాలి? – ఓ సోదరి

సోషల్ మీడియా ఇప్పుడు మన జీవితంలో భాగమైంది. అయితే దాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నాం అన్నది మన విజ్ఞత మీదే ఆధారపడి ఉంటుంది. సామాజిక మాధ్యమాల కారణంగా ఏర్పడుతున్న సమస్యలు... ముఖ్యంగా అమ్మాయిల విషయంలో జరుగుతున్న మోసాల గురించి వినే ఉంటావుగా! నువ్వూ అదే దారిలోకి వెళ్తున్నావని నీకు అనిపించట్లేదా? నీ గురించి, నీ కాలేజీ గురించి ఆ అబ్బాయి తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందులో ఆశ్చర్యపడాల్సిన విషయమూ ఏమీ లేదు. నీ ఖాతామీద కాస్త సమయం కేటాయించినా చాలు. కాబట్టి, ముందు అతన్ని దూరంగా ఉంచు. బ్లాక్ చేస్తే ఇంకా మంచిది. అయినా అమ్మకీ అక్కకీ తెలిస్తే కచ్చితంగా చంపేస్తారు అంటున్నావు. అంటే నువ్వు వెళ్తున్న దారి సరైనది కాదని నీకూ తెలుసనేగా? కాబట్టే, కదా భయపడుతున్నావు. అందుకే ఇప్పటికైనా సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకు. ఆన్‌లైన్ స్నేహాలనూ నమ్మకు. నేరుగా తెలిస్తేనే స్నేహం చెయ్యి. ఆ విషయంలోనూ పరిమితులుండాలి. అలాగే ఖాళీ సమయాన్ని నీ లక్ష్యాలు చేరుకోవడానికీ నైపుణ్యాలు పెంచుకోవడానికీ కేటాయించు. నీ భవిష్యత్తుకూ మంచిది.

చాంపియన్

సిరీస్‌లో సమంగా ఉన్న భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టుకు ఆసక్తికర ఆరంభం. రూట్ బాధ్యతాయుత బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన వేళ.. తొలి రోజును ఇంగ్లాండ్ సంతృప్తిగా ముగించింది. అలాగని టీమ్‌ఇండియా పెద్దగా వెనుకబడేమీ లేదు. ఇంగ్లిష్ జట్టు దూకుడును అడ్డుకోగలిగిన గిల్ బృందం.. రెండో రోజు ఇంకా మెరుగ్గా బౌలింగ్‌చేస్తే బలంగానే పోటీలో ఉండొచ్చు. రెండో టెస్టులో ఓటమి చవిచూసిన ఇంగ్లాండ్.. బజ్‌బాల్‌కు విరామమిస్తూ లార్డ్స్‌లో నెమ్మదిగా ఆడింది. స్ట్రోక్‌ప్లేను అటకెక్కించిన ఆ జట్టు స్ట్రైక్‌రేట్ కష్టంగా మూడు దాటిందంతే. పంత్ గాయంతో మైదానాన్ని వీడడం భారత్‌ను కలవరపెడుతోంది.

బజ్‌బాల్‌కు బ్రేక్

- ఇంగ్లాండ్ 251/4
- రాణించిన రూట్
- భారత్‌తో మూడో టెస్టు

లండన్

భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టు.. తొలి రెండు టెస్టులకు భిన్నంగా మొదలైంది. దూకుడైన ఆట లేదు.. పరుగుల జోరు లేదు. మందకొడి పిచ్‌పై జాగ్రత్తగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. తొలి రోజు, గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. జో రూట్ (99 బ్యాటింగ్; 191 బంతుల్లో 9×4) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు స్టోక్స్ (39 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు .పోప్ (44) రాణించాడు. నితీశ్ కుమార్‌రెడ్డి రెండు వికెట్లు పడగొట్టాడు. రెండో రోజు ఉదయం సెషన్లో భారత బౌలర్లు ఎలా బౌలింగ్ చేస్తారన్నది మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది.

మొదలెట్టిన నితీశ్: ఊహించినట్లే ఈ మ్యాచ్‌కు భారత్ ప్రసిద్ధ్ కృష్ణను తీసుకోలేదు. బుమ్రా జట్టులోకి వచ్చాడు. జట్టులో టీమ్ ఇండియా చేసిన ఏకైక మార్పు ఇదే. టాస్ గెలిచిన బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బజ్‌బాల్ శకంలో ఇంగ్లాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవడం ఇది రెండోసారి మాత్రమే కావడం విశేషం. భారత పేస్ త్రయం బుమ్రా, ఆకాశ్‌దీప్, సిరాజ్ ఇంగ్లాండ్ బ్యాటర్లను పరీక్షించారు. కానీ నితీశ్ కుమార్ రెడ్డి వికెట్ల పతనాన్ని ఆరంభించాడు. తొలి రెండు వికెట్లను అందించాడు. ఇంగ్లిష్ ఓపెనర్లు బెన్ డకెట్ (23), జాక్ క్రాలీ (18) తొలి గంటలో భారత పేస్‌ను తట్టుకుని నిలిచారు. 13 ఓవర్లలో ఇంగ్లాండ్ స్కోరు 39/0. బుమ్రా రెండు ఎండ్‌ల నుంచి బౌలింగ్ చేశాడు. అతణ్ని ఎదుర్కొని పరుగులు చేయడం ఆతిథ్య జట్టు బ్యాటర్లకు కష్టమైపోయింది. కానీ బుమ్రాకు వికెట్లు మాత్రం దక్కలేదు. అయితే గిల్.. నితీశ్‌ను బరిలోకి దించడం సత్ఫలితాన్నిచ్చింది. అతడు ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. తొలి వికెట్ రావడం అదృష్టమే. నితీశ్ షార్ట్ బంతి డకెట్ గ్లోవ్స్‌ను ముద్దాడుతూ వెళ్లి లెగ్‌సైడ్ వికెట్‌కీపర్ పంత్ చేతుల్లో పడింది. క్రాలీని మాత్రం ఓ చక్కని బంతితో ఔట్ చేశాడు నితీశ్. లేట్‌గా స్వింగై స్ట్రెయిట్ అయిన బంతికి క్రాలీ ఎడ్జ్‌తో పంత్‌కు చిక్కాడు. ఆ తర్వాత చక్కగా బ్యాటింగ్ చేసిన రూట్, పోప్ లంచ్ వరకు మరో వికెట్ పడనివ్వలేదు. అయితే ఈ సెషన్లో ఇంగ్లాండ్ బజ్‌బాల్‌కు భారత్ చెక్ పెట్టింది. సాధారణంగా దూకుడైన ఆటతో పరుగులు రాబట్టే ఆ జట్టు 3.32 రన్‌రేట్‌తో మాత్రమే పరుగులు చేయగలిగింది. 2022లో మెక్‌కలమ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసిన 17 సందర్భాల్లో తొలి సెషన్లో ఆ జట్టు అతి తక్కువ రన్‌రేట్ ఇదే.

నిలిచిన రూట్: తొలి సెషన్లో రెండు జట్లు సమంగా నిలవగా.. రెండో సెషన్లో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. పట్టుదలగా నిలిచిన రూట్, పోప్ అజేయంగా సెషన్‌ను ముగించారు. ఈ జంట చాలా సహనంతో బ్యాటింగ్ చేసింది. కానీ భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఈ సెషన్లో కూడా వేగంగా పరుగులు రాలేదు. జాగ్రత్తగా ఆడిన బ్యాటర్లు 24 ఓవర్లలో 70 పరుగులు మాత్రమే చేశారు. రూట్, పోప్ సంప్రదాయ శైలిలో ఆడారు. రిస్క్ చేయడానికి ఇష్టపడలేదు. షాట్ల కోసం తొందరపడలేదు. ఆఫ్‌స్టంప్ లోగిలిలో బంతులను వదిలేశారు. నితీశ్ బౌలింగ్‌లో ఫైన్ లెగ్‌లో బౌండరీతో రూట్ అర్ధశతకం పూర్తి చేశాడు. ఇందుకు అతడు 102 బంతులు ఆడడం గమనార్హం. అతడికి అండగా నిలిచిన పోప్ మరింత జాగ్రత్తగా బ్యాటింగ్ చేశాడు. సెషన్ ముగిసే సరికి ఇంగ్లాండ్ 153/2తో నిలిచింది. ఈ సెషన్లో ఒక్క వికెట్ పడగొట్టలేకపోయిన భారత్‌కు పంత్.. గాయంతో మైదానాన్ని వీడడం పెద్ద దెబ్బ. అయితే టీ తర్వాత తొలి బంతికే వికెట్ పడగొట్టి భారత శిబిరంలో ఆనందాన్ని నింపాడు జడేజా. కాస్త తిరిగిన బంతికి పోప్ ఎడ్జ్‌తో వికెట్‌కీపర్ జురెల్‌కు చిక్కడంతో 109 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే ఇంగ్లాండ్‌కు మరో దెబ్బ. బ్రూక్ (11)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో ఆ జట్టు 172/4తో నిలిచింది. వెంటనే మరో వికెట్ పడగొట్టి ఉంటే తొలి రోజు భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేదే. కానీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన రూట్.. ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు. స్టోక్స్ కూడా పట్టుదలగా నిలబడ్డాడు. ఎన్నో బంతులు వదిలేశాడు. సింగిల్స్‌తో సంతృప్తి పడ్డాడే కానీ.. ధాటిగా ఆడేందుకు ప్రయత్నించలేదు. రూట్ కూడా అంతే. సింగిల్స్‌తోనే ముందుకు సాగాడు. కానీ జడేజా బౌలింగ్‌లో ఓ స్లాగ్‌స్వీప్‌తో ఫోర్ సాధించాడు. క్రమంగా 90కి చేరుకున్నాడు. గిల్ బౌలర్లందరినీ ఉపయోగించినా ఈ భాగస్వామ్యాన్ని విడదీయలేకపోయాడు.



నితీశ్ కుమార్ 2/46



రూట్ 99 బ్యాటింగ్

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) పంత్ (బి) నితీశ్‌కుమార్ రెడ్డి 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ కుమార్‌రెడ్డి 23; ఒలీ పోప్ (సి) జురెల్ (బి) జడేజా 44; రూట్ బ్యాటింగ్ 99; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ బ్యాటింగ్ 39; ఎక్స్‌ట్రాలు 17 **మొత్తం:** (83 ఓవర్లలో 4 వికెట్లకు) 251; **వికెట్ల పతనం:** 1-43, 2-44, 3-153, 4-172; **బౌలింగ్:** బుమ్రా 18-3-35-1; ఆకాశ్‌దీప్ 17-2-75-0; సిరాజ్ 14-5-33-0; నితీశ్ కుమార్‌రెడ్డి 14-0-46-2; జడేజా 10-1-26-1; సుందర్ 10-1-21-0

బాగుందిరా.. మామా!

భారత్-ఇంగ్లాండ్ మూడో టెస్టులో టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నోట తెలుగు మాటలు వినిపించాయి. ఇంగ్లాండ్ ఓపెనర్లు డకెట్, క్రాలీ కుదురుకుపోతున్న సమయంలో ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని బరిలో దించాడు గిల్. చక్కని బంతులతో ఒకే ఓవర్లో వీళ్లిద్దరిని పెవిలియన్ చేర్చాడు నితీష్. మ్యాచ్‌లో నితీశ్ బౌలింగ్ చేస్తున్న క్రమంలో అతడిని మెచ్చుకుంటూ 'బాల్ రా.. మామా' అని గిల్ అన్నాడు. తర్వాత 'బాగుంది రా.. మామా' అని ఇంకోసారి అన్నాడు. ఈ మాటలు స్టంప్ మైక్‌లో వినిపించాయి. శుభ్‌మన్‌కు మనోడు తెలుగు నేర్పించేశాడు అని సామాజిక మాధ్యమాల్లో అభిమానులు వ్యాఖ్యానించారు.

పంత్‌కు గాయం



పంత్

టీమ్‌ఇండియాకు ఇది ఆందోళన కలిగించే విషయమే. వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడ్డాడు. ఎడమచేతి చూపుడు వేలికి గాయం కావడంతో రెండో సెషన్ సందర్భంగా అతడు మైదానాన్ని వీడాడు. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్‌కీపింగ్ చేస్తున్నాడు. పంత్.. వైద్యబృందం పర్యవేక్షణలో ఉన్నాడని బీసీసీఐ తెలిపింది. 34వ ఓవర్లో బుమ్రా బంతిని ఎడమవైపు దూకుతూ ఆపే ప్రయత్నంలో పంత్ గాయపడ్డాడు. అతడు మైదానంలో చికిత్స తీసుకోవడంతో మ్యాచ్ కాసేపు ఆగింది. తర్వాత పంత్ వికెట్‌కీపింగ్‌ను కొనసాగించేందుకు ప్రయత్నించాడు కానీ.. నొప్పి తీవ్రం కావడంతో అతడు ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. బుమ్రా ఓవర్ పూర్తయ్యాక మైదానం నుంచి నిష్క్రమించాడు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన జురెల్ బ్యాటింగ్ చేయలేడు. సూపర్ ఫామ్‌లో ఉన్న పంత్ బ్యాటింగ్‌కు రాకపోతే భారత్‌కు ఒక బ్యాటర్ తక్కువవుతాడు. అది ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే.



ఎంసీసీ మ్యూజియంలో సచిన్ చిత్రం

లండన్: దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ చిత్రాన్ని లార్డ్స్‌లోని ఎంసీసీ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. గురువారం భారత్-ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టు ఆరంభానికి ముందు ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. 18 ఏళ్ల క్రితం తీసిన ఫొటో ఆధారంగా చిత్రకారుడు స్టువర్ట్ పియర్సన్ రైట్ దీన్ని చిత్రించాడు. గతంలో కపిల్ దేవ్, బిషన్ సింగ్ బేడీ, దిలీప్ వెంగ్‌సర్కార్ ఫొటోలను కూడా పియర్సన్ ఇలాగే రూపొందించాడు. "ఇదో గొప్ప గౌరవం. 1983లో భారత్ వన్డే ప్రపంచకప్ గెలిచినప్పుడు తొలిసారి లార్డ్స్ గురించి విన్నా. అప్పటి కెప్టెన్ కపిల్ దేవ్ ట్రోఫీని సగర్వంగా పైకెత్తిన క్షణం నాలో క్రికెటర్ కావాలన్న ఆశను రగుల్కొల్పింది. లార్డ్స్‌లో ఇప్పుడు నా చిత్రం ఉండడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. ఇదెంతో ప్రత్యేకం" అని సచిన్ అన్నాడు.

తెందుల్కర్ గంటను మోగించి..: లార్డ్స్‌లో సచిన్‌కు మరో గౌరవం దక్కింది. భారత్-ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టు ఆరంభానికి సూచికగా తెందుల్కర్ గంటను మోగించాడు. లార్డ్స్‌లో టెస్టు మ్యాచ్ ఆరంభానికి ముందు ఇలా గంట మోగించడం సంప్రదాయం. పటౌడీ ట్రోఫీని అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీగా మార్చిన తర్వాత జరుగుతున్న తొలి సిరీస్‌లో సచిన్‌కు ఈ గంటను మోగించే అవకాశం దక్కింది.

కాంఫెర్ 5 బంతుల్లో 5 వికెట్లు

డబ్లిన్: ఐర్లాండ్ ఆల్‌రౌండర్ కర్టిస్ కాంఫెర్ అరుదైన ఘనత సాధించాడు. గురువారం ఇంటర్ ప్రొవిన్షియల్ టీ20 ట్రోఫీలో మన్‌స్టర్ రెడ్స్‌కు ఆడుతూ నార్త్ వెస్ట్ వారియర్స్‌పై కాంఫెర్ 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టాడు. అతడు ఒకే ఓవర్లో ఈ ప్రదర్శన చేయలేదు. కాంఫెర్ 12వ ఓవర్లో చివరి రెండు బంతులకు విల్సన్, హ్యూమ్‌లను ఔట్ చేశాడు. తర్వాత 14వ ఓవర్లో తొలి మూడు బంతుల్లో మెక్‌బ్రిన్, మిల్లర్, జోష్‌లను పెవిలియన్ చేర్చాడు. మొత్తంగా 2.3 ఓవర్లలో 16 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ప్రొఫెషనల్ క్రికెట్లో పురుషుల్లో 5 బంతుల్లో 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా కాంఫెర్ రికార్డు సృష్టించాడు. మహిళల్లో 2024లో ఈగల్స్ ఉమెన్ జట్టుపై జింబాబ్వే అమ్మాయి కెలిస్ ఎండోవు 5 బంతుల్లో 5 వికెట్లు తీసింది

ఇంగ్లాండ్‌పై తొలిసారి టీ20 సిరీస్ సొంతం

అమ్మాయిలు అదరగొట్టేశారు

- నాలుగో మ్యాచ్‌లో భారత్ ఘనవిజయం



రాధ

మాంచెస్టర్: అదిరిపోయే ఫామ్‌లో ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఇంగ్లాండ్ గడ్డపై చరిత్ర సృష్టించారు. టీ20లో ఆ జట్టుపై భారత్ తొలిసారి సిరీస్ విజయాన్ని అందుకుంది. బుధవారం నాలుగో టీ20లో ఆరు వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలివుండగానే 3-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. 2006లో డెర్బీలో జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ పైచేయి సాధించింది. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఇంటా, బయటా ఇంగ్లాండ్‌పై భారత్ సిరీస్ నెగ్గలేకపోయింది. ప్రస్తుత పర్యటనలో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తాచాటడంతో అలవోకగా సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. భారత బౌలర్ల దెబ్బకు 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 126 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (22; 19 బంతుల్లో 2×4, 1×6) టాప్ స్కోరర్. సిరీస్‌లో భారత విజయాల్లో కీలకంగా మారిన తెలుగమ్మాయి శ్రీచరణి (2/30) మరోసారి విజృంభించింది. రాధ యాదవ్ (2/15), అమన్‌జ్యోత్ కౌర్ (1/20), దీప్తిశర్మ (1/29) కూడా సత్తాచాటడంతో ఇంగ్లాండ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. స్మృతి మంధానా (32; 31 బంతుల్లో 5×4), షెఫాలీ వర్మ (31; 19 బంతుల్లో 6×4), జెమీమా రోడ్రిగ్స్ (24 నాటౌట్; 22 బంతుల్లో 1×4), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (26; 25 బంతుల్లో 3×4) రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. సిరీస్‌లో ఆఖరి టీ20 శనివారం జరుగుతుంది.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: 126/7 (సోఫియా డంక్లీ 22, అలిస్ క్యాప్సీ 18, టామీ బ్యూమాంట్ 20, శ్రీచరణి 2/30, రాధ యాదవ్ 2/15), **భారత్ ఇన్నింగ్స్:** 17 ఓవర్లలో 127/4 (స్మృతి 32, షెఫాలీ 31, జెమీమా 24 నాటౌట్, హర్మన్‌ప్రీత్ 26)

వింబుల్డన్‌లో భారీ షాక్! టైటిల్‌కు బలమైన ఫేవరెట్ సబలెంకా ఇంటిముఖం పట్టింది. సెమీస్‌లో ఆమెను అనిసిమోవా ఓడించింది. మరోవైపు బెన్సిచ్‌ను చిత్తు చేసి స్వైటెక్ తుదిపోరుకు అర్హత సాధించింది. కెరీర్‌లో అనిసిమోవాకు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కాగా.. వింబుల్డన్‌లో తుదిపోరుకు రావడం స్వైటెక్‌కు ఇదే మొదటిసారి. టైటిల్ కోసం శనివారం అనిసిమోవాతో స్వైటెక్ తలపడనుంది.

సబలెంకాకు షాక్

ఫైనల్లో అనిసిమోవా ● స్వైటెక్‌తో టైటిల్ పోరు



అనిసిమోవా



స్వైటెక్

లండన్: సబలెంకాకు తీవ్ర నిరాశ! ఈసారి ఎలాగైనా వింబుల్డన్ ట్రోఫీ గెలవాలనుకున్న ఆమె కల చెదిరింది. సెమీస్‌లోనే ఈ బెలారస్ అమ్మాయి ఇంటిముఖం పట్టింది. హోరాహోరీగా సాగిన పోరులో 13వ సీడ్ అమండా అనిసిమోవా 6-4, 4-6, 6-4తో టాప్‌సీడ్ సబలెంకాకు షాక్ ఇచ్చింది. రెండున్నర గంటలకు పైగా సాగిన ఈ పోరులో కీలక సమయాల్లో చేసిన తప్పిదాలు సబలెంకాను ముంచాయి. తొలి సెట్ నువ్వానేనా అన్నట్లు సాగింది. 4-4 వరకు ఇద్దరూ సమంగా నిలిచారు. తొమ్మిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన అనిసిమోవా 5-4తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత సర్వీస్ నిలబెట్టుకుని సెట్‌ను గెలుచుకుంది. రెండో సెట్లోనూ సబలెంకాకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ తప్పలేదు. అయినా ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన సబలెంకా 5-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరుతో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో సెట్లో సబలెంకా మళ్లీ గాడి తప్పింది. అనవసర తప్పిదాలు, డబుల్‌ఫాల్ట్స్‌తో పట్టు విడిచింది. దీంతో 4-1తో అనిసిమోవా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పదో గేమ్‌లో మరోసారి బ్రేక్ చేసి సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ క్రమంలో ఆమె 2 ఏస్‌లు 30 విన్నర్లు కొట్టింది. 37 అనవసర తప్పిదాలు, 4 డబుల్‌ఫాల్ట్స్ చేసిన సబలెంకా ఓటమి కొనితెచ్చుకుంది. మానసిక సమస్యలతో 2023లో చాలా నెలలు టెన్నిస్‌కు దూరమైన అనిసిమోవా.. 2024లో పునరాగమనం చేసి ఆస్ట్రేలియన్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ చేరింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్లోనూ ప్రిక్వార్టర్స్ దశకు వెళ్లింది.

తిరుగులేని స్వైటెక్: మరో టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ తన లక్ష్యానికి అడుగు దూరంలో నిలిచింది. అలవోకగా ఈ పోలెండ్ తార ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో ఈ ఎనిమిదో సీడ్ 6-2, 6-0తో బెన్సిచ్ (స్విట్జర్లాండ్) పోరాటానికి తెరదించింది. తొలి సెట్లో మాత్రమే ప్రత్యర్థి నుంచి స్వైటెక్‌కు పోటీ ఎదురైంది. కానీ నాలుగో గేమ్‌లో బ్రేక్ సాధించిన స్వైటెక్ 3-1తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత అదే దూకుడుతో సెట్‌ను గెలుచుకుంది. రెండో సెట్లో స్వైటెక్ పవర్‌గేమ్ ముందు బెన్సిచ్ నిలవలేకపోయింది. బలమైన సర్వీసులు, రిటర్న్‌లతో విజృంభించిన స్వైటెక్ 5-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్లో స్వైటెక్ ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా గెలిచే అవకాశం ఇవ్వలేదు. బెన్సిచ్ ఈ మ్యాచ్‌లో ఓడినా ఆమె పునరాగమనం స్ఫూర్తిదాయకం. గతేడాది ఏప్రిల్‌లో బిడ్డకు జన్మనిచ్చినా ఈ స్విస్ అమ్మాయి త్వరగానే సర్క్యూట్‌లోకి వచ్చి వింబుల్డన్ లాంటి టోర్నీలో తుది నాలుగు జాబితాలో చోటు దక్కించుకోగలిగింది.

మూడో రౌండ్లో హంపి, హారిక

బాటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచ చెస్ కప్‌లో భారత చెస్ స్టార్ ప్లేయర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక మూడో రౌండ్ చేరారు. హంపి 1.5-0.5 తేడాతో అఫ్రుజా (ఉజ్బెకిస్థాన్)పై విజయం సాధించింది. రెండో రౌండ్ తొలి గేమ్‌లో నెగ్గిన హంపి రెండో గేమ్‌ను డ్రా చేసుకుంది. హారిక 2-0తో పి.వి. నందితను ఓడించింది. వరుసగా రెండు గేమ్‌ల్లో ఆమె నెగ్గింది. వైశాలి కూడా ముందంజ వేసింది. రెండో రౌండ్ రెండో గేమ్‌లో ఆమె మైలి జేడ్ (కెనడా)పై గెలిచింది. 2-0 స్కోరుతో తర్వాతి రౌండ్ చేరింది. మరోవైపు క్లాడియా (పోలెండ్)తో గేమ్‌ను డ్రా చేసుకున్న ప్రియాంక, అన్నా ఉస్నెనా (ఉక్రెయిన్) చేతిలో ఓడిన వంతిక అగర్వాల్ టైబ్రేక్‌లో అదృష్టం పరీక్షించుకోనున్నారు. రెండో రౌండ్‌ను వీరిద్దరు 1-1తో ముగించారు.

నొవాక్.. సినర్‌ను దాటేనా!

పురుషుల సెమీస్ సా।। 6 నుంచి



జకోవిచ్



సినర్

లండన్: నొవాక్ జకోవిచ్‌కు పెద్ద పరీక్ష! 25వ టైటిల్ వేటలో ఉన్న ఈ సెర్బియా యోధుడు జోరు కొనసాగిస్తూ వింబుల్డన్‌లో సెమీస్ వరకు వచ్చాడు. కానీ ఇక్కడే అతడికి అసలు సవాల్ ఎదురుకానుంది. ఫైనల్లో చోటు దక్కించుకోవాలంటే ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్‌ను నొవాక్ దాటక తప్పదు. శుక్రవారం సెమీస్‌లో సినర్‌తో జకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఈ ఇటలీ స్టార్‌తో పోరు నొవాక్‌కు అంత తేలిక కాదు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్లో అతడి చేతిలో జకోవిచ్ ఓడిపోయాడు. అంతేకాదు సినర్‌తో ఆడిన గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ నొవాక్‌కు పరాజయమే మిగిలింది. కానీ వింబుల్డన్‌లో మాత్రం జకోవిచ్‌పై సినర్ ఇప్పటిదాకా గెలవలేదు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. మరో సెమీఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో రెండోసీడ్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) తలపడనున్నాడు. ఫ్రిట్జ్‌తో అల్కరాస్‌కు గట్టిపోటీనే ఎదురు కావొచ్చు. గతంలో అతడితో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ అల్కరాసే గెలిచినా.. ప్రస్తుతం ఫ్రిట్జ్ మంచి ఫామ్‌లో ఉన్నాడు.

భారత రికర్వ్ జట్లు విఫలం

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో భారత రికర్వ్ జట్లు నిరాశపరిచాయి. పురుషులు, మహిళల విభాగాల్లో ప్రిక్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించాయి. గురువారం దీపిక కుమారి, అంకిత, ఘాత ఖడ్కే త్రయం 3-5తో ఫ్రాన్స్ చేతిలో పరాజయంపాలైంది. ఒక దశలో 3-1తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు అనూహ్యంగా పరాజయంపాలైంది. పురుషుల విభాగంలో ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్, నీరజ్ చౌహాన్ బృందం 2-6తో బ్రెజిల్ చేతిలో ఓడింది. ఇక రికర్వ్‌లో సింగిల్స్, మిక్స్‌డ్ విభాగంలో భారత ఆర్చర్లు బరిలో ఉన్నారు. క్వాలిఫికేషన్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన ధీరజ్, అంకిత మిక్స్‌డ్ విభాగంలో ఆడనున్నారు. కాంపౌండ్ విభాగంలో భారత మహిళల బృందం ఫైనల్ చేరిన సంగతి తెలిసిందే.

లంకదే తొలి టీ20

పల్లెకెలె: బంగ్లాదేశ్‌తో ఇప్పటికే టెస్టు, వన్డే సిరీస్‌లను కైవసం చేసుకున్న శ్రీలంక.. మూడు టీ20ల సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. గురువారం తొలి మ్యాచ్‌లో లంక 7 వికెట్ల తేడాతో బంగ్లాను ఓడించింది. మొదట బంగ్లా 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. పర్వేజ్ ఇమాన్ (38), మహ్మద్ నయీం (32), మెహదీ మిరాజ్ (29) రాణించారు. తీక్షణ (2/37) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. కుశాల్ మెండిస్ (73; 51 బంతుల్లో 5×4, 3×6) మెరుపులతో లంక 19 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. నిశాంక (42) రాణించాడు.


ఇండియా-ఎ విజయం

ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): ఐరోపా పర్యటనలో ఇండియా-ఎ పురుషుల హాకీ జట్టు తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ 6-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. ఉత్తమ్‌సింగ్ అద్భుతమైన గోల్‌తో ఇండియా-ఎ ఖాతా తెరవగా.. కెప్టెన్ సంజయ్ జట్టు స్కోరును 2-0కు పెంచాడు. మిడ్ ఫీల్డర్ మహ్మద్ రహీల్ మౌసీన్ వరుసగా రెండు గోల్స్‌తో సత్తా చాటాడు. అనంతరం అమన్‌దీప్ లక్రా, వరుణ్‌కుమార్ చెరో గోల్ సాధించడంతో 6-0తో మ్యాచ్ ఇండియా-ఎ సొంతమైంది.

ఎలిమినేటర్‌లో న్యూయార్క్ గెలుపు

డలాస్: మేజర్ లీగ్ క్రికెట్లో ఎంఐ న్యూయార్క్ జట్టు క్వాలిఫయర్-2 ఆడేందుకు అర్హత సాధించింది. ఎలిమినేటర్‌లో 2 వికెట్ల తేడాతో శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్‌ను ఓడించింది. మొదట శాన్‌ఫ్రాన్సిస్కో 19.1 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌటైంది. బార్ట్‌లెట్ (44) టాప్‌స్కోరర్. ఛేదనలో 43/0తో ఉన్న స్థితి నుంచి 108/8తో న్యూయార్క్ ఓటమి అంచున నిలిచింది. బౌల్ట్ (22 నాటౌట్) పోరాడి మరో 3 బంతులు మిగిలుండగానే న్యూయార్క్‌ను గెలిపించాడు. మోనాంక్ పటేల్ (33), డికాక్ (33) రాణించారు. క్వాలిఫయర్-2లో టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో న్యూయార్క్ తలపడనుంది. తొలి క్వాలిఫయర్‌లో గెలిచిన వాషింగ్టన్ ఫ్రీడమ్ ఇప్పటికే ఫైనల్ చేరింది.

బుక్క పెట్టుకునే ముందు లెక్కపెట్టుకోండి!



పెద్దలైతే...

పని ఒత్తిడిలో పడి ఆఫీస్‌లో నాలుగైదు చాయ్ బిస్కెట్‌లు...
నాలుగింటికి సరదాగా...
రెండు మూడు సమోసాలు...
ట్రాఫిక్‌లో ఈది ఇంటికి రాగానే...
వేడివేడి పకోడీలు...

పిల్లలైతే...

అమ్మ కష్టపడి కట్టిన
లంచ్‌బాక్స్ ఉన్నా...
స్కూల్ ఆవరణలోనో..
బయట దొరికే జంక్‌ఫుడ్...
తిననిదే మనసుకు తోచదు!

- ఈనాడు, హైదరాబాద్

మనలో చాలామంది... ఏం తింటున్నామో... ఎంత తింటున్నామో తెలియని పరిస్థితి! ఫలితంగా మనదేశానికి ప్రపంచ మధుమేహ రాజధానిగా పేరు.. ప్రజలేమో అనారోగ్యాలతో బేజారు! అందుకే... జాగో భారత్ జాగో అంటోంది కేంద్రప్రభుత్వం! ఊబకాయం, మధుమేహాలకు ముందస్తు చెక్ పెట్టడంలో భాగంగా ఏం తింటున్నామో ఎంత తింటున్నామో లెక్కపెట్టుకొని మరీ తినాలని హెచ్చరిస్తోంది. అన్ని విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో ఇకపై చక్కెర, కొవ్వు కేలరీలపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది.

బ్లాక్‌బోర్డులు, నోటీస్ బోర్డు, సర్క్యులర్ బోర్డులకు తోడు... విద్యాసంస్థలు, కార్యాలయాల్లో... ఇకపై కేలరీల బోర్డులూ చేరబోతున్నాయి. మధుమేహం, ఊబకాయం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ సూచికలు ప్రదర్శించాలని కేంద్రప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. పని ప్రదేశాల్లో ఒత్తిడిలో పడి చాలామంది చక్కెర అధికంగా ఉండే ఆహారాలను పరిమితికి మించి తీసుకుంటున్నారు. విద్యాసంస్థల్లోనూ పిల్లలు ఎక్కువగా జంక్‌ఫుడ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించటంతో పాటు ముందుజాగ్రత్తలూ తీసుకునేలా ప్రజల్ని అప్రమత్తం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఎక్కువగా తీసుకునే స్నాక్స్, వాటిలో ఉండే చక్కెర, క్యాలరీలతో మోడల్ బోర్డులను హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సిద్ధం చేసింది. పని ప్రదేశాల్లో వీటిని ప్రదర్శించడం ద్వారా కొంత నియంత్రణ సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

● మధుమేహం ఉన్నవారు చక్కెరపై చాలావరకు నియంత్రణ పాటిస్తున్నా, మిగతావారూ.. అవసరానికి మించి తీసుకుంటున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మనదేశం మధుమేహ రాజధానిగా మారుతున్న పరిస్థితుల్లో తీసుకునే ఆహారం, అందులోని కేలరీలు, చక్కెరను లెక్కలేసుకుని ఆరగించాల్సిందే అని వైద్యులూ సూచిస్తున్నారు.

రుచి తప్ప మరే ప్రయోజనం లేదు

● చక్కెరతో రుచి తప్ప మరే ప్రయోజనాలు లేవు. రోజువారీ ఏ రూపంలో తీసుకున్నా పెద్దల్లో గరిష్ఠంగా 25 గ్రాములకు చక్కెర మించవద్దు! పిల్లలకైతే ఇంకా కొంచెం తక్కువే వాడాలి!



● ఒక చెంచా 5 గ్రాములతో సమానం. చక్కెర వాడకం ఎట్టి పరిస్థితుల్లో రోజుకు ఐదు చెంచాలకు మించొద్దు!

వేటిలో ఎంతెంత చక్కెరంటే? (100ఎంఎల్/గ్రాములకు)

పదార్థం	చక్కెర(గ్రా)/ చెంచాలు
శీతల పానీయం	30/6
చాయ్	10/2
గులాబ్‌జామ్	55/11
జిలేబి	40/8
ఫ్లేవర్డ్ మిల్క్	10/2
బిస్కెట్(20గ్రా)	05/1
చాక్లెట్	55/11
కోన్ ఐస్‌క్రీమ్	15/3
జామ్(20గ్రా)	10/2
పండ్లరసం	10/2

చక్కెర ఎక్కువైతే నష్టాలు:



అధిక బరువు
మధుమేహం
త్వరగా వయసు మళ్లడం
దంతాలు దెబ్బతినడం

నూనె బోర్డులు సైతం...

పరిమితికి మించి తీసుకునే వంటనూనెలూ ఆరోగ్యానికి హాని కారకాలే! రోజువారీ నూనె ద్వారా ఒంటికి 27-30 గ్రాములకు మించి కొవ్వు చేరకూడదు. అయితే చాలామంది రోజువారీ ఎంత నూనె ఒంట్లోకి చేరుతుందనే అవగాహన లేకపోవడంతో అధికంగా తీసుకుంటున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'నూనె' బోర్డులూ ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నమూనా ఆయిల్ బోర్డులను సిద్ధం చేసింది.

ఏ ఆహార పదార్థంలో ఎంత కొవ్వు, కేలరీలు ఉన్నాయంటే..

ఆహారం	కొవ్వు(గ్రా.)/కేలరీలు
సమోసా (100 గ్రా)	28/362
కచోరి(40 గ్రా)	10/166
వడాపావ్ (127గ్రా)	9.5/263
పిజ్జా(6 ముక్కలది)	40/1377
పకోడి(130గ్రా)	26/351
చిప్స్ (28గ్రా)	9.5/147
ఫ్రెంచ్ ఫ్రైస్(117గ్రా)	17/342
బర్గర్ (247గ్రా)	20.5/590



సీమలో కరవు నివారణకు శాశ్వత చర్యలు

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



జొన్న పంటను పరిశీలిస్తున్న శివరాజ్‌సింగ్ చౌహాన్, పక్కన అచ్చెన్నాయుడు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రాయలసీమ జిల్లాల్లో కరవు నివారణ శాశ్వత పరిష్కార చర్యలు చేపడతామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాయలసీమ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన అధికారులకు సూచించారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో దక్షిణ ఏపీలోని కరవు పీడిత జిల్లాలపై సమీక్ష నిర్వహించారు. కరవు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కరవును ఎలా అధిగమించాలో శాశ్వత పరిష్కార ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఇందులో కేంద్రానికి భాగస్వామ్యం చేసి, క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులు సీమ జిల్లాల్లో కరవు పరిస్థితి, పంటల సాగు వివరాలు, నీటిపారుదల అంశాల గురించి వివరించారు. అనంతరం పుట్టపర్తి మండలంలోని పెడబల్లిలో 'సేంద్రియ' పద్ధతిలో సాగు చేసిన జొన్న పంటను కేంద్ర మంత్రి పరిశీలించారు.

■ ఆ తర్వాత కేంద్ర మంత్రిని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కలిశారు. రాష్ట్రంలో కరవు తద్వారా వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ.. ఈ పరిస్థితులపై శాస్త్రవేత్తలు, అధికారులతో ప్రత్యేక బృందాన్ని పంపి, సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

వీధి శునకాలది ఏమి భాగ్యం!

బెంగళూరులో మూడుపూటలా చికెన్ బిర్యానీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బెంగళూరులో వీధి శునకాల సంరక్షణకు మహానగర పాలికె అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వాటికి నిత్యం మూడు పూటలా చికెన్ బిర్యానీ సరఫరా చేసేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె రూ.2.80 కోట్లతో ఓ పథకాన్ని సిద్ధం చేసింది. నగరంలో 2.80 లక్షల వీధికుక్కలు ఉండగా.. తొలివిడతగా 5వేల భైరవాలకు ఒక్కోదానికి రోజుకు 367 గ్రాముల చికెన్ బిర్యానీ అందించనున్నారు. పథకం అమలుకు టెండర్లను ఆహ్వానించారు. ఇప్పటికే వీధికుక్కలకు నిత్యం ఆహారం, నీరు, వసతి వ్యవస్థలను కల్పించారు. ఇప్పుడు చికెన్ బిర్యానీ అందించే పథకానికి శ్రీకారం చుట్టారు. అందుకోసం 125 ప్రదేశాలను గుర్తించారు.

శ్రీశైలం డ్యాం 3 గేట్ల ద్వారా నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి గురువారం 1,60,843 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దాంతో జలాశయం 3 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. గరిష్ఠ నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 203.42 టీఎంసీలుగా ఉంది. కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి జరుగుతోంది. విద్యుదుత్పత్తి, స్పిల్‌వే ద్వారా 1,48,747 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్‌కు చేరుతోంది. పోతిరెడ్డిపాడుకు 20 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీరు వెళ్తోంది.

సత్యసాయి శత జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

● మహాసమాధిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయిబాబా మహా సమాధిని సీఎం తోపాటు మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దర్శించుకున్నారు. ముఖ్యమంత్రికి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, అధికారులు ఘన స్వాగతం పలికారు. ట్రస్టు సేవా కార్యక్రమాలు, బాబా శతజయంతి ఉత్సవాలపై సీఎం.. రత్నాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సత్యసాయి మానవాళికి అందించిన సేవలు అమోఘమని, వాటిని ట్రస్టు విస్తృతపరచడం అభినందనీయమని సీఎం ప్రశంసించారు. నవంబరు 23న జరిగే సత్యసాయి జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. 'నా మనసుకు ఎప్పుడు అలసటగా అనిపించినా మానసిక ప్రశాంతత సాయి సన్నిధిలో లభిస్తుంది. పుట్టపర్తి అంటే నాకు చాలా ఇష్టం' అని చంద్రబాబు చెప్పారు.

కేంద్ర మంత్రితో భేటీ

పుట్టపర్తి శాంతి భవన్ అతిథిగృహంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు పలు అంశాలపై చర్చించారు. మామిడి, ఇతర పంటలు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు కేంద్రం తగు సాయం అందించాలని కోరారు.





సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ★ కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మాట్లాడుతున్న చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు

రంగరాయ వైద్య కళాశాలలో కీచకపర్వం

● విద్యార్థినులకు ల్యాబ్ టెక్నీషియన్ లైంగిక వేధింపులు

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో బీఎస్సీ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సుల విద్యార్థినుల పట్ల కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అంశం వెలుగుచూసింది. ముఖ్యంగా ల్యాబ్ సహాయకుడు ఒకరు, మరో ఉద్యోగి వికృత చేష్టలపై కళాశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 8న కొందరు విద్యార్థినులు ఫ్యాకల్టీ వద్ద విలపించడంతో కళాశాల అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపించారు. మైక్రోబయాలజీ, పాథాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాల్లో కొందరు సిబ్బంది తమ పట్ల అసభ్యంగా వ్యవహరించిన తీరును దాదాపు 50 మంది విద్యార్థినులు కమిటీ ముందు చెప్పారు. ఈ విషయాన్ని కళాశాల విద్యార్థినులు కొందరు 'ఈనాడు' దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బందిలో ఇద్దరు వ్యక్తులు తమను వేధించినట్లు విచారణలో తెలిపామన్నారు. తాను శాశ్వత ఉద్యోగినని, ఎవరూ ఏమీ చేయలేరని ల్యాబ్ సహాయకుడు బెదిరిస్తున్నట్లు తెలిసింది. కొంత మంది ల్యాబ్ అసిస్టెంట్లు విధులకు మద్యం తాగి వస్తున్నారని కూడా కమిటీకి చెప్పారు. తాను ఎవరిపట్లా అసభ్యంగా ప్రవర్తించలేదని విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది చెప్పినట్లు సమాచారం. ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా వేధింపుల వ్యవహారంపై తమ దృష్టికి వచ్చిన వెంటనే విచారణ జరిపించామని, నివేదిక అందాల్సి ఉందని చెప్పారు. విద్యార్థినుల ఆరోపణలు నిజమని తేలితే డీఎంఈ ఆదేశాల మేరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కరేడు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం: సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

ఉలవపాడు, గుడ్లూరు, న్యూస్‌టుడే: రైతుల దగ్గర చౌకగా భూములు తీసుకుని పరిశ్రమల పేరుతో పెద్దలకు కట్టబెడతామంటే పోరాటాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడులో రైతులతో గురువారం ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పంట భూములను ఇండోసోల్ పరిశ్రమకు అప్పగించాలని ప్రభుత్వం చూడడం దారుణమని, ప్రజలతో మాట్లాడకుండా నోటిఫికేషన్ ఇచ్చి భూములు తీసుకుంటామంటే కుదరదని రామకృష్ణ పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. ఖాళీ భూములు ఉన్నచోట్ల వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కరేడు రైతులు మాట్లాడుతూ ఇండోసోల్‌కు భూములివ్వబోమని చెప్పాక తమ పొలాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారని.. పంటలు పండకపోతే భూములు లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

పోలవరం రెండో దశ తర్వాతే.. 'బనకచర్ల'పై ఆలోచించగలం

కేంద్ర జల సంఘానికి నివేదించిన పోలవరం అథారిటీ

ఈనాడు, అమరావతి: 'పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టదలచిన నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌లో మార్పులు చేయాలి. ప్రస్తుత డీపీఆర్ ఆమోదానికి భిన్నంగా ఉన్న అంశాలనూ అందులో చేర్చి అవసరమైన అనుమతులు తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తుకే నీటిని నిల్వ చేసేలా కేంద్రం మంత్రిమండలి సమావేశంలో రూ.30,436.95 కోట్లకు ఆమోదించింది. ప్రాజెక్టు తొలి దశతోనే పోలవరం పూర్తి లక్ష్యాలు నెరవేరవు. ఈ ప్రాజెక్టులో +45.72 మీటర్ల స్థాయికి రెండో దశలో నీటిని నిల్వ చేశాకే పోలవరం-బనకచర్ల అనుసంధానం అంశాన్ని ఆలోచించగలం' అని పోలవరం ప్రాజెక్టు అథారిటీ పేర్కొంది. పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రీ ఫీజిబులిటీ నివేదికపై అథారిటీ తన అభిప్రాయాలను కేంద్ర జలసంఘానికి తెలియజేసింది. ఈ మేరకు అథారిటీ డైరెక్టర్ మన్ను జి ఉపాధ్యాయ కేంద్ర జలసంఘానికి లేఖ రాశారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో



కొత్తచెరువు సమీపంలో హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులు

హంద్రీ-నీవా లైనింగ్ పనుల్లో రికార్డు

పుట్టపర్తిలో పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు



రాత్రివేళ సాగుతున్న లైనింగ్ పనులు

ఈనాడు, అనంతపురం: హంద్రీ-నీవా లైనింగ్ పనుల్లో అధికారులు రికార్డు సృష్టించారు. 24 గంటల్లో 7 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. ప్రధాన కాలువపై జీడిపల్లి జలాశయం నుంచి పుంగనూరు బ్రాంచి కెనాల్ వరకు లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనుల పరిశీలనకు వస్తుండటంతో గురువారం ఉదయం 6 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ఏకధాటిగా పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్‌తో కలిసి కొత్తచెరువు, పుట్టపర్తి మధ్యలో రహదారి పక్కన లైనింగ్ పనుల్ని పరిశీలించారు. హంద్రీనీవాకు ఈ నెల 15న నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో గడువులోగా పనులు పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఎస్ఈ రాజా స్వరూప్ వారికి వివరించారు. 216 కి.మీ. నుంచి 400 కి.మీ. వరకు 7 ప్యాకేజీల్లో గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 4,500 క్యూబిక్ మీటర్ల పని పూర్తి చేశారు.

పీ4 మార్గదర్శులకు 18న చంద్రబాబు విందు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 18న 200 మంది ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, భారీ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, బహుళజాతి సంస్థల ప్రతినిధులు, సెలబ్రిటీలతో అమరావతిలో భేటీ కానున్నారు. పీ4 లక్ష్యాలు, మార్గదర్శులను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించనున్నారు. గురువారం ఆయన ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో పీ4 అమలుపై సమీక్షించారు. మార్గదర్శులకు పీ4 లక్ష్యాలను వివరించి మరింతమంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్న అన్ని వర్గాలనూ ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వివరించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌కు చంద్రబాబు పరామర్శ

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ బంగారుపాళ్యం పర్యటనలో వైకాపా రౌడీమూకల దాడిలో గాయపడ్డ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. వైద్యం అందుతోందా అని ఆరా తీశారు. వైకాపా రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. 'న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం. నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికలపై, మీడియా ప్రతినిధులపై ఈ తరహా దాడుల్ని క్షమించేది లేదు. బాధిత కుటుంబానికి అండగా ఉంటాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. శివకుమార్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించామన్నారు. మీడియా హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

పాలిసెట్‌లో 56% సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో 56% సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 255 పాలిటెక్నిక్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 79,141 సీట్లు ఉండగా.. 44,511 భర్తీ అయ్యాయి. పాలిసెట్‌లో 1,33,359 మంది అర్హత సాధించగా, వీరిలో కౌన్సెలింగ్‌కు 48,241 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారు. వీరిలో 47,159 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాగా.. 46,084 మంది వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకున్నారు. క్రీడా, ఎన్‌సీసీ కోటాలో 1,051 మందికి సీట్ల కేటాయింపు పెండింగ్‌లో పెట్టారు. శాప్, ఎన్‌సీసీ డైరెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన జాబితా రానందున వీటి కేటాయింపు పూర్తిచేయలేదు.

గోదావరికి పెరుగుతున్న వరద

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం



పోలవరం ప్రాజెక్టులోని స్పిల్‌ఛానల్ నుంచి గోదావరిలోకి వెళ్తున్న వరద

కుక్కునూరు, పోలవరం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద పెద్ద ఎత్తున వచ్చి చేరుతోంది. మహారాష్ట్రలోని నాసిక్ పరిసరాల్లో కురిసిన వర్షాలకు నీరంతా దిగువకు రావడంతో వరద ప్రవాహం గణనీయంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 7 గంటలకు భద్రాచలం వద్ద 25.07 అడుగులకు నీటిమట్టం చేరింది. బుధవారం సాయంత్రం 19 అడుగులు ఉన్న వరద 24 గంటల్లో 6 అడుగుల మేర పెరిగింది. శుక్రవారం ఉదయానికి 30 అడుగులు దాటే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ వర్గాలు తెలిపాయి.

■ పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం సాయంత్రానికి 30 మీటర్లకు నీటి మట్టం పెరిగింది. 48 గేట్ల నుంచి 3.25 లక్షల క్యూసెక్కులు స్పిల్‌ఛానల్ ద్వారా తిరిగి గోదావరిలోకి వెళ్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. మరోవైపు పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకంలోని 22 పంపుల ద్వారా గురువారం 7,700 క్యూసెక్కులు ప్రాజెక్టు కుడికాలువలోకి విడుదల చేసినట్లు పర్యవేక్షణ డీఈ సురేష్ చెప్పారు. గతవారం రోజులుగా పట్టిసీమ పంపుల నుంచి కుడికాలువలోకి 2.1 టీఎంసీలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు: వరద ప్రవాహం పెరుగుతుండటంతో కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం, ఎల్లప్పగూడెం, చెరువుకొమ్ముగూడెం గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాల వారిని దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించే ఏర్పాట్లు చేపట్టారు. ఎల్లప్పగూడెం గ్రామాన్ని మద్రిపాడు కాలనీకి తరలించబోతున్నారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలకు బండ్లబోరు వద్ద పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేపట్టారు. ఎద్దువాగు ఎగువన ఉన్న గ్రామాల ప్రజలు ఎత్తైన ప్రదేశాల్లో పునరావాసం చూసుకుంటున్నారు.

● గోదావరి నదికి వరదపోటు ప్రభావంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గురువారం ఉదయం 2,32,160 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని బూరుగులంక, ఊడిమూడిలంక, బెల్లంపూడిలంక, వై.వి.పాలెం ఏటిగట్టు దిగువన ఉన్న తాత్కాలిక బాటలు కొట్టుకుపోయాయి. ఫలితంగా బూరుగులంక, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేటలతో పాటు ఆనగార్లంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అక్టోబరు వరకు వీరికి ఈ పడవలే శరణ్యం.



గ్రీన్ పాస్‌పోర్టు, మొక్కలతో పటమట కేఎస్ఆర్ జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

మొక్కను పెంచడానికో పాస్‌పోర్ట్!

విద్యార్థులకు అందజేసిన ప్రభుత్వం

మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించేందుకు 4, ఆపై తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం మొక్కలను అందిస్తోంది. గురువారం జరిగిన మెగా పీటీఎం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్ పేరుతో ఒక పుస్తకాన్ని ఇచ్చారు. ఇందులో మొక్క వ్యవహారనామం, సాంకేతిక నామం, ఏ తేదీన, ఏ ప్రాంతంలో మొక్కను నాటారనే వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. విద్యార్థులు తమకు ఇచ్చిన మొక్కకు వారి తల్లి పేరు పెట్టి, కుదిరిన చోట నాటాలి. తర్వాత ప్రతి మూడు నెలలకోసారి దాని ఎదుగుదల స్థితిని పాస్‌పోర్టులో నమోదు చేస్తారు. దానికి అనుగుణంగా విద్యార్థికి గరిష్ఠంగా 5 పాయింట్ల వరకు వస్తాయి. సంవత్సరానికి రెండు సార్లు ఉపాధ్యాయుడు వీటిని నిర్ధారించి సంతకం చేయాల్సి ఉంటుంది. 'మొక్క ఎదుగుదలతో నా ప్రయాణం' అనే వాక్యంతో ఉన్న ఈ పాస్‌పోర్టు విద్యార్థులను అమితంగా ఆకర్షిస్తోంది. - ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, గోపాలపట్నం (విశాఖ)



ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న గ్రీన్ పాస్‌పోర్ట్



మొక్కల ఎదుగుదల వివరాల నమోదుకు గ్రీన్ పాస్‌పోర్ట్‌లో ఇచ్చిన కాలమ్‌లు

రింగైనా... కాకున్నా మనసంతా రింగరింగా..!

- ఎక్కువ మంది యువతలో 'రింగ్జైటీ' రుగ్మత
- అవసరానికి మించి మొబైల్ వినియోగంతో సమస్య

శ్రీకాంత్.. ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ. సామాజిక మాధ్యమాల్లో వారితో నిరంతరం కనెక్ట్ అయి ఉంటాడు. కాలేజీ ముగిసిన తర్వాత కూడా నిద్ర పోకుండా మిత్రులతో సంభాషించేందుకు ఎక్కువ సమయం గడుపుతుంటాడు. ఫోన్‌ను దిండు కిందే పెట్టుకుని పడుకుంటాడు. ఏమాత్రం అలికిడి అయినా ఏదైనా ముఖ్యమైన మెసేజ్ వచ్చి ఉండొచ్చన్న గాబరాతో నిద్రపోవడం లేదు. ఇది తన చదువుపై తీవ్ర ప్రభావం చూపింది.

ఈనాడు, అమరావతి: మొబైల్ ఫోన్ మన జీవితంలో ప్రధాన భాగంగా మారిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకూ ఎక్కువగా వాడుతున్నారు. అవసరం లేకపోయినా మొబైల్ ఉపయోగించాలన్న ధోరణి పెరుగుతోంది. కొవిడ్ తర్వాత నుంచి ఇది మరింత అధికమైంది. ముఖ్యంగా యువత రోజుకు సగటున 2,500 సార్లు మొబైల్‌ను ట్యాప్ చేస్తున్నారు.

అవసరానికి మించి వాడకంతో అనేక సమస్యలు తెచ్చి పెడుతోంది. కాల్స్, మెసేజ్‌లు, సామాజిక మాధ్యమ నోటిఫికేషన్లు.. తదితర అవసరాల కోసం ఫోన్ పైనే అధిక సమయం కేటాయిస్తున్నారు. ముఖ్యమైన పనిలో ఉంటూ కూడా మొబైల్ చూడకపోతే ఏదో కోల్పోతున్నామనే భావనలో ఉంటున్నారు. దీనివల్ల ఇటీవలి కాలంలో పలువురిలో 'రింగ్జైటీ' అనే సమస్య కనిపిస్తోంది. దీనిని 'ఫాంటమ్ రింగింగ్ సిండ్రోమ్', 'ఫాంటమ్ వైబ్రేషన్ సిండ్రోమ్' అని కూడా పిలుస్తున్నారు. ఇది పలు మానసిక సమస్యలకు దారితీస్తోంది. మెసేజ్‌లపై ఎక్కువ ఆధారపడే వారిలో ఈ రకమైన ఆదుర్దా, ఆందోళన కనిపిస్తున్నాయి. ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో.. 68 శాతం మంది కాలేజీ విద్యార్థులు కనీసం వారానికి ఒకసారైనా ఈ సమస్య బారిన పడుతున్నట్లు తేలింది.

అనేక దుష్ఫలితాలు




ఈ సమస్యతో ఇబ్బంది పడేవారు నిద్రపోతున్న సమయంలోనూ మొబైల్‌ను అందుబాటులో పెట్టుకుంటున్నారు. తరచూ చెక్ చేసుకుంటే కానీ ఉండలేని పరిస్థితి. రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడు, వాహనం నడుపుతూ కూడా ఫోన్‌పై ఓ కన్నేసి ఉంచుతారు. 34.5 శాతం మంది మెడికోలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు మంగళూరులోని కస్తూర్బా వైద్య కళాశాల అధ్యయనంలో తేలింది. తరగతి గదుల్లోనూ వీటిని ఉపయోగిస్తున్నారని, దీనివల్ల వారి చదువులు దెబ్బతింటున్నాయని గుర్తించారు.

రింగ్జైటీ అంటే..?


ఫోన్ రింగ్, వైబ్రేట్ అవుతుందేమోనని పదే పదే చూడడం.. చిన్న శబ్దం వచ్చినా.. మెసేజ్ వచ్చి ఉంటుందేమోనని ఆత్రుతగా చెక్ చేసుకోవడం.. మొబైల్‌కు ఏమైనా అప్‌డేట్స్ వస్తాయేమోనని భ్రాంతిలో తరచూ వెతకడం.. అసలు ఏదీ రాకపోతే.. నిరాశకు గురికావడం.. వంటివి ఫోన్ ఎక్కువగా వాడేవారిలో కనిపిస్తోన్న సమస్యలు.





- ఈ సమస్య వల్ల ఆందోళన, ఒత్తిడికి గురవుతుంటారు. ఏ పనిలో ఉన్నా దానిపై ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపక శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితి. మొబైల్‌కు కాల్స్ రాకపోయినా.. ఏదో వెలితిగా భావిస్తుంటారు.
- ఇటువంటి వారు వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వరు. కేవలం డిజిటల్‌గానే అనుసంధానమయ్యేందుకు ఇష్టపడతారు. నిద్రలేమి కారణంగా మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

సమస్యను అధిగమిస్తేనే ప్రశాంతత



- మొబైల్‌ను వినియోగించే సమయాన్ని గణనీయంగా తగ్గించాలి. ముఖ్యంగా అనవసరమైన విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు.
- విధి నిర్వహణలో ఉన్నప్పుడు చేసే పనిపైనే ధ్యాసను లగ్నం చేయాలి. ఫోన్ చూసుకోవడానికి ప్రత్యేకంగా సమయం నిర్దేశించుకోవాలి.
- యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలి. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.
- అనవసర నోటిఫికేషన్లను ఆఫ్ చేయడం ఉత్తమం.
- కలత నిద్ర వల్ల మనసు చికాకుగా ఉంటుంది. ఈ సమయంలో చరవాణిని చూడడం మానుకోవాలి.

యువతపై తీవ్ర ఒత్తిడి



రింగ్జైటీ సమస్య యువతపై అధిక ప్రభావాన్ని చూపుతోంది. దీని వల్ల ఏకాగ్రత లోపిస్తోంది. నిద్ర సమస్యలు తలెత్తుతున్నాయి. జ్ఞాపకశక్తి కూడా సన్నగిల్లుతోంది. జీవితంలో ఆఫ్‌లైన్‌లోనూ చురుగ్గా ఉండాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడం... అభిరుచులపై దృష్టి సారించడం... స్క్రీన్ టైమ్‌ను తగ్గించడంతో ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

– డా.మానస, సైకియాట్రిస్ట్, విజయవాడ

బెట్టింగ్ యాప్‌ల కేసులో రంగంలోకి ఈడీ

- 29 మంది సెలబ్రిటీలపై ఈసీఐఆర్.. హవాలా కోణంపై ఆరా
- నిందితుల జాబితాలో రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ తరహా యాప్‌ల కోసం ప్రమోషన్ల వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసింది. ఈ కేసులో నిందితుల జాబితాలో సినీనటులు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, ప్రణీత సుభాశ్, అనన్య నాగళ్లతోపాటు టీవీ యాంకర్ శ్రీముఖి, శ్యామల తదితరులున్నారు. నిందితులు జంగిల్ రమ్మీ, జీత్‌విన్, లోటస్ 365.. తదితర బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయడం వివాదాస్పదమైంది. వీరి ప్రమోషన్ల ప్రభావంతో పలువురు యువకులు బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోవడంతోపాటు కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు రూ.వేల కోట్ల డబ్బు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఆయా ఘటనల నేపథ్యంలో సినీప్రముఖులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆయా కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ఆరంభించింది. ప్రమోషన్లు చేసినందుకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు హవాలా మార్గంలో పలువురికి డబ్బు పంపించారనే కోణంలో ఆరా తీస్తోంది. ఇప్పటికే తెలంగాణ పోలీసుల నుంచి ప్రాథమిక దర్యాప్తు వివరాలను ఈడీ సేకరించింది. త్వరలోనే నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది.



రోజును మార్చుకుంటే జీవితం మారుతుంది

జీవితాన్ని మార్చుకోవడానికి ఏం చేయాలా అని అదే పనిగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ముందు మీ రోజును మార్చుకోండి. అంటే రోజువారీ మీరు చేసే పనుల్లో ఏవి అవసరమైనవి, వేటిని పూర్తిగా వదిలివేయాలి, ఏ పనుల వల్ల ఎక్కువ ప్రతిఫలం ఉంటుంది, వాటికి ఎంత సమయం కేటాయించాలి, కొత్తగా నేర్చుకోవల్సినవి ఏంటి అనే విషయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మార్పులు చేసుకోండి. క్రమంగా మీ జీవితం మెరుగవుతుంది.

– జాన్ సి.మాక్స్‌వెల్, రచయిత

సెప్టెంబరు 24 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ముందస్తు ఏర్పాట్లపై అదనపు ఈవో దిశానిర్దేశం

తిరుమల, న్యూస్‌టుడే: ఈ ఏడాది శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక అన్నమయ్య భవనంలో ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి, కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విభాగాల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కీలక నిర్ణయాలు

★ బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్‌ఆర్ఐలు, దాతల కోటా దర్శనాలు అనుమతించరు. ★ దర్శన క్యూ లైన్లు, మాడ వీధుల్లోని గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో అన్నప్రసాదాల పంపిణీ, లడ్డూల నిల్వలు పెంచుకోవడం. ★ శ్రీవారి సేవకులుగా యువతీ యువకులను ఆహ్వానించడం. ★ సెప్టెంబరు 28న గరుడ వాహన సేవ నిర్వహించనుండటంతో 27 నుంచి 29 వరకు తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలకు అనుమతి నిరాకరణ.



మాట్లాడుతున్న వెంకయ్య చౌదరి

బ్రహ్మోత్సవాలు ఇలా..

★ బ్రహ్మోత్సవాలకు ముందే సెప్టెంబరు 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం. ★ 23న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 24న ధ్వజారోహణం. ★ అక్టోబరు 1న రథోత్సవం, 2న చక్రస్నానం. ★ రోజూ ఉదయం 8 - 10 గంటల వరకు, సాయంత్రం 7-9 గంటల వరకు వాహన సేవలు.

తితిదే ఈవో పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా

సైబర్ నేరగాళ్లు తితిదే ఈవో శ్యామలరావు పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించినట్లు అధికారులు గుర్తించారు. ఆ ఖాతాతో ఎవరినైనా మోసం చేశారా, తితిదేకు సంబంధించిన తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారా.. అనే కోణాల్లో దర్యాప్తు చేయాలని ఈవో విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు.

వైభవంగా శాకంబరి ఉత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబదేవికి శాకంబరి ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. 3 వేల నిమ్మకాయలు, 3 వేల కిలోల కూరగాయలు, ఆకుకూరలు, 100 గుమ్మడికాయలతో అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. ప్రత్యేక అలంకరణతో కొలువుదీరిన శాకంబరి ఉత్సవమూర్తికి అర్చకులు పూజలు చేసి మంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



శాకంబరిదేవి ఉత్సవమూర్తి

EENADU Vol: 51, Issue: 332 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కెనడాలో ఢీ కొన్న విమానాలు

- భారత్‌కు చెందిన శిక్షణ పైలట్ మృతి

ఒట్టావా: కెనడాలోని మేనటోబాలో విషాదం చోటు చేసుకుంది. రెండు శిక్షణ విమానాలు ఢీకొన్న ప్రమాదంలో భారత్‌కు చెందిన శ్రీహరి సుకేశ్ మృతి చెందారు. మరో విమానం నడుపుతున్న కెనడాకు చెందిన సవన్నా మే రాయ్స్(20) కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ మానిటోబా రాష్ట్రంలోని హర్వ్స్ ఎయిర్ పైలట్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. సింగిల్ ఇంజిన్ విమానాలతో వీరు టేకాఫ్, ల్యాండింగ్‌లు సాధన చేస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. చిన్న రన్‌వేపై ఇద్దరూ ఒకేసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించారు. దాదాపు 400 మీటర్ల ఎత్తులో రెండు విమానాలు ఢీకొన్నాయి.

'ఉదయ్‌పూర్ ఫైల్స్' చిత్రం విడుదలపై స్టే

దిల్లీ: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన టైలర్ హత్య ఇతివృత్తంగా రూపొందిన 'ఉదయ్‌పూర్ ఫైల్స్' చిత్ర విడుదలపై దిల్లీ హైకోర్టు గురువారం స్టే విధించింది. ఈ చిత్రం శుక్రవారం విడుదల కావాల్సి ఉంది. చిత్రం విడుదలను శాశ్వతంగా నిలిపివేయాలన్న పిటిషనర్ల.. తమ ఫిర్యాదును రెండు రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని ధర్మాసనం సూచించింది. చిత్రం విడుదలైతే తమ కేసు విచారణ నిష్పాక్షికంగా సాగేందుకు గల అవకాశాలు మృగ్యమవుతాయని టైలర్ కన్హయలాల్ హత్య కేసులో నిందితులైన పిటిషనర్లు పేర్కొన్నారు. 2022 జూన్‌లో కన్హయలాల్ తల నరికి హతమార్చిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. మహమ్మద్ ప్రవక్త పట్ల భాజపా నాయకురాలు నూపుర్ శర్మ చేసిన అవమానకర వ్యాఖ్యల్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేసిన కారణంగానే ఈ హత్య చేశామని పేర్కొంటూ నిందితులు మహమ్మద్ రియాజ్, మహమ్మద్ గౌస్‌లు.. ఒక వీడియో విడుదల చేశారు.

వడోదరా ప్రమాదంలో 18కి చేరిన మృతుల సంఖ్య

దిల్లీ, వడోదరా: గుజరాత్‌లోని వడోదరాలో వంతెన కూలిన ఘటనలో మరో ఐదుగురి మృతదేహాలు లభ్యమవడంతో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 18కి చేరుకుంది. మరో నలుగురి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వారికోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) తెలిపింది.

పాక్ నటి మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించిన కుటుంబం

కరాచీ: అనుమానాస్పదంగా మృతి చెందిన పాకిస్థాన్ నటి, మోడల్ హుమైరా అస్గర్ అలీ మృతదేహాన్ని తీసుకునేందుకు ఆమె కుటుంబ సభ్యులు నిరాకరించారు. కరాచీలోని డిఫెన్స్ హౌసింగ్ సొసైటీలోని ఒక అపార్టుమెంట్‌లో ఆమె మృతదేహాన్ని గత వారం కనుగొన్నారు. అప్పటికే మృతదేహం బాగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఆమె రెండు నెలల క్రితం మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. యజమాని అభ్యర్థన మేరకు ఇంటిని ఖాళీ చేయించాల్సిందిగా కోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు పరిచే క్రమంలో పోలీసులు ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. 'హుమైరా కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని తీసుకుని అంత్యక్రియలు జరపడానికి నిరాకరించారు. రెండేళ్ల క్రితం ఆమెతో తెగ దెంపులు చేసుకున్నామని వారు తేల్చి చెప్పారు. కుటుంబ సభ్యులకు దూరమై ఏకాకిలా జీవిస్తున్న హుమైరా అనేక పాకిస్థానీ టెలివిజన్ సీరియళ్లలోనూ, రెండు సినిమాల్లోనూ నటించారు. గత నెలలో పాక్ నటి ఆయేషా ఖాన్ ఇదే స్థితిలో తన కరాచీ అపార్టుమెంట్‌లో శవమై కనిపించారు.

అక్రమ వలసల నిరోధానికి బ్రిటన్, ఫ్రాన్స్ మధ్య అంగీకారం

లండన్: ఫ్రాన్స్ నుంచి బ్రిటన్‌కు అక్రమ వలసలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరు దేశాలూ ఒక అంగీకారానికి వచ్చాయి. ఫ్రాన్స్ నుంచి ఇంగ్లిష్ చానెల్ దాటి బ్రిటన్‌కు అక్రమంగా చేరుకుంటున్న ప్రతి ఒక్క అక్రమ వలసదారును స్వదేశానికి వెనక్కి పంపాలన్నది ఈ అంగీకార సారాంశం. ప్రయోగాత్మకంగా అమలుపరచనున్న ఈ ఒప్పందాన్ని గురించి బ్రిటన్ ప్రధాని కెయిర్‌స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్‌లు గురువారం ప్రకటన వెలువరించారు. తొలుత కొందరిని మాత్రమే తిప్పి పంపుతారు. అయితే అక్రమ వలసదారుల్ని తిప్పి పంపేదిశగా ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఇకపై ఫ్రాన్స్ నుంచి చిన్న చిన్న పడవల్లో ప్రయాణం చేసి బ్రిటన్ చేరుకుంటున్న వారిని నిర్బంధించి తిప్పి పంపుతామని కెయిర్ స్టార్మర్ అన్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 21 వేల మంది ఫ్రెంచి జాతీయులు పడవల్లో బ్రిటన్ చేరుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విషయంలో 56 శాతం పెరుగుదల నమోదైంది.

10 మంది బందీలను విడుదల చేస్తాం: హమాస్

జెరూసలెం: కాల్పుల విరమణ ఒప్పంద చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు 10 మంది ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయడానికి తాము అంగీకరించినట్లు హమాస్ బుధవారం ప్రకటించింది. అయితే యుద్ధానికి సంబంధించి శాశ్వత కాల్పుల విరమణ, తమ భూభాగం నుంచి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వైదొలగడం వంటి కీలక అంశాలు ఇంకా చర్చల దశలోనే ఉన్నాయని పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ బుధవారం రాత్రి నుంచి నిర్వహించిన దాడుల్లో 36 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఓ ఆసుపత్రి ముందు ఉన్న వారిపై జరిగిన దాడిలో 10 మంది చిన్నారులు, ఐదుగురు పెద్దలు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు హమాస్ దాడిలో ఓ ఇజ్రాయెలీ సైనికుడు ప్రాణాలు కోల్పోయారు.

బుల్లెట్ రైలుమార్గ కీలక సొరంగ పనుల్లో ముందడుగు

ముంబయి: దేశంలో తొలి బుల్లెట్ రైలుమార్గం నిర్మాణ పనుల్లో భాగంగా ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్సు నుంచి ఠాణెలోని శిల్పాటా వరకు 21 కి.మీ. మేర నిర్మించే సొరంగ మార్గంలో తొలి ముందడుగు పడింది. 'నూతన ఆస్ట్రేలియన్ సొరంగ తవ్వక పద్ధతి' (ఎన్ఏటీఎం)ని ఉపయోగించి దీనిలో కీలకమైన 2.7 కి.మీ. భాగాన్ని పూర్తిచేసినట్లు 'నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్' ప్రకటించింది. రెండుపక్కల నుంచి తవ్వకపు పనులు ప్రారంభించి, పురోగతి సాధించినట్లు తెలిపింది. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఆవాసాలకు, మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలగని రీతిలో జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది.

కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా

- ఇద్దరు పౌరుల మృతి, 13 మందికి గాయాలు



రష్యా గురువారం జరిపిన డ్రోన్, క్షిపణి దాడులతో ఉక్రెయిన్‌లోని కీవ్ ప్రాంతంలో చెలరేగిన మంటలు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. క్షిపణులు, డ్రోన్లతో గురువారం రాత్రి భారీ గగనతల దాడి నిర్వహించింది. దీంతో నగరమంతటా మంటలు చెలరేగాయి. ఈ దాడిలో ఇద్దరు పౌరులు మరణించగా, 13మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ముందురోజు రాత్రి కూడా 700కు పైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడిచేసిన సంగతి తెలిసిందే.

ఆయుధ సరఫరాను ప్రారంభించిన అమెరికా

ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు బుధవారం అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

రష్యాలో మమ్మల్ని బంధించారు

- భారత పర్యాటకుడి ఆరోపణ

ఇంటర్నెట్ డెస్క్: రష్యా పర్యటనకు వెళ్లిన తమను అకారణంగా బంధించారని భారత్‌కు చెందిన అమిత్ తన్వర్ అనే పర్యాటకుడు ఆరోపించారు. పాస్‌పోర్టులను లాక్కొని, తమను నేరస్థుల్లా చూస్తున్నారని వాపోయారు. ఈ మేరకు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఈ నెల 8న 12 మందితో కలిసి రష్యా పర్యటనకు బయలుదేరా. అవసరమైన అన్ని పత్రాలు నావద్ద ఉన్నాయి. అయినా రష్యా ఇమ్మిగ్రేషన్ అధికారులు మమ్మల్ని బంధించారు. నాతోపాటు 9 మందిని ఎలాంటి వివరణ ఇవ్వకుండా గంటల తరబడి నిర్బంధించారు. కేవలం ముగ్గురికే అనుమతిస్తున్నట్లు తెలిపారు. మా పాస్‌పోర్టులు లాక్కుని మరికొంత మంది భారతీయ ప్రయాణికులు ఉన్న గదిలో మమ్మల్ని బంధించారు. ఆ తర్వాత మరికొంతమంది అధికారులు వచ్చి మా మొబైల్ ఫోన్లలోని ఫొటో గ్యాలరీ, సెర్చ్ హిస్టరీ, యూట్యూబ్ యాక్టివిటీని తనిఖీ చేశారు. అనంతరం మమ్మల్ని దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. మా అందరినీ మరో గదిలోకి తరలించారు. అందులో 2, 3 రోజులుగా నిర్బంధంలో ఉన్నవారు ఉన్నారు. మమ్మల్ని ఎప్పుడు విడుదల చేస్తారో తెలియడం లేదు' అని తన్వర్ పేర్కొన్నారు.



గురుగ్రామ్‌లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలోని సదరన్ పెరిఫెరల్ రోడ్‌లో ఏర్పడిన భారీ గుంతలో పడిపోయిన మద్యంసీసాల ట్రక్కు. కుండపోత వర్షాల నేపథ్యంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది.

ట్రంప్‌పై దాడి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల వైఫల్యమే

- ఆరుగురిపై వేటు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో పెన్సిల్వేనియాలోని బట్లర్ కౌంటీలో డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పుల ఘటనకు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల వైఫల్యమే కారణమని తేలింది. ఈ క్రమంలో నాడు విధుల్లో ఉన్న ఆరుగురిని సస్పెండుచేస్తూ సీక్రెట్ సర్వీస్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మ్యాట్ క్విన్ వెల్లడించారు. వీరందరినీ భవిష్యత్తులో కీలక విధులకు దూరంగా ఉంచుతామని తెలిపారు. బట్లర్‌లో జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత సీక్రెట్ సర్వీస్‌దేనని స్పష్టం చేశారు.

ట్రంప్ సన్‌బాత్ చేసేటప్పుడు డ్రోన్‌తో దాడి చేస్తాం: ఇరాన్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇకపై ఆయన ఫ్లోరిడా నివాసం కూడా సురక్షితం కాదని ఇరాన్ పేర్కొంది. అధ్యక్షుడు సన్‌బాత్ చేస్తున్న సమయంలో ఒక డ్రోన్ ఆయన్ను ఢీకొట్టవచ్చని హెచ్చరించింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సలహాదారు జావద్ లారిజానీ ఈ హెచ్చరిక చేశారు. ట్రంప్‌నకు ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో రిసార్ట్ ఇకపై సురక్షితం కాదని లారిజాని పేర్కొన్నారు. డ్రోన్ దాడి సులభమైన పని అని వ్యాఖ్యానించారు.

ఈడీ సోదాల్లో డంకీ రూట్ ఏజెంట్ల గుట్టు రట్టు

- 30 పాస్‌పోర్టులు స్వాధీనం

దిల్లీ: భారతీయుల్ని అక్రమంగా విదేశాలకు పెద్దఎత్తున "డంకీ రూట్"లో తరలిస్తున్న పలువురు ఏజెంట్లు, ఇమ్మిగ్రేషన్ ఏజెన్సీలపై దాడులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించింది. వీరిలో ఒకరి నుంచి 30 ఒరిజినల్ పాస్‌పోర్టుల్ని స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ప్రకటించింది. పంజాబ్, హరియాణాలలో ఒక మనీలాండరింగ్ కేసుకు సంబంధించి సోదాలు జరుపుతుండగా "డంకీ రూట్" వ్యాపారాన్ని గురించిన సమాచారం బయట పడిందని ఈడీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రవాసార్థుల్ని కష్టసాధ్యమైన అక్రమ మార్గాల గుండా సుదీర్ఘకాలం నడిపించి విదేశాలకు చేర్చే ప్రక్రియకు డంకీ లేదా డాంకీ రూట్ అన్న పేరు స్థిరపడింది. దీనికి సంబంధించి పంజాబ్‌లోని అమృత్‌సర్, సంగ్రూర్, పాటియాలా, మోగాలతో పాటు హరియాణాలోని అంబాలా, కురుక్షేత్ర, కర్నాల్ ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు జరిపారు. అమెరికాకు వలస వెళ్లాలనుకునే వారిని ఏజెంట్లు మధ్యవర్తులు తప్పుడు హామీల ద్వారా మోసగించి వివిధ దేశాల సరిహద్దుల గుండా సాగే ప్రమాదకరమైన డంకీ మార్గంలో తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఇలా ప్రమాదకర మార్గంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏజెంట్లు తమ బాధితుల్ని బెదిరించి పెద్ద మొత్తాలు లాగుతున్నట్లు విచారణలో తేలింది. ఇలాంటి వ్యవహారాల్లో ఆరితేరిన ఒక ఏజెంట్ ఇంట్లో జరిగిన సోదాల్లో 30 ఒరిజినల్ పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకున్నారు.

ఆదివారం వస్తే.. ఆలయాల శుభ్రత



ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌కు చెందిన కొందరు విద్యార్థులు ఆదివారం వచ్చిందంటే.. చీపుర్లు, బకెట్లతో ఆలయాలకు చేరుకొని శుభ్రపరిచే కార్యక్రమంలో నిమగ్నం అవుతున్నారు. అనురాగ్ విశ్వకర్మ, తనిష్క్ సోనీ అనే ఇద్దరు యువకుల స్ఫూర్తితో వారు ఈ సేవామార్గంలో పయనిస్తున్నారు. నగరంలో నర్మదానది ఒడ్డున ఉన్న ఆలయంలో అపరిశుభ్రతను చూసి కలత చెందిన వీరిద్దరూ స్వయంగా ఆలయాన్ని శుభ్రపరిచి, ఆ వీడియోను వైరల్ చేశారు. గురుద్వారాలు, మసీదులు, చర్చీలు చాలా శుభ్రంగా ఉంటున్నాయని.. ఆలయాలు మటుకు పాలిథిన్ కవర్లు, పడేసిన పూజా సామగ్రితో అపరిశుభ్రంగా ఉన్నాయని వీడియోలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియోను చూసిన యువత భారీగా ముందుకువచ్చి మద్దతు తెలిపారు. తనిష్క్, అనురాగ్ 70 నుంచి 80 మంది యువతతో 'సనాతన్ సేవా గ్రూప్' ఏర్పాటు చేశారు. సభ్యుల సంఖ్య క్రమంగా పెరిగి, ప్రతి ఆదివారం వివిధ ఆలయాల్లో శుభ్రత పనులకు తోడు పరిసరాల్లో మొక్కలు కూడా నాటుతున్నారు.

సాయం నిలిపిన ట్రంప్.. అగమ్యగోచరంగా 'ఎయిడ్స్' నివారణ

లండన్: గడచిన ఆరు నెలలుగా ఎయిడ్స్ నివారణకు ఆర్థిక సాయాన్ని అమెరికా నిలిపివేయడంతో వ్యవస్థ దిగ్భ్రాంతికి గురైందని ఐరాస అధికారులు పేర్కొంటున్నారు. సాయాన్ని పునరుద్ధరించకుంటే 2029 నాటికి 40 లక్షలకుపైగా ఎయిడ్స్ మరణాలు సంభవిస్తాయని, 60 లక్షల మందికి కొత్తగా హెచ్ఐవీ సోకుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏళ్లుగా ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలకు అమెరికా అందించిన ఆర్థిక సాయం ఎంతోమందికి ప్రాణదానం చేసింది. నిస్సహాయ వర్గాలకు ఔషధ సాయం అంది మరణాలు గత మూడు దశాబ్దాలుగా కనిష్ఠ స్థాయికి చేరాయి. "నిధుల నిలిపివేత కారణంగా ఔషధ సరఫరా మార్గాలు మూసుకుపోయాయి. ఆరోగ్య కేంద్రాలు మూతపడ్డాయి. ఆస్పత్రుల్లో సిబ్బంది లేరు. హెచ్ఐవీ పరీక్షలు నిలిచిపోయాయి. అనేక ప్రజాసంస్థలు హెచ్ఐవీ నివారణ కార్యక్రమాలను తగ్గించడమో, నిలిపివేయడమో జరిగింది" అని యూఎన్ఎయిడ్స్ సంస్థ గురువారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇతర దాతలు కూడా ఈ పరిణామాల నేపథ్యంలో వెనకడుగు వేసే అవకాశం ఉందని, దీంతో దశాబ్దాలుగా ఎయిడ్స్ నివారణ రంగంలో సాధించిన పురోగతి మట్టిపాలయ్యే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత జనవరిలో విదేశీ సాయం మొత్తాన్ని నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో 2025లో ఎయిడ్స్ నివారణకు ఆ దేశం నుంచి రావాల్సిన 400 కోట్ల డాలర్లు నిలిచిపోయాయి.

గ్లోబల్ సిటిజన్ స్కాలర్‌షిప్‌నకు 10 మంది ఎంపిక

- అందులో 8 మంది భారతీయులే..

దిల్లీ: అత్యంత ప్రతిభ కలిగిన 10 మంది విద్యార్థులను రూ.కోటి విలువైన గ్లోబల్ సిటిజన్ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేసినట్లు సింగపూర్ అధికారులు తెలిపారు. వీరిలో ఇద్దరు మధ్యప్రాచ్య దేశాలకు చెందినవారుకాగా మిగిలిన 8 మంది భారతీయులే కావడం విశేషం. ఈ ఉపకార వేతనం పొందిన విద్యార్థులు 11, 12 తరగతులను సింగపూర్‌లోని (గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్) జీఐఐఎస్ స్మార్ట్ క్యాంపస్‌లో చదవనున్నారు. రెండేళ్ల కాలానికి 100 శాతం రుసుము, వసతి, జీవన వ్యయం అందుతాయి. 2008లో ప్రారంభమైన ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంకు అనేక దశల్లో వడపోతల తర్వాత విద్యార్థులను ఎంపిక చేస్తారు. కేవలం అకడమిక్ రికార్డులనే కాకుండా విద్యార్థిలో ఉన్న నాయకత్వ లక్షణాలు, సమాజంలో వారి పాత్ర, సమస్య పరిష్కార నైపుణ్యం తదితరాలను పరిశీలిస్తారు.

జమ్మూకశ్మీర్‌లో ఆశావహ పరిస్థితులు

- ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్య



కోల్‌కతాలో తనను కలిసేందుకు వచ్చిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: పహల్గాం ఉగ్ర దాడి అనంతరం తమ రాష్ట్రంలో పర్యాటకం తిరిగి పుంజుకోవడంతో ఆశావహ వాతావరణం నెలకొందని జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 'మా విషయంలో 2025 సంవత్సరం అంత తేలిగ్గా సాగలేదు. పహల్గాం దాడి అనంతరం జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకం కథ కంచికి చేరకుండా మరింతగా పుంజుకుంది' అని తెలిపారు. గురువారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక రంగానికి ఇదొక కొత్త ప్రారంభమని చెప్పారు. 'రాష్ట్రంలో పహల్గాం దాడికి పూర్వం హోటళ్లన్నీ నిండి ఉండేవి. దాల్ సరస్సులో పడవలు కిక్కిరిసి ఉండేవి. ఉగ్ర దాడి అకస్మాత్తుగా పరిస్థితిని తలకిందులు చేసింది. అయితే అనతి కాలంలోనే పరిస్థితి తిరిగి సాధారణంగా మారింది' అని ఒమర్ పేర్కొన్నారు. మరోవైపు తన కోల్‌కతా పర్యటన సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఒమర్ భేటీ అయ్యారు. దుర్గా పూజ అనంతరం కశ్మీర్‌లో పర్యటిస్తానని ఈ సందర్భంగా మమత తెలిపారు. కశ్మీర్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

టెన్నిస్ మాజీ క్రీడాకారిణిని కాల్చిచంపిన కన్నతండ్రి

గురుగ్రామ్: హరియాణాలో దారుణం చోటుచేసుకుంది. టెన్నిస్ మాజీ క్రీడాకారిణిని ఆమె కన్నతండ్రే కాల్చి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రస్థాయి క్రీడాకారిణి రాధికా యాదవ్ (25) గురుగ్రామ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసముంటోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో వంట చేస్తుండగా వెనుక నుంచి ఆమె తండ్రి దీపక్ యాదవ్ రివాల్వర్‌తో కాల్పులు జరపడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. ఆమె సంపాదనపై ఆధారపడి బతుకుతున్నానంటూ కుమార్తె తరచూ అవహేళన చేసేదని, అందుకే ప్రాణాలు తీశానని దీపక్ అంగీకరించినట్లు చెబుతున్నారు. రాధిక టెన్నిస్ అకాడమీని నిర్వహించడం తండ్రికి ఇష్టం లేకపోవడమే వారిద్దరి మధ్య ఘర్షణకు కారణమని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

స్మైల్ పథకాన్ని సవరించిన కేంద్రం

దిల్లీ: యాచకుల పునరావాసానికి, సంక్షేమానికి ఉద్దేశించిన 'స్మైల్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. మతపరమైన ట్రస్టులు, ఆలయ ధర్మకర్తల మండళ్లు సైతం ఈ పథకంలో భాగం కావాలని సూచించింది. పర్యాటక ప్రాంతాలు, నగరాలు, చారిత్రక ప్రదేశాల్లో దీని అమలుకు రాష్ట్రాలతో కలిసి దృష్టి సారించనున్నట్లు వివరించింది. పథకంలో భాగంగా సర్వే ద్వారా యాచకుల గుర్తింపు, ఆశ్రయం, దీర్ఘకాలిక పునరావాసం, సమాజంలో గౌరవం పొందేలా సమగ్ర పునరావాసం కల్పిస్తారు. ఈ పథకం కోసం మూడేళ్లకు దాదాపు రూ.100 కోట్లు కేటాయించింది. 2025-26లో కేటాయించిన రూ.37 కోట్లలో 30 శాతాన్ని సర్వే-తరలింపులకు, 50 శాతాన్ని పునరావాసం కల్పించేందుకు, మిగిలిన 20 శాతాన్ని పురోగతి సమీక్ష తర్వాత చివర్లో కేటాయించనున్నట్లు చెప్పింది. పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా అధికారులు సర్వేలు చేపట్టి యాచకులను గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పింది. పథకం ద్వారా తక్షణ సహాయంతో పాటు దీర్ఘకాలిక ఉపాధి లభించేలా విద్య నేర్పించి, నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చిన్నారులనైతే సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారు. దివ్యాంగులు, వృద్ధులు, వైద్యసాయం అవసరం ఉన్నవారి కోసం వైద్య సదుపాయంతో కూడిన శరణాలయాలను నిర్వహిస్తారు.

ఇకనైనా దేశంపై దృష్టి పెట్టండి: జైరాం

దిల్లీ: విదేశాల్లో పర్యటిస్తూ దేశ సమస్యలను మోదీ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. "తరచుగా విదేశాల్లో పర్యటించే మోదీకి భారత్ స్వాగతం పలుకుతోంది. మరో పర్యటనకు వెళ్లేలోపు బహుశా ఓ మూడు వారాలు మన దేశంలో ఉంటారేమో! ఇప్పుడైనా మణిపుర్ వెళ్లడానికి ఆయనకు తీరిక దొరుకుతుందో లేదో..! పహల్గాం ఉగ్రదాడి దోషులను ఇప్పటివరకు న్యాయస్థానం ముందు ఎందుకు నిలబెట్టలేదో కూడా మోదీ సమీక్ష చేయొచ్చు. సొంత రాష్ట్రం గుజరాత్‌లో వరుసగా కూలుతూ, మునుగుతున్న మౌలిక సదుపాయాలపైనా దృష్టి పెట్టొచ్చు. హిమాచల్‌కు సాయం చేయొచ్చు. తలచుకుంటే జీఎస్టీ సంస్కరణలూ తేవొచ్చు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల కోసం అఖిలపక్ష సమావేశానికి కూడా ఆయన అధ్యక్షత వహించవచ్చు" అని 'ఎక్స్'లో జైరాం రమేశ్ వ్యంగ్యాస్త్రం సంధించారు.

రైళ్ల భద్రతకు డీఎఫ్‌సీసీఐఎల్‌తో ఒప్పందం

దిల్లీ: రైళ్లు నడుస్తుండగానే కృత్రిమ మేధ సాయంతో పరీక్షించగలిగే సాంకేతిక వ్యవస్థ సమకూర్చుకునేందుకు 'భారత సరకురవాణా నడవా సంస్థ' (డీఎఫ్‌సీసీఐఎల్)తో భారతీయ రైల్వే ఒప్పందం కుదుర్చుకుంది. రైళ్ల కింది భాగంలో ఉండే పరికరాల విడిభాగాలు వేలాడుతున్నా, గల్లంతైనా ఇది క్షణాల్లో గురించి సంబంధిత వర్గాలను అప్రమత్తం చేస్తుంది. ఇలాంటిది సమకూర్చుకోవడం ఇదే తొలిసారి అవుతుందని రైల్వే మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జరగబోయే ప్రమాదాలను, ఆటంకాలను నివారించడంలో ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంది.



ఇజ్రాయెల్ బాంబుదాడులతో గురువారం ఉత్తర గాజా ప్రాంతంలో ఎగసిన మంటతో కూడిన పొగ

దలైలామా వారసుడు చైనా నుంచి రారు

- అరుణాచల్ ప్రదేశ్ సీఎం

దిల్లీ: ప్రజాస్వామ్య దేశం నుంచి దలైలామా వారసుడు వస్తారని.. చైనా నుంచి మాత్రం కాదని అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ పేర్కొన్నారు. "ఎక్కడైతే ప్రజాస్వామ్యం ఉంటుందో, ప్రజలు తమ భావాలు ఎక్కడైతే స్వేచ్ఛగా వ్యక్తపరుస్తారో, కచ్చితంగా అక్కడే దలైలామా ఉంటారు. చైనాలో ప్రజాస్వామ్యం లేదు'" అని సీఎం తెలిపారు. టిబెటన్ల ఆధ్యాత్మిక వారసుడి ఎంపికపై చైనా అభ్యంతరం వ్యక్తంచేయడంపై స్పందిస్తూ.. "ఆధ్యాత్మికతకు సొంత విధానం ఉంటుంది. చైనాలో దలైలామా సంస్థలు లేవు. టిబెటన్ బౌద్ధులు హిమాలయ ప్రాంతంలో దలైలామా సంస్థలు ఏర్పాటుచేశారు. దీనిపై చైనా ఎందుకు జోక్యం చేసుకుంటుందో తెలియదు" అని సీఎం అన్నారు.

న్యాయ విద్యార్థిని గ్యాంగ్‌రేప్‌పై హైకోర్టుకు నివేదిక

- సమర్పించిన బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా: న్యాయ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటనకు సంబంధించిన దర్యాప్తు నివేదికను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గురువారం కలకత్తా హైకోర్టుకు సమర్పించింది. ఈ మేరకు పోలీసులు నమోదు చేసిన కేసు డైరీని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. "కళాశాల పనివేళలు ముగిశాక పూర్వ విద్యార్థిని కళాశాలలోకి ఎలా అనుమతించారు? కళాశాల యాజమాన్య పర్యవేక్షణ లేకుండా సిబ్బంది చాలాసేపు క్యాంపస్‌లో ఎందుకున్నాడు? బాధితురాలికి అప్పటికే నిందితుడి నుంచి బెదిరింపులు వస్తున్నాయని తెలిసి యాజమాన్యం ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అంటూ పిటిషనర్ ప్రశ్నించారు. వీటికి సమాధానాలతో తదుపరి నివేదికను నాలుగు వారాల తర్వాత కోర్టు ముందు ఉంచాల్సిందిగా జస్టిస్ సౌమెన్ సేన్ అధ్యక్షతన డివిజన్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

రూ.2 వేల అప్పు తిరిగి చెల్లించమంటే.. కత్తితో పొడిచి హత్య: ముగ్గురి అరెస్టు

దిల్లీ: దేశ రాజధాని నగరంలోని జఫ్రాబాద్ పోలీస్‌స్టేషను పరిధిలో.. తీసుకొన్న రూ.2 వేల రుణం తిరిగి చెల్లించమని అడిగినందుకు ఫర్దీన్ (23) అనే యువకుణ్ని నిందితులు కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. హత్య జరిగిన కొన్ని గంటల వ్యవధిలో ప్రధాన నిందితుడు ఆదిల్ (30)తోపాటు అతడి తండ్రి, సోదరుణ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. మిత్రుడు జావేద్‌తో కలిసి వెళుతున్న ఫర్దీన్ దారిలో ఎదురుపడిన ఆదిల్‌ను తనకు ఇవ్వాల్సిన రూ.2 వేల గురించి అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆదిల్ తన జేబులో నుంచి కత్తి తీసి వారిద్దరిపై దాడి చేసి పరారయ్యాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆదిల్ తండ్రి షకీల్ (58), సోదరుడు కమల్ (28) దాడిని ప్రోత్సహించినట్లు పోలీసులు తెలిపారు. ఆదిల్‌పై ఇదివరకే మూడు కేసులు, కమల్‌పై నాలుగు కేసులు ఉన్నాయని చెప్పారు.



మేరఠ్ పరిసరాల్లో భూమి కంపించడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు

హరియాణాలో 4.4 తీవ్రతతో భూకంపం

- దిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు

దిల్లీ: హరియాణాలో గురువారం రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని ప్రకంపనలు దేశ రాజధాని దిల్లీ, పరిసర ప్రాంతాల్లో కనిపించాయి. హరియాణాలోని ఝజ్జర్ ప్రాంతంలో 10 కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. రోహతక్, గురుగ్రామ్, పానీపత్, హిసార్, మేరఠ్ జిల్లాల్లో ఉదయం 9.04 గంటల సమయంలో భూప్రకంపనలు వచ్చాయి. భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

ఈనాడు సినిమా



బాహుబలి... ఈసారి ఒకే సినిమాగా!


బాహుబలి మళ్లీ వస్తున్నాడు. అయితే ఈసారి ఒకే సినిమాతో సందడి చేయనున్నారు. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై గురువారంతో పదేళ్లయింది. ఈ సందర్భంగా సినిమాని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు దర్శకుడు రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. అయితే రెండు భాగాలుగా వచ్చిన ఈ సినిమాల్ని.. ఈసారి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంగా ఈ ఏడాది అక్టోబరు 31న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. చిత్ర దర్శకుడు రాజమౌళి ఎక్స్ ద్వారా స్పందిస్తూ... "ఎన్నో ప్రయాణాలకు నాంది... 'బాహుబలి'. ఎన్నో జ్ఞాపకాలు, మరెంతో ప్రేరణ. ఈ సినిమా విడుదలై పదేళ్లయింది. రెండు భాగాలుగా అలరించిన బాహుబలి సంయుక్త చిత్రంగా ఒకే భాగంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంద"ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్, రానా, రాజమౌళి, రమ్యకృష్ణ, శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని తదితరులు పాల్గొన్నారు.

దుల్కర్.. వినూత్నమైన కథతో


దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ తెలుగులో వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన చేస్తున్న తెలుగు సినిమా 'ఆకాశంలో ఒక తార' చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడాయన మరో కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సమయాత్తమవుతున్నారు. దీనితో రవి అనే ఓ కొత్త దర్శకుడు తెరకు పరిచయం కానున్నట్లు తెలిసింది. దీన్ని ఎస్ఎల్‌వీసీ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఆగస్టు తొలి వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇది దుల్కర్ శైలికి తగ్గట్లుగా ఓ వినూత్నమైన కథతో రూపొందనుందని తెలుస్తోంది. ఆయనకు జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి.

హిట్టు కలయిక మరోసారి!


శ్రీవిష్ణు

ఇటీవలే 'సింగిల్' చిత్రంతో సినీ ప్రియుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో శ్రీవిష్ణు. ప్రస్తుతం ఆయన 'మృత్యుంజయ' అనే సినిమాతో పాటు కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీరావుతో ఓ చిత్రం చేస్తున్నారు. అయితే ఇప్పుడీ జాబితాలోకి మరో సినిమా కూడా చేరినట్లు తెలుస్తోంది. 'సామజవరగమన' చిత్రంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు రామ్ అబ్బరాజు. ఇప్పుడాయన శర్వానంద్‌తో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇది పూర్తయ్యాక రామ్ మరోసారి శ్రీవిష్ణుతో చేతులు కలపనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే తను ఓ వినోదాత్మక కథను సిద్ధం చేశారు. అది విష్ణుకి కూడా నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది.



ప్రేమకు ప్రతిఫలంగా కోరుకునేది ప్రేమనే!

సినిమా: 'ఆప్ జైసా కోయీ'
నటీనటులు: ఆర్.మాధవన్, ఫాతిమా సనా షేక్
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

రెడీ ఇన్ ఓటీటీ

కథాంశం: సంప్రదాయ కుటుంబానికి చెందిన 40ఏళ్ల వయసున్న సంస్కృతం టీచర్ శ్రీరేణు. ఆధునిక కుటుంబంలో పుట్టి.. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే అమ్మాయి మధు బోస్. తన జీవితంలో పెళ్లి ఓ కలగానే మిగిలిపోతుందని బాధపడుతున్న శ్రీరేణుకు.. ఈ మోడ్రన్ మధు పరిచయం అయితే ఎలా ఉంటుంది? వీరిద్దరికి జోడీ కుదురుతుందా? ఇవన్నీ తెలుసుకోవాలంటే 'ఆప్ జైసా కోయీ' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ విలక్షణ నటుడు ఆర్.మాధవన్, ఫాతిమా సనా షేక్ జంటగా నటించిన చిత్రమిది. వివేక్ సోని దర్శకుడు. ఇందులో శ్రీరేణుగా మాధవన్, మధు పాత్రలో ఫాతిమా కనిపించనున్నారు. పెళ్లి కోసం తంటాలు పడుతున్న శ్రీరేణు.. సామాజిక మాధ్యమాల ద్వారా మధు పరిచయం అవుతుంది. వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకుంటారు. కానీ సంప్రదాయాలకు విలువనిచ్చే శ్రీరేణు కుటుంబానికి.. నేటి తరానికి చెందిన మధు ప్రాముఖ్యత నచ్చదు. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సినిమా కథాంశం. మరి "ప్రేమకు ప్రతిఫలంగా ప్రేమను మాత్రమే కోరుకోవాలి', సంస్కృతం టీచర్ అయినా.. ప్రేమకు పూర్తి నిర్వచనం తెలీదు" అంటోన్న ఈ జంట కథేంటో మీరూ చూసేయ్యండి.

అణుబాంబు కన్నా ప్రమాదకరమైనది కాపీయింగ్

– ఆర్.నారాయణమూర్తి



"విద్యను జాతీయం చేయడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ (పేపర్ లీక్)' అంటున్నారు ఆర్. నారాయణమూర్తి. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ. . స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా సరికొత్తగా ఆగస్టు 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గోరటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. "గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీకులు.. గ్రూపు 1-2 లాంటి ఉద్యోగ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకులు చూస్తుంటే చదువులకు ఏమైందనిపిస్తోంది. ఇదిలా కొనసాగితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి. నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై అమెరికా వేసిన అణుబాంబు కన్నా చాలా ప్రమాదకరమైనది కాపీయింగ్. చూసి రాసిన వాళ్లు డాక్టర్లయితే రోగులు బతుకుతారా.. ఇంజినీర్లయితే వాళ్లు కట్టిన భవనాలు, వంతెనలు నిలబడతాయా? అందుకే ఇలాంటి దారుణాలు జరగకూడదంటే ప్రశ్నా పత్రాలు లీకుల మయం కాకూడదు. నా మిత్రులు అద్దంకి దయాకర్, అందెశ్రీ మన రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇప్పిస్తామన్నారు. దానికి వాళ్లకు కృతజ్ఞతలు. కాకపోతే నాకు పన్ను మినహాయింపు ఏమీ వద్దు. ప్రభుత్వం నుంచి ఏ సహకారం వద్దు. సినిమాని ప్రజల్లోకి తీసుకెళ్లండి చాలు" అన్నారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కొత్త చిత్రాలకి శ్రీకారం


ధనుష్

తమిళ కథానాయకుల్లో చాలా మంది తెలుగులోనూ బలమైన మార్కెట్‌ని సొంతం చేసుకున్నారు. కార్తి, ధనుష్ అయితే అప్పుడప్పుడూ తెలుగులోనూ సినిమాలూ చేస్తుంటారు. వీళ్లు ఎక్కడ సినిమాలు చేసినా సరే, ఇటు తెలుగు, అటు తమిళం... రెండు భాషల్లోనూ తప్పనిసరిగా విడుదలవుతూ ఉంటాయి. ఇటీవలే 'కుబేర' సినిమాతో సందడి చేశారు ధనుష్. ఇప్పుడు మరో కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. ఆయన 54వ చిత్రం గురువారం ప్రారంభమైంది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. డా. ఇషారి కె.గణేశ్ నిర్మాత. ధనుష్ సరసన 'ప్రేమలు' ఫేం మమితా బైజు కథానాయికగా నటిస్తోంది. యాక్షన్ డ్రామా కథతో రూపొందుతున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణని కూడా గురువారమే ప్రారంభించారు.

కార్తి కథానాయకుడిగా... 'మార్షల్'


కల్యాణి ప్రియదర్శన్, కార్తి


మనలో ఒకడు అనిపిస్తూ 'సత్యం సుందరం' సినిమాతో సందడి చేసిన కార్తి తన 29వ చిత్రంగా 'మార్షల్' చేస్తున్నారు. తమిజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్నారు. ఇందులో కార్తి సరసన కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. రెగ్యులర్ చిత్రీకరణని కూడా ప్రారంభించారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా కార్తి కెరీర్‌లో మరపురాని చిత్రంగా నిలిచిపోతుందని సినీ వర్గాలు తెలిపాయి.

ఆ మాటతో తొమ్మిది సినిమాల నుంచి తీసేశారు


విద్యాబాలన్

'పరిణీత' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన విద్యాబాలన్ తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. సిల్క్‌స్మిత జీవితకథ ఆధారంగా రూపొందిన 'ది డర్టీ పిక్చర్' సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మహిళా ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకొంటూనే మంచి గుర్తింపు సాధించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్ ప్రారంభంలో ఎదురైన చేదు అనుభవాల్ని పంచుకున్నారు. బాలీవుడ్ ప్రయాణానికి ముందే దక్షిణాదిలోని ఓ సినిమా మధ్యలో ఆగిపోవడం వల్ల తొమ్మిది చిత్రాల నుంచి ఆమెను తీసేశారని, అంతేకాదు ఆమెపై ఐరెన్‌లెగ్ అనే ముద్ర పడిందన్నారు. "మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్‌తో కలిసి 'చక్రం' అనే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఆ సినిమా గురించి వార్తలు దక్షిణాది నుంచి ఉత్తరాది సినీపరిశ్రమలకు వ్యాపించాయి. దాంతో పలు చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. కానీ అనూహ్యంగా 'చక్రం' మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ఆ సినిమా ఆగిపోవడానికి నేనే కారణమంటూ ప్రచారం జరిగింది. దాంతో ఇండస్ట్రీలో నన్ను 'ఐరెన్ లెగ్' అన్నారు. ఆ వెంటనే నేను ఒప్పుకున్న తొమ్మిది ప్రాజెక్ట్‌ల నుంచి నన్ను తొలగించారు. నిజానికి ఆ సినిమా ఆగిపోవడానికి కారణం నేను కాదు. మోహన్‌లాల్‌కు, ఆ చిత్ర దర్శకుడితో అభిప్రాయ భేదాల వల్ల అది ఆగిపోయింద"ని తెలిపారు. ఆ ప్రభావం తన కెరీర్‌పై పడిందన్నారు విద్య. అంతేకాదు తనపై తనకున్న నమ్మకమే ఈ రోజు తనను ఈ స్థాయిలో ఉంచిదన్నారు. ప్రారంభంలో అమితాబ్ బచ్చన్, టబు లాంటి నటీనటులు కూడా తిరస్కరణలకు గురయ్యారని అలా వాళ్లని గుర్తుచేసుకుని కెరీర్‌లో ముందుకుసాగినట్లు తెలిపారు.

దేవుడంటే నిజమో అబద్ధమో కాదు.. నమ్మకం!


మనోజ్ చంద్ర

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాల నందించిన నిర్మాత ప్రవీణ పరుచూరి. ఇప్పుడామె 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయం కానున్నారు. మనోజ్ చంద్ర, మోనిక టి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఇది ఈ నెల 18న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. కొత్తపల్లిలోని లోకల్ రికార్డ్ డ్యాన్స్ స్టూడియో యజమాని రామకృష్ణ అదే ఊరికి చెందిన సావిత్రిని ప్రేమిస్తాడు. ఓరోజు ఆమె.. రామకృష్ణను గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. అయితే ఉత్సాహంగా అక్కడికి వెళ్లిన అతనికి ఊహించని సన్నివేశం కనిపిస్తుంది. మరి అదేంటి.. ఆ ఘటన తర్వాత రామకృష్ణ జీవితం, తన ప్రేమకథ ఎన్ని మలుపులు తిరిగింది? అన్నది ఆసక్తికరం. 'దేవుడంటే నిజమో అబద్ధమో కాదు. నమ్మకం" అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇది మిస్టీరియస్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందినట్లు అర్థమవుతోంది. ఈ సినిమాకి నిర్మాతలు: గోపాలకృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి.

భార్యాభర్తల చిలిపి గొడవ



విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటిస్తున్న చిత్రం 'తలైవాన్ తలైవి'. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లోకి రానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం తెలుగులో 'సార్ మేడమ్' అనే టైటిల్‌తో విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం వెల్లడిస్తూ టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ పెళ్లికి ముందు ఓ అమ్మాయికి మెట్టినింటి వాళ్లు చెప్పే మాటలతో ప్రారంభమై..సరదాగా భార్యభర్తల మధ్య జరిగే చిలిపి గొడవతో సాగుతుంది. నిత్యా మేనన్, విజయ్ సేతుపతిల మధ్య సాగే సంభాషణలు ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ ప్రారంభంలో వంట మాస్టర్‌లా కనిపించిన హీరో చివర్లో మాస్ యాక్షన్ లుక్‌తో కనిపిస్తున్న ఈ టైటిల్ టీజర్ ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

వాస్తవ సంఘటనల.. ఉసురే

టీజై అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా నవీన్ డి గోపాల్ తెరకెక్కించిన చిత్రం 'ఉసురే'. మౌళి ఎం రాధాకృష్ణ నిర్మించారు. రాశి కీలక పాత్ర పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా ఆగస్టు 1న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. "వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లుకున్న వైవిధ్యభరితమైన గ్రామీణ ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. తప్పకుండా అందరి హృదయాల్ని హత్తుకునేలా ఉంటుంది. కొత్తదనం కోరుకునే తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుంది" అన్నారు.


టీజై అరుణాచలం, జననీ

తిమ్మరాజుపల్లి టీవీ విశేషాలు

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్ర పరిశ్రమకి వచ్చి... అవకాశాల కోసం ఎదురు చూస్తున్న ఔత్సాహిక నటీనటులు, సాంకేతిక నిపుణులకి అండగా నిలుస్తానని కిరణ్ అబ్బవరం తన 'దిల్ రూబా' సినిమా వేడుకలో చెప్పారు. ఆ మాట మేరకే కొత్తతరం నటులు, సాంకేతిక నిపుణులతో సుమైర స్టూడియోస్ సంస్థతో కలిసి తన సొంత నిర్మాణ సంస్థ కె.ఎ.ప్రొడక్షన్స్ పతాకంపై ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు కిరణ్. 'తిమ్మరాజుపల్లి టీవీ' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంతో సాయితేజ్, వేద శ్రీ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. వి.మునిరాజు దర్శకుడు. కిరణ్ అబ్బవరం సినిమాలకి సాయితేజ్ గతంలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేయగా, మునిరాజు ఆన్‌లైన్ ఎడిటింగ్ చేశారు. గ్రామీణ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుంది.


'తిమ్మరాజుపల్లి టీవీ'

'జైలర్ 2' సెట్స్‌లోకి!


మోహన్‌లాల్

రజనీకాంత్ నటించిన విజయవంతమైన సినిమా 'జైలర్'లో మాధ్యూగా అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించారు మోహన్‌లాల్. ఇప్పుడీ ఇద్దరూ 'జైలర్ 2' కోసం మరోసారి చేతులు కలిపేందుకు సిద్ధమయ్యారు. 'జైలర్'కు కొనసాగింపుగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. రమ్యకృష్ణ, మిర్నా మేనన్, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే తొలి భాగంలో కనిపించిన అతిథి పాత్రలతో పాటు మరికొన్ని పాత్రలు ఈ రెండో భాగంలో కనిపించనున్నాయి. అయితే ఇప్పుడీ సినిమా కోసం మోహన్‌లాల్ చెన్నైలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో అడుగు పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనతో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే రజనీ కూడా తిరిగి సెట్‌లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ కోసం త్వరలోనే బాలకృష్ణతో పాటు శివ రాజ్‌కుమార్ కూడా సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇది వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.

56వ 'ఇఫీ'లో ఓటీటీలకు చోటు

56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫీ) నవంబరు 20 నుంచి 28వరకు గోవాలో జరగనుంది. దీని నిర్వహణకు కేంద్ర సమాచార ప్రసార మంత్రి అశ్వని వైష్ణవ్ అధ్యక్షతన 31 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీని కేంద్రం గురువారం ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్‌లో తొలిసారి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రతినిధులకు కూడా చోటు కల్పించారు. గోవాలో జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ చలనచిత్ర దర్శకుడు శేఖర్ కపూర్‌ను డైరెక్టర్‌గా నియమించారు. ఈ ఏడాది స్టీరింగ్ కమిటీని 16 నుంచి 31 సభ్యులకు విస్తరించారు. ఈ విస్తరణ మరింత సమగ్రమైన పరిశ్రమ వ్యాప్తి విధానాన్ని సూచిస్తుందని సమాచార మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. "మొదటిసారిగా ప్రపంచ మీడియా వినోద, దృశ్య మాధ్యమంగా అభివృద్ధి చెందుతున్న అమెజాన్ ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా, వయాకామ్ లాంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు చేర్చడం జరిగింద"ని తెలిపింది. ఈ కమిటీకి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ సహ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

సల్మాన్‌తో చిత్రాంగద

బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్ ఖాన్ ఆర్మీ అధికారిగా నటిస్తున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్ కథానాయిక పాత్ర పోషించనుందని అపూర్వ లఖియా వెల్లడించారు. భారత్ - చైనా సరిహద్దుల వద్ద 2020లో గాల్వాన్‌లో జరిగిన యుద్ధ నేపథ్యంలో నిజజీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్రాంగద సింగ్ గురించి మాట్లాడుతూ..."చిత్రాంగద నటనాశైలీ, ప్రతిభ తనని ఈ పాత్రకి ఎంపిక చేసేలా చేశాయి. తనతో కలిసి పనిచేయాలని ఎల్లప్పుడూ కోరుకుంటున్నాన"ని లఖియా పేర్కొన్నారు. ఈ సినిమాతో సల్మాన్‌తో తొలిసారి తెరను పంచుకోనుంది చిత్రాంగద.


చిత్రాంగద సింగ్

ఈనాడు బిజినెస్

ఎల్ఐసీలో స్వల్ప వాటా విక్రయించనున్న ప్రభుత్వం

దిల్లీ: బీమా రంగ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)లో స్వల్ప వాటా విక్రయించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందు కోసం పెట్టుబడుల ఉపసంహరణ విభాగం పనిచేస్తోంది. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.5% వాటా ఉంది. 2022 మేలో ఐపీఓ ద్వారా కంపెనీలో 3.5% వాటాను ప్రభుత్వం విక్రయించి, దాదాపు రూ.21,000 కోట్లు సమీకరించింది. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల ప్రకారం.. 2027 మే 16 నాటికి.. ఎల్ఐసీలో మొత్తం 10% వాటాను ప్రభుత్వం విక్రయించాల్సి ఉంది. ఈ ప్రకారం ప్రభుత్వం మరో 6.5% వాటా విక్రయించాల్సి ఉంది. ఇందులో ప్రస్తుతం ఎంతమేర విక్రయించాలనుకుంటోందీ తెలియలేదు. ప్రస్తుతం ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.5.85 లక్షల కోట్లుగా ఉంది.

చైనా మార్కెట్లోకి 'దక్కన్' రైస్

ఈనాడు, హైదరాబాద్: 'దక్కన్' బ్రాండు పేరుతో బియ్యాన్ని ఎగుమతి చేస్తున్న దక్కన్ గ్రెయిన్జ్ ఇండియా, తాజాగా చైనాలోకీ అడుగుపెట్టింది. ఇప్పటికే ఈ సంస్థ అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, స్వీడన్, జర్మనీ, ఐర్లాండ్, తుర్కియేతో పాటు కొన్ని ఐరోపా దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తోంది. వరి సాగులో మనదేశం తర్వాత చైనా అగ్రగామిగా ఉండగా, అక్కడ దక్కన్ బ్రాండును పరిచయం చేయడాన్ని కీలక మైలురాయిగా సంస్థ పరిగణిస్తున్నట్లు దక్కన్ గ్రెయిన్జ్ ఇండియా డైరెక్టర్ కిరణ్ కుమార్ ఇక్కడ తెలిపారు. అమెరికాలో నాన్-బాస్మతీ బియ్యం మార్కెట్లో దక్కన్ బ్రాండు అగ్రస్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రైతుల నుంచి నాణ్యమైన బియ్యం కొనుగోలు చేసి, విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు వివరించారు. అత్యధికంగా సోనా మసూరి రకాన్ని ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ సమీపంలోని సుల్తాన్‌పూర్‌లో ఇటీవల సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన మిల్లులో వడ్ల ప్రాసెస్ చేసి, అక్కడి నుంచి బియ్యాన్ని విదేశాలకు పంపుతున్నట్లు వెల్లడించారు. త్వరలో దేశీయ మార్కెట్లోనూ దక్కన్ బ్రాండును పరిచయం చేస్తామని తెలిపారు.

హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీగా ప్రియా నాయర్



దిల్లీ: హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) కొత్త సీఈఓ, ఎండీగా ప్రియా నాయర్ నియమితులయ్యారు. 2025 ఆగస్టు 1 నుంచి అయిదేళ్ల పాటు ఆమె పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం యూనిలీవర్ ప్రెసిడెంట్ (బ్యూటీ, వెల్‌బీయింగ్)గా ఆమె వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31న కంపెనీ సీఈఓ, ఎండీ బాధ్యతల నుంచి తప్పుకోనున్న రోహిత్ జావా స్థానాన్ని ప్రియా భర్తీ చేయనున్నారు. 'హెచ్‌యూఎల్ బోర్డులోనూ ఆమె చేరనున్నారు. ఇందుకు నియంత్రణపరమైన అనుమతులు లభించాల్సి ఉంటుంది. 1995లో హెచ్‌యూఎల్‌లో చేరిన ప్రియా నాయర్, పలు కీలక పదవులు నిర్వహించారు. హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీగా బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళగా ప్రియా నిలిచారు.

కోడి గుడ్డు
11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	540
గోదావరి	515
విశాఖపట్నం	540
చిత్తూరు	603

టీసీఎస్ లాభం రూ.12,760 కోట్లు

ఏప్రిల్- జూన్ ఆర్థిక ఫలితాలు (2025–26 / 2024–25)

	2025–26	2024–25	వృద్ధి
లాభం	రూ.12,760 కోట్లు	రూ.12,040 కోట్లు	6%
ఆదాయం	రూ.63,437 కోట్లు	రూ.62,613 కోట్లు	1.3%

సిబ్బంది సంఖ్య

2025 జూన్ 30	2025 మార్చి 31	2024 జూన్ 30
6,13,069	6,07,979	6,06,998

నికరంగా పెరిగింది 5,090 మంది; ఏడాది వ్యవధిలో నికరంగా పెరిగింది 6,071



ముఖ్యాంశాలు
- ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో టీసీఎస్ నికర లాభం అంచనాలను మించి నమోదైంది.
- స్థిరకరెన్సీ రూపేణా ఆదాయంలో 3% క్షీణత
- ప్రస్తుతం కంపెనీ వద్ద ఏఐ నైపుణ్యాలున్న సిబ్బంది 1,14,000 మంది
- ఏప్రిల్- జూన్‌లో కంపెనీ 9.4 బిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లు దక్కించుకుంది.
- ఉద్యోగుల ప్రయోజనాల కోసం వ్యయాలు 3.6% పెరిగి రూ.37,715 కోట్లకు చేరాయి.
- కంపెనీ మొత్తం వ్యయాలు 1.6% పెరిగి రూ.48,118 కోట్లుగా నమోదయ్యాయి.

వలసల రేటు (%లో)
2025 జనవరి- మార్చి 13.3
2025 ఏప్రిల్- జూన్ 13.8
పెరుగుదల 0.5

రూ.11 (1100%) మధ్యంతర డివిడెండు. రికార్డు తేదీ 2025 జులై 16. ఆగస్టు 4 కల్లా చెల్లింపు

24.5% నిర్వహణ మార్జిన్

2025-26లో తాజా ఉత్తీర్ణుల నియామకాల లక్ష్యం– 42,000

విపణులవారీగా స్థిర కరెన్సీలో ఆదాయ వృద్ధి/క్షీణత (%లో)

ఉత్తర అమెరికా	–2.7
లాటిన్ అమెరికా	3.5
బ్రిటన్	–1.3
ఐరోపా	–3.1
ఆసియా పసిఫిక్	3.6
భారత్	–21.7
పశ్చిమాసియా, ఆఫ్రికా	9.4



'అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కొనసాగుతుండటంతో గిరాకీలో క్షీణత కారణమైంది. 2024-25తో పోలిస్తే 2025-26లో అంతర్జాతీయ వ్యాపార విభాగాలు మెరుగైన ప్రదర్శన కనబరుస్తాయి. 2025-26 మొత్తం ఆదాయంలో కిందటేడాది కంటే వృద్ధి నమోదు కాబోతోంది.'
– కె కృతివాసన్, ఎండీ, సీఈఓ, టీసీఎస్

'ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి టీసీఎస్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. కొత్త సాంకేతికతలపై నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏప్రిల్- జూన్‌లో మా సిబ్బంది 1.5 కోట్ల గంటల సమయాన్ని వెచ్చించారు. ఏఐ వల్ల సిబ్బంది సంఖ్యను తగ్గించుకోవాలని అనుకోవడం లేదు. సిబ్బంది వేతన పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాజా ఉత్తీర్ణుల నియామకాలపై నిర్దేశిత లక్ష్యం ప్రకారం వెళ్తున్నాం'.
– మిలింద్ లక్కడ్, ముఖ్య మానవ వనరుల అధికారి

ఇప్పటికే షేరుకు 18% నష్టం
ఈ ఏడాదిలో ఇప్పటివరకు టీసీఎస్ షేరు 18% నష్టపోయింది. గత ఆరు నెలల్లో 21% నష్టపోగా.. నెల వ్యవధిలో 2% తగ్గింది. అంతర్జాతీయ అనిశ్చితులే ఇందుకు కారణం. గురువారం బీఎస్ఈలో 0.06% నష్టపోయి, రూ.3382 వద్ద స్థిరపడింది.

ఆసియాలోని 10 అగ్రగామి టెక్ నగరాల్లో హైదరాబాద్



దిల్లీ: టెక్ నిపుణుల లభ్యత అత్యధికంగా ఉన్న ఆసియా-పసిఫిక్‌లోని 10 అగ్రగామి నగరాల్లో మనదేశంలోనే 6 ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి, పుణె, చెన్నైలలో సాంకేతిక నిపుణుల లభ్యత అత్యధికంగా ఉన్నట్లు 'కొలియర్స్ గ్లోబల్ టెక్ మార్కెట్స్: టాప్ టాలెంట్ లొకేషన్స్ 2025' నివేదిక వెల్లడించింది. ఆసియా-పసిఫిక్ దేశాలకు సంబంధించి అగ్రగామి 5 నగరాల్లో సింగపూర్ మాత్రమే భారత్‌కు వెలుపల ఉన్న నగరమని వివరించింది. అగ్రగామి 10 నగరాల్లో తైపే, సిడ్నీ, మెల్‌బోర్న్ కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూసినా టెక్ నిపుణుల లభ్యత మనదేశంలో అత్యధికంగా ఉంది. నిపుణులకు అవకాశాలు, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్, కార్మిక సూచీ, అందుబాటులోకి వచ్చే నిపుణులు, భిన్న రంగాలకు కావాల్సిన నిపుణుల లభ్యత వంటి అంశాల్లో అంతర్జాతీయంగా 200 మార్కెట్లను విశ్లేషించి, ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

ఈ నివేదిక ప్రకారం..

✦ డేటా సైంటిస్టుల లభ్యత బెంగళూరులో అధికంగా ఉంది. 25 ఏళ్లలోపు సాంకేతిక నిపుణుల్లో అధికులు హైదరాబాద్‌లోనే ఉన్నారు.
✦ ఆసియా-పసిఫిక్ దేశాల్లోని టెక్ నిపుణుల్లో 69% మంది భారత నగరాల్లోనే ఉన్నారు. ✦ ప్రపంచ అగ్రగామి 10 టెక్ నిపుణుల కేంద్రాల్లోనూ.. బెంగళూరు, బీజింగ్, టోక్యో ఉన్నాయి.
✦ అత్యంత కీలక నైపుణ్యాలు, ఐటీకి కావాల్సిన మౌలిక వసతులు, గ్రేడ్ ఏ కార్యాలయ స్థలాలు, తక్కువ నిర్వహణ - నిపుణుల వ్యయాల వంటివి టెక్నాలజీ రంగంలో భారత్‌ను ప్రపంచానికే ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి.

ఫిన్‌టెక్ 'వైజ్' కేంద్రం హైదరాబాద్‌లో

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డబ్బు తరలించడం, నిర్వహణకు సంబంధించిన ఫిన్‌టెక్ సేవల సంస్థ వైజ్, హైదరాబాద్‌లో తన కేంద్రాన్ని ప్రారంభిస్తోంది. ఇందులో వందల సంఖ్యలో సిబ్బందిని నియమిస్తామని వెల్లడించింది. ప్రోడక్ట్, ఇంజినీరింగ్, సర్వీసింగ్ విభాగాల్లో నియామకాలు చేపడతామని వెల్లడించింది. అంతర్జాతీయ ఖాతా వివరాల సదుపాయమూ ఇక్కడ లభిస్తుంది. దీనివల్ల వ్యాపారవేత్తలు మధ్యస్థ మార్కెట్ మారకపు రేటుతో 8 కరెన్సీల్లో (డాలర్, పౌండ్, యూరో, ఆస్ట్రేలియా డాలర్, సింగపూర్ డాలర్ తదితరాలు) విదేశాల నుంచి చెల్లింపులు పొందొచ్చు. హైదరాబాద్ కేంద్రం నిర్వహణ బాధ్యతలను స్మృతి రవి చేపడతారు. హైదరాబాద్‌లో అత్యంత నైపుణ్యాలున్న ఇంజినీర్ల లభ్యత అధికంగా ఉన్నందునే, వైజ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రపంచ కార్యకలాపాల్లో, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్‌లో ఈ కేంద్రం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని స్మృతి తెలిపారు.

2.5 లక్షల డాలర్లు పంపొచ్చు: వైజ్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన కంపెనీ. 2013 నుంచి అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ప్రవాస భారతీయులు మనదేశానికి పంపుతున్న సొమ్ములో (రిమిటెన్సెస్) 10% వైజ్ ప్లాట్‌ఫామ్ ద్వారానే వస్తోంది. 2021లో వైజ్, మనదేశం నుంచి 'లైట్నింగ్ ఫాస్ట్ ట్రాన్స్‌ఫర్స్' సదుపాయాన్ని ప్రారంభించింది. ఎల్ఆర్ఎస్ (లిబరలైజ్డ్ రిమిటెన్స్ స్కీమ్) కింద గరిష్ఠ పరిమితి అయిన 2.5 లక్షల డాలర్ల వరకు వైజ్ కస్టమర్లు మనదేశం నుంచి విదేశాలకు పంపించొచ్చు. గంటన్నర వ్యవధిలోనే ఈ సొమ్ము విదేశీ ఖాతాలోకి జమవుతుంది కూడా.
✦ ఈ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా, వివిధ దేశాల క్లయింట్లకు సంబంధించిన 118.5 బిలియన్ పౌండ్ల సొమ్మును ఒక చోటి నుంచి మరో చోటికి బదిలీ చేసింది.

జీవిత కాల బ్యాటరీ వారెంటీతో టాటా నెక్సాన్, కర్వ్ ఈవీ



దిల్లీ: జీవిత కాల వారెంటీతో హైఓల్టేజ్ (హెచ్‌వీ) బ్యాటరీలను నెక్సాన్.ఈవీ (45 కిలోవాట్‌అవర్), కర్వ్.ఈవీ వాహనాలకు అందించబోతున్నట్లు టాటా మోటార్స్ గురువారం ప్రకటించింది. ఈ ప్రయోజనం ప్రస్తుత యజమానులతో పాటు కొత్తగా ఈ రెండు విద్యుత్ ఎస్‌యూవీలు కొనుగోలు చేయబోతున్న వారికీ వర్తిస్తుందని తెలిపింది. నెక్సాన్.ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ (30 కిలోవాట్‌అవర్, 45 కిలోవాట్‌అవర్) ఎంపికల్లో లభిస్తుండగా, జీవిత కాల వారెంటీ బ్యాటరీ నెక్సాన్.ఈవీ 45 కిలోవాట్ అవర్‌కు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. కర్వ్.ఈవీలో రెండు (45 కిలోవాట్‌అవర్, 55 కిలోవాట్‌అవర్) ఎంపికలు ఉండగా, ఈ రెండు కార్లపైనా ప్రయోజనం లభిస్తుందని వెల్లడించింది. నెక్సాన్.ఈవీ ధరలు రూ.12.49 - 17.19 లక్షల (ఎక్స్-షోరూమ్) శ్రేణిలో ఉండగా, కర్వ్.ఈవీ ధరలు రూ.17.49 - 21.99 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉన్నాయి. కొత్త వారెంటీతో ఈవీల దీర్ఘకాలిక రీసేల్ విలువ పెరగడంతో పాటు 10 ఏళ్లలో రూ.8-9 లక్షల మేర నిర్వహణ వ్యయాలను పొదుపు చేసుకునే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది.
✦ ప్రత్యేక లాయల్టీ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రస్తుత టాటా.ఈవీల యజమానులు నెక్సాన్.ఈవీ 45 కిలోవాట్‌అవర్, కర్వ్.ఈవీలను కొనుగోలు చేస్తే, నేరుగా రూ.50,000 ప్రయోజనం అందిస్తున్నామని కంపెనీ తెలిపింది.
✦ లైఫ్‌టైమ్ హెచ్‌వీ బ్యాటరీ వారెంటీతో తొలిసారిగా హ్యారియర్.ఈవీని టాటా మోటార్స్ ఇటీవల తీసుకొచ్చింది. వీటి ధరలు రూ.21.49-30.23 లక్షల (ఎక్స్-షోరూమ్) శ్రేణిలో ఉన్నాయి.

జూన్‌లో పసిడి ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,081 కోట్లు

5 నెలల గరిష్ఠమిది



దిల్లీ: పసిడి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) ల్లోకి ఈ ఏడాది జూన్‌లో నికరంగా రూ.2,081 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 5 నెలల గరిష్ఠం. జనవరిలో వచ్చిన రూ.3,751 కోట్ల తర్వాత ఇవే అధికం. భౌగోళిక - రాజకీయ అనిశ్చితులు, పసిడి ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకులు లాంటివి ఇందుకు కారణమయ్యాయి. మేలో రూ.292 కోట్లు నికరంగా జమయ్యాయి. ఏప్రిల్‌లో రూ.6 కోట్లు; మార్చిలో రూ.77 కోట్ల చొప్పున నికరంగా పసిడి ఈటీఎఫ్‌ల నుంచి బయటకు వెళ్లినట్లు మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం యాంఫీ గణాంకాలు తెలిపింది.
✦ ఈ ఏడాది తొలి అర్ధభాగం (జనవరి-జూన్)లో నికరంగా రూ.8,000 కోట్ల పెట్టుబడులను పసిడి ఈటీఎఫ్‌లు ఆకర్షించాయి. దీంతో పసిడి ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ జూన్ చివరకు రూ.64,777 కోట్లకు చేరింది. జూన్‌లో ప్రారంభమైన 2 కొత్త పసిడి ఈటీఎఫ్ పథకాల్లోకి రూ.41 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పసిడి ఈటీఎఫ్ ఖాతాల సంఖ్య జూన్ చివరకు 76.54 లక్షలకు చేరింది.

అనిల్ అంబానీకి ఊరట



దిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ రుణాలను 'మోసపూరిత' ఖాతాగా వర్గీకరించడాన్ని వెనక్కి తీసుకున్నట్లు బాంబే హైకోర్టుకు కెనరా బ్యాంక్ గురువారం తెలిపింది. దీంతో బ్యాంక్ ఇంతకు ముందు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ, అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ఉపసంహరణ ఆదేశాలను ఆర్‌బీఐకు ఇవ్వాల్సిందిగా బెంచ్ సూచించింది.

దిల్లీలో 10 నిమిషాల డెలివరీ ప్రారంభించిన అమెజాన్

దిల్లీ: క్విక్‌కామర్స్ సేవలను ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా దిల్లీకి విస్తరించింది. ఆర్డరు తీసుకున్న 10 నిమిషాల్లో డెలివరీ ఇచ్చే పద్ధతిని ఇప్పటికే బెంగళూరులో సంస్థ ప్రారంభించిన సంగతి విదితమే. ఈ సేవల కోసం అమెజాన్ రూ.2,000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. బెంగళూరులో 3 పిన్‌కోడ్ ప్రాంతాల్లో క్విక్‌కామర్స్ సేవలు విజయవంతం అయినందునే, ఇప్పుడు దిల్లీలో ప్రారంభించినట్లు బ్లూమ్‌బర్గ్ వివరించింది. ఇప్పటికే ఈ తరహా సేవలందిస్తున్న జొమాటో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టోలతో అమెజాన్ పోటీ పడనుంది.

వాణిజ్య చర్చల కోసం మళ్లీ అమెరికాకు మన బృందం



దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు మరోవిడత చర్చలు చేపట్టడానికి భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ బృందం ఒకటి త్వరలో వాషింగ్టన్‌కు వెళ్లనుంది. వ్యవసాయం, వాహన రంగాల వంటి అంశాల్లో భేదాభిప్రాయాలను తొలగించుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వాణిజ్య విభాగ ప్రత్యేక కార్యదర్శి, భారత ముఖ్య సంధానకర్త రాజేశ్ అగర్వాల్ తెలిపారు. 'మధ్యంతర, తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను వేరుగా చూడడం లేదు. ఒక పూర్తి ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాం. ఏ అంశాలపై ఏకాభిప్రాయం వస్తుందో, వాటినే మధ్యంతర ఒప్పందంగా తీసుకొస్తాం. మిగతా వాటిపై చర్చలు కొనసాగుతాయ'ని వివరించారు.

ఒప్పందం ఖరారుకే యత్నాలు: అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికే భారత్ ప్రయత్నిస్తోందని రాజేశ్ అగర్వాల్ వివరించారు. సెప్టెంబరు-అక్టోబరు నాటికి తొలి దశ ఒప్పందం, అంతకు ముందే మధ్యంతర ఒప్పందం కుదుర్చుకోవాలన్నది ఇరు దేశాల యత్నం. ఇప్పటిదాకా భారత్ 26 దేశాలతో 14 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కుదుర్చుకుందని అగర్వాల్ తెలిపారు. 'బ్రిటన్‌తో ఒప్పందం ఖరారైంది. ఐరోపా సమాఖ్యతో చర్చలు ముందస్తు దశలో ఉన్నాయి. అమెరికాతో ఒప్పందం తుది రూపునకు తీసుకురావడానికి చర్చిస్తున్నామ'ని గురువారమిక్కడ ఆయన పేర్కొన్నారు.

అమెరికాపై ప్రతీకార సుంకాల సవరింపునకు ప్రతిపాదన: ఉక్కు, అల్యూమినియంపై సుంకాన్ని 25% నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించడంతో.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనల కింద ఆ దేశంపై ప్రతీకార సుంకాలను సవరించాలని భారత్ ప్రతిపాదించింది. 'టారిఫ్ రేట్లను సవరించడానికి భారత్‌కు హక్కు ఉంది. అమెరికా తన టారిఫ్‌ను 25% నుంచి 50 శాతానికి చేర్చడం ఇందుకు నేపథ్యమ'ని బుధవారం డబ్ల్యూటీఓ తన సభ్యదేశాలకు సమాచారం ఇచ్చింది.

ఈఎస్ఆర్ జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్‌లో జీఎంఆర్ గ్రూపు చేతికి 100% వాటా

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అనుబంధ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్), ఈఎస్ఆర్ జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈజీఎల్‌పీపీఎల్) అనే సంస్థలో 70% వాటా కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఈ సంస్థలో ఇప్పటికే జీఎంఆర్ గ్రూపునకే చెందిన జీఎంఆర్ హైదరాబాద్ ఏరోట్రోపోలిస్ (జీహెచ్ఏఎల్)కు 30% వాటా ఉంది. హైదరాబాద్ విమానాశ్రయ ప్రాంగణంలో గోదాములు, సరకు నిల్వ, రవాణా సదుపాయాలు నిర్మించడానికి జాయింట్ వెంచర్ సంస్థగా ఈజీఎల్‌పీపీఎలల్‌ను జీహెచ్ఏఎల్, ఇఎస్ఆర్ హైదరాబాద్ 1 పీటీఈ లిమిటెడ్ 2020 జనవరిలో ఏర్పాటు చేశాయి. ఈ సంస్థ ఇప్పటి వరకు 17 లక్షల చదరపు అడుగుల నిర్మాణ స్థలం గల పారిశ్రామిక, సరకు రవాణా సదుపాయాలను నిర్మించింది. ఇప్పుడీసంస్థలో 70% వాటాను జీహెచ్ఐఏఎల్ కొనుగోలు చేయడంతో 100% వాటా జీఎఆర్ గ్రూపు చేతికి వచ్చినట్లు అవుతోంది. దీనివల్ల హైదరాబాద్ విమానాశ్రయ సమీపంలో సరకు నిల్వ, రవాణాతో పాటు పారిశ్రామిక సదుపాయాలను విస్తరించడానికి అవకాశం కలుగుతుందని జీహెచ్ఐఏఎల్ సీఈఓ ప్రదీప్ పణికర్ పేర్కొన్నారు.

యూఏఈలోనూ యూపీఐ సేవలు



దిల్లీ: యూఏఈలో యూపీఐ సేవలను విస్తరించడంపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుబంధ విభాగం ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) దృష్టి పెట్టింది. ఇప్పటికే యూఏఈ భాగస్వాములతో కలిసి డిజిటల్ చెల్లింపు సేవలను అందిస్తోంది. రిటెయిల్, ఆతిథ్యం, వినోదం, రవాణా, అత్యవసర సేవలు వంటి విభాగాల్లో యూపీఐ సేవలను విస్తరించేందుకు అక్కడి నియంత్రణ సంస్థలతో ఎన్ఐపీఎల్ పనిచేస్తోంది.

రెండో రోజూ అమ్మకాల ఒత్తిడి



సెన్సెక్స్ ▼346 — 83190
నిఫ్టీ ▼121 — 25355

సమీక్ష

దేశీయ సూచీలకు వరుసగా రెండో రోజూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాల ప్రారంభం నేపథ్యంలో, మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఐటీ, టెలికాం షేర్లు డీలాపడ్డాయి. టారిఫ్‌లకు సంబంధించిన అనిశ్చితి కూడా సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 పైసలు పెరిగి 85.70 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.27% నష్టంతో 70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి.
✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.1.14 లక్షల కోట్లు తగ్గి రూ.460.25 లక్షల కోట్లు (5.38 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
✦ సెన్సెక్స్ ఉదయం 122 పాయింట్ల (క్రితం ముగింపు 83,536.08) లాభంతో 83,658.20 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఇంట్రాడేలో 83,134.97 పాయింట్లకు పడింది. చివరకు 345.80 పాయింట్ల నష్టంతో 83,190.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.85 పాయింట్లు కోల్పోయి 25,355.25 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,340.45- 25,524.05 పాయింట్ల మధ్య కదలాడింది.
✦ సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు నమోదుచేశాయి. భారతీ ఎయిర్‌టెల్ 2.62%, ఏషియన్ పెయింట్స్ 1.92%, ఇన్ఫోసిస్ 1.05%, బీఈఎల్ 1.03%, టెక్ మహీంద్రా 0.93%, అల్ట్రాటెక్ 0.67% డీలాపడ్డాయి. మారుతీ 1.36%, టాటా స్టీల్ 1.04%, బజాజ్ ఫైనాన్స్ 0.72% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. టెక్ 1.17%, టెలికాం 1.11%, ఫోకస్డ్ ఐటీ 0.77%, ఐటీ 0.71%, మన్నికైన వినిమయ వస్తువులు 0.44% నీరసించాయి. స్థిరాస్తి, లోహ, చమురు-గ్యాస్, యుటిలిటీస్ రాణించాయి. బీఎస్ఈలో 2064 షేర్లు నష్టపోగా, 1959 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 138 షేర్లలో ఎటువంటి మార్పులేదు.
✦ దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి, బెంగళూరు వంటి కీలక నగరాల్లో వ్యాపార ప్రయాణ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ట్రావెల్ ఏజెంట్ ప్లాట్‌ఫామ్ యాత్రతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆతిథ్య సేవల సంస్థ ఓయో ప్రకటించింది.
✦ ఐటీ సేవల ఆధునికీకరణ, నిర్వహణ కోసం న్యూజిలాండ్‌కు చెందిన డునెడిన్ సిటీ కౌన్సిల్ నుంచి 10 ఏళ్ల ఒప్పందాన్ని హెచ్‌సీఎల్ టెక్ దక్కించుకుంది. సైబర్ భద్రత, హైబ్రిడ్ క్లౌడ్, సేవల నిర్వహణ, ఐటీ అసెట్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ సేవల వంటి వాటిలో హెచ్‌సీఎల్ టెక్ మార్పులు తీసుకురానుంది. ఈ కాంట్రాక్టు విలువను వెల్లడించలేదు.
✦ రాజస్థాన్‌లోని బక్రీ టిబ్బా బ్లాక్ నుంచి ఉత్పత్తి చేసే సహజవాయువును 15 ఏళ్ల పాటు గెయిల్ ఇండియాకు విక్రయించడానికి ఆయిల్ ఇండియా దీర్ఘకాలిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది.
✦ సరికొత్త బీఎస్ఈ ఇన్సూరెన్స్ సూచీని బీఎస్ఈ అనుబంధ సంస్థ ఆసియా ఇండెక్స్ తీసుకొచ్చింది. బీఎస్ఈ 1000 సూచీలో బీమా సంస్థలుగా వర్గీకరించిన వాటికి ఈ సూచీ ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఎల్‌పీజీ సంస్థలకు రూ.35,000 కోట్ల పరిహారం!



దిల్లీ: వంట గ్యాస్ సరఫరాలో నష్టాలు చవిచూస్తున్న చమురు మార్కెటింగ్ సంస్థలకు రూ.30,000-35,000 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం త్వరలో చెల్లించే అవకాశం ఉంది. గత 15 నెలలుగా వాస్తవ వ్యయం కంటే తక్కువ ధరకే ద్రవీకృత పెట్రోలియం వాయువు (ఎల్‌పీజీ)ను అమ్ముతున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలకు ఈ మొత్తం అందుతుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఈ కంపెనీలు రూ.28,249 కోట్లు నష్టపోగా, ప్రభుత్వం రూ.22,000 కోట్లే పరిహారంగా అందించింది.
✦ 2025-26 బడ్జెట్‌లో ఈ పరిహారం కోసం ప్రత్యేక కేటాయింపు చేయలేదు. అయితే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని ఏప్రిల్ నుంచి పెంచడం ద్వారా రూ.32,000 కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఈ నిధులనే ఇప్పుడు చమురు సంస్థలకు చెల్లిస్తుందని సమాచారం. వంటగ్యాస్ సిలిండర్లను వాస్తవ వ్యయం కంటే తక్కువ ధరకు విక్రయించడం వల్ల, పరిశ్రమకు 2024-25లో రూ.40,500 కోట్ల నష్టం వచ్చినట్లు అంచనా.
✦ గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోగ్రాముల సిలిండర్ ధరను రూ.50 పెంచడం ద్వారా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఈ నష్టాలు తగ్గిస్తున్నారు.

క్యాన్సర్ ఔషధం అభివృద్ధికి గ్లెన్‌మార్క్ ఫార్మా, అబ్‌వీ ఒప్పందం

దిల్లీ: క్యాన్సర్, ఆటోఇమ్యూన్ వ్యాధులకు చికిత్సలో వినియోగించే ఒక ఔషధాన్ని అభివృద్ధి చేయడానికి దేశీయ ఫార్మా సంస్థ గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్, అబ్‌వీ అనే బహుళ జాతి ఫార్మా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. 'ఐఎస్‌బీ 2001' అనే అభివృద్ధి దశలో ఉన్న ఈ ఔషధంపై గ్లెన్‌మార్క్ ఫార్మాకు చెందిన ఇచ్నోస్ గ్లెన్‌మార్క్ ఇన్నోవేషన్ (ఐజీఐ) అనే సంస్థ భాగమైంది. 'బీట్ ప్రొటీన్ ప్లాట్‌ఫామ్' ఆధారంగా ఈ ఔషధాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేయనున్నట్లు గ్లెన్‌మార్క్ వెల్లడించింది. ఈ ఔషధం అందుబాటులోకి వచ్చాక, దీన్ని వాణిజ్య ప్రాతిపదికన ఉత్పత్తి చేయడానికి, ఉత్తర అమెరికా, ఐరోపా, జపాన్, చైనా దేశాల్లో విక్రయించడానికి అబ్‌వీకి అవకాశం ఉంటుంది. ఆసియా, లాటిన్ అమెరికా, రష్యా, సీఐఎస్ దేశాలు, పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాల్లో ఉత్పత్తి, విక్రయ హక్కులు గ్లెన్‌మార్క్ ఫార్మాకు లభిస్తాయి. ఐజీఐకి ముందుగా 700 మిలియన్ డాలర్లు, ఆ తర్వాత 1.225 బిలియన్ డాలర్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉంటుంది.

శాంసంగ్ ట్రై ఫోల్డ్ ఫోన్!?

ఈ ఏడాది చివరికల్లా ఆవిష్కారం

న్యూయార్క్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్, కొత్తగా ట్రైఫోల్డ్ ఫోన్‌ను ఆవిష్కరించే యత్నాల్లో ఉంది. ఈ ఏడాది చివరికల్లా ఆ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించే అవకాశం ఉందని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ వైస్ ప్రెసిడెంట్ (ప్రోడక్ట్ ప్లానింగ్) మిన్‌సియోక్ కాంగ్ పేర్కొన్నారు. మడత పెట్టే ఫోన్ సాంకేతికతలో ట్రైఫోల్డ్ ఫోన్ తదుపరి అడుగు అవుతుందని, అందుకే దీని వాణిజ్యీకరణపై దృష్టి సారించినట్లు తెలిపారు. చైనాకు చెందిన హువావే ఇప్పటికే 'మేట్ ఎక్స్ అల్టిమేట్' మోడల్‌తో ట్రైఫోల్డ్ ఫోన్‌ను తీసుకొచ్చింది. షియోమీ, హానర్ సంస్థలు కూడా ఈ మోడల్ ఫోన్ ఆవిష్కరణ కోసం పనిచేస్తుండడం విశేషం.

పెట్టుబడి విభిన్నంగా

బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక మల్టీ-ఫ్యాక్టర్ పథకాన్ని తీసుకొచ్చింది. **బంధన్ మల్టీ-ఫ్యాక్టర్ ఫండ్** అనే ఈ పథకాన్ని అడాప్టివ్, ఎవాల్వింగ్, మల్టీ-ఫ్యాక్టర్ క్యాంటిటేటివ్ మోడల్ ఆధారంగా నిర్వహిస్తారు. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 24న ముగుస్తుంది. కనీస పెట్టుబడి రూ.1,000. ఈ పథకం నిర్వహణలో పెట్టుబడి కోసం ప్రధానంగా పరిశీలించే మొమెంటమ్, వాల్యూ, క్వాలిటీ, వోలటిలిటీ.. తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. బీఎస్ఈ 200 టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. స్టాక్ మార్కెట్ సూచీలు బాగా పెరిగిన ప్రస్తుత తరుణంలో పెట్టుబడుల ప్రక్రియ, నిర్వహణ ఎంతో సవాలుతో కూడిన అంశం. అందువల్ల ఏదో ఒక అంశంపై ఆధారపడి, పెట్టుబడి నిర్ణయాలు తీసుకోకుండా, విభిన్నమైన అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతోంది. అదే మల్టీ-ఫ్యాక్టర్ ఫండ్‌లోని ప్రత్యేకత. **ఈ పథకానికి ఫండ్ మేనేజర్లు.. రిషి శర్మ, బ్రిజేష్ షా.**

ప్రైవేటు బ్యాంకుల్లో

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ నుంచి ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ పథకం ఒకటి అందుబాటులోకి వచ్చింది. **ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 14. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఈ పథకానికి కొలమానంగా ఉంటుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నందున బ్యాంకింగ్ రంగం స్థిరమైన వృద్ధి నమోదు చేసే అవకాశం ఉంటుంది. అందులోనూ ప్రైవేటు బ్యాంకులు సరికొత్త అవకాశాలను అందుకోవడంలో ముందుంటున్నాయి. రుణాలు, డిపాజిట్లలో ప్రైవేటు బ్యాంకుల వాటా వేగంగా పెరుగుతున్న విషయం విదితమే. ఇదే కాకుండా ఇతర బ్యాంకింగ్ సేవలను వేగంగా అందిస్తూ ఖాతాదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ పథకం ద్వారా ప్రైవేటు బ్యాంకుల షేర్లలో మదుపు చేసేందుకు మదుపరులకు అవకాశం లభిస్తుంది. **ఫండ్ మేనేజర్లు.. నిషిత్ పటేల్, అశ్విని షిండే.**

పెద్ద కంపెనీల్లో మదుపు

కొత్త పథకం

జేఎం ఫైనాన్షియల్ మ్యూచువల్ ఫండ్ నుంచి కొత్త పథకం వచ్చింది. ఇది లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ తరగతికి చెందిన ఈక్విటీ పథకం. **జేఎం లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్** పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. నిఫ్టీ లార్జ్, మిడ్‌క్యాప్ 250 టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. ప్రధానంగా లార్జ్, మిడ్‌క్యాప్ తరగతికి చెందిన షేర్లలో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. తద్వారా స్థిరత్వం, అధిక వృద్ధి అవకాశాలు లభిస్తాయి. పథకం విలువలో హెచ్చుతగ్గులు కొంత తక్కువగా ఉంటాయి. జేఎం ఫైనాన్షియల్ మ్యూచువల్ ఫండ్ సొంతంగా ఆవిష్కరించిన గీక్ మోడల్ (గ్రోత్ ఆఫ్ ఎర్నింగ్స్ అండ్ ఎర్నింగ్స్ క్వాలిటీ) పద్ధతి ప్రకారం పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తారు. **ఫండ్ మేనేజర్లు అసిత్ భండార్కర్, రుచి ఫౌజ్‌దార్, దీపక్ గుప్తా.**

హెచ్చుతగ్గులు లేకుండా

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, **ఎస్‌బీఐ నిఫ్టీ 100 లో వోలటిలిటీ 30 ఇండెక్స్ ఫండ్** అనే పథకాన్ని ఆవిష్కరించింది. ఈ పథకం న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) ఈ నెల 22న ముగుస్తుంది. కనీస పెట్టుబడి రూ.5,000. నిఫ్టీ 100 లో వోలటిలిటీ 30 ఇండెక్స్ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. దీర్ఘకాలంలో ఈ పథకంపై స్థిరమైన లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. ఇది ఇండెక్స్ పథకం కాబట్టి, నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉంటాయి. ప్రధానంగా నిఫ్టీ 100 లో వోలటిలిటీ 30 ఇండెక్స్ పథకంలో భాగంగా ఉన్న షేర్లపై పెట్టుబడి పెట్టడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. **ఫండ్ మేనేజర్.. వైరల్ ఛద్వా.**

ఉద్యోగాలు మారితే రిటర్నులు ఇలా!

గత ఆర్థిక సంవత్సరంలో మీరు రెండు మూడు ఉద్యోగాలు మారారా? ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసేప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. లేకపోతే చిక్కులు రావొచ్చు. అలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.



ఒకే సంస్థలో కొనసాగిన వారితో పోలిస్తే, ఉద్యోగాలు మారిన వారికి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు ప్రక్రియ కాస్త సవాలుగా ఉంటుంది. ఫారం-16, టీడీఎస్‌లో సమస్యలు, గ్రాట్యుటీ లేదా పీఎఫ్ ఉపసంహరణలు ఇలా పలు అంశాలు ఇక్కడ ప్రధానంగా ఉంటాయి. చిన్న తప్పిదం చేసినా పన్ను శాఖ నుంచి నోటీసు రావొచ్చు.

ఫారం-16లు తీసుకున్నారా?

పన్ను చెల్లింపుదారులు చేసే అతిపెద్ద తప్పిదాల్లో ఒకటి.. తాము ఇప్పుడు ఉద్యోగం చేస్తున్న సంస్థ నుంచే ఫారం-16ను తీసుకుంటారు. ఇంతకు ముందు పనిచేసిన సంస్థలో ఆర్జించిన జీతాన్ని మర్చిపోతుంటారు. దీంతో ఆదాయం తక్కువగా నమోదు అవుతుంది. చాలామంది ఉద్యోగులు తమ కొత్త యాజమాన్యానికి పాత ఆదాయం గురించిన సమాచారం ఇవ్వరు. ఫలితంగా రిటర్నుల సమయంలో ఆదాయం, టీడీఎస్ లెక్కల మధ్య వ్యత్యాసాలు కనిపిస్తుంటాయి. ఐటీఆర్ సమర్పించేటప్పుడు ఒకేసారి అధికంగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి, గత ఆర్థిక సంవత్సరంలో మీరు పనిచేసిన సంస్థలన్నింటి దగ్గర్నుంచి ఫారం-16లు తీసుకోవడం తప్పనిసరి.

అన్ని ఆదాయాలూ కలిపి..

అన్ని ఫారం-16ల్లో చూపించిన ఆదాయాలను కలిపి, మొత్తం ఎంత ఆర్జించారో చూసుకోవాలి. ఫారం-26ఏఎస్, వార్షిక సమాచార పత్రం (ఏఐఎస్)తో సరిపోల్చుకోవాలి. అన్ని వివరాలనూ ఒకసారి పరిశీలించి, ఏకీకృత ఆదాయం ఆధారంగా మీకు వర్తించే ఫారంలో రిటర్నులు సమర్పించాలి. దీనివల్ల పారదర్శకత వస్తుంది. తర్వాత పన్ను నోటీసులకు తావుండదు. పాత పన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసేటప్పుడు 80సీ, 80డీ వంటి మినహాయింపులు రెండు సంస్థల్లోనూ క్లెయిం అయ్యే అవకాశం ఉంది. రిటర్నులు దాఖలు చేసేప్పుడు ఈ విషయంలో జాగ్రత్త అవసరం.

వ్యత్యాసం ఉంటే

ఉద్యోగాలు మారినప్పుడు ఫారం-16లోని ఆదాయాలకూ, ఫారం-26ఏఎస్, ఏఐఎస్‌లోని వివరాలకు కొన్నిసార్లు వ్యత్యాసం ఉండొచ్చు. ఇలాంటి అసమానతలు గుర్తిస్తే, వెంటనే యాజమాన్యాన్ని సంప్రదించి, టీడీఎస్ రిటర్నును సవరించాల్సిందిగా కోరాలి. ఐటీఆర్ దాఖలు చేసేప్పుడు 26ఏఎస్‌లోని టీడీఎస్ వివరాలనే ఆధారంగా తీసుకోవాలి. ఉద్యోగం మారినప్పుడు మీకు అందిన ప్రయోజనాలనూ ఐటీఆర్ ఫారంలో తెలియజేయడం తప్పనిసరి.

సరైన ఫారంలో

ఒకటికి మించి ఆదాయాలు ఉన్నప్పుడు కొన్నిసార్లు ఐటీఆర్-1కు బదులుగా ఐటీఆర్-2 లేదా ఐటీఆర్-3ను ఎంచుకోవాల్సి రావచ్చు. మీ ఆదాయ వనరుల ఆధారంగా సరైన ఫారాన్ని ఎంపిక చేసుకొని, రిటర్నులు సమర్పించాలి. ఈ విషయంలో అనుమానం ఉంటే, పన్ను నిపుణులను సంప్రదించడం మంచిది.

సిరి

siri@eenadu.net

పొదుపు ఖాతా.. అధిక వడ్డీ వచ్చేలా

బ్యాంకు పొదుపు ఖాతాలో ఉంచిన మొత్తంపై ఏడాదికి 2.5 శాతానికి మించి వడ్డీ రావడం లేదు. మరి, ఇంతకు మించి వడ్డీని ఆర్జించాలి, ఎలాంటి ఇబ్బందీ లేకుండా నగదు వెనక్కి తీసుకునేలా ఉండాలి.. ఇందుకు మార్గం ఏమిటి? సమాధానం స్వీప్-ఇన్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు. వీటి గురించి తెలుసుకుందాం.

పొదుపు లేదా కరెంట్ ఖాతాను ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో అనుసంధానం చేసేదే స్వీప్-ఇన్ ఫిక్స్‌డ్ డిపాజిట్. పొదుపు ఖాతాలో ఉన్న మొత్తం నిర్ణీత పరిమితికి మించినప్పుడు వెంటనే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లోకి బదిలీ అయ్యే ఏర్పాటు ఉంటుంది. దీని వల్ల సాధారణ పొదుపు ఖాతాతో పోలిస్తే, కాస్త అధిక వడ్డీ రేటును పొందవచ్చు. అదే సమయంలో అత్యవసర సమయాల్లో డబ్బును సులభంగా వెనక్కి తీసుకోవచ్చు. ఈ విధానం మీ నిధులను సమర్థంగా నిర్వహించేందుకు, అధిక రాబడిని సాధించేందుకు సహాయపడుతుంది.

స్వీప్-ఇన్ ఎఫ్‌డీ సౌకర్యం ఉపయోగించేందుకు ముందుగా పొదుపు ఖాతా లేదా కరెంటు ఖాతాను ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాతో అనుసంధానం చేయాలి. పొదుపు ఖాతాలో ఎంత మేరకు కనీస నిల్వ ఉండాలని అనుకుంటున్నారో నిర్ణయించుకోవాలి. ఆ పైబడిన మొత్తం ఎఫ్‌డీ ఖాతాలోకి వెళ్లిపోతుంది.

ఉదాహరణకు మీరు పొదుపు ఖాతాలో రూ.50వేలు ఉంటే చాలు అనుకున్నారు. అప్పుడు ఆ ఖాతాలో రూ.80 వేలు ఉంటే.. రూ.30వేలు స్వీప్-ఇన్ ఎఫ్‌డీలోకి బదిలీ అవుతాయి. ఒకవేళ మీరు పొదుపు ఖాతాలో నుంచి రూ.20 వేలు తీశారనుకుందాం. అప్పుడు స్వీప్-ఇన్ ఎఫ్‌డీ నుంచి పొదుపు ఖాతాకు రూ.20వేలు రివర్స్ స్వీప్ అవుతాయి.

✦ స్వీప్-ఇన్ ఎఫ్‌డీలు సాధారణ పొదుపు ఖాతాతో పోలిస్తే అధిక వడ్డీని ఆర్జించేందుకు ఉపయోగపడతాయి. ఉదాహరణకు పొదుపు ఖాతాలో 2.5-2.75 శాతం వరకూ అవడ్డీ రేటు అందితే.. స్వీప్-ఇన్ ఎఫ్‌డీలో వ్యవధిని బట్టి, 5.5 శాతం నుంచి 7.75 శాతం వరకూ అందుతుంది.



✦ అత్యవసర సమయాల్లో ఎఫ్‌డీని పూర్తిగా రద్దు చేయాల్సిన అవసరాన్ని ఇది తప్పిస్తుంది. అవసరమైన మేరకు మాత్రమే నిధులను ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన మొత్తం ఎఫ్‌డీలోనే అధిక వడ్డీని ఆర్జిస్తుంది.

✦ నిధుల బదిలీ అంశంలో ఎలాంటి మానవ ప్రమేయం ఉండదు. అంతా ఆటోమేటిక్ ప్రక్రియ. ఇది ఈ ఖాతాల నిర్వహణను సులభం చేస్తుంది.

✦ ఎఫ్‌డీని రద్దు చేసుకుంటే అపరాధ రుసుము వర్తిస్తుంది. ఈ ఖాతాలో అలాంటివేమీ ఉండవు.

✦ మీ బ్యాంకు ఆన్‌లైన్ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ విభాగం నుంచి ఈ స్వీప్-ఇన్ ఎఫ్‌డీని ఎంచుకోవచ్చు. మీ పొదుపు ఖాతాలో ఎంత మేరకు ఉండాలో ఇక్కడే నిర్ణయించేందుకు వీలుంటుంది.

✦ కొన్ని బ్యాంకులు స్వీప్-ఇన్ ఎఫ్‌డీలో కనీసం రూ.25,000 ఉండాలని అడుగుతున్నాయి. దీని గురించి తెలుసుకునేందుకు ఒకసారి మీ బ్యాంకును సంప్రదించండి.

✦ మీ రోజువారీ వినియోగాన్ని బట్టి, పరిమితిని జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి. నిధులు తరచూ అటూ ఇటూ బదిలీ అయితే పెద్దగా ఉపయోగం ఉండదు.

పొదుపు ఖాతాలో అధిక మొత్తం ఉండే వారు ఈ స్వీప్-ఇన్ ఎఫ్‌డీని పరిశీలించవచ్చు. ముఖ్యంగా అత్యవసర నిధిని నిర్వహించేందుకు దీన్ని వాడుకోవచ్చు.

రూ.2వేలతో మదుపు చేయొచ్చా?

మా అమ్మాయి వయసు 4. తన పేరుమీద నెలకు రూ.2వేల వరకూ మదుపు చేయాలని ఆలోచిస్తున్నాం. దీనికోసం ఏం చేయాలి? ఎలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి? - సుదీప్

■ మీ అమ్మాయి చిన్న వయసు నుంచే తన భవిష్యత్తు అవసరాల కోసం పెట్టుబడి పెట్టాలనే ఆలోచన మంచిదే. అధిక మొత్తంలో డబ్బు జమ అయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. పెట్టుబడుల విషయంలో కాలం ఎంతో విలువైనది. తొందరగా మదుపు ప్రారంభిస్తే.. తక్కువ పెట్టుబడితోనూ ఎక్కువ డబ్బు జమ అయ్యే అవకాశం ఉంటుంది. ముందుగా తన భవిష్యత్తు అవసరాలకు తగిన ఆర్థిక రక్షణ కల్పించండి. ఇందుకోసం మీ వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ తీసుకోండి. మీ పెట్టుబడికి అధిక రాబడి రావాలంటే స్టాక్ మార్కెట్ ఆధారిత పథకాలను ఎంచుకోవాల్సి వస్తుంది. దీనికోసం డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా పెట్టుబడులు పెట్టుకోండి. మీ అమ్మాయికి 21 ఏళ్లు వచ్చే వరకూ అంటే 17 ఏళ్లపాటు క్రమం తప్పకుండా మదుపు చేస్తే.. 12 శాతం వార్షిక రాబడి అంచనాతో.. రూ.11,73,208 అయ్యేందుకు అవకాశం ఉంది. ఇది అప్పటి అవసరాలకు అంతగా సరిపోకపోవచ్చు. వీలైతే.. ఆదాయం పెరిగినప్పుడల్లా మీ పెట్టుబడిని పెంచేందుకు ప్రయత్నించండి.



నేను నెలకు రూ.5,000 వరకూ మదుపు చేయాలని అనుకుంటున్నాను. ఏటా 10 శాతం పెంచుకుంటూ వెళ్తాను. ఇప్పటికే రూ.5లక్షల వరకూ ఆరోగ్య బీమా తీసుకున్నాను. టర్మ్ పాలసీ ఉంది. నా ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలి? కనీసం 15 ఏళ్ల తర్వాత ఎంత మొత్తం వస్తుంది? - బొల్లంపల్లి విష్ణు

■ పెట్టుబడులు ప్రారంభించే ముందు కుటుంబ ఆర్థిక బాధ్యతలకు తగిన రక్షణ కల్పించడం చాలా ముఖ్యం. మీరు ఆరోగ్య బీమా, టర్మ్ పాలసీ తీసుకోవడం అభినందనీయం. వీటితోపాటు, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని తీసుకోండి. ఆరు నెలలకు సరిపోయేలా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోండి. పెట్టుబడిని ఏటా 10 శాతం పెంచడం వల్ల డబ్బు అధిక మొత్తంలో జమ అవుతుంది. మీరు నెలకు రూ.5,000 చొప్పున డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి. 15 ఏళ్ల వ్యవధి ఉంది కాబట్టి, రూ.5,000లో రూ.2,000 మిడ్ స్మాల్ క్యాప్ ఫండ్‌లోనూ పెట్టుబడిని ప్రయత్నించవచ్చు. నెలకు కేవలం రూ.5,000 స్థిరంగా మదుపు చేస్తే 15 ఏళ్లకు 12 శాతం రాబడి అంచనాతో రూ.22,36,782 అయ్యేందుకు వీలుంది. ఏటా 10 శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్తే.. 15 ఏళ్ల తర్వాత రూ.38,88,953 అయ్యే అవకాశం ఉంది. ఏటా 10 శాతం అధికంగా మదుపు చేయడం వల్ల మీ వద్ద 74 శాతం అధిక మొత్తం జమ అవుతుంది.

నా వయసు 27. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిని. జీతం నుంచి అన్ని ఖర్చులు పోను రూ.25,000 వరకూ పొదుపు చేస్తున్నాను. దీన్ని భవిష్యత్తుకు ఉపయోగపడేలా పెట్టుబడి పెట్టాలంటే ఏం చేయాలి? - అనిలా కొమిరె

మార్గదర్శి

■ ఇటీవలి కాలంలో చిన్న వయసులోనే పెట్టుబడులు ప్రారంభించాలని చాలామంది అనుకుంటున్నారు. నెలకు రూ.25,000 పెట్టుబడి చాలా మంచి మొత్తమే. మీరు మదుపు చేయాలనుకుంటున్న మొత్తంలో రూ.7,500 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)లో జమ చేయండి. మిగతా రూ.17,500 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి. ఈ డబ్బును పదవీ విరమణ తర్వాత అవసరాల కోసం వాడాలనుకుంటే.. కనీసం మరో 34 ఏళ్లకు పైగా సమయం ఉంది. నెలకు రూ.25,000లను 11 శాతం సగటు వార్షిక రాబడితో పెట్టుబడి పెడితే.. 33 ఏళ్ల తర్వాత రూ.8,26,58,766 జమ అయ్యే అవకాశం ఉంది. ఇది ఇప్పుడు చూస్తే అధిక మొత్తంలో కనిపిస్తోంది. కానీ, 6 శాతం ద్రవ్యోల్బణంతో పోలిస్తే.. ఆ మొత్తం విలువ నేటి రూ.1,20,83,572తో సమానం అవుతుంది. కాబట్టి, వీలైనప్పుడల్లా పెట్టుబడిని పెంచుకోండి.

నేను చిరు వ్యాపారిని. నాకు 10, 4 ఏళ్ల ఇద్దరు పిల్లలు. భవిష్యత్తులో వారి చదువులకు ఉపయోగపడేలా పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. నా దగ్గర డబ్బు ఉన్నప్పుడల్లా మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాను. దీంతోపాటు నాకు పింఛను వచ్చే ఏర్పాటు చేసుకోవచ్చా? - శ్రవణ్

■ మీరు చిరు వ్యాపారి అంటున్నారు కాబట్టి, ముఖ్యంగా మీరు అత్యవసర నిధిపై దృష్టి ఎక్కువగా పెట్టాలి. కనీసం ఒక ఏడాది అవసరాలకు సరిపోయే మొత్తం మీ దగ్గర ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. మీ ఆదాయంలో హెచ్చుతగ్గులుంటాయి. దీనికి అనుగుణంగా ప్రణాళిక ఉండాలి. మీకు ఆరోగ్య బీమా, జీవిత బీమా ఎంతో అవసరం. అనుకోకుండా అనారోగ్యం వస్తే.. ఆర్థికంగా చిక్కులు వస్తాయి. అందువల్ల ఆరోగ్య బీమా తీసుకోండి. మీరు డబ్బులున్నప్పుడు పెట్టుబడులు పెట్టాలనుకోవద్దు. నెలకు కొంత మొత్తం అనే క్రమశిక్షణను అలవాటు చేసుకోండి. మీ సగటు ఆదాయం, ఖర్చులను చూసుకొని, మిగులు మొత్తాన్ని లెక్కించండి. ఇందులో కనీసం 50 శాతాన్ని పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నించండి. ఇందుకోసం ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోండి.

మా మామయ్య దగ్గర రూ.4 లక్షలున్నాయి. వీటిని సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో జమ చేయాలనుకుంటున్నాం. దీనిపై ఎంత వడ్డీ వస్తుంది? ఈ వచ్చిన వడ్డీని సైతం పెట్టుబడి పెట్టేందుకు ఏ పథకాలను ఎంచుకోవాలి? – బాబా జాన్

■ సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో ప్రస్తుతం 8.2 శాతం వడ్డీనిస్తున్నారు. రూ.4లక్షలపైన మూడు నెలలకోసారి రూ.8,200 వస్తాయి. ఈ డబ్బును పోస్టాఫీసు పొదుపు ఖాతాకు మళ్లించి, దాన్ని అక్కడి నుంచి పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్ చేయొచ్చు. మొదటిసారి వడ్డీ అందిన తర్వాత ఆర్‌డీని ప్రారంభించండి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.net కు మెయిల్ చేయండి)

రాబడి హామీ లాభమేనా?

జీవితంలో అనిశ్చితి సహజం. పెట్టుబడులకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ ఆధారిత పథకాల విషయానికి వస్తే ఎంత రాబడి వస్తుందనే విషయానికి స్పష్టత ఉండదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు బీమా సంస్థలు కనీస రాబడి హామీతో కొత్త పాలసీలను తీసుకొస్తున్నాయి. కాలానుగుణంగా మారే లక్ష్యాలకు అనుగుణంగా పాలసీలను ఎంచుకునే వీలు కల్పిస్తున్నాయి. జీవితంలో మారే దశలను బట్టి, సురక్షిత, రాబడి హామీనిచ్చే పథకాలు మనకు అవసరం అవుతున్నాయన్నదీ గుర్తించాలి.



పాలసీని ఎంచుకునేటప్పుడే జీవిత బీమా రక్షణతో పాటు, వ్యవధి తీరాక ఎంత మొత్తం చెల్లిస్తామనే రాబడి హామీతో వస్తున్న పథకాలే 'గ్యారంటీడ్ ఇన్‌కం స్కీం'లు. పేరులోనే ఉన్నట్లు ఇవి రాబడికి హామీ ఇస్తాయి. అన్ని రకాల నష్టభయాలకూ ఇవి పరిష్కారం చూపిస్తాయి. నష్టభయం ఏమాత్రం భరించలేని వారు.. పాలసీకి ఏక మొత్తంగా లేదా పరిమిత కాలం పాటు ప్రీమియం చెల్లించాలని భావించే వారికి ఇవి అనుకూలం. పెట్టుబడుల జాబితాలో ఎలాంటి నష్టభయం లేని పథకాలతోపాటు, రాబడి హామీతో ఉన్నవీ కావాలని అనుకున్నప్పుడు వీటిని పరిశీలించాలి.

కావాల్సిన విధంగా

రాబడి హామీ ఉన్న పథకాన్ని ఎంచుకున్నప్పుడు ముందుగా ఎన్నేళ్లు ప్రీమియం చెల్లించగలరు అన్నది చూసుకోవాలి. కొన్ని పాలసీలు 6, 8, 10, 12, 16 ఏళ్లపాటు ప్రీమియం చెల్లించే వీలును అందిస్తాయి. మీరు ప్రీమియం చెల్లించడం ఆపేసిన నిర్ణీత వ్యవధి తర్వాత ఈ పాలసీలు గ్యారంటీడ్ అడిషన్స్‌తో కలిపి చెల్లిస్తాయి. మరికొన్ని పాలసీలు నెలనెలా ఆదాయం ఇచ్చేలానూ ఉంటాయి. ప్రీమియం చెల్లించడం ఆపేసిన తర్వాత ఎప్పటి నుంచి మీకు ఆదాయం రావాలి అనేది నిర్ణయించుకోవచ్చు. కొన్ని పాలసీల్లో ఆదాయం స్థిరంగా అందుతుంది. మరికొన్ని నిర్ణీత వ్యవధుల్లో ఆదాయం కొంత శాతం మేరకు పెరుగుతూ ఉంటుంది. పాలసీ తీసుకునేటప్పుడే ఆదాయం ఎలా కావాలన్నది నిర్ణయించుకోవాలి.

అనిశ్చితి లేకుండా

ఈక్విటీ మార్కెట్లు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పలేం. కాబట్టి, మార్కెట్ ఆధారిత పథకాలు అందించే రాబడుల్లో అనిశ్చితి ఎక్కువగా ఉంటుంది. కానీ, రాబడి హామీ ఉండే పథకాల విషయానికి వస్తే... వీటిలో మార్కెట్ ఆధారిత హెచ్చుతగ్గులుండవు. పాలసీ తీసుకునేటప్పుడే గ్యారంటీడ్ అడిషన్స్, బీమా రక్షణ ఎంత ఉంటుందనేది స్పష్టంగా తెలుస్తుంది. కాబట్టి, ఇబ్బందులు ఉండవు. సుదీర్ఘకాలం పెట్టుబడులు సురక్షితంగా ఉండాలని అనుకున్నప్పుడు రాబడి హామీ పథకాలను ఎంచుకోవచ్చు.

ఆర్థిక లక్ష్యాలకు..

మీ ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు, మీ అవసరాలు తీర్చే విధంగా ఈ పాలసీలను తీసుకోవచ్చు. ప్రీమియం చెల్లింపు వ్యవధి, చెల్లింపు తీరు దగ్గర్నుంచి, బీమా సంస్థలు తిరిగి చెల్లించేటప్పుడు ఆదాయం అందుకునే విధం వరకూ అన్నీ మీ ఇష్టానుసారమే ఎంచుకోవచ్చు. పిల్లల చదువులు, పదవీ విరమణ ప్రణాళికలు.. తదితర అవసరాలను తీర్చేందుకు ఇవి ఉపయోగ పడతాయి.

ద్రవ్యోల్బణం తట్టుకునేలా..

ద్రవ్యోల్బణం ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటుంది. మన డబ్బు విలువను తగ్గిస్తూనే ఉంటుంది. ఖర్చులు అధికం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇదే స్థాయి జీవన ప్రమాణాలు కొనసాగించాలంటే.. అధిక ఆదాయం అవసరం. ఇలాంటి వాటికి ఈ తరహా పాలసీలు తోడ్పడతాయి.

ఖర్చుల కోసం ఓ ఖాతా

ఉద్యోగులకు నెలనెలా జీతం శాలరీ ఖాతాలో జమ అవుతుంది. ఇందులో నుంచే అన్ని ఖర్చులూ, రుణ వాయిదాలూ వెళ్లేలా ఏర్పాటు చేసుకుంటారు. దీనికి బదులుగా ఖర్చుల కోసం ప్రత్యేకంగా రెండో బ్యాంకు ఖాతా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే ఖర్చుల మీద నియంత్రణ ఉంటుందని చెబుతున్నారు.



ఇప్పుడు చాలా బ్యాంకులు పొదుపు ఖాతాలో కనీస నిల్వ మొత్తం ఉండాల్సిన అవసరం లేదంటున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ బ్యాంకులు దీన్ని అమలు చేస్తున్నాయి. కాబట్టి, మీకు అందుబాటులో ఉన్న ఏదైనా ప్రభుత్వ బ్యాంకు శాఖకు వెళ్లి కొత్తగా ఒక ఖాతాను తీసుకోండి. మీరు చేసే ఏ ఖర్చయినా ఇందులో నుంచి వెళ్లేలా చూసుకోవాలి.

ఆదాయం రాగానే ఖర్చులు సిద్ధంగా ఉంటాయి. ఒకే ఖాతాలో ఆదాయం, వ్యయాలన్నీ నమోదైతే.. ఆర్థిక క్రమశిక్షణ సరిగా ఉండదు. ఖాతాలో డబ్బు కనిపిస్తుంది. కాబట్టి, ఉన్నదంతా ఖర్చు చేయడానికే అన్నట్లు భావిస్తుంటాం. దీనికి బదులుగా వేతనం రాగానే ఖర్చుల కోసం కేటాయించిన ఖాతాలోకి డబ్బును బదిలీ చేయాలి. యూపీఐ, ఆన్‌లైన్ కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులన్నీ ఈ ఖాతా నుంచే వెళ్లేలా చూడాలి.

✦ ఒకే ఖాతా నుంచి ఖర్చుల కోసం డబ్బు వెళ్తున్నప్పుడు వాటిని పరిశీలించడం చాలా తేలిక అవుతుంది. ముందుగా పెట్టుబడి, రుణాలకు ఈఎంఐ లాంటివి పూర్తయ్యాక నెలవారీ బడ్జెట్‌ను నిర్ణయించుకోవాలి. ఆ మేరకే ఖర్చు చేసేలా ప్రణాళిక వేసుకోవాలి. మీ వేతన ఖాతా నుంచి అవసరమైన మేరకే ఈ ఖర్చుల ఖాతాకు బదిలీ చేయండి. ఎట్టి పరిస్థితుల్లోనూ వేతన ఖాతాలో మిగిలిన డబ్బును తీయొద్దు. ఇలా చేయడం వల్ల నెలనెలా మీ పొదుపు మొత్తం పెరుగుతుంది. అత్యవసరాల్లో మాత్రమే ఈ సొమ్మును వాడాలి.

✦ డెబిట్ కార్డులను వాడటం వల్ల రివార్డు పాయింట్లు వస్తుంటాయి. మీ వేతనం ఖాతా, ప్రత్యేకంగా తీసుకున్న పొదుపు ఖాతా దేనికి ఈ పాయింట్లు అధికంగా వస్తున్నాయో చూసుకోండి. వేతన ఖాతా డెబిట్ కార్డుతో చేసే చెల్లింపులకు అధిక ప్రయోజనాలు ఉంటే దాన్నుంచే చెల్లించాలి. మిగతా మొత్తాన్నే ఖర్చుల ఖాతాకు మళ్లించాలి.

✦ కొన్ని బ్యాంకులు కనీస నిల్వపై రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, పొదుపు ఖాతాపై కాస్త ఎక్కువ వడ్డీనిస్తుంటాయి. ఇలాంటి వాటిని ఎంచుకునే ప్రయత్నమూ చేయొచ్చు. నెలాఖరుకు మిగిలిన మొత్తాన్ని లిక్విడ్ ఫండ్లు, అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్ల వాటికి మళ్లించే విధంగా చూసుకోవచ్చు.

కార్బోహైడ్రేట్లు

కార్బోహైడ్రేట్లు జీవ రసాయనశాస్త్రంలో అత్యంత ముఖ్యమైన సేంద్రియ అణువులు. జీవుల్లో శక్తి ఉత్పత్తి, నిర్మాణాత్మక ఆధారం, జీవక్రియల్లో కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి ప్రధానంగా శరీరానికి శక్తిని అందించే ఇంధన వనరుగా పని చేస్తాయి. ముఖ్యంగా మెదడు, కండరాలు, ఇతర కణజాలాలకు తక్షణ శక్తిని సరాఫరా చేస్తాయి. కార్బోహైడ్రేట్ల శక్తి నిల్వ, వాటి గుర్తింపు, నిర్మాణం ఆధారంగా అవి నిర్వర్తించే విధులపై పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

సరళమైన రూపం..
విధులు బహుముఖీయం

పోటీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

కార్బోహైడ్రేట్లు కార్బన్ (C), హైడ్రోజన్ (H) ఆక్సిజన్ (O) అణువులతో 1 : 2 : 1 నిష్పత్తిలో ఉంటాయి. రసాయన ఫార్ములా $C_x (H_2O)_x$. ఇది కార్బోహైడ్రేట్ల పేరు, ఉత్పత్తిని సూచిస్తుంది.

✦ ఇవి సరళమైన చక్కెరల నుంచి (మోనోశాకరైడ్లు), సంక్లిష్ట శృంఖల నిర్మాణాల వరకు (పాలీశాకరైడ్లు) వివిధ రూపాల్లో ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్‌గా విచ్ఛిన్నమై, కణ శ్వాసక్రియ ద్వారా ATP రూపంలో శక్తిని ఉత్పత్తి చేస్తాయి. ఇవి కణాల్లో జరిగే అనేక జీవక్రియలకు శక్తిని అందిస్తాయి.

✦ కార్బోహైడ్రేట్లు గ్లైకోజన్ రూపంలో శక్తిని నిల్వ చేయడం, కణ గుర్తింపు (గ్లైకోప్రోటీన్ ద్వారా), నిర్మాణాత్మక ఆధారం (సెల్యులోజ్) లాంటి ఇతర కీలక విధులను నిర్వర్తిస్తాయి. ఇలాంటి బహుముఖీయ పాత్రల కారణంగా జీవుల జీవక్రియ, ఆరోగ్యవంతమైన జీవనానికి కార్బోహైడ్రేట్లు అత్యవసరం.

కార్బోహైడ్రేట్లు - వర్గీకరణ

కార్బోహైడ్రేట్లను రసాయన నిర్మాణం, లక్షణాలు, జీవశాస్త్రీయ విధులు, ఆహార వనరుల ఆధారంగా వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు. సంక్లిష్టత, అణువుల సంఖ్య ఆధారంగా వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు. అవి: 1. మోనోశాకరైడ్లు, 2. డైశాకరైడ్లు, 3. పాలీశాకరైడ్లు

మోనోశాకరైడ్లు

కార్బోహైడ్రేట్లలో అత్యంత సరళమైన రూపం. ఇవి ఒకే చక్కెర అణువును కలిగి ఉండి, సరళమైన సూక్ష్మరూప నిర్మాణంలోకి విచ్ఛిన్నం కావు. వీటిని 'సాధారణ చక్కెరలు' అని కూడా పిలుస్తారు.


రసాయన నిర్మాణం: మోనోశాకరైడ్లు ($C_xH_{2x}O_x$) ఫార్ములాను కలిగి ఉంటాయి. ఇక్కడ x కార్బన్ అణువుల సంఖ్యను సూచిస్తుంది. (సాధారణంగా 3 నుంచి 7 వరకు).

▮ వీటిని కార్బన్ అణువుల సంఖ్య ఆధారంగా ట్రయోస్ (3 కార్బన్లు), టెట్రోస్ (4 కార్బన్లు), పెంటోస్ (5 కార్బన్లు), హెక్సోస్ (6 కార్బన్లు)గా వర్గీకరిస్తారు.

ఉదా: గ్లూకోజ్, ఫ్రక్టోజ్ హెక్సోస్‌లు ($C_6H_{12}O_6$), రైబోజ్ పెంటోస్ ($C_5H_{10}O_5$).


ఉదాహరణలు – విధులు:

గ్లూకోజ్: రక్తంలో బ్లడ్ షుగర్‌గా పిలిచే ఈ చక్కెర శరీరంలోని కణాలకు ప్రాథమిక శక్తివనరు. ఇది శ్వాసక్రియలో ATP (శక్తి కరెన్సీ) ఉత్పత్తికి ఉపయోగపడుతుంది. తేనె, పండ్లు, మొక్కజొన్న మొదలైనవి దీనికి ఆహార వనరులు.



ఫ్రక్టోజ్: పండ్ల చక్కెరగా పిలిచే ఫ్రక్టోజ్ కాలేయంలో గ్లూకోజ్‌గా మారి శక్తిని అందిస్తుంది. పండ్లు, తేనె మొదలైనవి ఆహార వనరులు.

గెలాక్టోజ్: పాలలో లాక్టోజ్ రూపంలో కనిపిస్తుంది. జీర్ణక్రియలో గ్లూకోజ్‌గా మారి శక్తిని అందిస్తుంది. పాలు, పాల ఉత్పత్తులు ఆహార వనరులు.



ప్రాముఖ్యత: తక్షణ శక్తి అందించడం ద్వారా శరీరంలోని మెదడు, కండరాలకు శక్తిని సరఫరా చేస్తాయి.

◆ ఇతర కార్బోహైడ్రేట్లు (డైశాకరైడ్లు, పాలీశాకరైడ్లు) ఏర్పడటానికి బిల్డింగ్ బ్లాక్‌లుగా పనిచేస్తాయి.

◆ రైబోజ్ లాంటి మోనోశాకరైడ్లు DNA, RNA నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తాయి.

డైశాకరైడ్లు


ఇవి రెండు మోనోశాకరైడ్ అణువులు గ్లైకోసిడిక్ బంధాల ద్వారా కలిసి ఏర్పడే కార్బోహైడ్రేట్లు. జీర్ణక్రియ సమయంలో ఎంజైమ్‌ల ద్వారా మోనోశాకరైడ్లుగా విచ్ఛిన్నమై శక్తిని అందిస్తాయి.

రసాయన నిర్మాణం: రెండు మోనోశాకరైడ్లు ఒక గ్లైకోసిడిక్ బంధం ద్వారా అనుసంధానమై, ఒక నీటి అణువును విడుదల చేస్తూ ఏర్పడతాయి. దీన్నే కండెన్సేషన్ రియాక్షన్ అంటారు.

ఉదా: సుక్రోజ్ అనేది గ్లూకోజ్, ఫ్రక్టోజ్ మధ్య గ్లైకోసిడిక్ బంధం ద్వారా ఏర్పడుతుంది.


ఉదాహరణలు – విధులు:

సుక్రోజ్ (గ్లూకోజ్ + ఫ్రక్టోజ్): దీన్ని సాధారణంగా టేబుల్ షుగర్‌గా వినియోగిస్తారు. ఇది జీర్ణక్రియలో సుక్రేస్ ఎంజైమ్ ద్వారా గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌గా విచ్ఛిన్నమవుతుంది. చెరకు, బీట్‌రూట్, మాపుల్ సిరప్ ఆహార వనరులు.



లాక్టోజ్ (గ్లూకోజ్ + గెలాక్టోజ్): ఇది పాలలో కనిపించే చక్కెర. శిశువులకు శక్తి వనరుగా పని చేస్తుంది. లాక్టేస్ ఎంజైమ్ ద్వారా జీర్ణమవుతుంది. పాలు, డైరీ ఉత్పత్తులు ఆహార వనరులు.

మాల్టోజ్ (గ్లూకోజ్ + గ్లూకోజ్): ఇది ధాన్యాల (ముఖ్యంగా మొలకెత్తిన గింజలు) జీర్ణక్రియ సమయంలో ఏర్పడుతుంది. మాల్టేస్ ఎంజైమ్ ద్వారా జీర్ణమవుతుంది. బార్లీ, బీర్, మాల్ట్ ఉత్పత్తులు ఆహార వనరులు.



ప్రాముఖ్యత: డైశాకరైడ్లు శరీరంలో శక్తి వనరుగా పని చేస్తాయి. కానీ మోనోశాకరైడ్లుగా విచ్ఛిన్నమైన తర్వాతే శోషణ చెందుతాయి.

❖ సుక్రోజ్ లాంటి డైశాకరైడ్లు ఆహారంలో తీపి రుచిని అందిస్తాయి, వివిధ వంటకాల్లో ఉపయోగపడతాయి.

❖ లాక్టేస్ ఎంజైమ్ లోపం ఉన్నవారు లాక్టోజ్‌ను జీర్ణించుకోలేరు. ఫలితంగా జీర్ణ సమస్యలు తలెత్తుతాయి.

పాలీశాకరైడ్లు

పాలీశాకరైడ్లు అనేక (పదుల నుంచి వేల సంఖ్యలో) మోనోశాకరైడ్ అణువుల గొలుసులతో ఏర్పడే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు. శక్తి నిల్వ, నిర్మాణాత్మక సహాయం, ఇతర జీవక్రియ పాత్రలను నిర్వహిస్తాయి.

రసాయన నిర్మాణం: పాలీశాకరైడ్లు గ్లైకోసిడిక్ బంధాల ద్వారా అనుసంధానితమై అనేక మోనోశాకరైడ్ ప్రమాణాలను కలిగి ఉంటాయి.

● ఇవి సరళ (ఉదా: సెల్యులోజ్) లేదా కొమ్మలు ఉన్న (ఉదా: గ్లైకోజన్) నిర్మాణాలను కలిగి ఉండవచ్చు.

ఉదాహరణలు – విధులు:

స్టార్చ్ (పిండి పదార్థం): మొక్కల్లో శక్తి నిల్వరూపం. ఇది అమైలోస్ (సరళ గొలుసు), అమిలోపెక్టిన్ (కొమ్మలు ఉన్న గొలుసు) రూపాల్లో ఉంటుంది. బియ్యం, గోధుమలు, బంగాళదుంపలు మొదలైనవి ఆహార వనరులు.

◗ జీర్ణక్రియలో అమైలేస్ ఎంజైమ్ ద్వారా గ్లూకోజ్ యూనిట్లుగా విచ్ఛిన్నమై శక్తిని అందిస్తుంది.

గ్లైకోజన్: జంతువుల్లో శక్తి నిల్వరూపం. ఇది కాలేయం, కండరాల్లో నిల్వ ఉంటుంది. అవసరమైనప్పుడు (ఉదా: ఉపవాసం లేదా వ్యాయామ సమయంలో) గ్లూకోజ్‌గా విచ్ఛిన్నమై శక్తిని అందిస్తుంది.

◗ గ్లైకోజన్ అధికంగా శాఖలతో కూడిన నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి వేగవంతమైన శక్తి విడుదలకు సాయపడుతుంది.

సెల్యులోజ్: ఇది మొక్కల కణ కవచాల్లో నిర్మాణాత్మక భాగం. బీటా-గ్లూకోజ్ ప్రమాణాల సరళ గొలుసులతో ఏర్పడుతుంది.

◗ మానవుల్లో సెల్యులేస్ ఎంజైమ్ లేనందువల్ల వారు సెల్యులోజ్‌ను జీర్ణించుకోలేరు. అయినప్పటికీ ఇది ఆహార ఫైబర్‌గా పనిచేసి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. ఆహారనాళం ఆరోగ్యంగా ఉండేలా సహకరిస్తుంది. కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు మొదలైనవి ఆహార వనరులు.

కైటిన్: కీటకాలు, క్రస్టేషియన్ల (ఉదా: పీతలు, రొయ్యలు) బాహ్య అస్థిపంజరాలు, శిలీంధ్రాల కణ కవచాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది.



రచయిత
కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

707 Word of the Day

Hardship

Telugu meaning: పేదరికం, కష్టకాలం

English meaning: The word hardship (హార్డ్‌షిప్) is a noun that refers to severe suffering or difficulty, often due to the lack of resources, comfort, or basic needs.

Synonyms: Adversity, Misery

Antonyms: Comfort, Prosperity

Usage: **1.** He endured great hardship during his childhood, but never gave up on his dreams.

2. The villagers faced extreme hardship due to the prolonged drought.

నోటిఫికేషన్స్

క్లరికల్ ట్రైనీ పోస్టులు

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (వీసీబీ) క్లరికల్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 45. దరఖాస్తు ఫీజు రూ.100. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2025 జులై 16.

సైంటిస్ట్ ఉద్యోగాలు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) వివిధ విభాగాల్లో సైంటిస్ట్/ఇంజినీర్ ఎస్‌సీ (సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 39. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 జులై 14.

సూపర్‌వైజరీ ట్రైనీ పోస్టులు

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ వివిధ విభాగాల్లో సూపర్‌వైజరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 32. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 జులై 22.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులు/ ప్రవేశాలకు నేడే (జులై 11) చివరి తేదీ

▮ ఎన్‌సీసీబీఎంలో 13 ప్రాజెక్ట్ అసోసియేట్ ఉద్యోగాలు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ ఎన్ఆర్ఎస్‌సీ హైదరాబాద్‌లో 34 ఉద్యోగాలు. ఎంఈ/ఎంటెక్, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

▮ ఎఫ్‌డీడీఐలో 18 ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టులు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ జనాభా దినోత్సవం

జులై 11
చరిత్రలో ఈనాడు

జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యలు, సమాజంపై దాని ప్రభావాన్ని తెలియజేసే లక్ష్యంతో ఏటా జులై 11న 'ప్రపంచ జనాభా దినోత్సవం' (World Population Day)గా నిర్వహిస్తారు. ఒక ప్రదేశంలో నివసించే ప్రజల సంఖ్యను జనాభా అంటారు. మరణాల రేటు తగ్గుతూ, జననాల రేటు పెరిగితే మొత్తం జనాభాలో పెరుగుదల కనిపిస్తుంది. దీన్నే 'జనాభా విస్ఫోటనం' అంటారు. ప్రస్తుతం భారత్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఈ దశలోనే ఉన్నాయి. కుటుంబ నియంత్రణ, లింగసమానత్వం మొదలైనవాటి గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

▮ జనాభా గురించి అధ్యయనం చేయడాన్ని డెమోగ్రఫీ అంటారు. ఆర్థికాభివృద్ధి అనేది భౌతిక, సహజ వనరులపైనే కాకుండా మానవ వనరులపైనా ఆధారపడుతుంది. దేశంలోని జనాభా, విద్యా ప్రమాణాలు, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, ఆదాయ పంపిణీ మొదలైనవన్నీ ఇందులో భాగం. ఒక దేశ ఆర్థిక వృద్ధిని నిర్దేశించే అంశంగా జనాభా పెరుగుదలను పేర్కొంటారు.

▮ యూఎన్ పాపులేషన్ ఫండ్ (యూఎన్‌పీఎఫ్) - స్టేట్ ఆఫ్ ది వరల్డ్ పాపులేషన్ నివేదిక 2024 ప్రకారం, 2024 నాటికి మొత్తం ప్రపంచ జనాభా 811.9 కోట్లుగా ఉందని అంచనా. దీని ప్రకారం ప్రపంచంలో జనాభా పరంగా అతిపెద్ద దేశాలు వరుసగా: భారత్ - 144.17 కోట్లు, చైనా - 142.52 కోట్లు, యూఎస్‌ఏ - 34.18 కోట్లు, ఇండోనేసియా - 27.98 కోట్లు, పాకిస్థాన్ - 24.52 కోట్లు, నైజీరియా - 22.92 కోట్లు, బ్రెజిల్ - 21.76 కోట్లు, బంగ్లాదేశ్ - 17.47 కోట్లు, రష్యా - 14.40 కోట్లు, ఇథియోపియా - 12.97 కోట్లు.



చారిత్రక నేపథ్యం:


1830లో ప్రపంచ జనాభా ఒక బిలియన్ ఉండేది. 1987 నాటికి అది అయిదు బిలియన్లకు చేరింది. అయిదో బిలియన్ చివరి శిశువు 11 జులై 1987లో యుగోస్లావియాలో జన్మించాడు.

▮ ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా జులై 11న 'ప్రపంచ జనాభా దినోత్సవం'గా జరుపుకోవాలని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) పాలకమండలి 1989లో నిర్ణయించింది. ఇదే ప్రతిపాదనను 1990, డిసెంబరులో యూఎన్ జనరల్ అసెంబ్లీ కూడా ఆమోదించింది.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ రచన

ప్రపంచంలోని అనేక దేశాలు తమ రాజ్యాంగానికి అత్యున్నత స్థానాన్ని కల్పించాయి. రాజ్యాంగం లేకపోతే పాలన అస్తవ్యస్తమవుతుంది. ఇది దేశ నాయకులకు, పాలకులకు, పౌరులకు దిశానిర్దేశం చేస్తుంది. భారత్‌లో స్వాతంత్ర్యానికి పూర్వమే రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది. దీనిలోని సభ్యులు అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, దేశానికి అవసరమైన రాజ్యాంగ రచనను పూర్తి చేశారు. పోటీపరీక్షార్థులు రాజ్యాంగ పరిషత్ ఎన్నిక విధానం, అధ్యక్షులు, ఆమోదం, అమలు తదితర విషయాలపై అవగాహన ఏర్పర్చుకోవాలి.



చారిత్రక నేపథ్యం

భారతదేశానికి ఒక రాజ్యాంగ నిర్మాణ సభ ఉండాలని కమ్యూనిస్టు ఉద్యమకారుడు, రాడికల్ డెమోక్రటిస్ సిద్ధాంతవాది ఎం.ఎన్.రాయ్ మొదటిసారిగా ప్రతిపాదించారు.

✦ భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కోసం మొట్టమొదటిసారిగా డిమాండ్ చేసిన రాజకీయ పార్టీ - స్వరాజ్‌పార్టీ.

✦ 1946 జూన్-జులైలో భారతదేశంలో పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ముందుగా రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు నిర్వహించారు. శాసనసభలకు ఎన్నికైన సభ్యులు రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకున్నారు. దేశ విభజనకు ముందు రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా 389 మంది ఎన్నికయ్యారు.

రాజ్యాంగం ఆమోదం

రాజ్యాంగ పరిషత్ సభ్యులు సుమారు 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి రాజ్యాంగం రాశారు. దీన్ని రాసేందుకు అయిన మొత్తం ఖర్చు రూ.64 లక్షలు.

✦ రాజ్యాంగం రాయడానికి పట్టిన సమయం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు.

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబరు 9న గవర్నర్ జనరల్ వేవెల్ ఆదేశానుసారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది.

✦ ఈ సమావేశానికి 211 మంది సభ్యులు హాజరయ్యారు.

✦ జె.బి.కృపలానీ సూచన మేరకు అందరికంటే పెద్దవాడైన డా. సచ్చిదానంద సిన్హాను ఫ్రెంచ్ సంప్రదాయాన్ని అనుసరించి తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తాత్కాలిక ఉపాధ్యక్షుడిగా ఫ్రాంకో ఆంటోనీని ఎన్నుకున్నారు.

భారత రాజ్యాంగానికి ఆధారాలు, భారత రాజ్యాంగంలోని షెడ్యూళ్లు సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Tilaiya Barrage is located in...

Current Affairs

1. Which new unified web-based platform, launched by Union Jal Shakti Minister C R Patil, provides two-day advance flood inundation forecasts up to the village level?
A) FloodWatch B) C-FLOOD
C) RiverGuard D) HydroAlert

2. Novak Djokovic recently became the third player in Wimbledon history-after Martina Navratilova and Roger Federer-to achieve his 100th singles match victory at the tournament. Against which opponent did he record this milestone win?
A) Alex de Minaur
B) Jannik Sinner C) Miomir Kecmanovi
D) Flavio Cobolli

3. At the 17th BRICS Summit in Brazil, which Southeast Asian country was welcomed as a full member of the BRICS bloc?
A) Malaysia B) Indonesia
C) Thailand D) Vietnam

4. Which 3,500-year-old city, recently uncovered in Peru, served as a significant trading hub linking the Pacific coast, Andes, and Amazon regions?
A) Caral B) Huaricanga
C) Penico D) Sechin Bajo

5. Who has been appointed as the new CEO of the Reserve Bank Innovation Hub (RBIH) in July 2025?
A) Rakesh Ranjan B) Rajesh Bansal
C) Kris Gopalakrishnan D) Sahil Kini

6. Who was recently appointed as the Lead-Communications & Public Relations on the Executive Committee of the Commonwealth Youth Peace Ambassadors Network (CYPAN) for the 2025-2027 term?
A) Sukanya Sonowal
B) Ananya Mishra
C) Priyanka Das
D) Nisha Verma

Geography

7. Which of the following combinations correctly lists all the Indian states that share a border with Madhya Pradesh?
A) Uttar Pradesh, Jharkhand, Maharashtra, Gujarat, Punjab
B) Rajasthan, Bihar, Chhattisgarh, Gujarat, Uttar Pradesh
C) Gujarat, Maharashtra, Telangana, Odisha, Rajasthan
D) Uttar Pradesh, Chhattisgarh, Maharashtra, Gujarat, Rajasthan

SSC Exams Special
General Awareness

8. What are trade winds?
A) Air currents that blow from east to west near the equator
B) Winds that move from poles to the equator at high altitudes
C) Seasonal winds affecting the Indian subcontinent
D) Irregular wind patterns found in temperate regions

9. Which Indian steel plant was established in 1959 with assistance from West Germany?
A) Bhilai Steel Plant
B) Durgapur Steel Plant
C) Rourkela Steel Plant
D) Bokaro Steel Plant

10. Tilaiya Barrage is located in which district of Jharkhand?
A) Dhanbad B) Ranchi
C) Koderma D) Bokaro

Polity

11. Which Article of the Indian Constitution provides for the development and promotion of the Hindi language?
A) Article 351 B) Article 343
C) Article 348 D) Article 350A

12. Which Constitutional Amendment granted constitutional status to cooperative societies in India by inserting Part IX-B?
A) 91st Amendment Act, 2003
B) 93rd Amendment Act, 2005
C) 95th Amendment Act, 2009
D) 97th Amendment Act, 2011

13. The Second Schedule of the Indian Constitution deals with the emoluments and privileges of which of the following?
A) President, Governors, Speaker and Deputy Speaker of Lok Sabha
B) Supreme Court Judges only
C) Members of the Election Commission only
D) Ministers of State Legislatures only

14. Which writ is issued by a court to inquire into the legality of a person's claim to hold a public office?
A) Habeas Corpus B) Mandamus
C) Certiorari D) Quo Warranto

General Science

15. What is litmus paper primarily made from?
A) Natural dyes extracted from lichens
B) Chemical indicators derived from acids
C) Synthetic color pigments
D) Fermented plant roots

16. What does the term "valency" refer to in chemistry?
A) The number of neutrons in an atom
B) The total atomic mass of an element
C) The combining capacity of an element with another
D) The energy released during a chemical reaction

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.




నిప్పు లేకపోయినా నీటిని వేడి చేస్తుంది. పాటని, మాటని పట్టి పెట్టేసుకొని అడిగినప్పుడల్లా వినిపిస్తుంది. నియంత్రిత ప్రాంతంలోకి నియమాలకు విరుద్ధంగా ప్రవేశిస్తే అలారాన్ని ఆగకుండా మోగిస్తుంది. అదే విద్యుదయస్కాంత ప్రేరణ. ఒక అయస్కాంత క్షేత్రంలో ఉన్న వాహకం లేదా తీగచుట్టలో అయస్కాంతం లేదా తీగచుట్ట కదలికల వల్ల తీగపై పనిచేసే అయస్కాంత ప్రేరణలో మార్పులు ఏర్పడి విద్యుత్తు పుడుతుంది. దాని వల్ల నీరు వేడెక్కుతుంది, పాట వినిపిస్తుంది, అలారం మోగేస్తుంది. ఈ ప్రక్రియలకు కారణమైన ప్రభావాన్నే విద్యుదయస్కాంత ప్రేరణ అంటారు. భౌతిక శాస్త్రంలో అతిముఖ్యమైన ఈ భావన గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. విద్యుత్తు క్షేత్రం, అయస్కాంత క్షేత్రం, అయస్కాంత రేఖలు, విద్యుచ్ఛాలక బలం, శాస్త్రవేత్తల నియమాలపై అనువర్తనాలతో సహా అవగాహన పెంచుకోవాలి.

శక్తి ఉత్పత్తికి మూలం!

జనరల్ స్టడీస్
భౌతిక శాస్త్రం

విద్యుదయస్కాంత ప్రేరణ

తీగచుట్ట, అయస్కాంతాల మధ్య సాపేక్ష చలనం వల్ల తీగచుట్టలో విద్యుత్తు ప్రవాహం ఏర్పడుతుంది. ఇక్కడ తీగచుట్ట వైపు అయస్కాంతం కదిలినా, అయస్కాంతం వైపు తీగచుట్ట కదిలినా ఫలితాల్లో తేడా ఉండదు. తీగచుట్టలో అయస్కాంత అభివాహాన్ని నిరంతరం మారుస్తూ ఉంటే ఆ తీగచుట్టలో విద్యుత్తు ప్రవాహం ఏర్పడుతుంది. దీనిని ఫారడే నియమానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ విధంగా ఏర్పడిన విద్యుత్తు ప్రవాహాన్ని 'ప్రేరిత విద్యుత్తు ప్రవాహం' అంటారు. ఇది ప్రేరిత విద్యుచ్ఛాలక బలం వల్ల ఏర్పడుతుంది. ఈ విధంగా ప్రేరిత విద్యుత్తు ప్రవాహాన్ని పొందే దృగ్విషయాన్ని 'విద్యుదయస్కాంత ప్రేరణ' అంటారు.



ఫారడే నియమం: ఒక సంవృత వలయంలో ఏర్పడిన విద్యుచ్ఛాలక బలం విలువ, దాని ద్వారా వెళ్లే అయస్కాంత అభివాహ మార్పు రేటుకు సమానం. దీనిని గణిత రూపంలో ఈ విధంగా రాయవచ్చు.

$$\text{ప్రేరిత విద్యుచ్ఛాలక బలం} = \frac{\text{అభివాహంలో మార్పు}}{\text{కాలం}} \qquad \varepsilon = \frac{\Delta\phi}{\Delta t}$$

ఈ సమీకరణాన్ని 'ఫారడే విద్యుదయస్కాంత ప్రేరణ నియమం' అంటారు. ఇక్కడ ϕ = తీగచుట్టలోని అభివాహాన్ని సూచిస్తుంది.

లెంజ్ నియమం: తీగచుట్టలో ప్రేరిత విద్యుత్తు ప్రవాహం అపసవ్య దిశలో ఉండటం తప్పనిసరి. అంటే తీగచుట్టలో అభివాహం అధికమైతే ఆ చుట్ట ఆ పెరుగుదలను వ్యతిరేకిస్తుంది. అభివాహం తగ్గితే తీగచుట్ట ఆ తగ్గుదలను వ్యతిరేకిస్తుంది. తీగచుట్టలో అభివాహ మార్పును వ్యతిరేకించే దిశలో ప్రేరణ విద్యుత్తు ప్రవాహం ఉంటుంది. దీనినే 'లెంజ్ నియమం' అంటారు.



ఫారడే విద్యుదయస్కాంత ప్రేరణ నియమం అనువర్తనాలు

➡ సెక్యూరిటీ చెకింగ్ కోసం ఏర్పాటు చేసే పెద్ద పెద్ద ద్వారాల్లో తీగచుట్టను ఉంచుతారు. అది బలహీన సహజ అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరుస్తుంది. ఏదైనా ఇనుము లాంటి అయస్కాంత క్షేత్ర ప్రభావిత వస్తువును ఆ ద్వారం ద్వారా తీసుకెళితే తీగచుట్ట అయస్కాంత క్షేత్ర అభివాహంలో మార్పు ఏర్పడి, విద్యుత్తు ప్రవాహం జరిగి అలారం మోగుతూ హెచ్చరిస్తుంది.




➡ పాటలు వినడానికి లేదా రికార్డు చేయడానికి ఉపయోగించే టేప్ రికార్డర్ విద్యుదయస్కాంత ప్రేరణపై ఆధారపడి పనిచేస్తుంది. దీనిలోని క్యాసెట్‌లో పలుచని ప్లాస్టిక్ టేప్ ఉంటుంది. దానిపై ఐరన్ ఆక్సైడ్ పూత ఉంటుంది. ఈ టేప్‌పై వివిధ ప్రదేశాలు, రకరకాల తీవ్రతలతో అయస్కాంతీకరణకు గురై ఉంటాయి. టేప్ రికార్డర్‌లో ఉన్న చిన్న తీగచుట్టను ఈ టేప్ తాకుతూ కదులుతున్నప్పుడు దాని అయస్కాంత క్షేత్రాల్లో కలిగే మార్పుల వల్ల ఆ తీగచుట్టలో విద్యుత్తు ప్రవాహం ఏర్పడుతుంది.




➡ ఏటీఎం కార్డులో ఉండే అయస్కాంత పట్టీని స్కానర్‌లో స్వైప్ చేసినప్పుడు అది విద్యుదయస్కాంత ప్రేరణ సిద్ధాంతం ప్రకారం పనిచేస్తుంది.

➡ ఇండక్షన్ స్టవ్ విద్యుదయస్కాంత ప్రేరణ నియమంపై ఆధారపడి పనిచేస్తుంది. స్టవ్ ఉపరితలానికి కింద ఒక లోహపుచుట్ట ఉంటుంది. దానిలో ఏసీ విద్యుత్తును ప్రవహింపజేస్తే దానిచుట్టూ అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. ఒక లోహపు పాత్రలో నీరు పోసి స్టవ్‌పై ఉంచితే దాని అడుగు భాగంలో ఉన్న అయస్కాంత క్షేత్రం పాత్ర అడుగు భాగాన్ని దాటడం వల్ల పాత్రపై విద్యుచ్ఛాలక బలం ప్రేరేపితమవుతుంది. పాత్ర లోహంతో తయారుకావడంతో ప్రేరిత ఈఎంఎఫ్ పాత్రలో ప్రేరిత విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. పాత్రకు నియమిత నిరోధం ఉండటంతో ప్రవహిస్తున్న విద్యుత్తు వల్ల ఉష్ణం జనించి, అది నీటికి అందుతుంది. అందుకే దానిని ఇండక్షన్ స్టవ్ అని పిలుస్తారు. ➡ ఎలక్ట్రికల్ జనరేటర్‌లో స్థిర అయస్కాంత ధ్రువాల మధ్య ఒక దీర్ఘచతురస్రాకార తీగచుట్ట ఉంటుంది. అది భ్రమణం చెందితే దాని ద్వారా ప్రసరించే అభివాహం మారడం వల్ల విద్యుదయస్కాంత ప్రేరణ నియమం ప్రకారం తీగచుట్టలో విద్యుత్తు ప్రేరేపితమవుతుంది.



ఏసీ జనరేటర్: దీనిలోని తీగచుట్టలో ప్రతి అర్ధ భ్రమణానికి ప్రేరిత విద్యుత్తు ప్రవాహ దిశ నిరంతరం మారడం వల్ల ఏసీ విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దీనినే 'ఏకాంతర విద్యుత్తు' అని కూడా పిలుస్తారు. ఏసీ విద్యుత్తు షాక్ కొడుతుంది. ఇది ప్రమాదకరమైంది.


డీసీ జనరేటర్: దీనిలో తీగచుట్ట చివరన 'కమ్యూటేటర్' అనే పరికరాన్ని ఉపయోగిస్తారు. దాంతో ఉత్పత్తి అయిన ప్రేరణ విద్యుత్తు ప్రవాహదిశ ఒకే దిశలో ఉంటుంది. దీనిని 'డీసీ విద్యుత్తు' లేదా 'ఏకముఖ విద్యుత్తు' అంటారు. ఇది షాక్ కొట్టదు అందుకే ప్రమాదకరమైంది కాదు.
* జనరేటర్లు యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మారుస్తాయి. ఫారడే విద్యుదయస్కాంత ప్రేరణ నియమం ఆధారంగా ఇవి పనిచేస్తాయి.
* ఫారడే నియమాన్ని శక్తి నిత్యత్వ నియమం ఫలితంగా భావించవచ్చు.




అయస్కాంత క్షేత్ర దిశలో ఉంచిన విద్యుత్తు ప్రవాహ తీగపై పని చేసే అయస్కాంత క్షేత్ర బలం: * అయస్కాంత క్షేత్రంలో విద్యుత్తు తీగను ఉంచితే, దానిపై పనిచేసే క్షేత్ర బలం F = BIL sinθ అవుతుంది. B = అయస్కాంత ప్రేరణ, I = విద్యుత్తు ప్రవాహం, L = తీగ పొడవు
* అయస్కాంత క్షేత్ర దిశకు లంబంగా తీగలో విద్యుత్తు ప్రవాహం ఉన్నప్పుడు దానిపై పనిచేసే క్షేత్ర బలం F = BIL కు సమానంగా ఉంటుంది.
* అయస్కాంత క్షేత్ర దిశకు సమాంతరంగా తీగలో విద్యుత్తు ప్రవాహం ఉన్నప్పుడు దానిపై పనిచేసే క్షేత్ర బలం F = 0 అవుతుంది.

అయస్కాంత క్షేత్రంలో కదిలే ఆవేశంపై పనిచేసే అయస్కాంత క్షేత్ర బలం

* కదిలే ఆవేశానికి, అయస్కాంత క్షేత్రానికి మధ్య కోణం 'θ' ఉన్నట్లయితే దానిపై పనిచేసే అయస్కాంత క్షేత్రబలం F = qVB sinθ అవుతుంది.




* q అనే ఆవేశం 'V' వేగంతో అయస్కాంత క్షేత్రానికి లంబంగా ఉన్నప్పుడు దానిపై పనిచేసే క్షేత్రబలం F = qVB కి సమానంగా ఉంటుంది.
* అయస్కాంత క్షేత్రానికి సమాంతరంగా కదిలే ఆవేశంపై పనిచేసే అయస్కాంత బలం F = 0 అవుతుంది. ఇక్కడ... q = ఆవేశం, V = వేగం, B = అయస్కాంత క్షేత్రం




విద్యుత్తు ప్రవాహంతో తీగలో అయస్కాంత క్షేత్రం

1) సరళరేఖ లాంటి తీగలో విద్యుత్తుప్రవాహం వల్ల ఏర్పడే అయస్కాంతక్షేత్రం: * కుడిచేతిబొటనవేలు నిబంధన ద్వారా బలరేఖల దిశను గుర్తించవచ్చు. * దీనిలో కుడిచేతి బొటనవేలి దిశ విద్యుత్తు ప్రవాహ దిశను, మిగతా వేళ్లు అయస్కాంత క్షేత్ర దిశను సూచిస్తాయి.



2) వలయాకార తీగలో విద్యుత్తు ప్రవాహంవల్ల ఏర్పడే అయస్కాంతక్షేత్రం: * కుడిచేతి బొటనవేలు నిబంధన ద్వారా వలయాకార బలరేఖల దిశను గుర్తించవచ్చు. * దీనిలో బొటనవేలు అయస్కాంతక్షేత్ర దిశను, మిగతావేళ్లు విద్యుత్తు ప్రవాహదిశను సూచిస్తాయి.

3) సాలినాయిడ్‌లో విద్యుత్తు ప్రవాహం వల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రం: * కుడిచేతి బొటనవేలు నిబంధనతో సాలినాయిడ్‌లో బలరేఖల దిశను గుర్తించవచ్చు. * ఇది దండయస్కాంత లక్షణాలను పోలి ఉంటుంది.
* సాలినాయిడ్ రెండు చివరల్లో ఒకటి ఉత్తర ధ్రువంగా, మరొకటి దక్షిణ ధ్రువంగా ప్రవర్తిస్తాయి.





రచయిత: చంటి రాజుపాలెం

ప్రాక్టీస్ బిట్లు

ఇండియన్ ఎకానమీ

1. నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎవరు నియమితులయ్యారు?
 1) ఎస్.వి.ఆర్. సుబ్రహ్మణ్యం
 2) కె.వి.ఆర్. సుబ్రహ్మణ్యం
 3) బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం
 4) ఎల్.వి.ఆర్. సుబ్రహ్మణ్యం



2. నీతిఆయోగ్‌లో తాత్కాలిక సభ్యులను ఎలా ఎంపిక చేస్తారు?
 1) యూనివర్సిటీలు, ముఖ్యమైన రంగాల నుంచి
 2) సుప్రీంకోర్టు నుంచి
 3) హైకోర్టు నుంచి 4) యూపీఎస్సీ నుంచి
3. నీతి ఆయోగ్ మొదటి ఛైర్మన్ ఎవరు?
 1) నరేంద్ర మోదీ 2) డాక్టర్ మన్మోహన్ సింగ్
 3) రాజీవ్ కుమార్ 4) అరవింద్ పనగరియా
4. నీతిఆయోగ్ సంస్థాగత నిర్మాణంలో పూర్తికాల విధులు నిర్వహించే వారిని గుర్తించండి.
 ఎ) ఉపాధ్యక్షుడు బి) ప్రధానమంత్రి
 సి) పూర్తి సభ్యులు డి) తాత్కాలిక సభ్యులు
 1) ఎ, బి 2) ఎ, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
5. 2023-24కు ఎస్‌డీజీ ఇండియా ఇండెక్స్ ద్వారా కొలిచిన దేశం మొత్తం స్కోరు?
 1) 57 2) 60 3) 66 4) 71
6. భారతదేశం ఇంధనరంగంలో స్వావలంబన సాధించడానికి నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఏ సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించింది?
 1) 2030 2) 2047 3) 2070 4) 2050

సమాధానాలు
1-3; 2-1; 3-1; 4-4; 5-4; 6-2.

దోమ సైజులో అతిచిన్న గూఢచారి!



దేశంలో మొదటిసారిగా బిహార్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ-ఓటింగ్‌ను ప్రవేశపెట్టారు. రాకేశ్ శర్మ తర్వాత రోదసిలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా శుభాంశు శుక్లా ఘనత సాధించారు. దోమ పరిమాణంలో ఉండే అతి చిన్న గూఢచారి డ్రోన్‌ను చైనా రూపొందించింది. దిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ రహదారిపై రాజస్థాన్ పరిధిలోని అటవీప్రాంతంలో వన్యప్రాణుల కోసం కారిడార్‌ను అభివృద్ధి చేశారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్‌గా దీపిక పదుకొణె ఎంపికైంది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభమైంది. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, ప్రధాన ఘటనలుగా నిలిచే ఇలాంటి వర్తమాన వ్యవహారాలన్నింటిపై పోటీ పరీక్షార్థులు నిరంతరం దృష్టి సారించాలి. ప్రధాన మీడియాలో వచ్చే రోజువారీ సంఘటనలు, ప్రపంచ రాజకీయ పరిణామాలు, యుద్ధాల పర్యవసానాలు, క్రీడల ఫలితాలు, దేశీయ రక్షణ రంగ విశేషాలు, అవార్డుల విజేతలు, నియామకాలతోపాటు రాష్ట్రాలవారీ ప్రాధాన్యం ఉన్న అంశాలను సమగ్రంగా తెలుసుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. యూఎన్‌ఓ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన - 2025లో భారత్ స్థానం ఎంత?
 1) 99వ 2) 96వ 3) 128వ 4) 108వ
 నోట్: ▸ 2024లో భారత్ ర్యాంకు - 109
 ▸ యూఎన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్ నెట్‌వర్క్ 10వ సుస్థిర అభివృద్ధి నివేదిక.
 ▸ ఫిన్‌లాండ్, స్వీడన్, డెన్మార్క్ 1, 2, 3 స్థానాల్లో ఉన్నాయి.
 ▸ భారత్ 67 పాయింట్లతో 99వ స్థానంలో నిలిచింది. చైనా 67వ (74.4), అమెరికా 44వ (75.2), భూటాన్ 74వ (70.5), నేపాల్ 85వ (68.6), బంగ్లాదేశ్ 114వ (63.9), పాకిస్థాన్ 140వ (57) స్థానాల్లో నిలిచాయి.
2. కింది వాటిలో సరైంది?
 ఎ) గ్లోబల్ పీస్ ఇండెక్స్-2025ను 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్' విడుదల చేస్తుంది.
 బి) 2025 నివేదికలో 163 దేశాలను పరిగణనలోకి తీసుకున్నారు.
 సి) ఐస్‌లాండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
 డి) భారత్ ఈ నివేదికలో 115వ స్థానం దక్కించుకుంది.
 ఇ) రష్యాది 163వ స్థానం.
 1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ
 3) బి, డి, ఇ 4) ఎ, సి, డి
3. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సదస్సు - 2025లో ఎక్కడ జరిగింది?
 1) ది హేగ్ (నెదర్లాండ్స్) 2) న్యూయార్క్ (అమెరికా)



 3) లండన్ (బ్రిటన్) 4) ఒట్టావా (కెనడా)
 నోట్: ▸ నాటో 1949లో ఏర్పడింది.
 ▸ దీనిలో 32 సభ్య దేశాలున్నాయి. 32వ సభ్య దేశం స్వీడన్.
 ▸ ప్రధాన కార్యాలయం బ్రసెల్స్ (బెల్జియం)లో ఉంది.
 ▸ 2026లో 'నాటో సదస్సు-2026' తుర్కియేలో జరగనుంది.
4. Raw (రిసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) చీఫ్‌గా రవిసిన్హా స్థానంలో నూతనంగా ఎవరు నియమితులయ్యారు?
 1) పరాగ్ జైన్ 2) క్రాంతి క్రానే
 3) సుశాంత్ సింగ్ 4) అరుణ్ జైన్
5. 'ది వన్: క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్' పుస్తక రచయిత?
 1) సచిన్ తెందూల్కర్ 2) ధోని
 3) శిఖర్ ధావన్ 4) రోహిత్ శర్మ
6. భారతదేశంలో మొదటిసారి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ఆండ్రాయిడ్ ఆధారిత ఈ-ఓటింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రాష్ట్రం?
 1) ఉత్తర్‌ప్రదేశ్ 2) బిహార్
 3) గోవా 4) అస్సాం
7. 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025' ఏ నగరంలో జరగనున్నాయి?
 1) హైదరాబాద్ 2) ముంబయి
 3) చెన్నై 4) జైపుర్
8. 2029లో ప్రయోగించనున్న ఆర్బిటల్ పోర్ట్ స్పేస్ స్టేషన్‌కు, టీఎస్ఐ ఆర్బిటల్ మిషన్‌కు ఎంపికైన మొదటి భారతీయురాలు ఎవరు?
 1) నీలిమా శర్మ 2) దంగేటి జాహ్నవి
 3) దంగేటి స్వప్న 4) వనజా కిరణ్
9. కింది వాటిలో సరైంది?
 ఎ) యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌లో శుభాంశు శుక్లా అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు.
 బి) యాక్సియం-4 మిషన్‌కు పెగ్గీ విట్సన్ (అమెరికా) కమాండ్ చేస్తారు. శుభాంశు శుక్లా పైలట్‌గా, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగేరీ) నిపుణులుగా వ్యవహరిస్తారు.
 సి) ఈ వ్యోమ నౌకలో జాయ్ (హంస బొమ్మ) వెళ్లింది.
 డి) శుభాంశు శుక్లా ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందినవారు.
 1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
 3) ఎ, బి, డి 4) ఎ, సి, డి
10. ఏఐ సాంకేతికతతో తొలి డిజిటల్ హైవే దేశంలో మొదటిసారిగా ఎక్కడ అందుబాటులోకి వచ్చింది?
 1) దిల్లీ - గురుగ్రామ్ 2) దిల్లీ - శ్రీనగర్
 3) ముంబయి - చెన్నై 4) ముంబయి - బెంగళూరు
11. ఇటీవల వార్తల్లో నిలిచిన 'అదమ్య' అనేది..
 1) ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌక
 2) నూతన క్షిపణి
 3) నూతన యుద్ధ విమానం
 4) ఇండియన్ కోస్ట్‌గార్డ్ సబ్‌మెరీన్



 నోట్: అదమ్యను గోవా షిప్‌యార్డ్‌లో తయారుచేశారు. దీన్ని 'ఫాస్ట్ పాట్రోల్ వెసల్‌'గా పిలుస్తారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో 2025, జూన్ 28న చేరింది.
12. భారతదేశం నుంచి అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (APEDA) ద్వారా ఏ రాష్ట్రం నుంచి తొలిసారిగా లిచి పండ్లు యూఏఈ, ఖతార్ దేశాలకు ఎగుమతి కానున్నాయి?
 1) ఉత్తర్‌ప్రదేశ్ 2) రాజస్థాన్
 3) పంజాబ్ 4) గుజరాత్
13. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ రవి అగర్వాల్ పదవీకాలాన్ని ఇటీవల కేంద్రం ఎప్పటి వరకు పొడిగించింది?
 1) జూన్, 2026 2) ఆగస్టు, 2027
 3) జూన్, 2029 4) ఆగస్టు, 2028
 నోట్: 2025, జూన్ 30న పదవీ విరమణ చేయాల్సిన ఇతడి పదవీకాలాన్ని ఏడాది పెంచారు. (జూన్, 2026 వరకు).
14. భారతదేశంలో మొదటి సీతాకోక చిలుకల అభయారణ్యాన్ని ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
 1) తమిళనాడు 2) కర్ణాటక
 3) గోవా 4) కేరళ
 నోట్: కన్నూర్ జిల్లాలోని 'అరళం వన్యప్రాణుల అభయారణ్యం' పేరును 'అరళం సీతాకోకచిలుకల అభయారణ్యం'గా మార్చారు.
 ▸ భారతదేశంలో మొదటి సీతాకోకచిలుకల పార్కు.. కర్ణాటకలోని బన్నేరుఘట్ట బయోలాజికల్ పార్కు (నవంబరు, 2006).
15. 'పేస్ట్రీ గేమ్ ఛేంజర్ అవార్డు' అందుకున్న మొదటి ఇండియన్ చెఫ్‌'గా ఎవరు రికార్డు సృష్టించారు?
 1) శ్రీలక్ష్మీ సూరాడ 2) పూజా ధింగ్రా
 3) కవితా మోహన్ 4) దివ్యారావు
16. భారతదేశంలో మొదటిసారి వన్యప్రాణుల కారిడార్‌ను ఏ ఎక్స్‌ప్రెస్‌పై అభివృద్ధి చేశారు?
 1) దిల్లీ - ముంబయి 2) దిల్లీ - గురుగ్రామ్
 3) దిల్లీ - శ్రీనగర్ 4) ముంబయి - బెంగళూరు
 నోట్: నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాజస్థాన్‌లోని బుంది జిల్లాలోని రణతంబోర్ టైగర్ రిజర్వ్ బఫర్ జోన్‌లో 12 కి.మీ. కారిడార్ అభివృద్ధి చేసింది.
17. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్' అవార్డుకు 'హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఎవరిని ఎంపిక చేసింది?
 1) ప్రియాంక చోప్రా 2) దీపికా పదుకొణె
 3) కత్రినా కైఫ్ 4) రష్మిక
18. దక్షిణ అమెరికాలో ఏ దేశాన్ని డబ్ల్యూహెచ్‌ఓ మలేరియా రహిత దేశంగా ప్రకటించింది?
 1) సురినామ్ 2) కొలంబియా
 3) చిలీ 4) బ్రెజిల్
 నోట్: ఆఫ్రికన్ దేశం బోట్స్వానా హెచ్‌ఐవీ వైరస్ వల్ల తల్లి నుంచి బిడ్డకు వ్యాప్తి చెందడాన్ని పూర్తిగా అరికట్టడంతో డబ్ల్యూహెచ్‌ఓ గోల్డ్ టైర్ హోదాను పొందింది.
19. ఇటీవల వార్తల్లో ఉన్న ఐరన్‌కబ్-3 అనేది?
 1) ప్రపంచంలో ఎగిరే మొదటి హ్యూమనాయిడ్ రోబో.
 2) ఇజ్రాయెల్ నూతన రక్షణ వ్యవస్థ.
 3) ఇరాన్ తయారుచేసిన నూతన రోబో.
 4) అమెరికా తయారు చేసిన నూతన క్షిపణి.



20. కింది వాటిలో సరైంది?
 ఎ) యూఎస్ బ్యాడ్మింటన్ 60వ ఎడిషన్ 2025, జూన్ 24 - 29 వరకు అమెరికాలోని అయోవా, కౌన్సిల్ బ్లఫ్స్‌లో నిర్వహించారు.
 బి) ఈ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విజేత ఆయుష్ శెట్టి(భారత్), రన్నర్ బ్రియాన్ యాంగ్(కెనడా).
 సి) ఈ ఓపెన్‌లో మహిళల విజేత బీవెన్ జాంగ్ (అమెరికా), రన్నర్ తన్వి శర్మ (భారత్).
 1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి
21. 'ఐఎన్ఎస్ తమాల్'- 2వ నౌక 2025, జులై 1న భారత నౌకాదళవిధుల్లో చేరింది. అయితే దీన్ని ఏ దేశంలోని యంటార్ షిప్‌యార్డులో నిర్మించారు?
 1) సింగపూర్ 2) అమెరికా 3) జపాన్ 4) రష్యా
 నోట్: ఐఎన్ఎస్ తమాల్ మొదటి నౌక 2024 రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు.
22. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచ దేశాల్లోని స్వదేశీయుల నుంచి భారత్‌కు పంపిన స్థూల నగదు విలువ ఎన్ని బిలియన్ డాలర్లకు చేరిందని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది?
 1) 135.46 బి.డాలర్లు 2) 150.89 బి.డాలర్లు
 3) 139.76 బి.డాలర్లు 4) 130.42 బి.డాలర్లు
23. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ) పేరును ఇటీవల ఏ విధంగా మార్చినట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ తెలిపింది?
 1) సరోజినీ నాయుడు జాతీయ మహిళా, శిశు అభివృద్ధి సంస్థ
 2) ఇందిరాగాంధీ జాతీయ మహిళా, శిశు అభివృద్ధి సంస్థ
 3) సావిత్రిబాయి పులే జాతీయ మహిళా, శిశు అభివృద్ధి సంస్థ
 4) దుర్గాబాయి దేశ్‌ముఖ్ జాతీయ మహిళా, శిశు అభివృద్ధి సంస్థ
24. 'ఉమెన్! లైఫ్! ఫ్రీడమ్! ఎకోస్ ఆఫ్ ఏ రెవల్యూషనరీ అప్‌రైజింగ్ ఇన్ ఇరాన్' పుస్తక రచయిత?
 1) సడేగ్ హెడాయత్ 2) చౌరా మాకేరెమి
 3) మార్జానే సత్రాపి 4) సిమిన్ ధనేశ్వర్
25. 'హిస్టరీ దట్ ఇండియా ఇగ్నోర్డ్' పుస్తక రచయిత?
 1) కిరణ్ ప్రకాశ్ 2) కె. నారాయణ్
 3) ప్రేమ్ ప్రకాష్ 4) వి. సత్యానంద్
26. ఇటీవల ఏ దేశం 'సంక్షేమ బిల్లు'ను ఆమోదించింది?
 1) బ్రిటన్ 2) అర్జెంటీనా 3) ఇటలీ 4) బ్రెజిల్
27. కిందివాటిలో సరైంది?
 ఎ) దోమ సైజులో ఉండే అతిచిన్న గూఢచారి డ్రోన్‌ను ఆవిష్కరించిన దేశం చైనా.
 బి) దేశంలోనే తొలిపూర్తి స్థాయి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నారు.
 సి) దేశంలోనే తొలి ఈ-ట్రాక్టర్ మహారాష్ట్రలోని పుణె ప్రాంతీయ రవాణా కార్యాలయంలో 2025, జూన్ 29న రిజిస్టర్ అయింది.
 డి) ఉక్రెయిన్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మురాఖా (చీమ) అనే చిన్న పాటి రోబోను ఆవిష్కరించారు.
 1) ఎ, బి, సి 2) బి, సి, డి
 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి



రచయిత: జి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు
1-1; 2-2; 3-1; 4-1; 5-3; 6-2; 7-4; 8-2; 9-2; 10-1; 11-1; 12-3; 13-1; 14-4; 15-2; 16-1; 17-2; 18-1; 19-1; 20-3; 21-4; 22-1; 23-3; 24-2; 25-3; 26-1; 27-4.

రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

✦ దేశ రక్షణకు రాజ్‌నాథ్‌సింగ్ చేస్తున్న కృషిని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఈఆర్‌సీ సభ్యుడిగా నామినేషన్‌కు గడువు పెంపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యుడి నియామకానికి నామినేషన్ దాఖలు చేసేందుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తొలుత జారీ చేసిన ప్రకటన ప్రకారం నామినేషన్ల దాఖలుకు జులై 9తో గడువు ముగిసింది. హైకోర్టు, జిల్లా కోర్టు న్యాయవాదిగా నియమించేందుకు ఉన్న అర్హతలు ఉండాలని.. 50 ఏళ్లు దాటిన వారు అర్హులని ప్రభుత్వం అందులో పేర్కొంది.



నరసింహుని శిరసున శశి వదనం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం చెంత గురువారం రాత్రి నిండు జాబిలి భక్తులకు కనువిందు గొల్పింది. వెండి వెన్నెల వెలుగుల్లో నారసింహుడి ఆలయం ఇలా మెరిసిపోయింది.
– న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట అర్బన్

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఈనాడు, అమరావతి: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ గురువారం నుంచి ప్రారంభమైంది. 10-14 తేదీల మధ్య రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలనకు 11-15, వెబ్ ఐచ్ఛికాల నమోదు 13-16 వరకు అవకాశం కల్పించారు. సీట్ల కేటాయింపు ఈ నెల 19న చేయనున్నారు.

'సింగిల్ మేజర్ డిగ్రీతో విద్యార్థులకు నష్టం'

ఈనాడు, అమరావతి: డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంతో విద్యార్థులు నష్టపోతారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 'సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుంది. పనిభారం తగ్గి అధ్యాపకులకు సైతం నష్టం జరుగుతుంది. ప్రభుత్వం దీనిపై ఆలోచించి పాత పద్ధతిలో మూడు సబ్జెక్టుల విధానం లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల డిగ్రీ కోర్సులను తీసుకురావాలి" అని ఆయన సూచించారు.

శాకంబరిగా శ్రీభద్రకాళి



ఓరుగల్లులో ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళి దేవాలయంలో 15 రోజులుగా శాకంబరి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సుమారు 10 టన్నుల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో భద్రకాళి అమ్మవారిని శాకంబరి మాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి కూరగాయలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, రంగంపేట(వరంగల్)

రూ.12 వేల కోట్లతో ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు

సమీక్షించిన సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ బలోపేతం చేసేందుకు రూ.12 వేల కోట్లతో ప్రాజెక్టులను ట్రాన్స్‌కో చేపట్టిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. ఏపీ ట్రాన్స్‌కో ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో వర్చువల్‌గా సచివాలయం నుంచి సమీక్షించారు. 'గత రెండు నెలల్లో రూ.155.04 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ.8,131 కోట్లతో చేపట్టిన 62 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో సీఆర్‌డీఏ ప్రాంతంలో 400 కేవీ, 220 కేవీ లైన్ల పనులు ఉన్నాయి. మరో రూ.363.13 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులకు అనుమతి లభించింది. రూ.3,614 కోట్లతో ప్రతిపాదించిన 31 అభివృద్ధి ప్రాజెక్టులకు టెండర్లు పిలిచాం. పారిశ్రామిక కారిడార్లు, పట్టణ క్లస్టర్లలో చేపట్టిన ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పూర్తి చేస్తాం' అని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, గ్రిడ్ డైరెక్టర్ భాస్కర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈలు పాల్గొన్నారు.

రెవెన్యూ మాన్యువల్ సిద్ధం

- 14 వాల్యూమ్స్ ద్వారా భూ పరిపాలన, చట్టాల వివరాలు
- ఏఐ సాయంతో 'చాట్‌బాట్' ద్వారా వినేందుకు వీలుగా చర్యలు

ఈనాడు, అమరావతి: భూ చట్టాలు, పరిపాలన, ప్రభుత్వ ఆదేశాలపై పౌరులకు అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. బ్రిటిష్ హయాం నుంచి ఇటీవల వరకు ప్రభుత్వపరంగా వెలువడిన ఆదేశాలతో మాన్యువల్‌ను 14 వాల్యూమ్స్‌ను రెవెన్యూ శాఖ తయారుచేసింది. 3,706 పేజీలతో తయారైన ఈ పుస్తకాలను సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ఉంచబోతున్నారు. భూములకు సంబంధించి రాష్ట్రంలో 200కు పైగా చట్టాలు ఉన్నాయి. వీటి గురించి రెవెన్యూ ఉద్యోగులకే పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఏ సమస్యకు ఏ చట్టం వర్తిస్తుందో అధికారుల్లో కొందరికి తెలియదు. దీంతో క్షేత్రస్థాయిలో కొత్త సమస్యలు వస్తున్నాయి. కోర్టుల్లో జరిగే విచారణ సమయంలో ఈ వివరాలు అందుబాటులో లేక, బాధితులతో పాటు అధికారులూ ఆపసోపాలు పడుతున్నారు. ఇక సామాన్యుల పరిస్థితి మరీ దారుణం.

అందుబాటులోకి 50 ప్రధాన భూ చట్టాల వివరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు భూ చట్టాలు, ఉత్తర్వులు, నియమాలను 14 పుస్తకాల (వాల్యూమ్స్) రూపంలో సీసీఎల్‌ఏ (భూ పరిపాలన శాఖ) సిద్ధం చేసింది. భూ కేటాయింపు, పేదలకు ఎసైన్డ్, ఇంటిస్థలాల పంపిణీ, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, భూముల పరిరక్షణ, ఆక్రమణల నిరోధం, ఇనాం, చుక్కల భూములు, ఇతర వ్యవహారాల గురించి ఈ మాన్యువల్ సిద్ధమైంది. సీసీఎల్‌ఏ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీ గత జనవరి నుంచి పనిచేయడం ఆరంభించింది. 200కు పైగా చట్టాలు ఉన్నా.. 50 చట్టాల కార్యకలాపాలే తరచూ జరుగుతుంటాయి. ఇందుకు అనుగుణంగా వాటి వివరాలను సిద్ధం చేశారు.

✦ ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్స్ (అప్‌గ్రేడేషన్ ఇన్ రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్) యాక్ట్-2017 వచ్చినప్పటి నుంచి హైకోర్టు నుంచి వెలువడిన ఆదేశాల వరకు 53 పేజీల్లో వివరించారు. జిల్లాల విభజన ప్రారంభం (1974) నుంచి జులై 23, 2024 వరకు వెలువడ్డ చట్టాలు, 84 జీవోలతో 346 పేజీల పుస్తకం తయారైంది.

✦ ప్రస్తుతం రెవెన్యూ మాన్యువల్ ఆంగ్లంలో తయారైంది. ఇందులో పౌరులకు నిత్యం అవసరమైన చట్టాలు, ఇతర సమాచారాన్ని తెలుగులోకి తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుతం సిద్ధంచేసిన వాల్యూమ్స్‌లోని సమాచారాన్ని ఏఐ సాయంతో 'చాట్‌బాట్స్' ద్వారా వినే సౌకర్యాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. భూ పరిపాలనపై తరచూ వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు.



విద్యకు 'చుక్కా'ని.. ఆశీర్వాదం ఇవ్వమని

నల్లకుంట, న్యూస్‌టుడే: గురు పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య ఆశీర్వాదం తీసుకున్నారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి.. పాదాభివందనం చేసి... సన్మానించారు. వీరితోపాటు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎమెస్కో పబ్లిషర్స్ అధినేత విజయ్ కుమార్‌లు చుక్కా రామయ్యను సన్మానించారు.

శాస్త్ర సాంకేతిక మండళ్లకు నిధులు అంతంతమాత్రమే

తెలుగు రాష్ట్రాల తీరుపై నీతి ఆయోగ్ పెదవివిరుపు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాల్లో పరిశోధనలు, నవకల్పనలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన శాస్త్ర సాంకేతిక మండళ్ల (సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్స్)కు తెలుగు రాష్ట్రాలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడంలేదు. వీటికి నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉన్నట్లు నీతి ఆయోగ్ గురువారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.5.79 కోట్లు, తెలంగాణ ప్రభుత్వం రూ.18.27 కోట్లు మాత్రమే కేటాయించాయి. ఈ విషయంలో కేరళ (రూ.173 కోట్లు), గుజరాత్ (రూ.159 కోట్లు), ఉత్తర్‌ప్రదేశ్ (రూ.139 కోట్లు), హరియాణా (రూ.129 కోట్లు) ముందువరుసలో ఉన్నాయి. పేటెంట్ల సాధన, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, జీఐ మ్యాపింగ్ రూపకల్పన, క్షేత్రస్థాయిలో కొత్త అంశాల ఆవిష్కరణ, సైన్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించే ఈ మండళ్లకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై నీతి ఆయోగ్ పెదవి విరిచింది. ఈ కౌన్సిళ్ల పనితీరును మెరుగుపరచడానికి ప్రస్తుత పాలకవర్గ నిర్మాణాన్ని కొంతమేర పునర్వ్యవస్థీకరించడంతో పాటు విస్తరించాలని సూచించింది. ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర శాస్త్రసాంకేతిక వ్యవహారాల మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కౌన్సిళ్లలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐటీ, పర్యావరణ, అటవీ, విద్య, ప్రణాళిక, ఆర్థిక శాఖలకు చెందిన సీనియర్ అధికారులను సభ్యులుగా నియమించాలని నీతిఆయోగ్ సిఫారసు చేసింది. అయినా, ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. జీఎస్‌డీపీలో నిర్దేశిత 0.5 శాతం నిధుల హెచ్చింపు, ఇతర కార్యకలాపాలు కూడా ఆశించిన రీతిలో లేవని పేర్కొంది.



తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. సరస్వతీ పుష్కరాల్లో భాగంలో మెట్లపై జ్ఞానదీపాల ఆకృతిని అమర్చారు. ప్రస్తుతం ప్రవాహంతో ఆ ఆకృతిలో కొంతభాగం మునిగిపోయి బాహుబలి సినిమాలోని దృశ్యాన్ని తలపిస్తోందిలా..
- న్యూస్‌టుడే, కాళేశ్వరం

ఐదు జిల్లాల్లో ఏటీఎస్‌ల అనుమతులు రద్దు

- ఫిట్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే కారణం

ఈనాడు, అమరావతి: వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను (ఏటీఎస్) గడువులోగా ఏర్పాటు చేయకపోవడంతో ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, పల్నాడు జిల్లాల్లో ఇచ్చిన అనుమతులను రవాణాశాఖ రద్దుచేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖపట్నంలోని ఏటీఎస్‌ను నిర్వహిస్తున్నారు. మిగిలిన 25 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటుకు గతంలో టెండర్లు పిలిచారు. ఇందులో అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా, మిగిలిన జిల్లాల్లో వేర్వేరు సంస్థలు బిడ్లు దాఖలుచేసి, ఫిట్‌నెస్ పరీక్షకు వసూలు చేసే ఫీజులో ప్రభుత్వానికి ఎంత శాతం చెల్లిస్తాయన్నది కోట్‌చేసి టెండర్లు దక్కించుకున్నాయి. గత ఏడాది ఆయా సంస్థలకు ఏటీఎస్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. ఇప్పటివరకు 17 జిల్లాల్లో ఏటీఎస్‌లు ఏర్పాటయ్యాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా జిల్లాల్లో ఇవి సిద్ధంకాగా, త్వరలో వీటిలో ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభిస్తారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఏటీఎస్‌పై కోర్టు కేసు కొనసాగుతోంది.

అదనపు గడువు ఇచ్చినా..

ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, పల్నాడు జిల్లాల్లో ఏటీఎస్‌ల ఏర్పాటుకు ఏడాది గడువు ముగిశాక, అదనంగా మరో మూడు నెలలు సమయం ఇచ్చినాసరే, గుత్తేదారు సంస్థలు వాటిని ఏర్పాటు చేయలేకపోయాయి. దీంతో వీటికి గత ఏడాది ఇచ్చిన అనుమతులు రద్దుచేస్తూ రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఒకవేళ ఆ సంస్థలు ఏటీఎస్‌లు ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపించి, మరింత గడువు కావాలనుకుంటే ప్రభుత్వం వద్ద విజ్ఞప్తి చేసుకోవాల్సి ఉంటుంది.

ఆర్థికశాఖ క్లియరెన్స్ ఎందుకివ్వడం లేదు?

వాహనాల ఫిట్‌నెస్ కోసం వాహన్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకొని, ఫీజు చెల్లించి.. ఏటీఎస్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఇలా చెల్లించే ఫీజులు రెండేళ్లపాటు పూర్తిగా గుత్తేదారు సంస్థవద్దే ఉంటాయి. రెండేళ్ల తర్వాత అందులోని కొంత మొత్తం (టెండర్‌లో కోట్ చేసినది) ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఏటీఎస్‌లకు ఫిట్‌నెస్ పరీక్షల ఫీజులు దక్కడంలేదు. ప్రభుత్వ ఖజానాలో జమ అవుతున్నాయి. ఆ డబ్బు ఏటీఎస్‌ల గుత్తేదారుల ఖాతాల్లోకి వెళ్లేలా ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. కానీ నెలల తరబడి ఈ దస్త్రంపై నిర్ణయం తీసుకోకుండా ఆర్థికశాఖ తొక్కిపెడుతోంది. మరోవైపు ఫిట్‌నెస్ జరిపిన వాహనాల ఫీజులను తమకు చెల్లించాలని ఏటీఎస్‌ల నిర్వాహకులు ఆర్థికశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

9999 నంబరు... రూ.11 లక్షలు

తెలంగాణలోని వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో 9999 నంబరు... రూ.11,09,999 ధర పలికింది. ఈ నంబరుకు రవాణాశాఖ నిర్ణయించిన ధర రూ.50 వేలు కాగా.. గురువారం అందుబాటులో ఉన్న ఈ నంబరు కావాలంటూ.. నలుగురు వాహనదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరి మధ్య రహస్య వేలం నిర్వహించగా.. అత్యధికంగా రూ.11,09,999కి హర్ష కన్‌స్ట్రక్షన్ సంస్థ టీజీ24ఏ 9999 నంబరును సొంతం చేసుకుంది.
– న్యూస్‌టుడే, రంగశాయిపేట (వరంగల్)

అమరావతిని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారు?

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా రాజధాని అమరావతిని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని వైకాపా నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాజధానిని అభివృద్ధి చేయకుండా వైకాపాపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అప్పులు ఎందుకు చేస్తోందని ప్రశ్నిస్తే.. తమను దేశ ద్రోహులంటూ ఎదురుదాడి చేస్తున్నారన్నారు. కూటమి.. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత ఎల్పీజీ సిలిండర్లు, విద్యార్థులకు ఆర్థికసాయం వంటి సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో పొగాకు, మామిడి, మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని వెల్లడించారు. 20 లక్షల మందికి ఇవ్వాల్సిన తల్లికి వందనం సాయాన్ని 13 లక్షల మందికే ఇచ్చారని ఆరోపించారు. వీటికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మేనల్లుళ్లు తిరిగి రారని.. అత్తా అసువులు బాసి..

తెలంగాణలోని సిగాచీ పరిశ్రమ దుర్ఘటనలో ఇద్దరు మేనల్లుళ్ల ఆచూకీ కోసం ఎదురుచూస్తూ వారి మేనత్త గుండె ఆగిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అన్నదమ్ములు అఖిలేశ్ నిషాంత్ (38), విజయ్‌కుమార్ నిషాంత్ (30) సిగాచీ పరిశ్రమలో పనిచేస్తున్నారు. పేలుడు ఘటనలో ఇప్పటికీ ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ లభ్యం కాలేదు. అందులో అఖిలేశ్, విజయ్‌కుమార్ కూడా ఉన్నారు. వారి ఆచూకీ లభిస్తుందని స్వగ్రామంలో ఉన్న కుటుంబసభ్యులు నిరీక్షిస్తున్నారు. పేలుడు సమయంలో వారు బయటకు వచ్చి ఉంటే ప్రాణాలతో ఉండే అవకాశం ఉందని ఎదురుచూశారు. కానీ, అధికారులు ఎనిమిది మంది ఆచూకీ తెలియలేదని, వారికి తక్షణ సాయం కింద రూ.15 లక్షలు అందజేస్తున్నామని ప్రకటించారు. దీంతో వీరంటే అమితంగా ఇష్టపడే మేనత్త ధీర బుధవారం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచారు. దీంతో ఆ అన్నదమ్ముల ఆచూకీ కోసం పాశమైలారం వచ్చిన వారు కూడా .. ఆమె అంత్యక్రియల కోసం గురువారం ఇక్కడి నుంచి బయల్దేరారు. – న్యూస్‌టుడే, పటాన్‌చెరు



అఖిలేశ్



విజయ్‌కుమార్

'బనకచర్ల' ప్రీ ఫీజిబులిటీ నివేదికపై

పోలవరం ప్రాజెక్టు అథారిటీ కేంద్రానికి లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రీ ఫీజిబులిటీ నివేదికపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ తన అభిప్రాయాలను కేంద్ర జలసంఘానికి తెలియజేస్తూ లేఖ రాసింది. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి..

2009లో అనుమతి పొందిన పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం.. 449.78 టీఎంసీల నీటి వినియోగానికి ఆమోదం దక్కింది. పోలవరం కుడి ప్రధాన కాలువ 11,654 క్యూసెక్కులకు, ఎడమ ప్రధాన కాలువ 8,123 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి అనుమతిస్తే రెండు కాలువలూ 17,560 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక తాడిపూడి ఎత్తిపోతల, ఆ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు పోలవరంలో భాగమవుతాయి. ఈ నదీ పరీవాహక ప్రాంత రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాల ఆధారంగా రూపొందిన 1980 గోదావరి అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. తాజా పోలవరం-బనకచర్ల అనుసంధానం పీఎఫ్‌ఆర్ ప్రకారం... ప్రతి ఏటా 200 టీఎంసీల వరద జలాలు మళ్లించి 7.41 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందిస్తారు. 22.58 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తారు. పోలవరం కుడి కాలువకు సమాంతరంగా కొత్త వరద కాలువను 18వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వుతారు. కుడి కాలువకు, ఈ వరద కాలువకు 166.50 కి.మీ. మేర ఒకే గట్టు ఉంటుంది. తాడిపూడి కాలువ 40 కి.మీ. మేర ఇందులో అనుసంధానమవుతుంది. ఈ నేపథ్యంలో పరిశీలించాల్సిన అంశాలు ఇవీ..

- కొత్త అనుసంధానం ప్రాజెక్టు పోలవరం డీపీఆర్‌లో భాగం కాదు. పోలవరం నుంచి అదనంగా నీటి తరలింపును కూలంకషంగా అధ్యయనం చేయాలి. అందుబాటులో ఉన్న జలాలు ఎన్ని? అంతర్రాష్ట్ర వివాదాలేంటి? ట్రైబ్యునల్ అవార్డులను పరిగణనలోకి తీసుకుని కొత్త ప్రాజెక్టును అధ్యయనం చేయాలి. పోలవరం ప్రాజెక్టు ద్వారా సాధించాల్సిన లక్ష్యాలు అన్నీ నెరవేరతాయా లేదా అన్నదీ పరిశీలించాలి.
- తాడిపూడి ఎత్తిపోతల కాలువల ద్వారా 83,607 హెక్టార్ల ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీళ్లు, 130 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత తాడిపూడి వ్యవస్థ అందులో అంతర్భాగమవుతుంది. ఈ నేపథ్యంలో తాడిపూడి, పోలవరం కుడి కాలువలు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై సమగ్ర అధ్యయనం చేయాలి.
- 1980 అంతర్రాష్ట్ర గోదావరి జలాల ఒప్పందం ఆధారంగా పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూలు నిర్ణయించారు. తాజాగా పోలవరం నుంచి 200 టీఎంసీలు మళ్లించే క్రమంలో ఆ ఆపరేషన్ షెడ్యూలును తిరిగి పరిశీలించాలి.

అరణ్యంలో నా ప్రేమకు 'అరుణో'దయం..

చర్ల, న్యూస్‌టుడే: అడవుల్లో తుపాకీ పట్టుకొని ప్రాణాలు లెక్కచేయకుండా తిరిగే అతను.. ఆమెను చూడగానే తనే నా ప్రాణం అనుకున్నాడు. తనను వివాహం చేసుకోవాలంటే పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాలని మావోయిస్టు పెద్దల షరతు పెట్టినా అంగీకరించాడు. ఆరేళ్లుగా ఆమెతో జీవించిన అతను.. ఇకపై జనారణ్యంలోనే కలిసి బతుకుదామని ఆమెతోపాటు పోలీసుల ముందుకొచ్చాడు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల లొంగిపోయిన డీవీసీఎం(డివిజన్ కమిటీ మెంబర్) అమిత్ బర్సా(27) తన ప్రేమాయణాన్ని ఇలా చెప్పుకొచ్చాడు.

'నా చిన్ననాడే తండ్రి, సోదరులు చనిపోయారు. 12 ఏళ్ల వయసులో మావోయిస్టు పార్టీ ఏసీఎం(ఏరియా కమిటీ మెంబర్) లింగే అడవికి తీసుకెళ్లింది. అక్కడ ఆయుధాలను ఎలా వినియోగించాలో శిక్షణ ఇచ్చారు. అబూజ్‌మడ్, గడ్చిరోలికి వెళ్లాను. పొలిట్‌బ్యూరో సభ్యుడు వేణుగోపాల్‌కు పదేళ్లు సెక్యూరిటీ గార్డుగా ఉన్నాను. గడ్చిరోలిలో జరిగిన పార్టీ సమావేశంలో తొలిసారి 'అరుణ లేకం'ను చూశా. తొలి చూపులోనే ఆమెను ఇష్టపడ్డా. చిన్నప్పటి నుంచి పార్టీలో చాలా ధైర్యంగా పెరిగాను. కానీ, అరుణతో మాట్లాడాలంటే ఎంతో భయం వేసేది. ఒకరోజు ధైర్యం కూడగట్టుకొని నా మనసులో మాట చెప్పేశా. ఆమె మొదట కోపగించుకున్నా.. రెండు నెలల తర్వాత ఓకే చెప్పింది. అయితే మావోయిస్టులు భార్యాభర్తలైతే తల్లిదండ్రులుగా మారడానికి వీల్లేదని చెప్పడంతో 2019లో పిల్లలు పుట్టకుండా స్టెరిలైజేషన్ చేయించుకున్నా. తర్వాత అరుణను వివాహం చేసుకున్నా. ప్రశాంతంగా జీవించాలని హింసామార్గాన్ని వీడి లొంగిపోయాం. వ్యవసాయం చేసుకుంటూ కొత్త జీవితం ప్రారంభిస్తాం. పిల్లల కోసం తిరిగి ఆపరేషన్ చేయించుకుంటాను' అని వివరించాడు. 'పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రేమ వ్యవహారమేంటని మొదట అమిత్‌పై కోపం వచ్చి మాట్లాడలేదు. తర్వాత ఆయన మంచితనం గురించి సహచరుల ద్వారా విన్నా. రెండు నెలల తర్వాత తానూ ప్రేమిస్తున్నట్లు చెప్పా' అని అరుణ చెప్పుకొచ్చారు. కాగా అమిత్‌పై రూ.8 లక్షలు, ఏసీఎం(ఏరియా కమిటీ మెంబర్)గా ఉన్న అరుణపై రూ.5 లక్షల రివార్డు ఉంది.



మావోయిస్టు దంపతులు అరుణ, అమిత్

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ ఆదేశం

ఈనాడు, అమరావతి: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. స్వర్ణాంధ్ర, పీ-4 ఫౌండేషన్, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, సంక్షేమ వసతిగృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని గుర్తుచేశారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో పరిశుభ్రత మెరుగుపరిచి, పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్లకు సూచించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు.

ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి అనుచరులు వేధిస్తున్నారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తమపై అక్రమ కేసులు బనాయించి, వైకాపా ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి అనుచరులు వేధిస్తున్నారని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలానికి చెందిన ఎస్.పీరయ్య, జి.సుబ్బనరసయ్య, మేక భాస్కర్ వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం వారు ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన బాధితుల నుంచి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వెబ్‌ల్యాండ్‌లో తమ భూమి వివరాలు లేవని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెదకొండూరుకు చెందిన యెండ్లూరి గోపి వాపోయారు. తన భూమిని సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని కొండాపురానికి చెందిన తిమోతి కోరారు.

ఆన్‌కాల్ డ్రైవర్, కండక్టర్ల ప్రతిపాదన వద్దు: ఎన్‌ఎంయూఏ

ఈనాడు, అమరావతి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఆన్‌కాల్(ఏ రోజుకారోజు పిలిచే) డ్రైవర్లు, కండక్టర్లను తీసుకోవాలనే ఆర్టీసీ బోర్డు ప్రతిపాదనను విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) కోరింది. ఎక్కడా ఆన్‌కాల్ డ్రైవర్ల వ్యవస్థలేదని, అయినా.. ఏపీఎస్ ఆర్టీసీలో అమలు చేస్తూ ఇంకా తీసుకోవాలనుకోవడం సరికాదని పేర్కొంది. సంస్థలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సొంత బస్సులు, విద్యుత్తు బస్సులు కొనుగోలు చేయాలని అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ఈయూ 74వ ఆవిర్భావ దినోత్సవం

ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) 74వ ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం రాష్ట్రంలో అన్ని డిపోలు, యూనిట్లలో నిర్వహించనున్నట్లు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య తెలిపారు. విజయవాడ మెయిన్ డిపో వద్ద రాష్ట్ర కమిటీ వేడుకలు నిర్వహిస్తుందన్నారు.

ప్రకాశం జిల్లాలో బాలుడి మృతిపై చంద్రబాబు విచారం

అన్ని కోణాల్లో విచారణ చేయాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా కంభం మండలం లింగోజిపల్లిలో రెండున్నరేళ్ల బాలుడు లక్షిత్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రకాశం ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అన్ని కోణాల్లోనూ విచారణ చేయాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వెళ్లిన లక్షిత్ దారితప్పి అడవిలోకి వెళ్లిపోయాడని ఎస్పీ తెలిపారు. "పోలీసులకు ఫిర్యాదు రాగానే జాగిలాలు, డ్రోన్లతో సెర్చ్ చేశాం. డీఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల్ని నియమించాం. అడవిలో చిక్కుకుపోయి రెండు రోజుల పాటు ఆహారం, నీరు లేక లక్షిత్ మరణించారని ప్రాథమిక అంచనాకు వచ్చాం" అని ఎస్పీ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం ఉందా అనే అంశంపైనా దర్యాప్తు చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

భారత చిత్రపటంలో తెలంగాణను తొలగిస్తారా?

- భాజపా నేతలు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్
- 'ఎక్స్'లో ప్రధానికి పలు ప్రశ్నల సంధింపు



ఈనాడు, హైదరాబాద్: ఏపీ మంత్రి లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షుడు మాధవ్ ఇచ్చిన భారత చిత్రపటంలో తెలంగాణ లేకపోవడం సరికాదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీని ఉద్దేశించి గురువారం 'ఎక్స్'లో కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. "భారత చిత్రపటంలో తెలంగాణను తొలగిస్తారా? దశాబ్దాలపాటు సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో సరైన చోటు కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ. అయితే, మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మా సాంస్కృతిక గుర్తింపును, అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. ఈ చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా? లేక కేవలం ఒక పొరపాటా? ఈ విషయంపై మీరు వెంటనే స్పష్టత ఇవ్వాలి. మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన భాజపా నేతలు క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్.. మోదీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు.